

**SEELAMAA? ADI YEMI?**
(Anthology of Short Stories)
by ANAAMAKUDU

అసలు గొప్పవాళ్ళం కావాలని అనుకోకపోవడమే నిజమైన గొప్పతనం. నలుగురిలోను ప్రత్యేకంగా కనిపించాలని అనుకోకపోవడంలోని ప్రత్యేకత అందరికి అర్థం కాదు. అలా ఉండగలిగితే అంతకన్న కావలసింది ఏముంది?

— అనామకుడు

ఈ 'అనామకుడు' మనోధర్మంతో, జీవిత పరమార్థాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నం చేసే రచయిత. వెల్లడిగా, - "ముందస్తు నిశ్చితాభిప్రాయాలు" ఏర్పరచుకోకుండా - చుట్టూ మనుషుల్ని అర్థంచేసుకొనే ప్రయత్నం ఒక సామర్థ్యం. ఒక కళ. ఈ కళ తెలిసిన రచయితలే "స్వతంత్ర"రచనలు చేయగలుగుతారు.

ఈ కళ నెరిగి, కథలు చెప్పిన రచయితగా 'అనామకుడు' సుమారు రెండు దశాబ్దులుగా కథలు వ్రాశారు. ఏ సిద్ధాంతాల మూసకట్టులోంచీ కాకుండా విశాల జీవితంలో నుంచి భిన్న అనుభవాలు చెప్పే కథలివి.

ఇవి జీవన తాత్త్వికత దృష్ట్యా అరుదైన కథలు.


ఇందువల్ల - ఈ 'అనామకుడు' తెలుగు కథా సాహిత్యంలో 'సునామకుడు'గా నిలుస్తారని నా ఆశంస -

— ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

వాహిని బుక్ ట్రస్ట్
1.9.286/3 విద్యానగర్. హైదరాబాద్ 500044

211 Pages :: Rs. 100/-

ISBN 81 - 88512 - 70 - 2



*Writer's Contact*

Dr. A.S. RAMASASTRI
A-27, DHANASTRA
122, N.P. Marg
Colaba
MUMBAI - 400 005.
✆ : 022 - 22183149
e-mail : ramasastri@hotmail.com

# శీలమా? అది యేమి?

## అనామకుడు

వాహిని బుక్ ట్రస్ట్
1.9.286/3 విద్యానగర్. హైదరాబాద్ 500044

**SEELAMA? ADI YEMI?** *(Anthology of Short Stories)*
*by* **ANAAMAKUDU**

First Edition : , 2006

Publication No. 71

© Dr. A.S. Ramasastri

*Cover Design :*
BALI

*Produced & Published by :*
**Vahini Book Trust (V.B.T.)**
1-9-286/3, Vidyanagar
Hyderabad - 500 044.

A
Service Oriented
Institution
Administrated
by
Y.V.S.R.S. SAI

*For Copies :*
Vahini Book Trust, 1-9-286/3, Vidyanagar, Hyderabad - 500 044.
Visalandhra Book House, Bank Street, Hyderabad & Other Branches
Navodaya Book House, Opp: Aryasamaj Mandir, Badi Chowdi, Hyderabad
Navayuga Book House, Sultan Bazar, Hyderabad.
Navodaya Publishers, Governorpet, Vijayawada.

*Typesetting:*
**Rachana Entinti Patrika,** Hyderabad - 500 044

*Text & Title Printed at :*
**Charita Impressions,** 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020

Total Pages : 211

Price : Rs. 100/- US $ : 10

ISBN 81-88512-70-2

# అంకితం

అసలు ఏమీ ఆలోచించకుండా
అలా అలవోకగా జీవించెయ్యడం
నేర్పించిన అమ్మకీ -

అసలు జీవితం అంటే ఏమిటి
అన్న ప్రశ్నకి సమాధాన అన్వేషణలో
నిరంతరం ఆలోచనల్లోనే జీవించడం
నేర్పించిన నాన్నకీ -

అసలు తను ఉన్నాడో / ఉందో చెప్పకుండా
మన ప్రమేయమే లేకుండా మన జీవితాల్ని
జాగ్రత్తగా ముందుకు నడిపిస్తున్న వారు
ఎవరైతే వారికీ -

# కృతజ్ఞతలు

(కొన్నింటికి బహుమతులు కూడా ఇచ్చి)
ఇందులోని కథల్ని ముందుగానే ప్రచురించిన
పత్రికా సంపాదకులకీ –

(అభిమానంతో, తన ఆశీర్వాదంగా)
ఈ పుస్తకానికి ముందుమాట రాసిచ్చిన
శ్రీకాంతశర్మగారికీ –

(మొదటి పుస్తకం 'రమణీయం' లాగానే)
ఈ పుస్తకాన్ని కూడా అందంగా అచ్చేసిన
వాహినీ బుక్ ట్రస్ట్ శాయిగారికీ –

# ముందుగా....

❖ ఆంతర్యం ............................ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ....... 6

# కథాక్రమం....

❖ అనంతం .......................................... 9
❖ అద్వైతం .......................................... 26
❖ అసంపూర్ణం .......................................... 38
❖ ఆరంభం .......................................... 46
❖ ఏ గాలెటు వీస్తుందో.... .......................................... 53
❖ ఓ అజ్ఞానం లోంచి... .......................................... 62
❖ ఓ వంద నోటు కథ .......................................... 70
❖ అంతరాంతరాళం .......................................... 76
❖ క్రైం 2000 .......................................... 84
❖ గూళ్ళు .......................................... 98
❖ తల్లి .......................................... 113
❖ తెరవెనుక .......................................... 121
❖ ది నెట్ .......................................... 133
❖ పక్షులు .......................................... 142
❖ మీ .......................................... 155
❖ మెరీనా... ఓ మెరీనా... .......................................... 162
❖ ముహూర్తం .......................................... 168
❖ యజ్ఞం .......................................... 172
❖ వర్ణభేదం .......................................... 182
❖ విముక్తి .......................................... 187
❖ శీలమా? అది యేమి? .......................................... 204

# ఆంతర్యం

E:\Seelamma\

Seelama1

4

బతుకులో ఎదురయే ఆశలూ, ఆరాటాలూ, భయలూ, పోరాటాలూ –

కలలూ, కాంక్షలూ –

బెంగలూ, జ్ఞాపకాలూ –

పాళ్లు మార్చి – ఇటూ అటూ కలబోసి, తలపోసుకుంటే – వింత వింత జీవన రసాయనాలు తయారవుతాయి. అవి, మనకు తెలుస్తున్నట్టుండి, తెలియని మనుషుల అంతరంగాలను కథలుగా బయటపెడతాయి.

బతుకును తూచి విలువ కట్టడం, అదొక కృష్ణతులాభారం. బరువైన, విలువైన ఎన్ని ఘటనలతో నింపినా – తూకానికి రాదు.

అల్పమైనా, ఆర్ద్రమైన ఒక్క అనుభవం తులసిదళంలా ఇట్టే తూచి విలువను తేలుస్తుంది.

అనామకుడినంటూ, తెరచాటుగా వుండి ప్రశస్తమైన ఇన్ని కథలు చెప్పిన ఈ రచయిత, వెల్లడిగా మనుషుల మనస్తత్వాలనీ, వారి కెదురయ్యే ఘటనల్లో జీవసారాన్నీ గ్రహించి కథలు చెప్పిన ఘటికుడు.

ఏ కథనైనా, వ్రాయడంకంటె, 'చెప్పడం' కష్టం. చెప్పడానికి మనోధర్మం కావాలి.

వ్రాయడమనగానే – వాక్య నిర్మాణం, భాష, శైలి, వంటివి, మేధాప్రధానంగా వచ్చి కూర్చుంటాయి. మనోధర్మప్రధానంగా కథ చెప్పేవారి వెంట, వాక్యాలు వాటంతట అవే పరుగులు తీస్తాయి. మల్లాది రామకృష్ణశాస్త్రిగారికి లాగ –.

మనస్సుతో (మేధతో కాకుండా) చుట్టూ లోకాన్ని – తర్కించకుండా – ఉన్నదున్నట్టుగా అర్థంచేసుకోవడానికి ప్రయత్నించే మనుషులు రచయితలవుతారు. ఇదేపని, మేధా ప్రధానంగా చేసేవారు గొప్ప సంస్కర్త అయినంతగా – బహుశా – గొప్ప రచయితలు కాలేరేమో!

ఈ 'అనామకుడు' మనోధర్మంతో, జీవిత పరమార్థాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నం చేసే రచయిత. వెల్లడిగా, – "ముందస్తు నిశ్చితాభిప్రాయాలు" ఏర్పరచుకోకుండా – చుట్టూ మనుషుల్ని అర్థంచేసుకొనే ప్రయత్నం ఒక సామర్థ్యం. ఒక కళ. ఈ కళ తెలిసిన రచయితలే "స్వతంత్ర"రచనలు చేయగలుగుతారు.

ఈ కళ నెరిగి, కథలు చెప్పిన రచయితగా 'అనామకుడు' సుమారు రెండు దశాబ్దులుగా కథలు వ్రాశారు. ఏ సిద్ధాంతాల మూసకట్టులోంచీ కాకుండా విశాల జీవితంలో నుంచి భిన్న అనుభవాలు చెప్పే కథలివి.

నన్ను మరీ ముఖ్యంగా ఆకర్షించిన విషయం – రకరకాల సందర్భాల మధ్య నుంచి స్త్రీ మనస్సును తెలియజెప్పే కథల తీరు –. మేధావిగా జీవిస్తూ సున్నితమైన అనుభూతులకు చలించని భర్తతో కాపరం చేసే ఒక స్త్రీ :– నాలుగు జతల దంపతుల సంసార గమనంలో, వాళ్ల వాళ్ల మనస్తత్వాల నేపథ్యంలో తమ అస్తిత్వం గురించి అసంతృప్తిపడే స్త్రీలు;–

ఇరుకిరుకు పంజరపుటింటిలో అణగారిపోతూ, వెల్లడి, వెలుతురు, లేని విసుగు ననుభవించే స్త్రీ;– పిల్లలు లేని తల్లి, ఒక తల్లి పిల్లి ఆరాటం నుంచి గ్రహించుకున్న, తన వెలితికి సిగ్గుపడిన వైనం;– స్వేచ్ఛకి అర్థం ఏమిటి? – దాని చరమ గమ్యం ఏమిటి? ఇది స్త్రీని బాధించక తప్పదా?– అనే "న్యాయ"పరమైన విచికిత్స;–

"సంప్రదాయం", తన మీద మోపిన బరువు నుంచి విముక్తిలేని స్త్రీ ఆర్తనాదం ఆంతర్యం;–

మధ్య తరగతి సంసారాల్లో ఉద్యోగం చేసే స్త్రీకి ఏపాటి ఆర్థిక స్వాతంత్ర్యం వుందని, తేలని ప్రశ్న;–

వార్ధక్యం, జబ్బు, లేమి, సేవ, కలగలిసి ఒక సహజ మరణానికీ – ఒక దిక్కులేనితనానికి, ఇద్దరు స్త్రీలను నడిపిన – 'సహజం'గా కనిపించే ఒక అసహజ సన్నివేశం; –

భౌతికమైన ఒక ప్రమాదపూర్వక అవమానం, స్త్రీ శీలానికి పరీక్షా మానమా? అనే తీవ్రాలోచన;–

నేపథ్యాలు వేరైనా, ఆర్థికమైన అంతస్తులు వేరైనా, స్త్రీత్వాన్ని బాధించే ఇన్ని వైవిధ్యంగల కథలు చెప్పడం, నినాదాలు లేకుండా చెప్పడం ఒక తరహా కథన శిల్పంగా నేను భావిస్తాను.

మృత్యుభయం ఎంత అర్థం లేనిది? స్థల కాలాలకు అతీతమైన అద్వైత స్థితి వుందా? తాత్త్విక దశలో వ్రాసి, నిర్లిప్తంగా జీవితం ముగించడం సాధ్యమేనా?

నైతిక వర్తనకు – ముఖ్యంగా స్త్రీ పట్ల ఊహలకు, ప్రవర్తనకు – మగవాణ్ణి నియంత్రించే సాధనం 'పరువు' భయమేనా?–

మానవ సంబంధాల్ని నిర్దాక్షిణ్యంగా తుంచివేసే యంత్ర నియంత్రణం మనిషికి శాపమా? వరమా?–

కోల్పోయిన బాల్యాన్నీ, యౌవనాన్నీ, తలుచుకు దిగులుపడాలా? ఏర్పడిన బంధాలలో కొత్త ఆనందాన్ని ఆవిష్కరించుకోవాలా?–

వర్ణభేదం స్థానంలో, వృత్తిపరమైన వర్గభేదం పాటించడంపురోగమనమా? తిరోగమనమా?–

–ఇటువంటి ప్రశ్నలను పరోక్షంగా సంధించి, ఒక్కసారి మనస్సును సంప్రదించుకోమనే కథలు, ఈపుస్తకంలో కలవరపరుస్తాయి చదువరుల్ని –

రచయిత బ్యాంకు అధికారి కావడంవల్ల "కరెన్సీ నోటు సంచారం" గురించీ – బ్యాంకు వడ్డీలు బాగా తగ్గిపోవడం, సూత్రప్రాయంగా ఆర్థిక స్థితి అభివృద్ధికి సంకేతం కావచ్చు కానీ సాదా సీదా మధ్య తరగతి వాళ్ల మీద మోపబడే ఇబ్బంది గురించీ, – హైటెక్ యుగంలో, పట్టుబడే అవకాశం లేకుండా, లక్షల సొమ్ము ఇంటర్‌నెట్ ద్వారా అపహరించడం గురించీ – ఈ రచయిత, హెచ్చరికల్లాంటి మెరికల్లాంటి కథల్నిక్కడ చెప్పారు.

పరమ సామాన్యుడైనా – తన వ్యక్తిత్వాన్ని దిద్ది తీర్చిన – మరణించిన తండ్రికి – తన మనోభావాలను "లేఖగా" తెలియచెప్పడం ఆర్ద్రమైన కొత్త ప్రయోగం. అలాగే, వసుదేవుడు శిశువైన కృష్ణుణ్ణి నది దాటించి వ్రేపల్లె జేర్చడమనే పౌరాణిక కథనానికి ఈ రచయిత కల్పించిన మానవీయ పరిమళం ప్రశంసనీయం.

ఇంతదూరం ప్రతి కథనీ ప్రస్తావించడం ఎందుకంటే, ఈ కథలు అంతటి పారవశ్యం కలిగించాయి కనక –.

'అనామకుడు' ఉపయోగించిన అలవోక కథన చాతుర్యం ప్రతి కథకీ ఒక "కాంతి పరివేషం".

1. నిమిషానికిన్నిసార్లు కొట్టుకోవాలని తెలిసిన గుండెలా ఉంటుంది సముద్రం – (అనంతం)

2. జీవితాన్ని ఒక క్రమపద్ధతిలో చూడడం అలవాటయో, ఇష్టమయో, మనం ఆక్రమంలోనే చూస్తున్నాం. అలానే చూడనకర్కరలేదు. ఎలాగన్నా చూడవచ్చు – (అద్వైతం)

3. అనవసరమైన విషయాల్లో తలదూర్చకపోవడం చాలా కష్టం – (మీ)

4. ఓ మనిషి ఓ దశని పోగొట్టుకుంటే – ఇంకెవరో ఆ దశలోకి వస్తారు – రావాలి – (మెరీనా... ఓ మెరీనా)

5. ఆనందపడే విషయాలు కాలానుగుణంగా మారుతాయి – (మెరీనా... ఓ మెరీనా)

6. ఆనందం స్వేచ్ఛలోనే ఉందనుకుంటాం. అది బంధంలోనూ వుంటుంది – (మెరీనా... ఓ మెరీనా)

– ఇలా వాక్యాలుదాహరిస్తూ పోతే పెద్ద జాబితా తయారవుతుంది.

ఇతివృత్తం, దానికి తగిన కథన నైపుణ్యం, వస్తు వైవిధ్యం, ఉన్న కథలు అరుదుగా తటస్థపడుతూంటాయి.

ఇవి జీవన తాత్త్వికత దృష్ట్యా అరుదైన కథలు.

ఇందువల్ల – ఈ 'అనామకుడు' తెలుగు కథా సాహిత్యంలో 'సునామకుడు'గా నిలుస్తారని నా ఆశంస –.

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

శ్రావణ శుద్ధ చతుర్థి
29-7-2006



E:\Seelamma\
Seelama1
5



# అనంతం

**దూ**రంగా బయల్దేరిన నీటి అల ఒకటి నెమ్మదిగా ఒడ్డుకి చేరుకుని, ఒక్కసారిగా విరిగి, నురుగై ఇసుకమీద పారి, మళ్ళీ కడలిలోకి చేరిపోతోంది.

అల తరువాత అల – మళ్ళీ అల – అలా అలలు వస్తున్నాయి, పోతున్నాయి.

నిమిషానికిన్నిసార్లు కొట్టుకోవాలని తెలిసిన గుండెలా ఉంటుంది సముద్రం – కెరటాలు తీరాన్ని చేరి వెనక్కి వెళ్ళిపోవడం చూస్తుంటే. గుండె సవ్వడులలానే కడలి కెరటాలలో కూడా మార్పులుంటారు.

చంటి పిల్లని పక్కన పడుకోబెట్టుకుని తల్లి జోకొడుతున్నట్లు మెల్లగా చప్పుడు చెయ్యకుండా వస్తాయి కెరటాలు ఒక్కోసారి. ఒక్కోసారి పిల్ల అల్లరిని సహించలేని తల్లి కోపంలో అరిచినట్లు ఇంతెత్తున లేచి దగ్గరకొస్తే కొడతానన్నట్లు విరుగుతాయి కెరటాలు. పిల్ల ఆటలకి మురిసిపోతూ నవ్వే తల్లి కిలకిలల్లాగుంటాయి అలల సవ్వడులు ఒక్కోసారి. మరోసారి ఘోషిస్తూ తీరం దగ్గరికి చేరి మూలుగుతున్నట్లు విరుగుతాయి కెరటాలు. పిల్ల బాధని చూడలేని తల్లి ఆవేదనలా ఉంటుంది సముద్ర కెరట ధ్వని అప్పుడు.

మనుషులలోలానే తనలోనూ మూడ్స్ ఉన్నట్లూ, ఆ మూడ్స్‌ని కెరటాల సవ్వడుల ద్వారా ప్రకటిస్తున్నట్లూ ఉంటుంది సముద్రం. అప్పుడప్పుడు ప్రశాంతంగా ఉంటుంది. ఒక్కోసారి కోపగిస్తున్నట్లుంది. ఇంకోసారి నవ్వుతున్నట్లుంటుంది. మరోసారి ఏడుస్తున్నట్లుంది.

కానీ ఎప్పుడూ భయపడుతున్నట్లుండదు.

అలలు ఆగిపోతాయన్న భయం కడలికి ఉన్నట్లు లేదు.

కడలి ఒడ్డున కూర్చుని అలలను చూస్తున్న రామ్మూర్తికి మాత్రం ఆ భయం ఉంది.

కడలి కెరటాలు ఆగిపోతాయన్నది కాదు రామ్మూర్తి భయం – తన గుండె కొట్టుకోవడం ఆగిపోతుందేమోనన్నది అతని భయం. అది చావు భయం. చావంటే

చచ్చేంత భయం.

ఆరున్నర పదులు నిండిన రామ్మూర్తి ఆరోగ్యవంతుడు. ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో ఇంటి నుండి ఓ కిలోమీటరు దూరంలో ఉన్న బీచ్‌కి నడిచి వచ్చి తిరిగి నడిచి ఇంటికి వెళ్తుంటాడు. ఒక్కోరోజు రెండు పూటలా వస్తాడు. అంతదూరం నడిచినా అతనికి ఆయాసం రాదు. చలికాలంలో సముద్రపుటొడ్డున గడిపినా జలుబు చెయ్యదు. ఏదన్నా అనారోగ్యంతో పోతానన్నది కాదు రామ్మూర్తి భయం – హఠాత్తుగా గుండె ఆగి చచ్చిపోతానేమోనని అతని భయం.

రెండు రోజుల నుండి పీడిస్తోంది ఆ భయం రామ్మూర్తిని.

రెండు రోజుల క్రితం అర్ధరాత్రి ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చేసరికి ఒళ్ళంతా చెమట పట్టి ఉంది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. అలా వేగంగా కొట్టుకుంటున్న గుండె ఒక్కసారిగా ఆగిపోతుందేమోననిపించింది. దాంతో భయం మొదలైంది. మంచం మీద నుండి లేచి పక్కన టేబుల్ మీద ఉన్న గ్లాసులోంచి కొంచెం నీళ్ళు తాగాడు. గుండె దడ తగ్గినట్లుంది. అయితే భయం తగ్గలేదు. గుండె ఆగిపోయి తను చచ్చిపోతానేమోనన్న ఆలోచన పోలేదు. దాంతో ఇంక ఆ రాత్రికి నిద్రపట్టలేదు.

తెల్లారి కొడుకూ, కోడలూ లేచాక వాళ్ళతో ఈ సంగతి ప్రస్తావిద్దామనుకున్నాడు, కానీ మనవడితో కాస్సేపు ఆడుకుంటే ఆ ఆటలలో ఈ భయం పోతుందని ఊరుకున్నాడు.

కోడలిచ్చిన కాఫీ తాగుతున్నా పేపర్ చదువుతున్నా కొడుకు విశేషాలు వివరిస్తున్నా తోటలోకి తీసుకెళ్ళి మనవడు తనతో ఆడుతున్నా రామ్మూర్తి భయం తగ్గలేదు. పైకి వేరే పనులు చేస్తున్నా మనస్సులో మాత్రం మరణం గురించి ఆలోచనలు పోవడం లేదు.

స్కూలుకి మనవడూ, ఆఫీసుకి కొడుకూ వెళ్ళిపోయాక తీరిగ్గా భోజనం చెయ్యడం అలవాటు రామ్మూర్తికి. కోడలు వడ్డిస్తుంటే మెతుకులు కలుపుతున్నాడే కానీ ముద్ద గొంతు దిగటం లేదు. గొంతులో ఏదో అడ్డుగా ఉన్నట్లు, గుండెలో ఎంతో భారంగా ఉన్నట్లు అనిపిస్తూనే ఉంది.

"ఏంటండీ, మామయ్యగారూ – సరిగ్గా తినడం లేదు?" అని అడిగింది కోడలు.

"నిన్న రాత్రంతా నిద్ర పట్టలేదు. ఒళ్ళంతా ఏదోలాగుంది" అన్నాడు సమాధానంగా రామ్మూర్తి.

"రాత్రి చాలాసేపు టీ.వీ. చూస్తూండిపోయారు. పడుకోవడం ఆలస్యమై నిద్ర పట్టుండదు. భోజనం చేసి కాస్సేపు నడుం వాల్చండి. నిద్రపోయి లేస్తే సుఖంగా



E:\Seelamma\
Seelama1
6

ఉంటుంది" అంది కోడలు.

"ఇప్పుడయినా నిద్ర పట్టాలి కదా!" అన్నాడు రామ్మూర్తి.

కోడలు ఏమీ మాట్లాడలేదు. ఎందుకు పట్టదని కోడలు అడిగితే తన భయం సంగతి చెప్పవచ్చునని ఎదురు చూశాడు. కోడలు అడగలేదు. అయినా చెప్పేద్దామా అని తీవ్రంగా అనిపించింది. కానీ, నాకు భయంగా ఉందని ఆ అమ్మాయితో చెప్పడం చిన్నతనంగా అనిపించింది రామ్మూర్తికి.

ఏదో భోజనం అయిందనిపించి గదిలోకి వెళ్ళి మంచం మీద నడుం వాల్చాడు. ఒంటరిగా ఉంటే భయ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు అనిపించి హాల్లోకి వెళ్ళాడు. కోడలు ఏదో రాసుకుంటోంది. రామ్మూర్తిని చూసి రాయడం ఆపి, "ఏమన్నా కావాలా?" అని అడిగింది. ఏమీ అక్కరలేదన్నట్లు తల ఊపి, గదిలోకి వెళ్ళి, అక్కడ ఉండలేక మళ్ళీ హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఆశ్చర్యంగా చూసి కోడలు – "ఏమీ తోచడం లేదా?" అని అడిగింది.

"తోచకపోవడం గురించి కాదు. రోజూ మాత్రం నేను చేసే పనులేం ఉన్నాయి తోచడానికి? ఇంటిపనీ, బయటపనీ, నా పనీ – అన్నీ నువ్వే చూస్తున్నావుగా?" అన్నాడు రామ్మూర్తి.

"మీరు చేసినన్నాళ్ళూ మీరు చేశారు. ఇప్పుడు చెయ్యడం మా కర్తవ్యం" అంది కోడలు.

రామ్మూర్తికి కావలసినవన్నీ జాగ్రత్తగా చూసి చేస్తుంది కోడలు. అయితే వాళ్ళిద్దరికీ మధ్య కబుర్లు ఉండవు ఎక్కువగా. మావగారితో అవసరానికి మించి మాట్లాడ్డానికి సిగ్గుపడుతున్నట్లుంది కోడలు. రామ్మూర్తికి కూడా కల్పించుకుని మాట్లాడాలని ఉండదు. కొంచెంసేపు కూర్చున్నాక, తను కూర్చోవడం వల్ల కోడలు రాసుకోవడం మానేసిందని చూసి మళ్ళీ గదిలోకి వెళ్ళాడు రామ్మూర్తి.

పరిస్థితి మామూలుగానే ఉంది. తన పరిస్థితికి ఏడుపు వచ్చేటట్లయింది రామ్మూర్తికి. తల్లిదండ్రులూ, భార్యా పోయినప్పుడు కూడా ఏడుపు రాని రామ్మూర్తికి ప్రస్తుతం ఏడుపొచ్చేస్తుందేమోననిపించింది.

తన పసితనం తనకి గుర్తులేదు. స్కూల్లో చదువుతున్నంత కాలం సమయమంతా చదువులోనే గడిచిపోయింది. తనకి కావలసినవన్నీ అమ్మా, నాన్నలు చూసి పెట్టేవారు. తన్నెంతో ప్రేమగా పెంచారు వాళ్ళు. తన్ని కాలేజీలో, ఉద్యోగంలో చేర్పించే పని నాన్న చూశారు. ఇంట్లో తన అవసరాల్ని అమ్మ చూసింది. పెళ్ళయ్యాక అంతా భార్య చూసుకునేది. తల్లిదండ్రులు పోయాక తనకి అన్నీ తనే అయి చూసింది భార్యే.

భార్య పోయేసరికి పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. కూతురు పెళ్ళయి బొంబాయిలో ఉంది. సంవత్సరానికోసారి వచ్చి చూసి వెళ్తుంటుంది. కొడుకు సరేసరి. తన అదృష్టం కొద్దీ కోడలు కూడా అలాంటిదే అయింది. తన కసలు కష్టాలంటే పెద్దగా తెలియవు. అందుకేనేమో ఈ భయం పెద్ద కష్టంగా కనిపిస్తోంది. ఇలా కూర్చుని ఉంటే చావు ఆలోచనలే వస్తాయి –

అని అనుకుంటూ లేచి హాల్లోకి నడవబోయి, మళ్ళీ కోడలి పని చెడిపినట్లవుతుందని గదిలోనే ఉండిపోయాడు.

సాయంత్రమయితే వాకింగ్‌కి వెళ్ళవచ్చు. తనలాగే వాకింగ్‌కి వచ్చి బీచ్‌లో కూర్చునే తన వయస్సు వాళ్ళని కలవచ్చు. వాళ్ళతో కబుర్లు చెప్పుకుంటే మనస్సు తేలికపడచ్చు – అని అనుకుని సాయంత్రం కోసం ఎదురు చూడసాగాడు. ఎదురుచూడ్డం రామ్మూర్తికి అలవాటులేని పని. అతనికి కావలసినవి అతను ఎదురుచూడకుండానే అమరుతూ ఉంటాయి. పొద్దున్న కాఫీ దగ్గర్నుండి, రాత్రి పాలదాకా అతని తల్లో, భార్యో, కోడలో సమయానికి అందిస్తూనే ఉన్నారు. సాయంత్రం దాకా ఎదురు చూడ్డం రామ్మూర్తికి కష్టమైన పని అయింది. గడియారం కేసి చూస్తుంటే అది తిరుగుతున్నట్లుగా అనిపించలేదు. గడియారం ఎప్పుడూ ఒకేలా తిరుగుతుంది. చూసేవాళ్ళ మానసిక పరిస్థితిని బట్టి అది తొందరగానో, నెమ్మదిగానో తిరుగుతున్నట్లు ఉంటుంది.

ఈ విషయం రామ్మూర్తికి తెలియనిది కాదు. తన జీవితంలోనే అలాంటి అనుభవాలు చాలా ఉన్నాయి. డిగ్రీ పరీక్షలకి ప్రిపేరవుతున్నపుడు పరీక్షల రోజులు తొందరగా రాకూడదనుకుంటే, అవి తొందరగా వచ్చేసేవి. పరీక్షలయ్యాక రిజల్ట్సు తొందరగా రావాలనుకుంటే రోజులు ఎప్పటికీ గడిచేవి కాదు. పెళ్ళయిన కొత్తలో రాత్రుళ్ళు తొందరగానూ, పగళ్ళు నెమ్మదిగానూ గడిచేవి. ఇవన్నీ తెలిసినా సమయం గడవనట్లూ, గడియారం తిరగనట్లూ అనిపిస్తూనే ఉంది రామ్మూర్తికి.

బాగా ఆలోచిస్తే మనిషికి మంచి చెడ్డలు, తప్పొప్పులు బాగా తెలుస్తాయి. అయితే సరిగ్గా ఆలోచించడంతోపాటు మనిషికి ప్రేమ, ద్వేషం, కోపం, భయంలాంటి కొన్ని ప్రాథమిక అనుభూతులు ఉన్నాయి. వాటి ప్రభావం వల్ల మెదడు చెయ్యగలిగిన మంచి చెడుల విచక్షణని వదిలేసి హృదయం నిర్దేశించే ఆవేశపు పనులు చేస్తాడు మనిషి. ఆ ఆవేశమే ఒక్కోసారి ఒక మతం వాళ్ళ చేత మరోమతం వాళ్ళ ప్రాణాలు తీయిస్తుంది. అదే ఒక్కోసారి భర్తచేత భార్యను కొట్టిస్తుంది. కొంపలకి నిప్పంటింపచేస్తుంది. ఆలయాలను కూల్చేయిస్తుంది. అన్నదమ్ములను విడగొడ్తుంది. మనిషి మానసిక వ్యథలకు, ఆందోళనలకు అదే కారణమవుతుంది.



E:\Seelamma\
Seelama1
7

రామ్మూర్తిని పట్టుకున్న చావు భయం అతన్ని నిలవనియ్యడం లేదు. సమయం గడపనియ్యడం లేదు.

ఎవరెలాంటి గొడవల్లో ఉన్నా, ఎంతటి మానసిక సంఘర్షణ అనుభవిస్తున్నా తిరిగే గడియారం తొందరగా తిరగదు. అలాగని ఆగిపోదు, అయిదవ్వాల్సిన సమయానికి అయిదయింది.

వాకింగ్‌కి వెళ్ళొస్తానని కోడలితో చెప్పి బయల్దేరాడు రామ్మూర్తి. బీచ్ దగ్గరికి వెళ్ళేసరికి కొందరు స్నేహితులు చేరుకుంటున్నారక్కడికి.

వాళ్ళంతా అరవై, అరవైఅయిదు పైబడ్డవాళ్ళే. ఒకరిద్దరు ఎనభైకి దగ్గర పడుతున్నారు. రోజూ సాయంత్రం అందరూ కలిసి రాజకీయాల గురించో, ఆటల గురించో మాట్లాడుకుంటారు. పెన్షనర్స్‌కి గవర్నమెంటు చేస్తున్నవో, చెయ్యనివో, చెయ్యగలిగినవో – పన్లను గురించి చర్చించుకుంటారు. కొడుకులూ, కూతుళ్ళ గొప్ప పనుల గురించి చెప్పుకుంటారు. వాళ్ళ అల్లుళ్ళూ, కోడళ్ళూ చెయ్యాల్సిన పనుల గురించి చెప్పుకుంటారు. చాలా మందికి ఇళ్ళల్లో ఏవో గొడవలుంటాయి. రామ్మూర్తికి సామాన్యంగా చెప్పుకునేందుకు ఏమీ గొడవలు లేవు. అయితే ఈ రోజు తన సమస్య గురించి చెప్పాలనుకున్నాడు రామ్మూర్తి.

అప్పటికే ఒక పెద్దాయన తన బాధను వివరిస్తున్నాడు –

"ఇవన్నీ చూస్తుంటే నాకు చచ్చిపోవాలని ఉంది. కొన్నాళ్ళ క్రితం దాకా నేను ఇంటి పెద్దను. నన్ను గౌరవంగా చూసేవాళ్ళు. మా వాడికి ఉద్యోగం వచ్చి పెళ్ళయినప్పటి నుంచీ, నేను ఇంట్లో ఉన్నానో, లేనో కూడా పట్టించుకోవడం లేదు. ఇంట్లోఊరికే తిని కూర్చునే వాడిలా కనిపిస్తున్నాను వాళ్ళకి. వాణ్ణి పెంచి, చదివించి, పెద్ద చేసింది నేను. ఆ మాత్రం కృతజ్ఞత వాడికి కానీ, వాడి పెళ్ళానికి కానీ లేదు. పొద్దున్న కొంచెం కాఫీ ఇస్తే పాలు అయిపోతాయని కష్టపడిపోతుందది. దాని మొగుడు ఇలానే పుట్టాడని అనుకుంటోంది. వాడికీ ఓ చిన్నతనం ఉందనీ, అది నావల్లనే గడిచిందనీ అనిపించదు దానికి. వాళ్ళని నేనీరోజు ఏమీ అనలేను. అంటే నా తిండి ఎలా గడుస్తుంది? చచ్చినట్లు పడుండాలి. ఇలా బిచ్చగాడిలా బతకడం కన్న చావడం నయం!"

పెద్దాయన కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. గొంతు గద్గదమైంది. ఇంక మాట్లాడలేక ఆపేశాడు. పక్కనున్న ఇంకో ఆయన సమాధానపరుస్తున్నట్లు చుట్టూ చెయ్యివేసి కండువాతో కళ్ళు తుడిచి –

"ఇది వృద్ధాప్యంలోని సమస్య. అనుభవించక తప్పదు. అనారోగ్యం, నిరాదరణ,

ఒంటరితనం – ఇవన్నీ ముసలితనం బాధలు. మనం మన పిల్లల్ని పెంచి పెద్ద చేస్తాం. వాళ్ళు మనల్ని నిర్లక్ష్యం చేస్తారు. కొందరు అదృష్టవంతులు ఉంటారు. రామ్మూర్తిలాగ. వాళ్ళ వృద్ధాప్య జీవితాలు సజావుగా, సంతోషంగా సాగిపోతాయి" అన్నాడు.

రామ్మూర్తికి తాను సంతోషంగా లేనని అరవాలనిపించింది. అయితే అరవలేకపోయాడు. ఇంట్లో వాళ్ళు సరిగ్గా చూడక తనతోటివాడొకడు చచ్చిపోదామనుకుంటున్న సమయంలో తనకి చచ్చిపోతానేమోనన్న భయం ఉందని చెప్పడానికి సంకోచించాడు.

సమస్యలూ, సమాధానాలూ, సలహాలూ సాగుతున్నాయి వాళ్ళ మధ్య. తన ఆలోచన్లలో ఉన్న రామ్మూర్తి వాటిని చెవులతోనే తప్ప మనసుతో వినలేకపోతున్నాడు.

ఇంట్లో వాళ్ళు సరిగ్గా చూడడం లేదన్న కారణంగా చచ్చిపోదామనుకుంటున్నారు కొందరు. చచ్చిపోవచ్చునని ఎంత ధైర్యంగా చెపుతున్నారో! నిజంగా చచ్చిపోయే క్షణం ముంచుకొస్తుందని తెలిస్తే వీళ్లల్లో ఎందరు ధైర్యంగా ఉండగలరో? తననెంత క్రుంగదీస్తోంది ఈ చావు భయం?

చీకటిపడ్డంతో ఇంటికి బయల్దేరారందరూ.

రామ్మూర్తి ఇంటికి చేరేసరికి గుమ్మం దగ్గర ఎదురుచూస్తూ కనిపించాడు కొడుకు. రామ్మూర్తిని చూడగానే అతనిలో ఆదుర్దా తగ్గినట్లు అనిపించింది.

"రాత్రంతా నిద్రపోలేదుటగా. మధ్యాహ్నం సరిగ్గా భోజనం చెయ్యలేదటగా" అని అడిగాడు కొడుకు.

"ఎవరన్నారు?" ఏదో అనాలని అన్నాడు రామ్మూర్తి.

"మీరు మీ కోడలితో చెప్పారుట కదా. అలా తినకుండా మీరు బయటికి వెళ్ళారని తెలిసి నాకు కంగారుగా అనిపించింది" అన్నాడు కొడుకు.

"తిరిగి వచ్చానుగా" అన్నాడు రామ్మూర్తి.

"ఒంట్లో బాగుండకపోతే డాక్టర్ దగ్గరికి వెళదాం" అన్నాడు కొడుకు.

"ఒంట్లో బాగానే ఉంది" అంటూ రామ్మూర్తి గదివైపు నడిచాడు.

"పొద్దున్న తినలేదంటున్నారు. తొందరగా భోజనం చేసేద్దామా?" అన్నాడు కొడుకు.

రామ్మూర్తి "ఊం" అంటే చాలు, వడ్డించడానికి సిద్ధంగా నిల్చుంది కోడలు. "ఆకలి లేదు. కాస్సేపు ఆగుదాం" అన్నాడు రామ్మూర్తి.

"లోపలికెళ్ళి విశ్రాంతి తీసుకోండి" అన్నాడు కొడుకు.



E:\Seelamma\
Seelama1
8

రామ్మూర్తి గదిలోకి నడిచాడు. వెంట వస్తున్న మనవడిని ఆపి "తాతయ్యకి ఒంట్లో బాగాలేదట. నువ్వు ఇక్కడే ఆడుకో" అంది కోడలు.

"నా ఒంట్లో ఏమీ లేదమ్మా – బానే ఉన్నాను" అన్నాడు రామ్మూర్తి.

ఒంట్లో ఏమీలేదంటే, మనస్సులో ఏదన్నా ఉందా అని కొడుకుకానీ, కోడలు కానీ అడుగుతారేమోనని ఎదురుచూశాడు రామ్మూర్తి. ఇద్దరూ అడగలేదు. అసలు రామ్మూర్తికి మానసికమైన ఆందోళన ఉంటుందన్న ఊహ వచ్చే అవకాశం ఎవరికీ లేదు. రామ్మూర్తికి సమస్యలు ఏమీ లేవు. పెళ్ళయిన కూతురు తన కుటుంబంతో సుఖంగా బొంబాయిలో ఉంటోంది. కొడుకు కుటుంబం సంతోషంగా ఉంది. రామ్మూర్తి ఆరోగ్యం బావుంది. అతనికి సరిపోయంత పెన్షన్ వస్తుంది. అతన్ని ఇంట్లో వాళ్ళందరూ బాగా చూసుకుంటారు. అసలు మానసికమైన ఆందోళనకి ఆస్కారం లేదు. అయినా గదిలో రామ్మూర్తికి కాలం భారంగా గడుస్తోంది.

చావు భయం తక్కిన భయాల్లాంటిది కాదు. దొంగభయం, పాము భయం నిరంతరం ఉండవు. నలుగురిలో ఉన్నప్పుడు, పగటిపూట ఈ భయాలు ఉండవు. ప్రయాణాల భయం, పరీక్షల భయం – అవన్నీ ఆ సంఘటనలు అయిపోగానే తగ్గుతాయి. చావు భయం అలా కాదు! చావు ఏ క్షణాన్నయినా రావచ్చు. లక్షల మంది మధ్యలో కూడా చావు రావచ్చు. ఇలాంటి ఆలోచనలు భయాన్ని పెంచసాగాయి. చావు కన్న చావుభయం భయంకరంగా తయారవసాగింది.

ఇంక భరించలేక కొడుక్కి చెప్పేద్దామనుకుని హాల్లోకి వస్తోంటే పక్క గదిలోంచి కొడుకు గొంతు వినిపించింది –

"భయం లేదు బాబూ, వంటింట్లోకి వెళ్ళి నీళ్ళు తాగిరా."

"నాకు భయం" అంటున్నాడు మనవడు.

"నాలుగేళ్ళుదాటాయి. ఇంకా భయం ఏంటి? వెళ్ళితాగు" అంటున్నాడు కొడుకు.

"పాపం భయపడుతున్నాడు. నేను నీళ్ళు తెస్తానుండండి" కోడలి గొంతు అది.

"అలాగైతే వాడికి భయం ఎలా పోతుంది? వాడు మరీ చిన్న పిల్లాడు కాదు. మనం ఇలా చేస్తే వాడికి భయం మిగిలిపోతుంది. ఎంత వయస్సు వచ్చినా పిరికివాడిలాగా ఉండిపోతాడు. నేను ఈ గది గుమ్మం దగ్గర నిలబడి ఉంటాను. నువ్వు వెళ్ళి తాగిరా" అన్నాడు కొడుకు.

బెరుగ్గా వంటింటివైపు వెళ్ళసాగాడు మనవడు.

రామ్మూర్తి గదిలోకి వచ్చేశాడు.

మనవడి భయాన్నే పట్టించుకోవడం లేదు. తనకు చచ్చిపోతానేమోనని భయంగా

ఉందంటే ఎలా చూస్తారు తన్ని. తన భయం ఎవడితోనన్నా చెప్పేటట్లు లేదు. తనతో ఎవరన్నా అంటే తనే నవ్వుతాడు. ఈ భయం తనకి పాతికేళ్ళ వయస్సప్పుడో, యాభైఏళ్ళ వయస్సప్పుడో వచ్చి ఉంటే ఎలాగుండేదో తెలియదు. ఎవరికన్నా చెప్తే వాళ్ళు తన్నర్థం చేసుకునేవారేమో. జీవితపు చివరిదశకి చేరుతున్న తను ఎవ్వరితోనూ తన భయం గురించి చెప్పలేకపోతున్నాడు. అయితే తన్నా భయం పట్టి కుదిపేస్తోంది. ఏ పనీ చెయ్యనివ్వడం లేదు.

రాత్రి కూడా ఏమీ తినలేకపోయాడు.

పక్క సరిచేసి పాలు, మంచినీళ్ళు గదిలో పెట్టి వెళ్ళింది కోడలు. ఇంటి తలుపులన్నీ వేసి, విశ్రాంతిగా పడుకోమని చెప్పి, తమ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు కొడుకు.

ఈ రాత్రి కూడా నిద్రపట్టదనిపించింది రామ్మూర్తికి. నిద్ర పట్టదేమోనన్న భావం అసలు నిద్ర పట్టనియ్యదు. కిటికీలు మూసి ఉంటే ఉంగుడెత్తినట్లుందనిపించి కిటికీ తలుపులు తీశాడు. కిటికీలోంచి కనిపించే చెట్లు భయంకరంగా కనిపిస్తోంటే, తలుపులు వేశాడు. ఉక్కగా అనిపించి పీక నొక్కేస్తున్నట్లు అనిపించి దుప్పటి తీసేశాడు. చుట్టూచీకటిగా అనిపించి లైట్ వేశాడు.

హనుమాన్ చాలీసా, సుందరకాండలు గుర్తొచ్చాయి. హనుమంతుణ్ణి తలచుకుంటూ పడుకుందామనుకున్నాడు. కానీ మనస్సు హనుమంతుడి మీద నిలబడలేదు. లేచి కూర్చున్నాడు. ఓ క్షణం భయం తగ్గినట్లయింది. మళ్ళీ మామూలే.

లేచి పాలు తాగబోయాడు. సయించలేదు. నీళ్ళు తాగబోయాడు. గుటక పడలేదు.

నిద్రలేకుండా ఒక రాత్రి గడపడం కష్టం కాదు. అర్ధరాత్రి పెళ్ళిళ్లకి నిద్ర లేకుండా రాత్రంగా హాయిగా కాలం గడిపేస్తారు చాలామంది. అయితే భయం వల్ల నిద్ర రాకపోతే కాలం గడపడం కష్టం.

మర్నాడు డాక్టర్ని కలవాలని నిర్ణయించుకున్నాడు రామ్మూర్తి. అలా ఏదో ఒకటి చెయ్యాలని అనుకున్నప్పుడు, ఆ పనిని చెయ్యడం, గురించి చేస్తున్న ఆలోచనలతో కాలం కొంత గడుస్తున్నట్లుంది భారంగానైనా.

పొద్దున్న కొడుకూ, మనవడూ వెళ్ళిపోయాక "అలా వెళ్ళొస్తాను" అన్నాడు కోడలితో రామ్మూర్తి.

"ఎవరన్నా వెళ్తుంటే ఎక్కడికని అడక్కూడదు. కానీ మీముఖం నిద్రలేకపోవడం వల్లనేమో బాగా పీక్కుపోయినట్లుంది. అందుకనే మీరు వెళ్తానంటే ఎక్కడికని అడక్కుండా ఉండలేకపోతున్నాను" అంది కోడలు.



E:\Seelamma\ Seelama1 9

ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవడం ఎందుకని డాక్టర్ దగ్గరికి వెళ్ళి వస్తానని నిజం చెప్పాడు రామ్మూర్తి.

"మీరు ఒక్కరూ వెళ్ళద్దు, నేనూ వస్తాను" అని తనూ బయల్దేరింది కోడలు. ఇంటికి తాళం వేసి.

తమకి తెలిసిన డాక్టర్ దగ్గరికెళ్ళారు.

"మావగారికి రాత్రిళ్ళు నిద్రపట్టడంలేదట. సరిగ్గా భోజనం చేయలేకపోతున్నారు. కొంచెం చూడండి" అంది కోడలు డాక్టర్‌గారితో.

మామూలు చెకప్‌చేసి – "గుండె గట్టిగా ఉంది. ఇప్పుడప్పుడే ఆగదు" అని రామ్మూర్తితో అని "ఆయన ఆరోగ్యం మంచిదమ్మా. ఈ వయసులో మామూలుగా ఉండే బి.పి., షుగర్ వంటివేమీ ఆయనకి లేవు. అప్పుడప్పుడు నిద్రపట్టకపోవడం పెద్ద సమస్య కాదు. అసలు నిద్ర పట్టదనిపించిన రోజు వాడేందుకు నిద్రమాత్రలిస్తాను. దగ్గరుంచండి. ఆయన గదిలో ఉంచద్దు. మరచిపోయి మళ్ళీ వేసుకుంటే ప్రమాదం, అవసరమైనప్పుడు ఒకటో, రెండో ఇవ్వండి" అన్నాడు కోడలితో.

"అసలు నా సమస్య....." అంటూ మొహమాటంగా మొదలెట్టిన రామ్మూర్తిని మధ్యలో ఆపేస్తూ డాక్టర్‌గారు –

"మీకు సమస్యలేంటండీ రామ్మూర్తిగారూ? హాయిగా ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. కూతురికి మంచి సంబంధం చేశారు. కొడుకు సుఖంగా ఉన్నాడు. మనవడితో ఆడుకుంటున్నారు. ఇంక ఆ భగవంతుడి పిలుపు కోసం ఎదురు చూస్తూ కాలం గడపడమే" అన్నారు.

ఆయన వయస్సు అరవైపైనే ఉంటుంది. చాలా రోజులుగా ఒకరికొకరు తెలియడం వల్ల వాళ్ళ మధ్య చనువుంది. ఆ చనువుని పురస్కరించుకుని ఆయన రామ్మూర్తితో వేళాకోళంగా మాట్లాడారు. భగవంతుడి పిలుపుకోసం ఎదురు చూడమనే డాక్టర్‌గారితో, తన చావు భయం గురించి చెప్పలేకపోయాడు రామ్మూర్తి.

ఇంటికి చేరాక భోజనం చేశాననిపించుకుని, కోడలినడిగి నిద్ర మాత్ర వేసుకుని పడుకునేందుకు ప్రయత్నించాడు రామ్మూర్తి. నిద్రమాత్రలు భయాన్ని పోగొట్టి నిద్రనివ్వలేవన్న సంగతి మధ్యాహ్న ప్రయత్నంలో కొంతా, రాత్రి ప్రయత్నంలో పూర్తిగా తెలిసింది రామ్మూర్తికి. మాత్రలు నిద్రనివ్వలేవన్న సంగతి భయాన్ని పెంచింది. రామ్మూర్తికిప్పుడు చావు భయంతో పాటు, ఈ భయం పోదేమోనన్న భయం తోడైంది.

భయం స్వభావమే అంత. అసలు బాధకన్నా బాధ కలుగుతుందన్న భయం ఎక్కువ బాధకలిగిస్తుంది. అంతకన్నా ఆ భయం తాలూకు భయం భయంకరంగా

ఉంటుంది.

తనకున్న సమస్య ఎవ్వరికీ చెప్పలేకపోవడం చాలా కష్టంగా ఉంది రామ్మూర్తికి. మృత్యువంటే ఏమిటో తెలియకుండా దాని గురించి భయపడ్డం వింతగా తోచింది. అయితే తెలియకపోవడం వల్లనే భయం కలుగుతుందేమో కూడా తెలియదు.

ఎంత ఆలోచించినా, ఎంత ప్రయత్నించినా చావు భయం తగ్గడంలేదు రామ్మూర్తికి. ఆ భయంతోనే మార్నింగ్‌వాక్‌కని వచ్చి సముద్రపు ఒడ్డున కూర్చున్నాడు. తూర్పున ఉన్న మబ్బు సూర్యుడినింకా కనిపించనియ్యడం లేదు.

ఈ చావు భయం అనుభవించడం కన్నా చావడం నయమనిపించింది రామ్మూర్తికి. చావు భయంకరమైనది అయితే అవచ్చు. చస్తే ఒక్కసారితో ఈ భయం సమాప్తమవుతుందనిపించింది. ఇలా క్షణం క్షణం భయంతో చస్తూ బతకడం కన్నా చావడం మేలు. ఈ ఆలోచన బలంతో లేచి సముద్రం దగ్గరికి నడిచాడు. కెరటం తాలూకు నీళ్ళు చల్లగా కాళ్ళకి తగిలాయి. ఒళ్ళంతా చల్లగా అయిపోయింది. నీళ్ళలోకి వెళ్ళలేక వెనక్కి వచ్చేసి కూర్చున్నాడు.

కూర్చుని ఆలోచించే కొద్దీ చావు తప్ప తన సమస్యకి సమాధానం లేనట్లనిపించసాగింది. చావాలన్న నిర్ణయంతో మళ్ళీ సముద్రంవైపు నడిచాడు. నీళ్ళు తగిలాయి. గుండె జారింది. వెనక్కి తిరిగి నడవసాగాడు. అలా నడుస్తుండగా –

"ఏంటి భయమా?" అన్నగొంతు వినిపించింది.

సముద్ర కెరటాల శబ్దం వేల తబలాల లయగా వినిస్తుంటే, ఆ కంఠ స్వరం సితార్ ధ్వనిలా వినిపించింది. కంఠస్వరం వినిపించిన వైపు చూశాడు.

పదహారేళ్ళునిండని అమ్మాయి నుంచుని ఉంది.

పసుపు పచ్చని పరికిణీ, జాకెట్టు, పైన వేసుకున్న నీలం రంగు ఓణీ. నుదుటన ఎర్రని చిన్న గుండ్రపు బొట్టు. కళ్ళకి నల్లని కాటుక, చెవులకి తెల్లని ముత్యాల జూకాలు, చేతులకు నీలం రంగు గాజులు. సన్నటి పొడుగాటి వేళ్ళతో ఎగురుతున్న జుట్టుని వెనక్కి తోసుకుంటూ రామ్మూర్తి దగ్గరకొచ్చి మళ్ళీ అడిగింది రామ్మూర్తిని – "భయమా?" అని.

రామ్మూర్తి ఆశ్చర్యపోతున్నట్లు చూశాడు.

"నాకూ నీళ్ళంటే భయమే" అంది అమ్మాయి.

"అదా–" అన్నాడు రామ్మూర్తి.

"అంత తేలికగా అనకండి. కెరటాలు చూడ్డానికి ఎంతో అందంగా ఉంటాయి. దగ్గరకెళ్తే మోసం చేస్తాయి. ఉన్నట్లుండి తమలోకి లాగేసుకుంటాయి. మీరు నీళ్ల



E:\Seelamma\
Seelama1
10

దగ్గరికి రెండుసార్లు వెళ్ళి రావడం చూసి మీక్కూడా నీళ్ళంటే భయం అనుకున్నాను" అందా అమ్మాయి.

"నాకు నీళ్ళంటే భయం లేదు" అన్నాడు రామ్మూర్తి.

"మరింక ఏదంటే భయం?" అందా అమ్మాయి.

రామ్మూర్తి ఇంక ఆగలేకపోయాడు. రెండు రోజులుగా తను చెప్దామనుకుంటున్న విషయాన్ని ఈ అమ్మాయి అడిగింది.

"చావంటే!" అన్నాడు వెంటనే.

"మీకు చావంటే భయమా?" అంది.

"అంతకు ముందు లేదు. రెండు రోజులుగా నన్ను పీడిస్తోంది ఈ చావు భయం" అన్నాడు చాలా సిన్సియర్‌గా రామ్మూర్తి.

రామ్మూర్తి దగ్గరకొచ్చి – అతన్ని పట్టుకుని కూర్చోపెట్టి తను ఎదురుగా కూర్చుంది ఆ అమ్మాయి. కూర్చుని –

"సముద్రమూ, కొండలోయా, మృత్యువూ ఎంతో అందమైనవి. అవి మనల్ని ఆహ్వానిస్తాయి. అలాగే తమలోకి లాగేసుకుంటాయి" అంది.

ఆ గొంతులో సాహిత్యమూ, సంగీతమూ కలిసి వినిపించాయి. ఆ గొంతులోని మాధుర్యం రామ్మూర్తిని లాలించింది. తన భయానికి ఆ అమ్మాయి నవ్వలేదు. అంతేకాదు తన మాటలు వినడానికన్నట్లు కూర్చుంది. కన్న తల్లి దగ్గర కూర్చుని తన కష్టాలు చెప్పుకునే కుర్రాడిలా – అరవై ఏళ్ళు నిండిన రామ్మూర్తి పదహారేళ్ళు నిండని అమ్మాయి ముందు కూర్చుని – తన గతం గురించి – రెండు రోజులుగా తను అనుభవిస్తున్న భయం గురించీ చెప్పుకోసాగాడు. తనకంతకు ముందు ఏ మాత్రమూ పరిచయం లేని పిల్ల దగ్గర తన బాధనంతా వెళ్ళగ్రక్కుకున్నాడు.

తన విశాలమైన కళ్ళను మూసి తెరవడం తప్ప మరో కదలిక లేకుండా వింటూ కూర్చుంది ఆ అమ్మాయి. అంతా విన్నాక అంది –

"మీకు తెలిసిన అమరులెవ్వరైనా ఉన్నారా?"

"మనిషికి మరణం తప్పదని నాకు తెలుసు. అయినా ఈ భయం తప్పడం లేదు నాకు" అన్నాడు రామ్మూర్తి.

"నిద్ర వస్తుందని ఎప్పుడయినా భయపడ్డారా?"

"లేదు."

"మరి చావు గురించి ఎందుకు భయపడుతున్నారు? చావు కూడా నిద్రలాంటిదే. మెలకువే రాని దీర్ఘ నిద్ర. నిద్ర ఎంత సుఖంగా ఉంటుందో తెలుసు మనకి. చావు

కూడా అంత సుఖంగా ఉండి ఉండాలి" అందా అమ్మాయి అదేదో పారవశ్యంలో ఉన్నట్లు.

"నిద్ర సుఖం గురించి రెండు రోజులుగా బాగా అర్థమవుతోంది నాకు" అన్నాడు రామ్మూర్తి.

"మీకు మరేం పనిలేకపోవడం వల్ల ఈ భయం పట్టుకుంది"అంది ఆ అమ్మాయి.

తన భయాన్ని అంత తేలికగా ఆ అమ్మాయి కొట్టి పారెయ్యడం బాధగా అనిపించింది రామ్మూర్తికి. అదే మాట అన్నాడు ఆ అమ్మాయితో. అందుకు సమాధానంగా –

"నిజం చెప్పండి, ప్రస్తుతం మీరు చేస్తున్న పనేంటి? పేపర్ చదవడం, భోజనం చెయ్యడం, వాకింగ్‌కి వెళ్ళడంలాంటి పనులు కావు. అవి మీ పనులు. మీ వల్ల ఇంకెవ్వరికైనా అవసరముందని మీకు అనిపించే పనులేమైనా మీరు చేస్తున్నారా? రిటైరయ్యేదాకా ఉద్యోగం చేశారు. తరువాత కొన్నాళ్ళు మీ భార్య ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకున్నారు. గత కొన్నాళ్లుగా మీరు చేస్తున్న పనేంటి? మీ జీవితం ఎవరికి పనికొస్తోంది. ఈ ప్రశ్న నేను ఈ రోజు మిమ్మల్ని అడగడంలేదు. మీలో మీకు తెలియకుండా ఈ ప్రశ్న రగులుతోంది. నా వల్ల ఈ ప్రపంచానికి అవసరం లేకపోతే నేను పోతానేమో ననిపించింది మీకు. అదే మృత్యుభయంగా అనిపిస్తోంది మీకు" అంది ఆ అమ్మాయి.

"ఇదంతా నీ ఊహ. నాకు అలా అనిపించనే లేదు ఎప్పుడూ" అన్నాడు రామ్మూర్తి.

"ఇది నా ఊహ అన్నది నిజం. అయితే ఈ ఊహ నిరాధారమైంది కాదు. ఆలోచిస్తే మీకూ అది సరయిందిగా తోచవచ్చు. ఇంక మీకు అనిపించడం గురించి – మనకి తెలిసిన మన భయాలు వేరు, అకారణ భయాలు వేరు. దేనికో ఎందుకో బయటికి తెలియకుండా, మన లోపల మనకి తెలియకుండా జరిగే ఆలోచనల వల్ల ఉత్పన్నమయ్యే భయాలు అకారణంగా కనిపిస్తాయి. మన బుర్రలను మథించి మనం ఆ కారణం కనుక్కోవచ్చు. ఆ కారణం సామాన్యంగా హాస్యాస్పదంగా ఉంటుంది మనకి. అలా అనిపించగానే భయం పోతుంది. అలా కాకపోతే దేనివల్ల భయం కలుగుతుందో ఆ కారణాన్ని తొలగించినా భయం పోతుంది."

"నువ్వు సైకాలజీ, సైకియాట్రీ చదివావా?"

"పదహారేళ్ళ నా జీవితం నాకెన్నోనేర్పింది."

"ఒకవేళ నువ్వు చెప్పింది నిజమే అయితే నేనిప్పుడేం చేస్తాను? రిటైరయ్యాను నేను. నా బాధ్యతలన్నీ తీరాయి" అన్నాడు రామ్మూర్తి.





"బాధ్యతలు వేరు.... పనులు వేరు.... బాధ్యతలని మీరనుకుంటున్నవి మీకు లేకపోయినంత మాత్రాన పనులు లేకుండా పోవు. మీ ఇంటి దగ్గరున్న నలుగురు పిల్లలను దగ్గరికి చేర్చుకుని వాళ్ళకి చదువు చెప్పండి. డబ్బుకోసం కాదు. ఉచితంగాపేద వాళ్ళకి చెప్పండి. బేంక్, పోస్టాఫీస్, పాలు – ఈ పనులకి మీరు వెళ్ళండి. ఇంట్లోవాళ్ళు వద్దంటారని అనద్దు. మీకు ఓపిక ఉన్నంతకాలం మీరు చెయ్యండి. బయటికి వెళ్ళలేకపోతే మీ కోడలికి వంటలో సాయం చెయ్యండి. వంట పని చెయ్యకూడదా?" అంది కొంటెగా.

"చెయ్యొచ్చు, నాకు వంట బాగా రాదు. చారు ఒక్కటే బాగా పెడతానని అనేది మా ఆవిడ" అన్నాడు రామ్మూర్తి.

"మానసికోల్లాసానికి కొన్ని పనులు చెయ్యచ్చు. షేక్సిపియర్ నాటికను దేన్నైనా తీసుకుని తెలుగులోకి అనువాదం చెయ్యచ్చు. రేడియోలో వస్తున్న మంచి పాటలని రికార్డ్ చేస్తుండవచ్చు. ఓ గులాబీ మొక్కను పెంచి చూడండి. ఎంత బాగుంటుందో. నా మట్టుకు నేను రవీంద్రుడి గీతాంజలిని తెలుగులోకి అనువదిస్తున్నాను. ఇంతకు ముందు ఎందరో అనువదించారు. అంత మాత్రాన నేను చెయ్యకూడదా?"

"నీ పనులకీ, నా పనులకీ పోలికా? నీ వయస్సెంత? నా వయస్సెంత?"

"వయస్సుకీ, చావుకీ సంబంధం ఉందా? ఎవరెప్పుడు పోతారో ఎవరికి తెలుసు?" అందా అమ్మాయి, సూర్యుడు తూర్పున ఉదయించునన్న ప్రాథమిక సూత్రాన్ని చెపుతున్నట్టు.

"అలా మాట్లాడకు" అన్నాడు రామ్మూర్తి.

"మీకు తెలియదు – మా అమ్మా, నాన్నలు, తాతా మామ్మలు, రెండేళ్ళ క్రితం ఓ కారు ప్రమాదంలో మరణించారు. మా ముత్తాత – అంటే – మా నాన్న నాన్నకి నాన్న – వాళ్ళందరికీ కొరివి పెట్టారు. ఆయన వయస్సు తొంభై పైన. కొడుకూ, మనవడూ పోయిన దుఃఖం ఆయన్ని చంపిందా? ఇవన్నీ చూడాలన్న ఆశ ఆయనకు ఉందా? ఆయనా, నేనూ మిగిలాం. ఎవరం ముందు పోతామో తెలియదు. అయితే నాకొక్కటే కోరిక. ఆయన నా కన్న ముందు పోవాలని. ముని మనవరాలి మరణాన్ని ముసలి ప్రాణం చూడకూడదని నా తాపత్రయం. ఈ భూమి మీద మనందరి చేతా ఇంత పెద్ద నాటకాన్ని వేయిస్తున్న సూత్రధారుడు మనకి ముందుగా ఏమీ చెప్పడు. అప్పటికప్పుడు సంభాషణలు యాక్షన్ చెప్తాడు. ఎవరిని ఎప్పుడు పొమ్మంటే అప్పుడు వాళ్ళు నిష్క్రమించడమే."

"నిండా పదహారేళ్ళు లేవు. ఎప్పుడూ చావు గురించి మాట్లాడుతున్నావేంటి నువ్వు?"

అన్నాడు రామ్మూర్తి.

"నా సంగతి వదిలేద్దాం. మీకెలాగుంది ఇప్పుడు?"

"నీతో మాట్లాడుతోంటే హాయిగా, కులాసాగా ఉంది. గుండె బరువు తగ్గినట్లుంది."

"అవును – పదహారేళ్ళ అందమైన అమ్మాయికి ఇంత దగ్గరగా కూర్చుని కబుర్లు చెప్తుంటే మగాళ్ళకి హాయిగా కాక ఇంకెలాగుంటుంది" అని వెంటనే "అందమైన దాన్నని నేనే చెప్పుకుంటున్నానని నాకు గర్వం అనుకుంటున్నారా?" అని అడిగింది.

"నీకు గర్వం ఉందో, లేదో నాకు తెలియదు కానీ – నీకు అందం ఉంది. సూర్యోదయం, శరచ్చంద్రికా, తొలకరి జల్లుకి తడిసిన మట్టివాసనా, కాలువ గట్టున గాలికి రెపరెపలాడుతున్న వరిపైరూ అందంగా ఉంటాయి. నీదీ అలాంటి అందం."

"మీకు ప్రకృతీ, కవిత్వం ఇష్టంలాగున్నాయి."

"చాలా ఏళ్ళ క్రితం మాట. కొన్నాళ్ళుగా రెండూ మర్చిపోయాను. నిన్ను చూశాక మళ్లీ గుర్తొస్తున్నాయి. ఎంతో ఆనందంగా ఉంది. నిన్నింత వరకు చూళ్ళేదు. రోజూ వస్తుంటావా బీచ్‌కి?" అన్నాడు రామ్మూర్తి.

"వస్తుంటాను. అయితే నేనక్కడే రోడ్డు మీద కార్లో కూర్చుని సూర్యోదయం చూసి వెళ్ళిపోతుంటాను. ఈ రోజు అలా చూస్తుంటే మీరు నీళ్ళదగ్గరికి వెళ్ళడం, తిరిగి రావడం కనిపించింది. ఏదో వింతగా అనిపించి మీ దగ్గరకొచ్చాను" అంది అమ్మాయి.

"అయితే నిన్ను రోజూ చూడచ్చునన్నమాట."

"ఏమో – నేను బతికున్నంత కాలం ఇక్కడికి తప్పకుండా వస్తాను. ఆ – ఇప్పుడు మీకోపని దొరికింది. రేపు నేను వస్తానో, రానో తెలియదు. అలాగే ఎల్లుండీ, ఆ మర్నాడూ కూడా. మీరు రోజూ ఉదయం వచ్చి చూస్తుండండి – నేను వస్తానో, రానోనని. నే నేరోజు రానో ఆ రోజు ఈ లోకంనుంచి వెళ్ళిపోయినట్లనుకోండి."

"మళ్ళీ మరణం గురించి మాట్లాడుతున్నావు – ఇంతకీ నీ పేరేంటి?"

"నా పేరుతో మీకేంటి పని? పేరు, అడ్రసు కనుక్కుని ప్రేమ లేఖలు రాస్తారా? లేక ఏకంగా పెళ్ళి సంబంధం మాట్లాడేసేందుకు ఇంటికి వచ్చేస్తారా? మా ముత్తాత మన పెళ్ళికి ఒప్పుకోడు. మా ముత్తాతే కాదు – మీ మనవడు కూడా ఒప్పుకోకపోవచ్చు. తన అక్క వయస్సు పిల్ల తనకి మామ్మ అవడానికి. ఇంతకీ మీ మీనవడి పేరేంటి?"

"వాడి పేరు నీకెందుకు?"

"నా మాట నాకే అప్పజెప్పానని ఆనందిస్తున్నారా? – ఇలాంటి ఆనందాలు అసలు ఆనందాలు కావండీ, మీరు నిజంగా ఆనందపడాల్సిన దానికి కారణం మీకు



E:\Seelamma\
Seelama1
12

కొడుకూ, ఓ మనవడు ఉండడం. కొడుకంటే ఎవరు? మీరే. ఒక చెట్టులోంచి విత్తనం వస్తుంది. అది మళ్ళీ చెట్టవుతుంది. ఆ చెట్టులోని భాగమే ఈ చెట్టు. మనుష్యులూ అంతే! మనం పోతే ఏముంటుంది? మన అంశ. అంటే మనలోని భాగమే మన తరువాత తరంగా ఉంటుంది. అలా ఉండడమే మనలని చావు భయం నుంచి దూరం చేస్తోందంటాడు బెర్ట్రాండ్ రస్సెల్. మనుష్య జాతి ఉన్నంతకాలం మనం ఉన్నట్లే. నాకు పిల్లలుంటే నాకూ ఆ ఫీలింగ్ కలిగేది. నాకు పిల్లలు లేరు. అయినా అలాగే ఫీలవగలుగుతున్నాను. అందుకే మృత్యువుకి భయపడ్డంలేదు" అంది ఆ అమ్మాయి.

"నువ్వు చెపుతోంటే నాకూ అనిపిస్తోంది. నా కొడుకు నా అంశ. వాడు నేను. అలాగే నా మనవడు. మరి చావు లేనట్లే కదా!"

"అసలు చావంటే ఏమిటో తెలిస్తే కదా అది ఉందో, లేదో తెలియడానికి.... ఏదో ఒక రోజున ఈ లోకంలో తక్కిన వారికి మనం ఉండం. మనకి మనం ఉంటామో, ఉండమో! ఏమయినా మన పిల్లల రూపంలో ఈ లోకంలో ఉంటాం. ఇంక దీని గురించి ఆలోచించవద్దు" అంది అర్థిస్తున్నట్లుగా ఆ అమ్మాయి.

"ఇంక ఈ ఆలోచన లేనట్లే నాకు" అన్నాడు రామ్మూర్తి.

మబ్బులు కొంచెం కొంచెంగా వీడుతుంటే సూర్యుడు కనిపించసాగాడు. సూర్య కిరణాలు అలల మీద మెరుస్తున్నాయి.

"కిరణాల కెరటాల్లో నిలబడదాం రా" అన్నాడు లేస్తూ రామ్మూర్తి.

"నాకు భయం" అంది ఆ అమ్మాయి.

"నేనున్నానుగా" అంటూ ఆ అమ్మాయిని తీసుకుని వెళ్ళి నీళ్ళలో నించో బెట్టాడు. ఆ అమ్మాయి కాళ్ళు నీళ్ళలో తడిశాయి. ఆ అమ్మాయి నవ్వింది.

"నీకు నీళ్ళంటే భయం లేదు. నాకు అబద్ధం చెప్పావు" అన్నాడు రామ్మూర్తి.

"మీకూ చావంటే భయంలేదు. నాకు అబద్ధం చెప్పారు" అంది ఆ అమ్మాయి.

"భయం ఉంది. నీ వల్ల పోయినట్లుంది" అన్నాడు రామ్మూర్తి.

"ఇంక వెళ్దాం" అంటూ కదిలింది ఆ అమ్మాయి.

అనుసరించాడు రామ్మూర్తి. మనవరాలు తాతని నడిపిస్తోంది. నడిపిస్తూ చెప్తోంది–

"మృత్యువు అనివార్యం. అయితే దానికోసం ఎదురుచూడకండి. అలాగని దాని గురించి భయపడకండి. నిరంతరం మన వెనకే ఉండే మన నేస్తం మృత్యువు – ఎప్పుడూ వెన్నంటే ఉంటుంది. దానికి మన మీద ప్రేమ పెరిగినప్పుడు మనల్ని తనతో కలిపేసుకుంటుంది. అలా మృత్యువు తీసుకెళ్ళిపోతుందని తెలియడం వల్లనే

మనం మన పనులు చేస్తున్నాం. అలాకాక అసలు మరణమే ఉండదని తెలిస్తే ఎలాగుండేదో ఈ లోకం?

"మనం లేకున్నా మన వారసులు – అంటే మనం – ఉంటూనే ఉంటారు. మన పనులు ఉంటాయి. కాళిదాసుకు, త్యాగరాజుకు, శంకరాచార్యులకు, న్యూటన్‌కి మరణముందా? అయితే అందరూ కవులూ, గాయకులూ, మతాచార్యులూ, శాస్త్రజ్ఞులూ కాలేరు. వారి వారి పరిధుల్లో వాళ్ల పనులు నిలుస్తాయి. మనమున్నంత కాలం మనతోపాటు మన నీడా, మన వెనకే మృత్యువు ఉంటాయి. మనం పోయినా మనకి గుర్తుగా మన పిల్లలూ, మన పనులూ మిగుల్తాయి" అంది తమ ముందున్న తమ నీడలను చూస్తూ.

రామ్మూర్తి వెనక్కి తిరిగా చూశాడు.

"మన వెనకనున్న మృత్యువు మనకి కనిపించి భయపెట్టదు. కనిపించకుండా కబళించివేస్తుంది" అంది నవ్వుతూ.

రామ్మూర్తి కూడా నవ్వేశాడు.

రోడ్డు మీదకి చేరేసరికి డ్రైవర్ కార్ వెనక డోర్ తెరిచాడు ఆ అమ్మాయి కోసం.

"నేనింక వెళ్తాను" అంది ఆ అమ్మాయి డోర్ పట్టుకుని.

డ్రైవర్ ముందు సీట్లో కూర్చున్నాడు.

"నీ పేరు చెప్పలేదు. అడ్రస్ చెప్పలేదు. మళ్ళీ మనం కలుస్తామా? రేపు ఇక్కడే కలుద్దామా?" అన్నాడు రామ్మూర్తి.

"బతికున్నంతకాలం వస్తానని చెప్పానుగా!"

"మళ్ళీ చావు గురించి మాట్లాడుతున్నావు. నా భయాన్ని నాకు ఎత్తి చూపాలనా?"

"కాదు – నిజంగానే నేనెన్నాళ్ళు బతుకుతానన్నది వైద్యశాస్త్రం మీద ఆధారపడి ఉంది. ఎయిడ్స్‌కి హఠాత్తుగా ఎవరన్నా మందు కనుక్కుంటే తప్ప నేనెక్కువ కాలం బతకను" అంది ఆ అమ్మాయి.

"అంటే...." అంటూ ఆగాడు రామ్మూర్తి.

"అంటే ఏముంది – నాకు ఎయిడ్స్. ఎయిడ్స్ అనగానే ఏదో శృంగారపరపు ఆలోచనలు చెయ్యద్దు. రెండేళ్ళ క్రితం కారు యాక్సిడెంట్‌లో నాకు దెబ్బలు తగిలి బాగా రక్తంపోయింది. రక్తం ఎక్కించారు. దాని ఫలితం ఈ రోగం.... అంతే" అంది ఆ అమ్మాయి.

రామ్మూర్తి నివ్వెరపోయాడు.

కారు కదిలింది.



E:\Seelamma\ Seelama1 13

రామ్మూర్తి నెమ్మదిగా ఇంటివైపు నడిచాడు – బుర్రనిండా ఆలోచనలతో. ఎయిడ్స్‌తో బాధపడుతున్న పదహారేళ్ళ అమ్మాయికి లేని చావు భయం తనకి కలిగిందేంటో? ఆ అమ్మాయి వల్లే తన భయం తగ్గినట్లుంది. తను రోజూ బీచ్‌కొచ్చి ఆ అమ్మాయిని కలవాలి. ఆ అమ్మాయి బతకాలి. వాళ్ళ ముత్తాతగారు పోవడానికి ముందు ఆ అమ్మాయి పోకూడదు. అసలు అంత తొందరగా చచ్చిపోకూడదు. ఎయిడ్స్‌కి మందు ఎవరన్నా కనుక్కోవాలి. అలాగని తమ దేవుణ్ణి ప్రార్థించాలి – తనకున్న ముఖ్యమైన పని అదే.

రామ్మూర్తి నడుస్తూనే ఉన్నాడు.

సముద్రం ఎప్పటిలానే ఉంది – పైకి లేచి, విరిగి, నురుగై మళ్ళీ తనలోకి చేరిపోయే కెరటాలతో.

'స్వాతి' మాసపత్రిక, నవంబర్ 1992

# అద్వైతం

E:\Seelamma\

Seelama1

14

**చ**లికాలం – రాత్రికావడంతో – ఎక్కువమంది జనం లేరు బీచ్‌లో.

ఆరేడుకిలోమీటర్లు పొడవున్న అందమైన బీచ్ మెరీనా.

మద్రాసు నగరానికీ, నగరవాసులకీ ఎంతో అందాన్నీ, ఆనందాన్నీ ఇస్తోంది ఈ సముద్రతీరం.

మద్రాసులో ఉండడం మొదలెట్టి పదేళ్ళయినా స్వప్నకీ నాకూ సముద్రమంటే మక్కువ ఏమాత్రమూ తగ్గలేదు – పెళ్ళయి పన్నెండేళ్ళయినా ఒకరంటే ఒకరికి ప్రేమ తగ్గనట్లే.

ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిపోయే కెరటాలని చూస్తూ కూర్చుంటే సమయం తెలియదు మాకు. ఒక పక్క హార్బర్‌లోకి వచ్చిపోయే ఓడలు. మరోపక్క ఆ ఓడలకి దారిచూపుతూ లైట్‌హౌస్. పైన చుక్కలతో నిండిన ఆకాశం. ఆకాశంలో ఒక్కోరోజు ఒక్కోలా కనిపించే చంద్రుడు.

పౌర్ణమి కావడంతో చంద్రుడు నిండుగా వున్నాడు. వెన్నెలలో సముద్రం మెరుస్తోంది.

"ఎంత అందంగా వుంది ఈ సముద్రం" అంది స్వప్న మత్తులోకి జారుతున్నట్లు.

ఆల్కహాల్‌నే కాదు అందాన్ని తాగినా మత్తు వస్తుందన్నట్లుంది స్వప్న ముఖం.

నా మనస్సు కూడా మరో లోకంలో విహరిస్తున్నట్లుంది.

"మనపైన వున్న ఆకాశం కిందికి దిగి, ఇంకా కిందికి దిగి, అలా దిగుతూ వచ్చి మనల్ని చుట్టేస్తే ఎంత బాగుంటుందో" అంది స్వప్న.

"నీ కోరిక అశాస్త్రీయంగా వుంది స్వప్నా – అసలు పదార్థమే కాని ఆకాశం మనలనెలా చుట్టేస్తుంది?" అన్నాను నేను.

"అదే తప్పు. మనకు తెలిసిన భౌతిక శాస్త్రజ్ఞానంతో చూసి, మనకున్న పరిమితమైన అనుభవాలతో ఆలోచించి కొత్త అనుభూతిని అశాస్త్రీయం అనకూడదు. అయినా అందమైన కలలు కనవద్దంటావెందుకు? ఆ కలలలో ఆ కోరికలలో ఎంత ఆనందం వుందో?" అంది స్వప్న.

నేను నవ్వాను – సమాధానం చెప్పకుండా.

అదే తనకి కావల్సిన సమాధానమైనట్లు నాకేసి చూస్తూ అంది స్వప్న.

"నెమ్మదిగా వస్తున్న ఈ కెరటాల లోంచి ఓ కెరటం ఒక్కసారిగా పైకి లేచి మనల్ని ముంచేస్తోంటే – మనం ఒకరి ఒళ్ళో ఒకరం పడుకుని వుంటే ఎలాగుంటుంది?"

"మనం నీళ్లల్లో మునిగిపోతాం" అన్నాను నేను.

"అయినా మనకేం అవకపోవచ్చు. అలా మనపైన కెరటం – ఇలా కబుర్లాడుకుంటూ ఇసకమీద మనం" అంది స్వప్న కళ్లు మూసుకుంటూ.

ఆ సన్నివేశాన్ని ఊహించుకుంటూ నేనూ కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు మూసుకుని వున్న నాకు ఒక పెద్దకాంతి కనిపించసాగింది. కళ్ళు మూసుకునే వున్నాను నేను. అయినా కాంతి కనిపిస్తూనే వుంది. ఇంతలో పెద్ద హోరు వినిపించసాగింది.

"ఏంటది స్వప్నా?" అన్నాను గట్టిగా.

"సముద్రం పొంగుతున్నట్లుంది" అంది స్వప్న.

"ఆ హోరు సరే – కాంతి ఏంటీ?" అన్నాను.

కళ్ళు మూసుకుని వున్న నాకు కనిపిస్తున్న కాంతి, నాకు వినిపిస్తున్న హోరు స్వప్నకి కూడా తెలుస్తున్నాయి.

"కాంతి పెరుగుతోంది. హోరు దగ్గరకొచ్చేస్తోంది. మనల్ని ముంచేస్తోంది" అంది స్వప్న.

కళ్లు తెరిచాను.

స్వప్న ఒళ్ళో నేను. నా ఒళ్లో స్వప్న. మా మీద కెరటం. అయితే మేం తడవడం లేదు. పైకి చూశాను. ఆకాశం లేదు. మా చుట్టూ ఏదో నీలం రంగు చుట్టేసినట్లుంది.

స్వప్న కోరిక ఫలించినట్లుంది.

ఆకాశం మమ్మల్ని చుట్టేసింది. కెరటం మమ్మల్ని ముంచేసింది. అయితే మాకు ఏమీ అవడం లేదు.

అసలు మేం బతికి వున్నామో లేదో తెలియదు. చుట్టూ మద్రాసు బీచ్‌లేదు...

ఇద్దరం లేచాం. అసలు లేచినట్లు లేదు నాకు. తేలుతున్నట్లుంది. అదే మాట అన్నాను స్వప్నతో.

"అసలు మనం బతికి వున్నామా?" అంది స్వప్న.

"తెలియడం లేదు. చూద్దాం పద" అన్నాను.

నడవసాగాం ఇద్దరం. అయితే నడుస్తున్నట్లు లేదు. అసలు ఎటూ వెళ్తున్నట్లు లేదు. వెళ్తున్నట్లు ఎలా తెలుస్తుంది. ఒక చోటు నుండి మరో చోటుకి వెళ్తే తెలుస్తుంది. నీలంలో చుట్టెయ్యబడి వున్న మాకు ఎటైనా వెళ్ళడం అంటే తెలియడం లేదు. నడిచినా వున్నచోటే వున్నట్లుంది. చుట్టూ ఆకాశమే. పైనంతా కెరటమే.

టైం ఎంతయ్యుంటుందో చూద్దామని వాచీ చూశాను. వాచీ తిరగడం లేదు. నా వాచీ పాడయ్యుంటుందని స్వప్నని టైమెంతయిందని అడిగాను. తన చేతి గడియారం చూసుకుని స్వప్న అంది.

"తిరగడం లేదు."

అంటే స్థలమే కాదు - కాలం కూడా స్థంభించింది. స్థలం, కాలం స్తంభిస్తే సంఘటనలు లేవు. సంఘటనలు లేకపోతే స్థలకాలాలు లేవు. అయితే వేటివల్ల ఏవి పుడతాయో తెలియదు.

నడుస్తున్నా వున్నచోటే టైం కదలకుండా వున్నాం.

"ఇప్పుడేమవుతుంది?" అన్నాను స్వప్నతో.

"ఏమో తెలియదు. అసలు ఇప్పుడేమవుతోందో తెలిస్తే కదా - ముందేమవుతుందో తెలియడానికి? ఇది నిజమా? మాయా? కలా? అసలు మనం వున్నామా?" అంది స్వప్న.

"ఈ స్థితి కొత్తగా వుంది కానీ భయంగా లేదు. బాధగా లేదు" అన్నాను.

"అసలు ఏ ఫీలింగూ లేదు. ఫీలింగ్ రావాలంటే ఏదో ఒకటి జరగాలి. ఏమీ జరగనప్పుడు ఏ ఫీలింగ్ వుంటుంది?" అంది.

"ఏదో జరుగుతున్నట్లుంది" అన్నాను.

"అవును - మనల్ని చుట్టేసిన ఆకాశం దూరమవుతోంది. పైనున్న కెరటం వెనక్కి వెళ్ళిపోతోంది".

"ఆ - మనచుట్టూ స్పష్టంగా కనిపిస్తోంది. అదిగో పైన ఆకాశం. అటుపక్క సముద్రం. మనం బీచ్‌లో ఇసకమీద వున్నాం" అన్నాను.

"అయితే ఇది మద్రాసు బీచ్ కాదు. విశాఖపట్నం బీచ్. అదిగో డాల్ఫిన్స్ నోస్" అంది.

"అంతేకాదు. ఇది ఇప్పటి విశాఖపట్నం బీచ్ కాదు. పదిహేనేళ్ళ క్రితం బీచ్. అప్పుడు ఈ పరిసరాలు ఇలానే వుండేవి" అన్నాను.

"అప్పుడు రోజూ మనం ఇక్కడకొచ్చే వాళ్ళం కదా" అంది.

"కొన్నేళ్ళ క్రితం కలిసివచ్చేవాళ్ళం. అంతకు ముందు కొన్నాళ్ళు విడివిడిగా వచ్చేవాళ్ళం. అప్పుడు మనం ఒకరికొకరం తెలియదు. నువ్వో పుస్తకం చదువుకుంటూ కూర్చునేదానివి. నేనూ ఓ పుస్తకం చదువుకుంటూ - అదిగో అక్కడ కూర్చునేవాడిని" అంటూ అటు చూశాను.

నాకొక్కసారి షాక్ కొట్టినట్లయింది.



E:\Seelamma\
Seelama1
15

అక్కడ నేనే వున్నాను.

సరిగ్గా పదిహేనేళ్ళ క్రితం ఎలాగుండే వాడినో అలా అక్కడ కూర్చుని చదువుకుంటున్నాను.

నాకు పిచ్చెక్కినట్లయింది.

స్వప్నకేసి చూశాను.

స్వప్న కూడా అదే పరిస్థితిలో ఉంది.

అయితే స్వప్న పదిహేనేళ్ళ క్రితపు నన్ను చూడ్డంలేదు. ఇంకోవైపు చూస్తోంది. నేనటుచూశాను.

అక్కడ స్వప్న కూర్చుని వుంది.

సందేహం లేదు. పదిహేనేళ్ళ క్రితం స్వప్న ఎలాగుందో అలానే వుంది. అప్పుడు తనెక్కడ కూర్చునేదో అక్కడే కూర్చుని అలానే పుస్తకం చదువుతోంది.

"స్వప్నా" అన్నాను.

"నాకేం అర్థం కావడం లేదు" - అంది స్వప్న.

"మనం చచ్చిపోయామా? దయ్యాలమా?" అన్నాను.

"మనం దయ్యాలమైతే మరి వాళ్ళెవరు?" అంది.

"వాళ్ళు మనమే" అన్నాను.

"అంటే మనం చచ్చిపోయినట్లా? ఉన్నట్లా? నేను ఆ అమ్మాయిని చూసి వస్తాను" అంటూ నడవబోయింది.

"అదెవరో అమ్మాయి కాదు - నువ్వే - నిన్ను నువ్వే కలవబోతున్నావు" అన్నాను నేను.

స్వప్న నడిచింది - తనవైపే.

నేనూ నావైపు నడిచాను.

వెళ్ళి నా ముందు - అంటే "అతని" ముందు కూర్చున్నాను.

తలెత్తి చూశాడు. చూసి విస్తుపోయాడు.

"పదిహేనేళ్ళ తర్వాత నువ్వువి నేను" అన్నాను.

"అతని"కి అర్థం కాలేదు. పదిహేనేళ్ళ క్రితం ఇలా జరిగి వుంటే "నాకూ" అర్థం అయ్యేది కాదు.

కొంచెంసేపు నన్ను చూసి కొంచెం బోధపడినట్లుగా నవ్వి - "నాలానే వున్నారు మీరు" అన్నాడు.

"నీలా వుండడం కాదు - నువ్వే నేను - నేనే నువ్వు. ఇంకో పదిహేనేళ్ళకి

ఇలానే వుంటావు" అన్నాను.

"నాకు అర్థం కావడం లేదు" అన్నాడు.

"నా పరిస్థితీ అంతే. నేనూ, స్వప్నా మద్రాసులో సముద్రం ఒడ్డున కూర్చుని వున్నాం. మమ్మల్ని ఆకాశం చుట్టేసింది. సముద్రం ముంచేసింది. రెండూ విడిపోయేసరికి ఇక్కడ, ఇప్పుడు వున్నాం. అక్కడ మేం కూర్చున్న సమయానికి పదిహేనేళ్ళు వెనక్కి వచ్చాం. అప్పుడు నేను ఇలా సముద్రం ఒడ్డున కూర్చుని చదువుతుండేవాడిని. ఇప్పుడు నువ్వు చదువుతున్న పుస్తకం నేనూ చదివాను. దాన్ని నీకు నీ ఫ్రెండ్ చదవమని ఇచ్చాడు. నువ్వు అతనికి తిరిగి ఇయ్యనే లేదు. నువ్వంటే నేనే. నేను వుంచేసుకున్నాను. ఆ పుస్తకం నా దగ్గర మద్రాసులో వుంది."

"మా అమ్మా నాన్నా పేర్లు ఏంటి?" అన్నాడు అతను సగం నమ్మకంగా.

"అమ్మపేరు అన్నపూర్ణ, నాన్న పేరు విశ్వనాథం. ఇద్దరూ చచ్చిపోయారు".

"ఇద్దరూ బతికే వున్నారు."

"పదిహేనేళ్ళ క్రితం బతికే వున్నారు. ఆరేళ్ళ క్రితం చచ్చిపోయారు. అంటే తొమ్మిదేళ్ళ తర్వాత చచ్చిపోయారు."

"మీరు మాట్లాడేది నాకు అర్థం కావడం లేదు. పిచ్చెక్కుతున్నట్లుంది."

"ఇంకొంచెం సేపు నేను మాట్లాడితే నాకు పిచ్చెక్కిందంటావు. పద నీ కాబోయే భార్యని నీకు చూపిస్తాను" అంటూ లేచాను. 'అతనూ' లేచాడు.

ఇద్దరం స్వప్నద్వయం దగ్గరికి నడవసాగాం.

మమ్మల్ని చూసి స్వప్న మా దగ్గరికి రాసాగింది. స్వప్నంటే నా స్వప్న. చిన్న స్వప్న కాదు.

అటుగా ఓ కాకి ఎగురుతూ రాసాగింది.

"సప్నా! కాకి!" అని అరిచాను.

నా స్వప్నలోంచి కాకి వెళ్ళిపోయింది. కాకికి స్వప్న కనిపించలేదు. అసలు స్వప్న శరీరమే లేనట్లుంది. కాకికే కాదు ఇంకెవ్వరికీ మేం కనిపించమేమో చిన్నప్పటి "మాకు" తప్ప.

అంటే మా శరీరాలు లేవన్నమాట. మేం ఆత్మలమేమో.

కాకి నా స్వప్న శరీరంలోంచి దూసుకుపోవడం చూసిన చిన్న స్వప్న నివ్వెరపోయింది.

మా కాళ్ళవంక చూసింది.

కాళ్ళు మామూలుగా వున్నాయి. మేం మామూలుగానే నడుస్తున్నాం. అయితే మా పాదాల గుర్తులు ఇసుకలో పడ్డంలేదు. అతని అడుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నావికానీ, నా స్వప్నవికానీ కనిపించడం లేదు. చిన్న స్వప్న లేచింది. లేచి మా దగ్గరకొచ్చింది.

నలుగురం ఒకేచోట చేరాం. పదిహేనేళ్ళ దూరం రెండడుగులు దగ్గరయింది.

"ఈవిడ నా శ్రీమతి స్వప్న" అన్నాను నేను పరిచయం ప్రారంభిస్తూ.

"ఈయన మా ఆయన" అంది నా స్వప్న.

"మనల్ని మనకు మనమే పరిచయం చేసుకుంటున్నాం" అన్నాను నేను నా స్వప్నతో.

"అప్పటికి మనం ఒకరికొకరం తెలియం. వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకోబోతున్నారు. చేసుకుని మనం అవుతారు" అంది నా స్వప్న.

"వాళ్ళేం చెప్తున్నారో నాకు తెలియదు కానీ నేను మిమ్మల్ని చేసుకోమని అడగడం లేదు" అన్నాడు 'అతను' చిన్న స్వప్నతో.

"నువ్వు పెళ్ళిచేసుకోమని నన్ను అడిగావు. నేను నిన్ను చేసుకున్నాను" అంది నా స్వప్న అతనితో.

"నేను మీ సంగతి చెప్పడం లేదు. ఆవిడ సంగతి చెప్తున్నాను" అన్నాడతను. నా స్వప్నతో – స్వప్నలిద్దరినీ మార్చి మార్చి చూస్తూ.

"ఆవిడ నేనే" అంది నా స్వప్న.

"అంటే మా ఇద్దరి పెళ్ళి జరిగి తీరుతుందా?" అంది చిన్న స్వప్న.

"జరుగుతుందా ఏమిటి? పెళ్ళి జరిగింది.ఎన్నో ఏళ్ళుగా అన్యోన్యదాంపత్యం సాగుతోంది. పదిహేనేళ్ల తర్వాత మీరు ఎలాగుంటారో అదే మేము" అన్నాను.

"ఒకవేళ మేం పెళ్ళి చేసుకోకపోతే" అన్నాడతను.

"చేసుకోకపోవడమనే ప్రసక్తి లేదు. పెళ్ళి అయిపోయింది. మీరు పదిహేనేళ్ళు ఎలా బతుకుతారో అలా బతికిన వాళ్ళం మేం. ఇప్పటివరకూ మీరు జీవించిన జీవితాల అనుభవమే వుంది మీకు. ఇంకా పదిహేనేళ్ళ అనుభవం వుంది మాకు" అంది నా స్వప్న.

"అంటే ఇంకో పదిహేనేళ్ళు బతుకుతామన్నమాట. ఏ రోగంతోనో, ఏక్సిడెంట్‌లోనో, యుద్ధం వల్లనో చచ్చిపోమన్న మాట. దాన్ని బట్టి మేం భవిష్యత్తులో ఏం చెయ్యాలో ఆలోచించుకోవచ్చు" అంది చిన్న స్వప్న.

"తరువాతి పదిహేనేళ్ళ గురించి మీరు ఏమీ ప్లాన్ చేసుకోలేరు. అది అయిపోయింది" అన్నాను.



E:\Seelamma\
Seelama1
16

“అది మీకు అయిపోయింది. మాకు కాదు. మేం పదిహేనేళ్ళు – ఆ తర్వాత ఇంకా కొన్నాళ్ళు జీవిస్తాం. ఇప్పుడు మీరు వచ్చినట్లు, ఇంకో ఇద్దరొచ్చి, తర్వాత ముప్ఫై ఏళ్ళ జీవితం మేం గడిపేశాం అంటే ఏమవుతుంది? మా జీవితాలకి సంబంధించిన ఆలోచనలూ, కోరికలూ, నిర్ణయాలూ మావి. మేం ఒకరినొకరం పెళ్ళి చేసుకోకపోవచ్చు” అన్నాడతను.

“అది మీ చేతుల్లో వుందా?” అన్నాను.

“ఎవరి జీవితం వాళ్ళ చేతుల్లోనే వుంటుంది” అన్నాడు.

“అయితే నువ్వు నీ జీవితం అనుకుంటున్నది నేను గడిపిన జీవితం. నువ్వూ నేనూ ఒక్కటే. నేను స్వప్న దగ్గరకెళ్ళి పెళ్లి చేసుకోమని అడిగాను. నువ్వు అడగనని ఎందుకనుకుంటున్నావు? అన్నాను.

“నేను నేను కనుక” అన్నాడు.

“కానీ నేను నువ్వే – నువ్వు నేనే” అన్నాను.

“అంటే రాబోయే పదిహేను సంవత్సరాలలో మీరెలా జీవితం గడిపారో అలా తప్ప మరోలా జీవితం గడిపే అధికారం మాకు లేదా?” అంది చిన్న స్వప్న.

నేను నా స్వప్నవైపు చూశాను. నాస్వప్న నన్ను చూసింది.

“తెలియదు” అన్నాం ఇద్దరం ఒకేసారి.

ఇంక నిలబడలేనట్లు కూర్చుంది నా స్వప్న. నేనూ కూర్చున్నాను. మా ఎదురుగా కూర్చున్నారు వాళ్ళిద్దరూ.

“ప్రతి మనిషికి తన జీవితం గురించి నిర్ణయించుకునే అధికారం వుందా? లేదా?” అంది చిన్న స్వప్న.

“ఉంది. ఉండాలి. అయితే మీరు పదిహేనేళ్ళ జీవితం గడిపేసి, మళ్ళీ పదిహేనేళ్ళు వెనక్కి వెళ్ళి, ఇంకోలా జీవిద్దామనుకుంటున్నారు” అన్నాను.

“కాదు. మేం పదిహేనేళ్ళ జీవితం గడపలేదు. అది గడిపింది మీరు” అన్నాడతను.

“మేం మీరేగా” అన్నాను.

నలుగురి మధ్యా నిశ్శబ్దం.

కొంతసేపటికి ఆ నిశ్శాబ్దాన్ని భంగపరుస్తూ అంది నా స్వప్న చిన్న స్వప్నతో.

“నువ్వు ఇంకా ఫిలాసఫీ ఎమ్మే చదువుతున్నావు. నేను పూర్తి చేశాను. అంతేకాదు. ప్రాక్పశ్చిమాల వేదాంతాలనెన్నింటినో చదివాను. నీకన్నా నేనెక్కువ పుస్తకాలు చదివాను, ఉపన్యాసాలు విన్నాను, అనుభవించాను. అయినా నాకీ అనుభవం కొత్తదే. అయితే ఇదికొత్తగా లేదు. ఏదో అంతర్మథనంలాగుంది. నాతో నేనే మాట్లాడుకుంటున్నట్లుంది.



E:\Seelamma\ Seelama1 17

నేనంటే ఎవరు? ఈ శరీరమా? ఈ మెదడా? ఈ జ్ఞాపకాలా? ఈ అనుభవాలా? ఇవేమీ కానిదా? తెలియదు.

నేను నీకన్న పదిహేనేళ్ళ జీవితం ఎక్కువ గడిపాననుకుంటున్నాను. అంటే నీకన్న ఎక్కువ అనుభవాల్ని చూసుంటాను. నా అనుభవాలనన్నింటినీ నీకు చెప్తే, వాటినిబట్టి నువ్వు నీ భవిష్యత్తుని మలచుకోగలవా? అసలు భవిష్యత్తు మన చేతుల్లో వుందా? అంతా విధి నడిపేదేనా? ముందు నిర్ణయించబడిన మార్గంలో మనం నడుస్తామా? మనమే మార్గాన్ని ఎన్నుకోగలమా?”

నా స్వప్న మాటలకి అడ్డు వస్తూ అంది చిన్న స్వప్న– “కొంత ఫ్రీ విల్ కొంత డెస్టినీ కలిసి జీవితం”

“నువ్వు పుస్తకాలలోంచి వేదాంతాన్ని అప్పచెప్తున్నావు” అంది నా స్వప్న నవ్వుతూ.

చిన్న స్వప్నకి కోపం రాలేదు. “నా భవిష్యత్తుని చెప్పండి” అంది నా స్వప్నతో.

“నీ భవిష్యత్తు నా గతం” అంది నా స్వప్న.

“అదే చెప్పండి” అంది చిన్న స్వప్న.

“చెప్పను”. “మేం గడిపిన జీవితం గురించి మీకు చెప్తే, అది మీ జీవితాల మీద ఏ ప్రభావం చూపిస్తుందో తెలియదు. అలా చెయ్యాలనో, చెయ్యకూడదనో మీరు ప్రయత్నించవచ్చు. ఎవరి జీవితం వాళ్ళు గడపడం మంచిది. అసలు మన జీవితాలు ఎలా గడుస్తాయో, మనం ఎలా గడుపుతామో తెలియదు.

భూత భవిష్యద్వర్తమానాలు వేర్వేరుగా లేవనిపిస్తోంది నాకు. స్థలం, కాలం మన కళ్ళకి మనం తొడుక్కున్న కళ్ళద్దాల లాగున్నాయి. వాటిని తీసేసి చూస్తే మనకి కనిపించేదంతా ఒక్కటేనేమో. ఆ ఒక్కటే సత్యమేమో” అంది నా స్వప్న.

“ఫిలాసఫీ చదువుతున్న నాక్కూడా మీరు చెప్పేదంతా గందరగోళంగా వుంది” అంది చిన్న స్వప్న.

“ఫిలాసఫీ చదవడం వల్ల ఏమీ రాదేమో చదువుతున్నామన్న తృప్తి తప్ప. సత్యం పుస్తకాలు చదవడం వల్ల అర్థం కాదు – అనుభవిస్తే తప్ప. ఆ అనుభవం అందరికీ కలగదు. అది కలిగితే ఉన్నదల్లా సచ్చిదానందమే” అంది నా స్వప్న.

“ఆ అనుభవం మీకు కలిగిందా?” అంది చిన్న స్వప్న.

“తెలియడం లేదు. కానీ మిమ్మల్ని – అంటే మమ్మల్నే – ఇలా స్థలాన్ని, కాలాన్ని కాదని కలవడంలోంచి ఏదో అర్థమవుతోంది. అదింకా స్పష్టంగా తెలియడం లేదు” అంది నా స్వప్న.

నేను స్వప్నవైపు వింతగా చూస్తున్నాను.

"ఇప్పుడు మీరేం చేస్తారు?" అన్నాడతను.

"ఇప్పుడంటే ఎప్పుడు – పదిహేనేళ్ళకి అటా? ఇటా?" అన్నాను.

నా స్వప్న చిన్న స్వప్న చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది – "హాస్టల్ వార్డెన్ నీ కోసం చూస్తుండి వుంటుంది. ఇంక వెళ్ళు."

"మరి మీ సంగతి?" అంది చిన్న స్వప్న.

"మిమ్మల్ని ఒంటరిగా వదిలివెళ్ళాలని లేదు" అన్నాడతను.

"మేం ఒంటరిగా లేం – ఒకరికొకరం వున్నాం. ఎన్నేళ్ళ నుండో ఒకరికొకరంగా, ఒకరంగా వుంటున్నాం. ఎన్ని సుఖాల్లో, ఎన్ని కష్టాల్లో మేం ఇద్దరం కలిసి ప్రయాణం చేశామో. మేం ఒకరికొకరం వుండగా మరొకరి తోడు అక్కర్లేదు మాకు. మీరింక వెళ్ళండి" అన్నాను నేను.

"స్వప్నా – అతన్ని వదలకు, అతనితో నీ జీవితం ఎంతో ఆనందంగా గడుస్తుంది. అతన్ని జాగ్రత్తగా, బాగా చూసుకో" అంది నా స్వప్న చిన్న స్వప్నతో.

నావీ అనే మాటలన్నట్లు అతని చేతిని నా చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కాను.

వాళ్ళిద్దరి కళ్ళలోనూ తడి కనిపించింది. చిన్న స్వప్న తన పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంది. నా గుండెలో ముల్లు దిగినట్లయింది. పదిహేనేళ్ళ క్రితపు స్వప్నను దగ్గరకి తీసుకుని ముద్దెట్టుకున్నాను. నా స్వప్న అతనిని దగ్గరకి తీసుకుని ముద్దెట్టుకోబోయింది.

"స్వప్నా" అన్నాను. నా గొంతులో ధ్వనించిన ఈర్ష్య నా స్వప్నకి అర్థమైంది. పల్చగా నవ్వింది.

ఎంతో మధురమైనది ఆ నవ్వు.

అప్పుడే చీకటి పడుతుంటే కడలి కెరటాల మీద ఉదయించే పున్నమి చంద్రుడికన్న అందంగా వుండే నవ్వు.

ఇంకాస్సేపటికి సూర్యోదయమవుతుండగా, మసక చీకటిలో కనిపించే మల్లెమొగ్గకన్న మనోహరంగా వుండే నవ్వు.

సంగీత విద్వాంసుడు గుండెలోతుల్లోంచి ఆలపించే మోహనరాగం కన్న మోహనమైన పువ్వు.

నయాగారాలూ, హిమాలయాలూ, ఇంద్ర ధనస్సులూ – విశ్వంలోని అందమైనవన్నీ మాయమైపోయినా స్వప్న నవ్వు ఒక్కటే వుంటే చాలు ఈ ప్రపంచం అందంగా వుండేందుకు అని అనిపించే నవ్వు.

E:\Seelamma\
Seelama1
18

అలా నవ్వుతూ నన్ను దగ్గరకి తీసుకుని కళ్ళుమూసుకుంది నా స్వప్న.

"స్వప్నా" అంటూ నా స్వప్నని దగ్గరకి తీసుకుని నేనూ కళ్ళు మూసుకున్నాను.

వాళ్ళిద్దరూ వున్నారన్న ఆలోచనలేదు మాకు. మేం ఇద్దరం ఒకరి ఒళ్ళో ఒకరం కళ్ళు మూసుకుని ఉన్నాం.

మళ్ళీ కాంతి కనిపించసాగింది. హోరు వినిపించసాగింది. కాంతి కనిపిస్తూనే వుంది. హోరు వినిపిస్తూనే ఉంది. కెరటం మమ్మల్ని ముంచెత్తింది, మేం తడవకుండా. ఆకాశం మమ్మల్ని చుట్టేసింది. మమ్మల్ని తాకకుండా.

ఇద్దరం అలా కళ్ళు మూసుకునే వున్నాం, ఎంతసేపో తెలియకుండా.

నెమ్మదిగా కాంతి తగ్గసాగింది. హోరు వినిపించడం మానేసింది.

ఇద్దరం కళ్ళు తెరిచాం.

ఒక పక్క ఓడలు. మరో పక్క లైట్ హౌస్. ఎదురుగా పున్నమి వెన్నెలలో మెరుస్తూ కడలి.

మళ్ళీ మెరీనా.

"ఏమయింది?" అన్నాను నేను స్వప్నకేసి చూస్తూ.

"మనం మరో లోకాన్ని చూశాం" అంది స్వప్న.

"మరో లోకమా?" అన్నాను.

"మరో లోకమంటే మరో లోకం కాదు. ఈ లోకమే. మరోలా చూశాం. మామూలుగా మనకి కనిపించేట్లు కాకుండా ఇంకోలా కనిపించింది. అందుకే మరో లోకం లాగ అనిపించింది."

"ఈ లోకమేనా?" అన్నాను చుట్టూ చూస్తూ.

"అవును. ఈ లోకమే. ఇక్కడ, ఇప్పుడు వున్నదే" అంది స్వప్న.

"ఇక్కడే, ఇప్పుడు వున్న లోకం అయితే మరి వాళ్ళేరి?" అన్నాను.

"వాళ్ళెవరు? వాళ్ళు మనమే" అంది.

"వాళ్ళు పెళ్ళి చేసుకుంటారా?" అని అడిగాను.

"మనం పెళ్ళి చేసుకున్నాం – వాళ్ళు చేసుకుంటారో లేదో తెలియదు" అంది స్వప్న.

"మనం వాళ్ళమేగా. మనం పెళ్ళి చేసుకుంటే వాళ్ళూ చేసుకున్నట్లే కదా?" అన్నాను.

"మనం పెళ్ళి చేసుకున్నాం. చేసుకోలేదు. రెండూ సంఘటనలే. రెండూ విశ్వంలో వున్నవే. మనం దేన్ని కావల్సి వస్తే దాన్ని చూడచ్చు. అలా జరుగుతోందని అనుకోవచ్చు.

అలా జీవించవచ్చు. పెళ్లి అవ్వాలని అనుకుంటే అవుతుంది. అక్కర్లేదనుకుంటే అవదు" అంది స్వప్న.

"నువ్వు చెప్తున్నది – మనం చూసిన దానికన్న అయోమయంగా, గందరగోళంగా వుంది. అసలు అర్థం కావడం లేదు" అన్నాను.

"నాకు అర్థం అయింది నేను చెప్తున్నాను. ఈ లోకం మనం అనుకుంటున్నట్లు స్థిరంగా, నిర్దిష్టంగా, ఒకరకంగా, వున్నది కాదు. మన జీవితాలు ఒక పద్ధతిలో, ఒకేలా, ఒక నిర్ణీతమైన దారిలో నడిచేవి కావు. మనం మన జీవితాల్నీ మన పరిసరాల్నీ మనకి కావల్సినట్లో, తెలిసినట్లో చూస్తున్నాం. ఇలానే చూడాలని లేదు. ఇంకోలా కూడా చూడచ్చు."

స్వప్న మాటలకు అడ్డు వస్తూ అన్నాను నేను – "నాకు అర్థం అయ్యేలా చెప్పు"

"ప్రయత్నిస్తాను. ప్రపంచంలోని పదార్థమూ, సంఘటనలూ అన్నీ ఒక్కసారే, ఒక్కచోటే వున్నాయి. పుట్టడం, పెరగడం, పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనడం, చనిపోవడం ఇవన్నీ ఒక క్రమంలో కాక చిందర వందరగా పక్క పక్కనే పడి వున్న సంఘటనలు, మనం కాలాన్ని కొలబద్ధగా చేసుకు చూస్తే వాటికి ఒక క్రమం వస్తోంది. అలానే నక్షత్రాలూ, గ్రహాలూ, కొండలూ, చెట్లూ అన్నీ ఒక్కచోట వున్నవే. మనం స్థలంలో వాటిని చూస్తే ఒక క్రమం వస్తుంది. మనం మనకి కావల్సిన వాటిని, కావల్సినప్పుడు చూస్తుంటాం. జీవితాన్ని ఒక క్రమపద్ధతిలో చూడ్డం అలవాటయో, ఇష్టమయో మనం ఆ క్రమంలోనే చూస్తున్నాం. అలానే చూడక్కర్లేదు – ఎలాగన్నా చూడచ్చు – మనం కావాలనుకుంటే – అదే అయింది ఇందాక"

"అంటే ముందు వెనుకలు లేవా?" అన్నాను.

"అవి మనం కల్పించుకున్నవి. భూత భవిష్యద్వర్తమానాలు లేవు. ఉన్నదంతా వర్తమానమే. జరుగుతున్నదే. నిజానికి అది జరగడం కాదు. ఓ సంఘటన జరగాలని అనుకోవడం. దాన్ని అనుభవించడం. ఒకసంఘటనవల్ల మరో సంఘటన జరుగుతుందనుకోవడం సరికాదు. కార్యకారణ సంబంధం మనం మొత్తం అంతా ఒకసారి చూడలేకపోవడం వల్ల మనకి కలుగుతున్న అభిప్రాయం. అంతా ఒక్కసారి చూడగలిగితే ముందు వెనుకలు లేవు"

"అది ఎలా సాధ్యం?"

"మనం నేల మీద నిలబడి చూస్తుంటే మనకి మన పరిసరాలు మాత్రం కనిపిస్తాయి. విమానంలో ఎక్కి కొంచెం పైకెళ్ళి చూస్తే చాలాచోట్లు ఒకేసారి కనిపిస్తాయి. అదిమనం చూడ్డంలో వున్న తేడా. మనం ఒక సంఘటనని దగ్గర నుండి చూస్తే ఆ సంఘటన



E:\Seelamma\
Seelama1
19

మాత్రం కనిపిస్తుంది.

ఈ సంఘటనలన్నిటికీ దూరంగా వెళ్ళి చూడగలిగితే అన్నీ ఒక్కసారే, ఒక్కచోటే కనిపిస్తాయి.

మనం సినిమా చూస్తుంటే ముందు ఏమవుతుందన్న ఆతృత వుంటుంది మనకు. ముందు ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి. అయితే సినిమా అంతా జరిగిన కథే. అంతా రీలుపైన వున్నదే. రీలంతా చూస్తే కథంతా ఒక్కసారే, ఒక్క చోటే వుంటుంది.

జీవితమయినా, ప్రపంచమయినా అంతే. విడివిడిగా చూడ్డంవల్ల ఇలా కనిపిస్తోంది. అంతా చూడగలిగితే స్థలకాలాలు లేవు. ఆలోచనలు లేవు. అలా లేకపోవడమే అన్నీ ఉండడం కూడా" అంది స్వప్న.

"అయితే మనం మనకి కావల్సినట్లో, మనకి తెలిసినట్లో లోకాన్ని చూస్తున్నామన్న మాట" అన్నాను.

"అవును. అనేకానేక సంఘటనలు నిండిన ఈ విశ్వంలో, ఒక్కో సంఘటనని ఒక్కోసారి ఎన్నుకుంటూ, వరసగా ఓ సంఘటన తర్వాత మరో సంఘటనని ఓ క్రమంలో చూసుకుంటుంటే జీవితం అవుతుంది. ఎన్నుకున్న సంఘటనల క్రమం జీవితం. సంఘటనలన్నిటినీ చూడగలిగితే, ఈ జీవితం వుండదు" అంది స్వప్న.

"అందరూ అలానే ఓ క్రమంలోనే చూస్తున్నారా?" అన్నాను.

"అందరూ లేరు"

"మరి ఎందరు చూస్తున్నారు?"

స్వప్న నాకేసి జాలిగా చూసింది.

చూసి లేచింది.

లేచి నా చేతిని తన చేతిలోనికి తీసుకుని నన్ను లేపింది.

ఇంటివైపుకి నడిపించసాగింది.

నడిపిస్తూ అంది – "ఒక్కరే"

ఆ ఒక్కరూ ఎవ్వరని అడుగుదామనుకున్నాను. ఇంతలో "అద్వైతం" అంటూ స్వప్న గొణుక్కుంటుంటే, అడగడం మానేశాను. ఏదో అర్థమైనట్లు అనిపించి.

*(Richard Bachరాసిన ONE నవల  చదువుతున్నప్పుడు కలిగిన ఒక ఆలోచనకి రూపకల్పన ఈ కథ.*

'స్వాతి' మాసపత్రిక – జులై, 1985

# అసంపూర్ణం



**ప**ట్టుచీరల ఫారిన్ పరిమళాలకీ, సూటువాలాల సిగరెట్టు వాసనలకీ ముక్కునూ – నాలుక చివర్ల నుండో, గుండెలోతుల్లోంచో వస్తున్న పొగడ్తలకి చెవుల్నీ – అందుకుంటున్న చేతులుకీ, అందిస్తున్న బొకేలకీ చేతుల్నీ – సదరు వాసనా, పొగడ్తా, బొకేతాలూకు చిరునవ్వులకి కళ్ళనూ–

ఆ చిరునవ్వులు చిందిస్తున్న వ్యక్తుల జ్ఞాపకాలకు మెదడునూ –

అంకితం చేసి నిల్చున్నా నేను–

నే రాసిన వైజ్ఞానిక గ్రంథానికి అంతర్జాతీయ బహుమతి వచ్చిన సందర్భంగా నా యింటి గార్డెన్‌లో నేనిస్తున్న విందుకి వచ్చిన వాళ్ళని స్వయంగా రిసీవ్ చేసుకుంటూ.

ప్రొఫెసర్లు, లాయర్లు, డాక్టర్లు, రచయితలు, ఎన్నో రంగాలలో ఎంతో పేరు తెచ్చుకున్న వాళ్ళెందరో వచ్చి నన్ను పొగుడ్తున్నారు. నా మేధస్సు అపూర్వమనీ, నా ఆలోచనాసరళి అద్వితీయమనీ, నా పుస్తకాలు అమోఘమనీ, నా శైలి అనన్య సాధ్యమనీ, అందంగా చెప్తున్నారు నాకు. ఆకాశానికి ఎత్తేస్తున్నారు నన్ను.

ఎన్నో యేళ్ళు నా కృషి ఫలితంగా నాకు లభించిన బహుమతీ, ఆదరణా నాకెంతో సంతోషంగా ఉన్నా మనసు మూలలో ఏదో లోటు.

కొన్నేళ్ళుగా నాకిలానే ఉంటోంది. ఎంతో మంది మనుష్యుల మధ్య ఉన్నా, ఎన్నో బహుమతులనందుకున్నా, ఎందరో నన్నభినందించినా ఏదో తెలియని వెలితి నా మనస్సును బాధిస్తూనే ఉంది. నా మెదడెంత ఓదార్చినా నా బాధ తీరడం లేదు. అదేంటో, ఆ లోటూ, ఆ వెలితీ ఏంటో...

నేనింకా ఆలోచిస్తూనే వున్నాను. పక్క నుండి ఎవరో నా పుస్తకంలో ఏదో పేజీ తిప్పి అందులో ఒక వాక్యం చదివి, వ్యాఖ్య చేసి దాని అర్థం అదేనా అని అడుగుతున్నారు – నేనా ధోరణిలో పడిపోయాను, ఇంకా వచ్చే అతిథుల్ని గమనిస్తూ.

సుమారు అందరూ వచ్చారనిపించి నేనూ వెళ్ళి అతిథులందరితో కలిసిపోయాను. వచ్చిన వారిలో కొందరే నాకు గుర్తున్నారు అందులో ఒక ముఖం మాత్రం నేను ముందే చూసినట్లు గుర్తుంది. కానీ ఎక్కడో గుర్తు రావడం లేదు. మళ్ళీ చూస్తే గుర్తొస్తుందేమోనని ఆ వ్యక్తి కోసం పార్టీ అయేంతవరకూ చూస్తూనే వున్నాను. కనిపించలేదు.

పార్టీ పొడుగునా ఎవరో ఒకరు నా జీవితంలో నేను సాధించిన దాన్ని గురించి చెప్తూనే ఉన్నారు. యాభై యేళ్ళ నా జీవితంలో నేను ప్రపంచంలో మరెవ్వరూ నేర్చుకోలేనంత జ్ఞానాన్ని సంపాదించుకున్నానట. నన్ను బెర్ట్రాండ్ రస్సెల్‌తో పోల్చారెవరో.

పార్టీ అయాక ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతున్న సమయంలో మా డాక్టరు గారు వచ్చి ఆయనకేదో అర్జంటు పనుండి అలానే వెళ్ళిపోతున్నానని, వాళ్ళావిడను ఇంటికి పంపించే ఏర్పాటు చెయ్యమని మరీ మరీ చెప్పి వెళ్ళిపోయారు

రెండేళ్ళ క్రితం నాకు హార్ట్ ఎటాక్ వచ్చి నేను చచ్చిపోతానేమో అనుకున్న సమయంలో నన్ను ఆదుకుని బతికించారు డాక్టరుగారు. అంతకు ముందు కూడా నా ఆరోగ్య విషయంలో ఎంతో సహాయం చేశారాయన. ఆయనకీ మాత్రం చెయ్యకపోతే ఎలా అని వాళ్ళావిడ కోసం చూస్తూ నిలబడ్డాను. అలాగే నేనిందాక గుర్తుపట్టలేని ముఖం కనిపిస్తుందా అని కూడా చూస్తున్నాను.

కనిపించిందావిడ. అదే ముఖం. సుమారు ముప్ఫై ఏళ్ళ క్రితం ఎంతో అందంగా వున్న మొహం. జుట్టుకి అక్కడక్కడా తెల్లరంగు వేస్తే అప్పుడెలాగుందో ఇప్పుడూ అలాగే ఉంది. ఆవిడ నెమ్మదిగా నా దగ్గరకొచ్చింది.

"శైలజా" నెమ్మదిగా గొణిగాను నేను.

"బయట చలిగా ఉంది. మా మనవరాలికి జలుబు చెయ్యచ్చు. లోపలికెళదాం పద" అంటూ నా కోసం ఆగకుండా ఇంట్లోకి నడిచింది.

"నేను మరొకరి కోసం చూస్తున్నా" అన్నాన్నేను.

"నువ్వు చూస్తున్న డాక్టరు గారి భార్యను నేనేలే. నువ్వు రా" అంది వినిపించేలా నవ్వుతూ. అది శైలజ ప్రత్యేకత. తన నవ్వు ఊరంతా వినిపించాలన్నంత పెద్దగా నవ్వుతుంది. తను శైలజను చూసి ఎన్నేళ్ళయిందో. అప్పుడూ ఇంతే. మొదటిసారి నేలమీద పీటపై కూర్చుని భోంచెయ్యడానికి నేనవస్థపడుతుంటే ఇదే నవ్వు....

నా ఆలోచన పూర్తికాకుండానే యింట్లోకి వెళ్ళి "నువ్వు నీ గదిలో పడుకో. నేను దీన్ని పడుకోబెట్టి వస్తాను. ఇది నా కూతురి కూతురు. నా పేరే" అంటూ మరో బెడ్రూంలోకి వెళ్ళింది. తన ఇల్లే అయినంత చొరవగా.

అవును. కొన్నేళ్ళ క్రితం తను అవుననుంటే ఈ ఇల్లు తనదే అయుండేదేమో. ఈ గౌరవం తనకీ దక్కుండేదేమో. కాని అదేంటో నన్ను కాదందా రోజు శైలజ.

మాకు, మా మామయ్య వాళ్ళకి పెద్దగా సంబంధ బాంధవ్యాలుండేవి కావు.

దానికొంత కారణం మా అమ్మ నా చిన్నప్పుడే చనిపోవడం అయినా, మిగతాది మాత్రం మా నాన్నకి వాళ్ళంతా తెలివి తక్కువ పల్లెటూరి వాళ్ళనే భావం స్థిరపడిపోవడం. అందువల్ల నేనసలా ఊరే వెళ్ళలేదు.

మా నాన్న నా ఎమ్.ఎస్.సి. మధ్యలో ఉండగా చచ్చిపోయే దాకా, నాకా కుటుంబంతో ఉన్న సంబంధమల్లా ఒక్కటే – మా అమ్మ పేరనున్న ఆస్తి గురించి మా మావయ్య రాసే ఉత్తరాలు.

హఠాత్తుగా మా నాన్న పోవడంతో నేను ఒంటరి వాణ్ణయిపోయాను. అప్పుడే మా మావయ్య నన్నాదుకున్నాడు – నా చదువుకి కష్టం రాకుండా. అంతేకాదు. విదేశాల్లో డాక్టరేటుకి అవకాశం వస్తే అప్పుడూ సహాయం చేశాడు.

నాకు చదువు తప్ప మరో ధ్యాసే ఉండేది కాదు. ప్రపంచంలో అన్ని విషయాలు తెలుసుకోవాలి. ఎంతో విజ్ఞానార్జించాలన్న పట్టుదలతో ఎంతో చదివాను. ఎన్నో తెలుసుకున్నాను.

తిరిగి రాడానికి ముందరే మావయ్య ఉత్తరం రాశాడు. తన కూతుర్ని పెళ్ళి చేసుకోమని. చూద్దామని మొదటిసారిగా వాళ్ళ ఊరెళ్ళాను.

అంత సాయం చేసిన మావయ్య కూతుర్ని పెళ్ళి చేసుకోమంటే వద్దనడం యిష్టం లేక వెళ్ళాను. ఇరవై రోజులక్కడుండి వెళ్ళే రోజున శైలజే అంది నాతో "నేను నీకు తగను బావా! మరొకర్ని. బాగా తెలివైన వాళ్ళని, నీ విజ్ఞానాన్ని అర్థం చేసుకునే వాళ్ళని పెళ్ళి చేసుకో" అని.

తరువాత కొన్నాళ్ళకి శైలజ పెళ్లి శుభ లేఖ వచ్చింది. ఏదో సెమినార్ల హడావుడిలో ఉండి వెళ్ళలేదు.

నేనెప్పుడూ నా పెళ్ళి గురించి పట్టించుకోలేదు. పట్టించుకునే వాళ్ళింకెవ్వరూ లేరు కూడా...

మనవరాల్ని పడుకోబెట్టి నా గదిలోకి వచ్చింది శైలజ.

"రా, బాగున్నావా?"

"ఇన్నాళ్ళకి నా బాగు గురించి పట్టిందన్నమాట"

"నువ్వెక్కడున్నావో తెలీక..."

"తెలుసుకోవాలంటే అదేం కష్టం కాదు. ఆకాశంలో ఎంతో దూరంలో అసలు కనిపించకుండా ఉండే బ్లాక్‌హోల్స్ ఎక్కడున్నాయో తెలిసిన నీకు మామయ్య కూతురెక్కడుండో తెలుసుకోవడం కుదర్లేదా?"

"సారీ, ఈ ఊళ్ళోనే ఉన్నావా?"



E:\Seelamma\
Seelama1
21

"నువ్వు నా బాగోగుల గురించి పట్టించుకోకపోయినా నీ గురించి నేను చూస్తేనే ఉన్నాను. మీ డాక్టర్‌గారు నిన్ను సొంత తమ్ముళ్ళా చూడ్డానికి కారణం నేనేలే"

"ఆయన దేవుడు"

"ఆ దేవుడు దృష్టిలో నువ్వో దేవుడివి. ఒక్క ఆయన దృష్టిలోనన్న మాటేం, లోకంలో అందరి దృష్టిలోనూ నువ్వు దేవుడివే."

"నీ దృష్టిలో..'

శైలజ నవ్వింది. అదే నవ్వు. లోకమంతా వినిపించే నవ్వు.

"అందులో నవ్వడానికేముందో నాకర్థం కాలేదు"

"ఆ... స్పెషల్ థియరీ ఆఫ్ రిలెటివిటీలో అతి కష్టమైన విషయాలు, మరెవ్వరికీ అర్థం కానివి కూడా నీకు పూర్తిగా అర్థం అయ్యాయే, నీ మరదలి నవ్వుకి కారణం అర్థం కాలేదా?"

"నువ్వు నన్ను హేళన చేస్తున్నావా?"

"నిన్ను నేను హేళన చెయ్యడమా? నీ పుస్తకాలు అర్థం చేసుకునే శక్తి కూడా లేనిదాన్ని. నీలాంటి జీనియస్‌ను హేళన చెయ్యడమా? ఏదో మరదల్ని కదాని కాస్త వేళాకోళం చేస్తున్నానేమో, అదీ పాత విషయాలు గుర్తొచ్చి. ఇప్పుళ్లా కాదు. నేనప్పుడు అందంగా ఉండేదాన్ని.

"ఇప్పుడు కూడా – కాళిదాసు రాసిన, రవి వర్మ గీసిన శకుంతలలా అందాన్ని పుణికి పుచ్చుకున్న శైలజలాగా ఉన్నావు"

"అప్పుడూ ఇలాగే అన్నావు. అంతటితో ఆపలేదు. కాళిదాసుకాలం గురించి, రవివర్మ రాష్ట్రం గురించి చాలా విషయాలు చెప్పావు. అవి వింటే నీ విషయ పరిజ్ఞానానికి ఆశ్చర్యం కలిగింది. కాని అవి చెప్పకుండా ఉంటే నా అందాన్ని పొగిడినందుకు నా ఆడమనస్సు ఆనందించుండేది."

చిరునవ్వు నవ్వుతూ కూర్చుంది నా మంచం మీద నాకు కొంచెం దూరంగా.

"మీ ఊళ్ళో ఉన్న యిరవై రోజులు నేను మరచిపోలేదు. అసలు మరచిపోలేనేమో" ఏదో ఒకటి మాట్లాడాలి కదాని అన్నాను.

"ఏం మా పొలాల్లో పాడే జానపద గేయాల్లోని సాహిత్యం దక్షిణాఫ్రికాలోని అదేదో దేశంలో నృత్యాలకి పాడేగేయాలకు దగ్గరగా ఉందని గ్రహించినందుకా? మా ఊళ్ళో ఏముంది బావా?"

"నీ ధోరణి నాకర్థం కావడంలేదు"

"అది నిజం. మనిద్దరికి ఒకరి ధోరణి ఒకరికి అర్థం కాలేదు. అందుకే మనకి

పెళ్ళి కుదర్చలేదా బ్రహ్మ."

"బ్రహ్మనెందుకంటావు?" నువ్వే వద్దన్నావుగా."

"ఏం బాధగా ఉందా?"

"నాకేం బాధలేదు, అసలు నాకు పెళ్ళి మీద పెద్ద ఇంట్రెస్టు లేదు."

"నీకసలు ఆడవాళ్ళ మీద ఆడవాళ్ళుగా ఇంట్రెస్టు లేదు. నీకు వాళ్ళు కూడా పరిశోధనా వస్తువులు. మిలియన్ల సంవత్సరాల క్రితం రాయి, వేల సంవత్సరాల క్రితం ఎముక, కొన్ని వందల సంవత్సరాల క్రితం శాసనం, నీ ఎదురుగా ఈ రోజు కూర్చున్న ఆడది – అందరూ ఒకటే నీకు. నేను మరదలిగా కాక నీ విజ్ఞానాన్ని వినే సాధనంగా కనిపించానేమో కదూ?"

"నువ్వు చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు శైలజా."

"జరిగిన విషయాలు మళ్ళీ గుర్తుకి తెచ్చుకుంటే నీకలా అనిపించదేమో."

"ఏంటా జరిగిన విషయాలు"

"రాత్రి నీక్కూడా ఆలస్యంగా పడుక్కోడమే అలవాటా? నాకయితే డాక్టర్‌గారి కోసం ఎదురుచూస్తూండడంవల్ల లేటవుతుంది."

"నేనూ ఏదో చదువుతూనో, రాస్తూనో చాలా పొద్దుపోయేదాకా ఉంటాను. అయితే పొద్దున్న కూడా చాలా ఆలశ్యంగా లేస్తాను."

"నాకది కుదరదులే."

"ఇంతకీ ఆ ప్రసక్తెందుకు?"

"మనం పాత విషయాల గురించి చాలాసేపు మాట్లాడుకోవచ్చని. ఏం నీకేదన్నా అభ్యంతరమా? నువ్వేదన్నా రాసుకోవాలా."

"లేదు. ఈ రోజు విశ్రాంతి తీసుకుంటున్నా. ఊఁ. ఆ జరిగిందేంటో చెప్పు."

"నువ్వు ప్రశాంతంగా పడుకో – నేనీ కుర్చీలో కూర్చుంటాలే."

లేస్తూ అంది – "ఈ లైటు ఉండాలా – అక్కర్లేకపోతే ఆపేస్తాను" అంటూనే ఆపేసింది. వెళ్ళి కుర్చీలో కూర్చుంది. శైలజ ఒళ్ళోకి కిటికీలోంచి వెన్నెల పడుతోంది.

"ఆ రోజూ యిలాగే వుంది – మా ఇంటి డాబా మీద గదిలో నువ్వు పడుక్కునుంటే నేను కుర్చీలో ఇలాగే కూర్చుని.

అదే మనం ఒకరితో ఒకరం మాట్లాడుకున్న ఆఖరిరోజు. నువ్వు ఆ వెన్నెల్లో నన్ను చూసి అదేదో ఇంగ్లీషు పద్యంలో ఆడెన్ రాసిన వాక్యాలు చదివావు. నీకు నీ ఎదురుగా వున్న వెన్నెల్లో ఆడపిల్ల కన్పించలేదు. ఏం చేస్తాం. ఆ రోజు రాత్రే నా ఆశలకి పూర్తిగా సమాధి కట్టేశాను. మనిద్దరికీ పెళ్ళి కుదరదని తెలుసుకుని నిన్ను



E:\Seelamma\
Seelama1
22

మరో అమ్మాయిని చేసుకొమ్మని చెప్పేశాను.

మొదటిరోజుకీ, ఆఖరిరోజుకీ ఎంత తేడా?

నువ్వు వస్తావని నాన్న చెప్పినరోజున నేనెంతో సంతోషించాను. విదేశాల్లో చదువుకున్న మా బావ ఎంతో అందంగా, హుందాగా వస్తాడని, నన్ను చూడగానే హుందా కొంత తగ్గించుకొని, కొంటె బావవుతాడని, ఎన్నో ఊహించుకున్నాను.

నువ్వు వచ్చావు. నా గురించి అస్సలు అడగలేదు. నాన్నతో ఏవో విదేశం గొడవలు చెప్పావు. అమ్మకి ఆరోగ్యం సరిగ్గా లేదంటే, కనుక్కొని ఏవో మందుల పేర్లు చెప్పావు. అల్లుడు డాక్టరని సంబరపడిపోయింది అమ్మ. నీ డాక్టరేటు డాక్టరీ కాదని తెలిసిన నాకు బలే సంతోషమేసింది – నీకెన్నో విషయాలు తెలుసని.

నువ్వు నా గురించి అడగనేలేదు. నీ కసలు మరదలుందనే తెలియదేమోలే. నాక్కొంచెం సిగ్గనిపించి నీ ముందుకి రాలేదు.

రాత్రి భోజనాలప్పుడు నేను సిగ్గు తగ్గించుకొని అమ్మ ప్రోత్సాహంతో నీకు వడ్డించడానికి వచ్చాను.

నేలమీద కూర్చోడం తెలియక కష్టపడుతున్న నిన్ను చూస్తే నాకు నవ్వొచ్చింది. భోం చేస్తున్న నిన్ను వంటెలా ఉందంటే చాలా బాగుందన్నావు. అమ్మాయి తండ్రిగా నాన్న అమ్మాయి చేసిందన్నారు.

నువ్వు నన్ను మెచ్చుకుంటావనుకున్నాను. మాటల్లో చెప్పకపోయినా మెచ్చుకోలుగా చూస్తావనుకున్నాను. అసలు నన్ను చూడనైనా లేదు. భోజనాలయ్యాక నీ గదిలోకి వక్కపొడి తెచ్చిస్తే, ఏం చదువుకున్నావని అడిగావు. మా ఊళ్ళో ఇంటర్మీడియట్‌దాకా చదువుకున్న నాకు విదేశీ చదువుల అల్లుడికోసం అని ట్యూషన్ పెట్టించి బి.ఎ. చెప్పించారు నాన్న. అదే చెప్పాను.

సబ్జక్టులేంటి, మార్కులెన్ని అని ఇంగ్లీషులో అడిగావు. ఇంగ్లీషు చదవటం అలవాటు చేసుకున్నాను కాని, మాట్లాడ్డం నాకు అలవాటులేక రాలేదు. ఇప్పటికీ నాకు రాదనుకో. డాక్టరుగారి భార్యగా నాకేం కష్టం కలగలేదు. నువ్వు ఇంగ్లీషులో అడిగినదానికి తెలుగులో మాట్లాడ్డమేమిటని నేనేదో చెప్పాను. నీకందులో ఏదో తప్పు కనిపించింది. ఆ గ్రామర్ రూల్స్ గురించి నాకో గంటసేపు చెప్పావు.

నీ భాషా పాండిత్యానికి సంతోషం కలిగింది. నీ సాన్నిధ్యంలో నేనుకూడా చాలా విషయాలు తెలుసుకోవచ్చనుకున్నాను.

అప్పుడు నాకేం తెల్సు. నువ్వు నీకు తెలిసిన విషయాలు చెప్పడానికి చెప్పావని, నాకు తెలియదు కనుక నేర్పాలని కాదని?

మనిద్దరికీ ఎలానూ పెళ్ళి అవుతుందని ఆశపెట్టుకున్న అమ్మ, నాన్నలు నీతో పొలానికి నన్ను పంపడానికి ఏం అభ్యంతరమనుకోలేదు సరికదా, సంతోషపడ్డారు.

అక్కడ పొలం గట్లమీద తిరుగుతూ, కలిసి కబుర్లు చెప్పుకోవచ్చనుకున్న నాకు నువ్వు రైతుల్తో మాట్లాడుతుండటం విసుగనిపించింది. చీడలు, మందులు, ఎరువుల గురించి నువ్వు వాళ్ళకి చెప్పిందానికి వాళ్ళు ఆశ్చర్యపోయి, నాతో పట్నం బాబయినా ఈయనకి వ్యవసాయం గురించి చాలా తెలిసిందంటే – నేనేదో నాకే తెలిసినంత గర్వపడ్డా – నా ఉత్సాహం మాత్రం చచ్చిపోయింది.

ఇంకన్నీ అలాగే జరిగాయి.

ఆరు బయట చీకట్లో పక్కేసుకుని పడుకున్న నీ పక్కన కూర్చున్నానారోజు. నాకు ఆకాశంలో నక్షత్రాలు సాయంత్రం ఒక్కటొక్కటిగా వస్తుండడం చూడడమంటే బలే సరదా. అదే మాట నీతో అన్నాను.

నువ్వు నాకు ఖగోళ శాస్త్రం గురించి చెప్పడం మొదలెట్టావు. పల్లెటూరిలో పుట్టి పెరిగిన పిల్లకు శాస్త్ర విషయాలు చిన్నప్పటినుంచి తెలియవని, అందులో ఇష్టం కుదరడం నువ్వు గ్రహించలేదు బిగ్‌బాంగ్ థియరీ నాకెందుకు బావా?

ఓ రోజు ప్రొద్దున్నే తలారస్నానం చేసి పొడుగాటి జుట్టుకి – నాకు తెలుసో తెలియదో కానీ – నా జుట్టు చాలా పొడుగు. వాలు కుర్చీలో కూర్చుని సాంబ్రాణి పొగేసుకుంటుంటే, నువ్వు రెప్ప వాల్చకుండా చూస్తావనుకున్న నాకు, తలస్నానం గురించీ, ప్రొద్దున్న సూర్యోదయంలోని కిరణాల మంచి చెడ్డల గురించీ వివరించావు నువ్వు.

ఇవన్ని యింకా ఎందుకులే –

నీ తెలివితేటలు మొదట్లో నన్నాకర్షించాయి. కాని దాంతోపాటు ఉండాల్సిన హృదయస్పందన లేదు నీకు.

నీకు మెదడుంది. హృదయం లేదు.

నీకు అనుభూతి, ఆనందం లేవు. నువ్వు కొన్ని మిలియన్ల 'కె' మెమరీ ఉన్న జెయింట్ కంప్యూటర్‌వి.

నువ్వు ప్రపంచం దృష్టిలో చాలా గొప్ప వాడివి. నీ గురించి ఇలా మాట్లాడే అర్హత లేదేమో నాకు.

నీకు సూర్యోదయంలో అందం తెలియదు. ఓ చల్లని పున్నమి రాత్రి వెన్నెల్లో కూర్చుని ఆకాశంలో కనిపించే మబ్బు తునకల విహారాన్ని నువ్వానందించలేవు. పువ్వైనా, ఆడదైనా, సముద్రమైనా నీ మెదడు దాకానే పరిమితం. నీకు వస్తువు



E:\Seelamma\ Seelama1 23

తాలూకు వివరాలే తెలుస్తాయి. అసలు వస్తువు తెలియదు. అందం తెలియదు. ఆనందం తెలియదు. శోభనం రాత్రి నీ భార్యతో నువ్వు మాస్టర్స్ అండ్ జాన్సన్ చేసిన రీసెర్చి గురించి అనర్గళంగా మాట్లాడగలవు. నీ భార్య కళ్ళలోని వాంఛను చూడకుండా.

సారీ, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన నిన్నిలాగ అనకుండా ఉండాల్సింది. ఏదో నా మనసులోని మాట బయటికొచ్చేసింది.

మా మనవరాలు ఓ రాత్రివేళ నిద్రలేచి నేను లేకపోతే భయపడుతుంది. అక్కడి కెళ్ళి పడుకుంటా.

నేను పొద్దున్నే లేచి వెళ్ళిపోతాను. నువ్వు లేవడం ఆలస్యమౌతుందన్నావుగా, గుడ్ నైట్, గుడ్‌బై."

"శైలజా! ఆగు, నిన్నో విషయం అడుగుతాను. నా గురించి నీకు బాగా తెలుసు కాబట్టి అడుగుతున్నాను. చెప్తావా?"

"నీకు నేను చెప్పడమేంటి?"

"నవ్వకు, ప్లీజ్. నేను కొన్నేళ్ళుగా ఈ బాధ పడ్తున్నా. నేనెంతో విజ్ఞానార్జన చేసి చాలా పేరు తెచ్చుకోవాలనుకున్నా. నేననుకున్నట్లే అయింది. అయినా – నాకెంత పేరు వచ్చినా – ఎంతమంది అభినందిస్తున్నా – ఏదో వెలితిగా, లోటుగా అనిపిస్తోంది. ఎందుచేతంటావ్?"

నవ్వింది. గట్టిగా నవ్వింది. నా చర్మం, ఎముకలు, మాంసం, రక్తం అంతా నిండేటట్లు నవ్వింది. నవ్వి అంది –

"నీకది చెప్పినా అర్థం కాదు. నీకో సగం జీవితం లేదు. నీ జీవితం అసంపూర్ణం."

అంటూ ఓ చూపు చూసి వెళ్ళిపోయింది.

ఆ చూపులో ఏముందో – జుగుస్సో? బాధో? జాలో? నాకర్థం కాలేదు.

E:\Seelamma\
Seelama1
24

# ఆరంభం

నదికి ఆ ఒడ్డున నగరం – మధురానగరం. ఈ ఒడ్డున పల్లె – రేపల్లె.

పల్లె నిండా పచ్చిక బయళ్ళే. బయళ్ళ నిండా గోవులే. ఆ గోవులన్నీ ఆ పల్లెలోని గోపాలురవే.

పల్లెలోని ఆబాలగోపాలం రాత్రంతా ఆదమరిచి నిద్రపోతారు. పొద్దు పొడవక ముందే నిద్ర లేస్తారు.

ఉదయమే పాలనీ, పెరుగునీ, వెన్ననీ నదికి ఆ ఒడ్డున్న ఉన్న నగరానికి తీసికెళ్ళీ, అక్కడే అమ్ముకునీ, వచ్చిన డబ్బుతో అక్కడ నుండి తమకి కావల్సిన సంబారాలు కొనుక్కునీ, పొద్దు గుంకే వేళకి తిరిగి పల్లెను చేరుకుంటూంటారు గోపాలురు.

ఇంటి పనులు చూసుకుంటూ, వెన్న చిలుకుకుంటూ, పాటలు పాడుకుంటూ కాలక్షేపం చేస్తూంటారు గోపికలు.

ఆవుల్ని మేపుకుంటూ తమలో తాము ఆడుకుంటూ కాలం గడుపుతూంటారు గోపబాలురు.

కరవూ కాటకం లేని పల్లె రేపల్లె. చీకూ చింతా లేని జనం రేపల్లీయులు.

ఆ రోజు అష్టమి. సాయం సమయం వరకూ నిర్మలంగా ఉన్న ఆకాశం, నెమ్మదిగా మేఘావృత్తం అవసాగింది. వాన మొదలవుతుందనడానికి సూచనగా చల్లగాలి బలంగా వియ్యడం మొదలెట్టింది.

నగరం నుండి రావల్సిన నావ వచ్చేసింది. అందులో గోపాలురు అందరూ వచ్చేసారు. ఒక్క కుంటయ్య తండ్రి తప్ప. కుంటయ్య పేరు కుంటయ్య కాదు. కాలు కొంచెం వంకరగా ఉండడంతో వంగి ఈడ్చుకుంటూ నడుస్తూంటాడు కాబట్టి అందరూ కుంటయ్య అంటారు. పదేళ్ల క్రితం అదే రోజు పుట్టాడు కుంటయ్య.

అందుకే ఆ రోజు ఉదయమే మధురకి వెళ్తూ కుంటయ్య తండ్రి – "ఈ రోజు మధురలో పాలూ పెరుగూ అమ్మిన డబ్బుతో నీకు మంచి మంచి బొమ్మలు కొని తీసుకుని వస్తానేం" అని చెప్పి వెళ్ళాడు. సాయంత్రం నావ రావడానికి చాలా ముందు నుండే కుంటయ్య నది ఒడ్డున కూచుని ఎదురు చూసాడు. నావ వచ్చింది. వెళ్ళింది. అయితే తండ్రి రాలేదు.



కుంటయ్యకి బాధ కలిగింది. ఏడుపు వచ్చింది. అయ్య బొమ్మలు తెస్తాడు. వాటిని స్నేహితులకి చూపించచ్చని అనుకున్నాడు. అయ్య రాలేదు. బొమ్మలు రేపు చూస్తాంలే అని వాడితో చెప్పి వాడి స్నేహితులందరూ వాళ్ల వాళ్ళ అయ్యలతో ఇళ్ళకి వెళ్ళిపోయారు.

వంకర కాలిని ఈడ్చుకుంటూ కుంటయ్య ఇంటికి చేరాడు. అమ్మ ఒళ్లో దూరి ఏడవడం మొదలెట్టాడు. అమ్మ వాడిని ఓదార్చింది.

"ఒక్కోసారి రాత్రి ఆలస్యంగా ఇంకో నావ వస్తుంది. అయ్య అందులో వస్తాడేమోలే. నువ్వు బువ్వ తిని పడుక్కో. ఉదయం లేస్తూనే కొత్త బొమ్మలతో ఆడుకుందువు గానీ" అంది అమ్మ.

"బువ్వ తిని మళ్ళీ నది ఒడ్డుకి వెళ్లి అక్కడే అయ్య కోసం చూస్తూ కుచుంటాను. అయ్య ఎట్లాగైనా రాత్రికి వస్తాడు. నాకు బొమ్మలు తెస్తాడు" అన్నాడు కుంటయ్య.

"నది ఒడ్డున చీకటిగా ఉంటుంది. అక్కడ నీకు భయం వేస్తుంది. నేను చెప్పినట్లు విని హాయిగా పడుక్కో" అంది అమ్మ.

"నాకు భయం లేదమ్మా. ఇంట్లో ఉన్నా నాకు నిద్ర రాదు. నేను వెళ్తానే" అన్నాడు కుంటయ్య.

"ఐతే ఒక పని చెయ్యి. ఈ దీపాన్నీ, ఆ గొడుగునీ నీ దగ్గర ఉంచుకో. అయ్య వచ్చేటప్పటికి ఆలస్యం అయినా దీపం కాంతిలో మీరు ఇంటికి వచ్చెయ్యచ్చు. కాస్త వాన పడినా గొడుగుంటుంది." అంది అమ్మ.

కుంటయ్య నెమ్మదిగా కుంటుకుంటూ నది ఒడ్డుకి చేరుకున్నాడు.

ఆ రోజు ఆకాశమంతా మేఘావృతమై ఉంది. తన దగ్గర ఉన్న దీపం కాంతిలో దగ్గర ఉన్న ప్రవేశం కనిపిస్తోంది. అంతే. దూరంగా ఏముందో కళ్ళు పొడుచుకున్నా కనిపించడం లేదు. ఐనా ధైర్యంగా కూచున్నాడు కుంటయ్య అయ్య కోసం ఎదురు చూస్తూ.

చల్లగాలి బలంగా వీస్తోంది. నది వడిగా పరుగెడుతోంది. పెద్ద వాన రావడానికి సూచనగా అనిపిస్తోంది.

నది వైపే చూస్తూ కూచున్నాడు కుంటయ్య. రాత్రి ఎంత గడిచిందో తెలియడం లేదు వాడికి.

అలా ఎదురు చూడ్డం వాడికి కష్టంగా అనిపించలేదు. అలసట కలగేలదు. నిద్రా రాలేదు.

నెమ్మదిగా వాన మొదలైంది. తడవకుండా గొడుగు కింద కూచున్నాడు కుంటయ్య.

అలా ఎదురు చూస్తూ కూచున్న కుంటయ్యకి నదిలో ఒక మనిషి తల మీద బుట్టతో ఈ ఒడ్డుకి వస్తున్నట్లు కనిపించింది. అయ్యే అలా వస్తున్నాడా అని ఆనందంగా లేచి నిల్చున్నాడు. అయితే ఆ మనిషి చింపిరి జుట్టుతో, పెరిగిన గడ్డంతో ఉన్నాడు. అయ్య కాదు.

అసలు ఆ మనిషి అంత లోతు నదిలో మునగకుండా ఎలా వస్తున్నాడో, అంత వానలోనూ ఆ బుట్ట తడవకుండా ఎలాగుందో కూడా అర్థం కాలేదు వాడికి. గడ్డపాయన నది ఈ ఒడ్డుకి చేరుకున్నాక, నెమ్మదిగా గట్టెక్కాడు. కుంటయ్య దీపమూ, గొడుగూ తీసుకుని ఆయన దగ్గరకి వెళ్ళాడు. ఆయన అలసట తీర్చుకోవడానికి అన్నట్టుగా బుట్టని తల మీద నుంచి దించి పక్కన పెట్టాడు.

బుట్టలో చిన్న పిల్లాడు కనిపించాడు కుంటయ్యకి. పిల్లాడు నల్లగా ఉన్నాడు. బుల్లి బుల్లి చేతులూ, కాళ్ళూ, బుజ్జి తలా, ఉంగరాల జుట్టూ, పిల్లాడు కుంటయ్యకి బాగా ముద్దొచ్చాడు. బుట్టకి గొడుగు అడ్డం పెట్టి పక్కనే కూచున్నాడు.

"పట్టుమని పదేళ్లు ఉంటాయో ఉండవో నీకు – ఇంత అర్థరాత్రి వేళ ఒక్కడివే ఈ వానలో నది ఒడ్డున కూచుని ఏం చేస్తున్నావు?" అని అడిగాడు గడ్డపాయన.

"ఎదురు చూస్తున్నాను" అన్నాడు కుంటయ్య.

"ఎవరి కోసం? ఇంత అర్థరాత్రి ఈ నదిని దాటి అటు పక్కనుండి ఇటు పక్కకి ఎవరు వస్తారు?" అన్నాడాయన.

"మీరు రాలేదూ?" అని అడిగాడు కుంటయ్య.

"నేనెలా వచ్చానో నాకే తెలియదు. అంత లోతు నది. అదీ వడిలో ఉంది. రెండుగా చీలి నాకు దారి ఇచ్చినట్లనిపించింది నాకైతే. ఆ దారిలో నేను నడుచుకుంటూ వచ్చాను లాగుంది. నాకే తెలియదు. అలానే వానాను. నదిలో నడుస్తున్నంత సేపూ కనిపించకుండా ఎవరో పెద్ద గొడుగు పట్టినట్లున్నారు. చూడు. బుట్ట తడవనే లేదు."

"ఈ ఊళ్ళో మీరెక్కడకి వెళ్ళాలి?" అని అడిగాడు కుంటయ్య.

"ఈ ఊరి పెద్ద ఇంటికి. అంతే తెలుసు. పెద్ద పేరూ తెలియదు. ఇల్లూ తెలియదు."

"నేను తీసుకెళ్తాను రండి. నాకు ఈ ఊరి పెద్ద నందయ్య ఇంటికి దారి తెలుసు. నా దగ్గర దారి చూపేందుకు దీపమూ ఉంది. బుట్ట తడవకుండా గొడుగూ ఉంది" అన్నాడు కుంటయ్య.

"ఈ అర్థరాత్రి ఎవరిని అడగాలా ఎలా వెళ్ళాలా అని అనుకుంటూంటే నువ్వు దేవుడిలా కనిపించావు. అడక్కుండానే దారి చూపిస్తాననంటున్నావు. పద" అంటూ బుట్ట నెత్తి మీద పెట్టుకుని బయల్దేరాడు గడ్డపాయన.



E:\Seelamma\
Seelama1
25

పక్కనే ఓ చేత్తో దీపం, మరో చేత్తో గొడుగూ పట్టుకుని బయల్దేరాడు కుంటయ్య.

కుంటయ్య వయస్సుకి కుంటయ్య పొడుగే కానీ ఓ కాలు వంకర తిరిగి ఉండడంతో నిటారుగా నిలబడలేడు. దాంతో వాడి చేతిలో ఉన్న గొడుగు బుట్ట పైదాకా రాలేదు. గొడుగు బుట్ట పైదాకా వెళ్ళడం కోసం చేతిని బాగా సాగదీసాడు. సరిపోలేదు. దాంతో వేళ్ల మీద నిల్చుని కాళ్ళని కూడా బాగా సాగదీశాడు. గొడుగు బుట్టపై దాకా వచ్చింది. గడ్డపాయన వేగంతో వెళ్తూండడంతో పక్కనే పరుగెత్తుతున్నట్లు అడుగులు వెయ్యసాగాడు కుంటయ్య.

నందయ్య ఇల్లు వచ్చింది. తలుపులు తీసే ఉన్నాయి. రేపల్లెలో ఇళ్లకి గొళ్ళాలు లేవు. పోడానికి ఇళ్ళలో ఏమీ లేవు. అంతకు మించి పోతుందన్న భయమూ లేదు. గోవుల్నీ, స్వశక్తినీ నమ్ముకుని బతుకుతున్న గొల్లల పల్లె రేపల్లె.

నందయ్య ఇంటిలోకి వెళ్ళి వచ్చాడు గడ్డపాయన. అంతా కలిపి ఒక్క నిముషం కూడా పట్టలేదు.

ఆయనతో కలిసి మళ్ళీ నది వంకకి కదిలాడు కుంటయ్య. ఒక్క నిముషం నందయ్య ఇంట్లోకి వెళ్ళి రావడానికి మధుర నుంచి ఈ గడ్డపాయన ఇంత అర్థరాత్రి ఎందుకు వచ్చాడో తెలియలేదు వాడికి. ఏదన్నా అడగడానికి ఆయన వెళ్ళిపోయే హడావిడిలో ఉన్నట్లున్నాడు. ఏమీ మాట్లాడ్డం లేదు.

నది ఒడ్డుకి చేరుకున్నారిద్దరూ. ఆయన కుంటయ్య వంక చూసి నవ్వుతూ – "నువ్వు చేసిన సాయం ఈ జన్మలో మర్చిపోలేను. నిన్ను ఆ దేవుడు చల్లగా చూస్తాడు" అని కదలబోయాడు.

కుంటయ్యకి బుట్టలోని నల్ల పిల్లాడిని ఒక్కసారి చూడాలనిపించింది. అదే అడిగాడు.

"పిల్లాడా?" అని అడిగాడు ఆయన.

కుంటయ్యకి అర్థం కాలేదు. "మీరు ఇందాక బుట్ట కింద పెట్టినప్పుడు చూసా – అందులో బుజ్జి పిల్లాడిని" అన్నాడు వాడు.

"నువ్వు పొరబడి ఉంటావు. ఇందులో ఉన్నది బుల్లి పాప. చూడు" అంటూ బుట్ట కొంచెం వంచాడు.

కుంటయ్యకి అర్థం కాలేదు. అందులో ఉన్నది చిన్న పాపే. తను చూసింది పిల్లాడిని. అది పిల్ల ఎలా అయిపోయిందో తెలియలేదు. అలానే తను చూసిన పిల్లాడు నల్లగా ఉన్నాడు. ఈ పిల్ల తెల్లగా ఉంది.

"ఇదేదో మాయలా ఉంది" అన్నాడు కుంటయ్య.

"జరిగిందీ, జరుగుతున్నదీ, జరగబోయేదీ – అంతా వాడి లీల" అని అంటూ నందయ్య ఇంటి వంక చూసాడాయన.

"అసలేం జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు వాడు.

"నాకూ అర్థం అవడం లేదు. అంతా మాయ" అంటూ పిల్ల వంక ఒకసారి చూసి బుట్టని సరిచేసుకుని నదిని దాటడం మొదలెట్టాడాయన.

కుంటయ్యకి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చినట్లయింది. ఇంతసేపూ తన అయ్య సంగతే గుర్తుకు రాలేదు. ఆ సంగతి గుర్తుకు రాగానే ఇంటి వైపు కదిలాడు కుంటయ్య.

అయ్య వచ్చాడో లేదో అని అనుకుంటూ ఇంటికి చేరాడు. ఇంటి గుమ్మం దగ్గరే అయ్యా, అమ్మా కనిపించేసరికి వాడికి ప్రాణం కుదుటబడింది.

వాణ్ణి చూస్తూనే, వాడి అమ్మా, అయ్యా వాడి దగ్గరకి పరుగెత్తుకుంటూ వచ్చారు.

"వచ్చావా? ఇంతసేపూ ఎక్కడకెళ్ళావు? నేనెంత భయపడిపోతున్నానో" అంది అమ్మ వాణ్ణి తన చేతుల్లోకి తీసుకుంటూ.

"నది ఒడ్డున నువ్వు కనపడకపోతే ఇంటి దగ్గర ఉంటావని వచ్చాను. తీరా చూస్తే నువ్వు నది ఒడ్డుకే వచ్చావని చెప్పింది అమ్మ. ఇంత రాత్రి వేళ నువ్వు కనిపించడం లేదంటే నాకు ఏం చెయ్యాలో తెలియదు. కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఇలా చతికిల పడిపోయాను. మీ అమ్మేమో ఒకటే ఏడుపు. ఇంతకీ ఎక్కడకి వెళ్ళావు?" అన్నాడు అయ్య, అమ్మ దగ్గర నుండి వాణ్ణి తన ఒళ్ళోకి లాక్కుంటూ.

"నేనక్కడే చాలా సేపున్నాను. నువ్వు రాలే. కొంచెం సేపే అక్కడ నుండి వెళ్ళింది. నువ్వు ఆ కొంచెం సేపులోనే వచ్చి ఉంటావు. అప్పుడు వచ్చిందా నావ?" అని అడిగాడు కుంటయ్య.

"నీకు బొమ్మలు కొనుక్కుని వచ్చేసరికి నావ వెళ్ళిపోయింది. రాత్రికి ఇంకో నావ వస్తుందంటే అక్కడే కూచున్నాను. ఎంత రాత్రయినా నావ రాలేదు. అయితే ఓ గడ్డపాయన ఓ బుట్ట నెత్తిన పెట్టుకుని నది దాటడం మొదలెట్టాడు. ఆయనకి నది చీలి దారి ఇస్తున్నట్లు అనిపించింది. ఆయన వెళ్ళిన దారినే నేనూ వచ్చాను. నదిని ఎలా దాటానో నాకే అర్థం కాలేదు. మధురలో వాన చినుకు లేదు. మన పల్లెలో మాత్రం పెద్ద వాన కురుస్తోంది. వానలో పరుగెత్తుకుంటూ మన ఇంటికి చేరాను. నువ్వు లేవని చూసేసరికి నా గుండాగినట్లయింది. ఇంతకీ నువ్వు ఎక్కడకి వెళ్ళావు?" అని అడిగాడు అయ్య.

"నువ్వు చెప్పావే గడ్డపాయన – ఆయన నెత్తి మీద బుట్టతో వచ్చాడు. ఆ బుట్టలో ఒక చిన్న పిల్లాడు ఉన్నాడు. ఆ పిల్లాడు నల్లగా ఉన్నాడు కానీ ఎంత ముద్దుగా



E:\Seelamma\
Seelama1
26

ఉన్నాడో తెలుసో అయ్యా. బుల్లి బుల్లి చేతులూ, కాళ్ళూ, చిన్ని కళ్ళూ, పెదాలూ – అప్పుడే పుట్టినట్లున్నాడు. నేనంతకు ముందు తమ్ముణ్ణి చూసా కదా పుట్టినప్పుడు అలానే ఉన్నాడు. అయితే ఆ నల్ల పిల్లాడి మొహం నవ్వుతున్నట్లు ఉంది. ఆ కళ్ళూ, పెదాలూ అలా చూస్తుండి పోవాలనిపించింది. ఆ పిల్లాడిని అలా చూస్తూ ఉంటే నాకు నెమలి పింఛాలను చూస్తున్నట్లు అనిపించింది. అంతే కాదు. మురళి వింటున్నట్లు అనిపించింది" అని అన్నాడు కుంటయ్య.

"నీ దగ్గర గొడుగు ఉంది కదా – మరి నువ్వు తడిసిపోయా వేంటి?" అని అడిగింది కొంగుతో తల తుడుస్తూ అమ్మ.

"నది దాటేడప్పుడు ఎవరో ఆ బుట్టకి గొడుగు పట్టినట్లు ఆ పిల్లాడు అసలు తడవనే లేదు. నది దాటి ఇటు వచ్చాక ఆ పిల్లాడు తడిసిపోకుండా నా గొడుగు పట్టుకున్నాను. నేను కొంచెం తడిసాను. నేను తడిస్తే పరవాలేదు. అంత బుల్లివాడు– అందులోనూ అంత చక్కని వాడు – తడిస్తే..." అని అంటూ ఆగాడు కుంటయ్య.

"ఇంతకీ ఆ గడ్డపాయన ఎవరో అడిగావా? ఆ పిల్లాణ్ణి ఇంత అర్థరాత్రి వేళ బుట్టలో పెట్టుకుని ఎందుకు తీసుకు వచ్చాడుట?" అని అడిగాడు అయ్య.

"ఆయనెవరో నాకు తెలియదు. ఆయన మాత్రం నందయ్య ఇంటికి వెళ్ళాడు. ఆ ఇంటికి దారి చూపింది నేనే. వాళ్ళకి గొడుగు పట్టింది నేనే. ఇంటి లోపలకి వెళ్ళి నాయన మళ్ళీ అదే బుట్టతో బయటకి వచ్చాడు. నది దాకా మళ్ళీ నేనే గొడుగు పట్టుకుని తీసికెళ్ళాను. అక్కడకెళ్ళాక ఆయన నది దాటడానికి వెళ్ళిపోతుంటే ఆ పిల్లాడిని మళ్ళా ఒకసారి చూడాలనిపించింది. అదే మాట ఆయనతో అంటే – బుట్టలోఉన్నది పిల్లాడు కాదు – పిల్ల అని అన్నాడు. తీరా చూస్తే అందులో ఉన్నది పిల్లే. నల్ల పిల్లాణ్ణి నేను నిజంగానే చూసాను. మరి ఆ నల్ల పిల్లాడు మాయమై తెల్లని పిల్ల ఎలా వచ్చిందో తెలియలేదు. చూడ్డానికి అంత మంచిగా కనిపించే ఆ గడ్డపాయన నాతో అబద్ధం ఎందుకు చెప్పాడో తెలీదు" అన్నాడు కుంటయ్య.

"అవన్నీ పెద్దవాళ్ళ వ్యవహారాలులే. నీకు తెచ్చిన బొమ్మల మూట లోపల చిలక్కొయ్యకి ఉంది. తెచ్చుకో" అన్నాడు అయ్య.

అంతవరకూ బొమ్మల గురించి మర్చిపోయిన కుంటయ్య, అయ్య వాటి ఊసెత్తగానే చెంగున లేచి రివ్వున పరుగు పెట్టాడు. వాడు అలా పరుగు పెట్టడం చూసి ఆశ్చర్యపోయారు అమ్మా అయ్యా.

బొమ్మల మూట తీసుకుని పరుగెత్తుకుంటూ వచ్చాడు కుంటయ్య.

"కుంటయ్యా– నీ కుడి కాలు ఎడం కాలులా నిటారుగా అయిపోయిందిరా"

అంది అమ్మ ఆనందంగా.

"ఒరే..... నువ్వు మామూలుగా నడుస్తున్నావురా" అన్నాడు అయ్య సంతోషంగా.

అప్పుడు కానీ తన కాలి వంకర పోయినట్లు చూసుకోలేదు కుంటయ్య. తను అందరిలా నడిచేస్తున్నట్లు తెలియలేదు వాడికి. ఆశ్చర్యంగా కాలినే చూసుకుంటూ ఉండిపోయాడు.

"నువ్వు ఇలా నడుచుకుంటూనే వచ్చావా ఇంటికి? అప్పుడు నేను చూణ్ణేలేదు." అంది అమ్మ.

అందుకు సమాధానంగా తనలో తను మాట్లాడుకుంటున్నట్లు అన్నాడు కుంటయ్య–

"నేను అయ్య కోసం నది గట్టు మీదకి వెళ్తున్నప్పుడు కుంటుకుంటూనే వెళ్ళాను. గడ్డపాయన బుట్ట దింపుకున్నప్పుడు కుంటుతూనే ఉన్నాను. తరువాత బుట్టకి గొడుగు పట్టడానికి నా పొడుగు సరిపోలేదు. అప్పుడు వేళ్ళ మీద నిలబడి పైకి సాగడానికి ప్రయత్నించాను. ఆ తరువాత నేను కుంటానో, నడిచానో నాకు గుర్తు రావడం లేదు. మరి ఆ గడ్డపాయన ఏదన్నా మాయ చేసాడో ఏమో ఇలా అయిపోయాను" అన్నాడు కుంటయ్య తన్ని తానే ఆనందంగా చూసుకుంటూ.

"మాయ గడ్డపాయనే చేసాడో – బుట్టలో ఉన్న పిల్లాడే చేసాడో. ఆ పిల్లాణ్ణి చూస్తే నీకు నెమలి పింఛాలు కనిపిచాయంటున్నావు. వేణువు వినిపించిందంటున్నావు. ఎవరు ఏ మాయ చేసినా మనకి మంచే జరిగింది. ఈ మాట ఎవరితోనూ అనద్దు. అనవసరంగా గొడవలు వస్తాయి. అదీ వ్యవహారం ఊరి పెద్ద నందయ్యతో. ఎవ్వరడిగినా రాత్రి పడుక్కుని తెల్లారి లేచే సరికి ఇలా అయిందని చెప్దాం – సరేనా?" అంది అమ్మ.

సరేనన్నాడు అయ్య.

అయ్య తెచ్చిన బొమ్మల్ని పక్కన పెట్టేసి అటూ ఇటూ నడుస్తూ తెగ మురిసిపోతున్నాడు కుంటయ్య.

వాడికిదంతా ఆ గడ్డపాయన కాకుండా ఆ నల్ల పిల్లాడే చేసి ఉంటాడనిపించింది. మర్నాడు నందయ్య ఇంటికెళ్లి ఆ నల్లపిల్లాడు ఉన్నాడో లేడో చూడాలనిపించింది. ఎందుకో ఉంటాడని కూడా అనిపించింది.

(Jeffrey Archer రాసిన First Miracle చదివి–)

●



E:\Seelamma\

Seelama1

27



# ఏ గాలెటు వీస్తుందో

ఉద్యోగంలో హోదా పెరిగే కొద్దీ బాధ్యత కూడా పెరగడంతో ఆఫీసు పని వదులుకుని అత్తయ్యా వాళ్ళ ఊరు రావడం కుదరలేదు. ఎప్పటికప్పుడు వద్దామనుకుంటూనే, రాకుండాఆరేళ్ళు గడిచిపోయాయి.

ఇంక తక్కిన విషయాలన్నిటినీ పక్కన పెట్టి ఈ ప్రయాణం చెయ్యడానికి ముఖ్య కారణం – వాషింగ్టన్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ సమావేశంలో నేను చేసిన ఉపన్యాసానికి నాకు లభించిన మెప్పు.

అక్కడ ఉపన్యసిస్తున్నంత సేపూ, ఆ తరువాత అందరూ నా ఉపన్యాసాన్ని పొగుడుతున్నంతసేపూ – నాకు మావయ్యే గుర్తొచ్చాడు. మావయ్య హైస్కూల్లో ఇంగ్లీషు టీచర్‌గా పనిచేసాడు. సెలవులకి నేను వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడల్లా నాకు కీట్స్, షెల్లీల కవిత్వం చదివి వినిపించి అందులో అందాల్ని అర్థమయ్యేలా చెప్పేవాడు. దాంతో నాకు ఇంగ్లీష్ కవిత్వం మీద ఇష్టం పెరిగింది. నేనూ మావయ్యలానే ఇంగ్లీష్ చదువుదామనుకున్నాను. అప్పుడు మావయ్యే నన్ను కూచోపెట్టుకుని –

"ఇంగ్లీష్ నీకు బాగా వస్తోంది. ఇంగ్లీష్‌లోనే బిఏ యెమ్మేలు చేసి డాక్టరేట్ కూడా చెయ్యచ్చు. ఐదే దానికన్నా ఏ ఎకనామిక్సో చదవడం మంచిదని నా అభిప్రాయం. ఇప్పుడు దేశానికి కావల్సింది మంచి ఆర్థికశాస్త్రవేత్తలు. అంతేకాక అది చదువుకున్న వాళ్ళకి మంచి భవిష్యత్తు కూడా ఉంటుంది. ఏ రిజర్వ్‌బ్యాంక్‌లోనో మంచి ఉద్యోగం సంపాదించుకోవచ్చు. ఇంగ్లీష్ ఎప్పుడైనా హాబీగా చదువుకోవచ్చు. నా ఉద్దేశంలో నువ్వు ఎకనామిక్స్‌లో బాగా రాణిస్తావు" అని చెప్పాడు.

మావయ్య చెప్పినట్లు నేను ఆర్థికశాస్త్రమే చదివాను. అప్పుడు మావయ్య నాకలా చెప్పడం వల్లే నేను ఈ రోజు ఈ ఉద్యోగం సంపాదించుకుని ఇంతపేరు సంపాదించుకోగలిగాను. అత్తయ్యనీ మావయ్యనీ కలిసి వాళ్ళతో నా ఆనందాన్ని పంచుకోవాలన్న కోరికే నా చేత ఈ ప్రయాణం చేయించింది.

నన్ను చూసి అత్తయ్యా, మావయ్యా బాగా సంతోషించారు. పిల్లలు ఉద్యోగాలకోసం వేరే ఊళ్ళలో ఉండడంతో పాత ఇంట్లో వాళ్ళిద్దరే ఉంటున్నారు. ఆరేళ్ళల్లో ఇల్లు

ఇంకా పాతబడినట్లుంది. సున్నం కూడా వేయించినట్లు లేదు. ఇద్దరే ఉండడంతో ఇంటి గురించి ఎక్కువగా పట్టించుకుంటూ ఉండి ఉండరు.

నన్ను తన పక్కనే కూచోబెట్టుకుంది అత్తయ్య. అత్తయ్య ఒళ్ళో కూచుని ఆవిడ చేతులకి ఉన్న బంగారు గాజులతో ఆడుకున్న రోజులు గుర్తొచ్చాయి నాకు. ఇప్పుడు ఆ గాజులు లేవు. పిల్లలకి ఇచ్చేసి ఉంటుంది అత్తయ్య. ఎప్పుడూ ఎవరికో ఒకరికి పెట్టడమే కానీ పుచ్చుకోవడం అలవాటు లేదు అత్తయ్యకి. మావయ్యా అంతే.

"ఎప్పుడూ అమెరికా ఇంగ్లాండ్ అని ప్రపంచమంతా తిరుగుతూ ఉంటావుట కదా! దేశ విదేశాల్లో బాగా పేరు తెచ్చుకుంటున్నావుటగా. అది వింటోంటే నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది." అంది అత్తయ్య.

అది అత్తయ్యకి ఉన్న గొప్ప గుణం. చిన్నప్పుడూ అంతే. తన పిల్లలకన్నా నేను బాగా చదువుతున్నానన్న అసూయ ఎప్పుడూ ఉండేది కాదు. అలాగని వాడు బాగా చదువుతున్నాడు. వాణ్ణి చూసి నేర్చుకోండి అని తన పిల్లలని కసిరేది కాదు. ఎవరికి ఎంత ప్రాప్తమో వాళ్ళకి అంత అని మనస్ఫూర్తిగా నమ్మిన మనిషి అత్తయ్య.

"నా చదువుకీ, ఉద్యోగానికీ, పేరుకీ అంతటికీ కారణం మావయ్యే అత్తయ్యా" అన్నాను నేను.

"నేనా?" అన్నాడు మావయ్య.

"అవును. నువ్వే. నన్ను ఆర్థిక శాస్త్రం చదవమని చెప్పింది నువ్వే. దానికి మంచి భవిష్యత్తు ఉందని నువ్వు చెప్పడం వల్లే నేను దాన్ని చదివాను. నా జీవితంలో నేను ఈ స్థితికి ఎదిగానంటే దానికి నువ్వే కారణం. ఈ విషయం మీతో చెప్పాలనే – నా ఆనందాన్ని మీతో పంచుకోవాలనే–" అని అంటున్న నా గొంతుక్కి ఏదో అడ్డు పడింది. నేను మాట్లాడలేకపోయాను.

"నేను చేసింది ఏముంది – నువ్వు కష్టపడి చదువుకుని పైకి వచ్చావు" అన్నాడు మావయ్య.

ఇంత పెద్దవాడివయ్యాక కూడా మమ్మల్ని గుర్తుపెట్టుకుని వచ్చావు. మాకెంతో ఆనందంగా ఉంది. వందరూపాయి నోట్లు చూసినప్పుడల్లా నువ్వే గుర్తుకు వస్తావు. నువ్వెప్పుడు సంతకం చేస్తావు వాటి మీద?" అని అడిగింది అత్తయ్య.

"నేనా? నాకెప్పటికీ ఆ అవకాశం రాదు" అన్నాను నేను.

"నీకు ఆ అవకాశం తప్పకుండా రావాలని కోరుకుంటున్నాను నేను. ఇంతకీ రిజర్వ్‌బ్యాంకేగా బేంకులన్నీ వడ్డీలు ఎంత ఇవ్వాలో నిర్ణయించేది?" అని అడిగింది అత్తయ్య.



E:\Seelamma\
Seelama1
28

అత్తయ్య నాకు తెలిసి ఇంతే. తెలియని విషయాలు అడిగి తెలుసుకుంటూ ఉంటుంది.

"అంతకు ముందు అలా ఉండేది. ఇప్పుడు అలా కాదు. డిపాజిట్ల మీద ఎంత వడ్డీ ఇవ్వాలో రిజర్వ్‌బ్యాంక్ చెప్పదు. అలానే బ్యాంకులు ఇచ్చే అప్పుల మీద ఎంత వడ్డీ తీసుకోవాలో కూడా చెప్పదు. అంతా బ్యాంకుల ఇష్టం. ఐతే బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ దగ్గర అప్పు తీసుకోవాలంటే ఎంత వడ్డీ ఇవ్వాలో అది మాత్రం రిజర్వ్‌బ్యాంక్ నిర్ణయిస్తుంది. దాన్ని బట్టి బ్యాంకులు వాళ్ళు ఇవ్వాల్సిన, తీసుకోవాల్సిన వడ్డీలు నిర్ణయించుకుంటాయి."

"అంటే రిజర్వ్‌బ్యాంకే కదా ఎంత వడ్డీ ఉండాలో నిర్ణయించేది?" అంది అత్తయ్య మళ్ళీ.

"ఒక విధంగా అంతే. ఐతే అందులో ప్రభుత్వం ప్రమేయం కూడా కొంత ఉంటుంది" అన్నాను నేను.

"మరి ఇప్పుడు వడ్డీ రేట్లెందుకు తగ్గించేస్తున్నారు? అని అడిగింది.

"దానికి చాలా కారణాలున్నాయి. బ్యాంకుల దగ్గర అప్పులు చేసి కదా వ్యవసాయదారులూ, వ్యాపారులూ తమ తమ పనులు చేసుకుంటున్నది. వాళ్ళు ఎక్కువ వడ్డీ కట్టాల్సి వస్తే ఏం చేస్తారు? దాన్ని వాళ్ళు అమ్మే వస్తువు ధరల్లో కలుపుకుంటారు. దాంతో ధరలు పెరుగుతాయి. ఒకవేళ అలా ధర పెంచలేకపోతే ఏం చేస్తారు? నష్టానికి తయారు చెయ్యరు కదా! దాంతో తయారీ తగ్గిపోతుంది. తయారీ తగ్గితే కూడా ధరలు పెరుగుతాయి. అది ప్రజలకీ, దేశానికీ మంచిది కాదు" అన్నాను నేను.

నేను చెప్పినదంతా వింది అత్తయ్య. విని – "వడ్డీలు తగ్గినా ధరలు తగ్గడం లేదు కదా" అని అంది.

"ధరలు తగ్గడం లేదు కానీ ఎక్కువ పెరగడం లేదుగా. ధరలు పెరగని కాలంలో వడ్డీలు పెంచక్కరలేదు. వడ్డీలు పెరక్కపోతే ధరలూ తగ్గుతాయి. ఒకదానితో ఒకటి తగ్గితేనే కదా దేశానికి మందిది" అన్నాను నేను.

"బ్యాంకులు ఇచ్చే అప్పులు మీద వడ్డీ తగ్గించడం సంగతి సరే. అందువల్ల ధరలు తగ్గుతాయంటున్నావు కాబట్టి ఫరవాలేదు. ప్రజలు పెట్టుకునే డిపాజిట్ల మీద వడ్డీ అలానే ఉంచెయ్యచ్చు కదా?" అని అడిగింది.

"డిపాజిట్ల మీద వడ్డీ ఎక్కువ ఇచ్చి అప్పు మీద వడ్డీ తక్కువ తీసుకుంటే బ్యాంకులు ఏం పని చేస్తాయి?" అని అడిగాను నేను, అత్తయ్య ప్రశ్నకి సమాధానంగా.

"ఐతే వడ్డీలు తగ్గడం సమంజసమే అంటావ్" అంది అత్తయ్య.

"తగ్గాలి, ఇంకా తగ్గాలి. అప్పుడే మన అందరికీ, మన దేశానికీ మంచిది. ఇప్పటికీ మన దేశం వడ్డీ రేట్లు అమెరికాలాంటి దేశాలతో పోలిస్తే ఎక్కువే. అక్కడా ఇక్కడా వేరే రేట్లు ఉండడం మనకి మంచిది కాదు" అని చెప్పాను.

అత్తయ్యకి ఏ విషయం గురించైనా అడిగి తెలుసుకోవడంలో ఆసక్తి. నాకు ఈ విషయం గురించి మాట్లాడాలంటే ఇష్టం. మా ఇద్దరి సంభాషణకి మావయ్యే అడ్డు చెప్పాడు.

"నీ సందేహాలన్నీ తరువాత అడుగుదువుగాని కానీ – ముందు వాడికి వంట చేసి పెట్టు. పొద్దున్న ఎప్పుడు తిన్నాడో ఏమో" అని అత్తయ్యతో అని. "నాలుగు రోజులుంటావు కదా మీ అత్తయ్య సందేహాలన్నీ తీర్చడానికి? అని నన్ను అడిగాడు.

"ఓ వారం ఉందామనుకుంటున్నాను – అత్తయ్య సందేహాలు తీర్చేందుకు కాదు కానీ, అత్తయ్య చేతి వంట తినడం కోసం" అన్నాను నేను.

నేను వారం రోజులు ఉంటాననగానే మావయ్య మొహంలో రంగులు మారినట్లనిపించింది నాకు. నేనకక్కడ వారం రోజులు ఉండడంతో వాళ్ళకి ఏదన్నా ఇబ్బంది ఉందేమో నాకు తెలియలేదు. ఐతే అత్తయ్య మాత్రం –

"రాక రాక వచ్చావు. వారం రోజులు ఉంటానంటున్నావు. ఎంతో సంతోషంగా ఉంది. వెళ్ళి స్నానం చేసి రా. వంట వండేస్తాను. ఈ పూటకి ఏం ఉంటే అదే వండేస్తాను. రేపట్నుండి నీకు నచ్చేవి చేసి పెడతాలే" అంది అత్తయ్య.

"నీ చేతి బొబ్బట్లూ, బూర్లూ తినాలని ఉంది" అంటూ స్నానానికి వెళ్ళాను నేను.

భోం చేస్తున్నంత సేపూ అత్తయ్య నా చేత నా ఉద్యోగం గురించీ, నా విదేశీ ప్రయాణాల గురించీ, రిజర్వ్‌బ్యాంక్ గురించీ, వడ్డీ రేట్ల గురించీ అడిగి చెప్పించుకుంటూనే ఉంది.

భోజనం అవగానే మావయ్య తనకి పని ఉందని బయటికి వెళ్ళిపోయాడు. అత్తయ్య నన్ను ఓ గదిలో పడుక్కోమని తను పక్క గదిలోకి వెళ్ళిపోయింది.

అంత తొందరగా నిద్రపోవడం అలవాటు లేదు నాకు. నేను వారం రోజులు ఉంటానన్నప్పుడు మావయ్య మొహంలో రంగులు మారాయనిపించడం నా భ్రమా, నిజమా అని ఆలోచిస్తూ పడుక్కుని ఉండగానే మావయ్య వచ్చిన అలికిడి వినిపించింది. పక్కగదిలో వాళ్ళిద్దరి మాటలూ వినిపించసాగాయి.

"వెళ్ళిన పని ఏమయింది?" అని అడిగింది అత్తయ్య.

"నెమ్మదిగా మాట్లాడు – వాడికి వినిపిస్తుంది" అన్నాడు మావయ్య.



E:\Seelamma\
Seelama1
29

"వాడు పడుకున్నాడులెండి. మీరు చెప్పండి. లక్ష్మీపతిగారు డబ్బు ఇచ్చారా? అని అడిగింది.

"లేదు" అన్నాడు. మావయ్య నిట్టూరుస్తున్నట్లుగా.

"ఏం – లేదన్నారా? ఎప్పుడూ అడగని మీరు అడిగినా ఇవ్వనన్నారా? ఆ మాత్రం ఓ వెయ్యి రూపాయలు సర్దడానికి స్తోమత లేని మనిషేం కాదు ఆయన. ఇవ్వడం ఇష్టం ఉండి ఉండదు" అంది అత్తయ్య.

మావయ్యకి వెయ్యి రూపాయలు అవసరం అయి ఎవరి దగ్గరికో అడగడానికి వెళ్ళాడని వింటోంటే ఏదోగా అనిపించింది నాకు.

"ఆయన ఇవ్వననడం కాదు – నేనే అడగలేదు. ఇంతవరకూ ఎప్పుడూ ఇలా అడగాల్సిన అవసరం రాలేదు. అందుకే అడుగుదామని వెళ్ళినా అడగలేకపోయాను." అలా అంటున్న మావయ్య గొంతులో తన చేతకానితనాన్ని క్షమించమని అడుగుతున్న అభ్యర్థన వినిపించింది నాకు.

అత్తయ్య ఏమీ మాట్లాడలేదు. ఏమీ మాట్లాడకపోయినా తన చూపులతోనే మావయ్యని బాధ పడవద్దని ఊరడించి ఉంటుంది. నేను చూడకపోయినా వాళ్ళిద్దరి కళ్ళల్లోనూ తడి కనిపించింది నాకు.

వాళ్ళిద్దరి మధ్యా ఆవరించిన నిశ్శబ్దం నన్ను బాధించింది. అసలు వాళ్ళకి డబ్బు ఎందుకు అవసరం అయిందో, ఎందుకు వాళ్ళ దగ్గర డబ్బు లేదో నాకు అర్థం కాలేదు. నా మొదటి సందేహానికి సమాధానం అన్నట్లుగా అత్తయ్య –

"పాపం వాడికేం తెలుసు. ఈ నెలాఖరు కష్టాలు. ఇంకో వారం రోజులు పోయాక వచ్చి ఉంటే మనకి పెన్షనూ వచ్చి ఉండేది. ఈ నెల వడ్డీ జమ అయి ఉండేది" అని అంది.

"నువ్వు చెప్పేది బావుంది. వాడికి మనల్ని చూడాలని అనిపించి వచ్చాడు. అసలు ఈ రోజుల్లో స్వంత అమ్మా, నాన్నల్ని చూడ్డానికే పిల్లలకి తీరిక ఉండడం లేదు. అలాంటిది మనల్ని గుర్తు పెట్టుకుని వచ్చినందుకు సంతోషించాలి. మనతో వారం రోజులు ఉంటానని అన్నాడు. అదే ఆనందం. మన పిల్లలు కూడా అన్ని రోజులు ఉండలేకపోతున్నారు మనతో" అన్నాడు మావయ్య.

"నేను వాడినేం అనడం లేదు. వెర్రి నాగన్న. ఇంత మంచి ఉద్యోగం, పేరూ, సంపాదనా అన్నీ మీరు వాణ్ణి ఆర్థికశాస్త్రం చదవమనడం వల్లే వచ్చాయనుకుంటున్నాడు. నేననేది మన పరిస్థితి గురించి. ఇప్పుడే ఇలా ఉంటే ఇంకా ముందు ముందు ఎలా ఉంటుందా అని."

"ఎప్పుడు ఎలా ఉంటుందో ముందే ఏం తెలుస్తుంది? ఆరేళ్ళ క్రితం రిటైరైన రోజున మన పరిస్థితి ఇలా అవుతుందని ఊహించామా? పెన్షన్ వస్తుందీ – రిటైరయినప్పుడు వచ్చిన బెనిఫిట్స్‌నీ బ్యాంకుల్లో వేసుకుంటే వచ్చే వడ్డీతో హాయిగా గడిపెయ్యచ్చనుకున్నాం. అప్పుడు నిజంగానే వడ్డీ బానే వచ్చేది. మూడేళ్ళగానే కదా వడ్డీ తగ్గిపోతుంది. దాంతో నెల గడవడమే కష్టమయిపోతోంది. వడ్డీలు ఎప్పుడు పెరుగుతాయో. మన పరిస్థితి ఎప్పుడు బాగుపడుతుందో."

మావయ్య మాటలు వింటోంటే – అత్తయ్య వడ్డీగురించి ఇందాక నాతోమాట్లాడం విషయం తెలుసుకోవడం కోసం కాదేమో అని అనిపించింది.

వడ్డీరేట్లు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. ఇంకా కాస్త తగ్గాలి అని నేను వాళ్ళతో అన్న మాటలు నాకు గుర్తు వచ్చాయి. నేను కాదు నాతో పాటు ఇంకా చాలా మంది ఇదే మాట అంటున్నారు. మన వడ్డీరేట్లు అన్ని దేశాల వడ్డీ రేట్లతో సమంగాఅవాల్సిన అవసరం ఉంది. అప్పుడు కానీ మనదేశం తక్కిన దేశాలతో పోటీ పడలేదు. గ్లోబలీకరణ తర్వాత ఏ దేశమూ దాని ఆర్థిక విధానాలని విడిగా చేసుకోలేదు. మన దేశమూ అంతే.

ఐతే అత్తయ్యా మావయ్యల పరిస్థితి ఏమిటి? ఆ విషయాన్నే ప్రస్తావిస్తున్నట్లుగా అత్తయ్య –

"మనం మన పిల్లల దగ్గర సాధ్యమైనంత వరకు ఏమీ తీసుకోకూడదని అనుకున్నాం. అసలు వాళ్ళదీ ఇచ్చే పరిస్థితి ఏమీ కాదు. రిటైర్మెంట్ సమయంలో వచ్చిన డబ్బు పెట్టి మన ఊళ్ళోనే మనకి ఉన్న కాస్త పొలం పక్కన ఇంకొంత కొనుక్కుని ఉంటే బావుండేదేమో. కొనడానికి బదులు ఉన్న ఆ పొలం కూడా అమ్మేసి మొత్తం అంతా బ్యాంక్‌లో వేసుకున్నాం" అని అంది.

"అప్పటి పరిస్థితుల్లో అది మంచి పనే. పొలాలు కొనుక్కున్నా, మనం ఏమీ వాటిని చూసుకోలేం. ఎవరికన్నా కౌలుకిఇవ్వాలి. వాళ్ళు మనకి ఎంత శిస్తు ఇస్తే అంతే. అయినా అప్పుడు బ్యాంక్‌లో వడ్డీ బాగా వచ్చేది. ఆ పరిస్థితుల్లో మనం చేసిందేమీ తప్పు కాదు. అదీ మనం స్వంతంగా ఆ పని చేసెయ్యలేదు. నలుగురినీ సంప్రదించే చేసాం" అని అన్నారు.

నాకు బాగా గుర్తుంది. మావయ్య రిటైరవడానికి ముందు నేను ఇక్కడికి వచ్చాను. తనకి వచ్చే డబ్బుని ఏం చెయ్యాలని నన్ను సలహా అడిగారు. అప్పుడు నేనే బ్యాంకుల్లో పెట్టుకోమని సలహా ఇచ్చాను. అత్తయ్య పొలం కొనుక్కుంటే మంచిది కాదా అని అడిగితే – కొనడం గురించి ఆలోచించద్దు, ఉన్నది కూడా అమ్మేయ్యమని సలహా





ఇచ్చింది నేనే. అది వాళ్ళకి గుర్తుండే ఉంటుంది. నేనలా సలహా ఇవ్వడం వల్లనే వీళ్ళ ఈ పరిస్థితి ఇలా ఉందా? పొలం మీద ఆదాయం అయితే పెరుగుతూ ఉండేదేమో.

"నేను మిమ్మల్ని ఆ పని ఎందుకు చేసారని అనడం లేదు. అయినా ఇన్నాళ్ళు మనకి ఎంత వస్తే అంతలోనే గడిపేసుకోలేదూ? ఈ రోజు ఎందుకో ఇలాంటి అవసరం వచ్చింది. దాని సంగతి చూడాలి మనం" అంది అత్తయ్య.

"మనం ఏదో కాస్త పచ్చడీ, కాస్త చారూ, కాస్త మజ్జిగతో కాలక్షేపం చేసేస్తున్నాం. వాడికి నాలుగు రకాల పదార్థాలు చేసి పెట్టాలి కదా! వాడున్న వారం రోజుల్లో మనం బానే ఉన్నాం అని వాడికి అనిపించాలి కాని కష్టపడుతున్నాం అని అనిపించకూడదు. బాధపడతాడు."

"ఈ పాడు పడిన కొంప చూస్తే వాడికి కొంత అర్థం అయ్యే ఉంటుంది. తిండికీ, గుడ్డకీ కూడా కష్టం అవుతోందని అనుకుని ఉండడు. ఇంతకీ ఇప్పుడేం చేద్దామో చెప్పండి."

"వాళ్ళనీ వీళ్ళనీ అడగడం ఎందుకు? రేపు బ్యాంక్‌కి వెళ్ళి ఓ పదివేల రూపాయల ఫిక్సెడ్ డిపాజిట్‌ని తీసేసి డబ్బు తీసుకువస్తాను."

"వడ్డీయే తప్ప అసలు తియ్యకూడదనుకున్నాం కదా?" అని అడిగింది అత్తయ్య.

"అంతా తియ్యను. ఓ వెయ్యి తీస్తాను. మిగతా తొమ్మిదివేలు మళ్ళీ డిపాజిట్‌గా ఉంచేస్తాను. ఏ నెల ఖర్చుల్లోనైనా ఒక వెయ్యి మిగిలితే అప్పుడు మళ్ళీ వేసెయ్యచ్చు."

"ఏ నెలకు వచ్చిన పెన్షనూ, వడ్డీ ఆ నెలకు సరిపోవడమే కష్టమైపోతుంటే మీరింకా మిగలడం గురించి చెప్తున్నారు" అంది అత్తయ్య.

"ఆ సంగతి ఇప్పుడే కాదుగా – ఈ లోపుగా ఎన్ని మార్పులు వస్తాయో, ఇంక డబ్బు గురించి ఆలోచించకుండా పడుక్కో" అన్నాడు మావయ్య.

వాళ్ళిద్దరూ పడుక్కోగలిరేమో తెలియదు కానీ నాకు మాత్రం నిద్రపట్టలేదు. ఎంత సమాధానపరుచుకుందామనుకున్నా నా మనస్సు అత్తయ్యా మావయ్యల పరిస్థితికి రాజీ పడలేకపోతోంది.

నా చిన్నప్పుడు నేను వీళ్ళ ఇంటికి వస్తున్నప్పుడు ఎప్పుడూ ఇంట్లో ఏ లోటూ ఉన్నట్లు నాకు కనిపించేది కాదు. పోనీ చిన్నతనంలో నాకు తెలియలేదేమో అనుకున్నా ఆరేళ్ళ క్రితం వచ్చినప్పుడు కూడా వాళ్ళు బావున్నట్లే కనిపించారు. అప్పటినుంచి ఇప్పటికి వడ్డీ రేట్లు సగానికి సగం పడిపోయి ఉంటాయి. పెన్షన్ పెద్దగా పెరిగి ఉండదు. అంటే వాళ్ళ నెలసరి ఆదాయం సగానికి పైగా తగ్గిపోయి ఉంటుంది. ధరల పెరుగుదల తగ్గి ఉండవచ్చు కానీ ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

వాషింగ్టన్‌లోనో, లండన్‌లోనో జరిగే చర్చల్లో పుట్టి – న్యూఢిల్లీలోనో, ముంబయిలోనో రూపు దిద్దుకుంటున్న ఆర్థిక విధానాలు దేశంలో ఎక్కడో ఓ మూలన ఒక చిన్న పట్టణంలో ఉన్న ఒక మామూలు కుటుంబం మీద చూపించే ప్రభావం ప్రత్యక్షంగా చూస్తున్నాను నేను.

వడ్డీలు తగ్గితే అప్పులు తీసుకుని వస్తువులని ఉత్పత్తి చేసే వాళ్ళు ధరలు తగ్గిస్తారు. ధరలు తగ్గితే ఆదాయం కాస్త తగ్గినా ఫరవాలేదు. అందుకని వడ్డీరేట్లు తగ్గించడం మంచిదే.

ఐతే ఈలోగా అత్తయ్యా మావయ్యా లాంటి వాళ్ళ పరిస్థితి ఏంటన్న ప్రశ్న మాకూ ఉంది. అందుకు కొన్నాళ్ళు కష్టపడవలసి రావచ్చునని మేము సమాధానం చెప్పుకుంటూనే ఉన్నాం. వీళ్ళ కష్టాలకి మేమే కారణమా అన్న ఆలోచన పీడించసాగింది నన్ను.

వాళ్ళు ఎంతో అభిమానవంతులు. ఎవరినీ ఏమీ అడగరు. ఇప్పుడు కూడా వాళ్ళ పరిస్థితి నాకు తెలియకూడదనే వాళ్ళు అనుకుంటున్నారు. తెలిస్తే నేను బాధ పడతానని వాళ్ళు బాధపడుతున్నారు. అలాంటి వాళ్ళ మీదా మా ప్రణాళికల ప్రభావం పడేది?

మావయ్య రేపు బ్యాంక్‌కి వెళ్ళి తన ఫిక్సడ్ డిపాజిట్‌లోంచి కొంచెం డబ్బు తీసేస్తాడన్న ఊహే భరించలేకపోయాను. డబ్బు తియ్యకుండా ఉండాలంటే రెండే మార్గాలు కనిపించాయి నాకు. ఒకటి, నేను వారం రోజులు ఉండకుండా అర్జంట్ పని వచ్చిందని చెప్పి వెళ్ళిపోవడం. అది వాళ్ళని బాధ పెడుతుంది. నాకూ ఇష్టం లేదు. రెండు, వాళ్ళకి కొంత డబ్బు నేనే ఇయ్యడం. బట్టలు కొని తీసుకువద్దామనుకున్నాను, కుదరలేదు, డబ్బు ఇస్తున్నాను తీసుకోండని చేతిలో పెట్టాలి.

నేను డబ్బు ఇస్తే వాళ్ళు తీసుకుంటారో లేదో అన్న అనుమానం ఉన్నా డబ్బు ఇద్దామని నిర్ణయించుకున్నాక, నెమ్మదిగా నిద్రపట్టింది నాకు.

ఉదయం నేను లేచి స్నానం చేసి వచ్చేసరికి అత్తయ్య దొడ్లో పువ్వులు కోసుకు వచ్చి దేవుడి దగ్గర పెట్టి నన్ను పూజకి పిలిచింది.

అది నా చిన్నప్పటి అలవాటు. ఇక్కడికి వచ్చినప్పుడల్లా అత్తయ్య నా చేత పూజ చేయించి హారతి ఇప్పించేది. హారతి అయ్యాక, అమ్మ నా చేత అత్తయ్య కాళ్ళకి దండం పెట్టించేది.

చాలా ఏళ్ళ తర్వాత అత్తయ్య పక్కన కూచుని పూజ చేస్తోంటే ఎంతో హాయిగా అనిపించింది. కోరుకున్నా, కోరుకోకపోయినా దేవుడు తనకి కావల్సింది తను మనకి ఇస్తాడని తెలిసి కూడా అత్తయ్యా మావయ్యల జీవితాలు హాయిగా గడిచేటట్లు



E:\Seelamma\
Seelama1
31

చెయ్యమని దేవుడిని కోరుకున్నాను.

హారతిని మావయ్య దగ్గరికి తీసుకెళ్ళాను. కళ్ళకద్దుకున్నాడు మావయ్య. హారతి పళ్ళెం పక్కన పెట్టి అత్తయ్య కాళ్ళకి దండం పెట్టాను.

"పెద్దవాడికి అయ్యావు. చిన్నప్పుడు ఇలా దండం పెడితే ఓ పావలా చేతిలో పెట్టేదాన్ని" అంటూ నన్ను లేవదీసింది అత్తయ్య.

నేను జేబులోంచి అయిదువేలు తీసి అత్తయ్య గుప్పిట్లో పెట్టాను. పెట్టి "మా ఆవిడ మీకిద్దరికీ బట్టలు కొని తీసికెళ్ళమంది. అక్కడ కొనడం కుదరలేదు. అందుకని ఈ డబ్బు పెట్టి మీరు" అంతకన్న చెప్పడం నాకు చేత కాలేదు. అసలు వాళ్ళ దగ్గర తీసుకోవడమే కానీ ఇంతవరకూ వాళ్ళకి నేనెప్పుడూ డబ్బు ఇవ్వలేదు. ఇప్పుడు ఇవ్వడం ఎంతో కష్టమయింది నాకు. అత్తయ్య గుప్పిట తెరిచి మావయ్యకి చేతిలో ఉన్న డబ్బు చూపించింది. డబ్బు చూడగానే మావయ్య –

"పిల్లలు పెద్దవాళ్ళకి డబ్బులు ఇవ్వడం ఇద్దరికీ శ్రేయస్కరం కాదు. తెలియక వాడు ఇస్తే తెలిసిన నువ్వు ఎలా తీసుకుంటున్నావు? వాడు మనింటికి వచ్చినప్పుడు మనం వాడికి బట్టలు పెట్టి పంపించాలి. మనం వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు వాడు మనకి పెట్టి పంపిస్తాడు. మనం ఎప్పుడో వెళ్తాం కదా. అప్పుడు చూద్దాం. అయినా అయిదువేలు పెట్టి బట్టలు కొనుక్కొనే వయస్సులో ఉన్నామా మనం? ఆ డబ్బు వాడికి తిరిగి ఇచ్చేయ్" అని అత్తయ్యతో అన్నాడు.

"మావయ్య పెద్దాయన. ఆయన చెప్పింది మనం ఇద్దరమూ వినాలి. తీసేసుకో. నీ పిల్లల పెళ్ళిళ్ళు చేస్తావుగా. అప్పుడు పెద్ద ముత్తయిదువుగా వచ్చి నీ దగ్గర పట్టుచీర తీసుకుంటానులే" అని అంటూ ఆ డబ్బుని నా జేబులో పెట్టేసింది అత్తయ్య.

"నువ్వు తీసుకుందువు గానీలే పట్టు చీర, నాకు మామూలు పంచె చాలు" అని అత్తయ్యతో అని నాతో "రాత్రి బాగా ఆలస్యంగా పడుకున్నట్లున్నావు కాస్సేపు విశ్రాంతి తీసుకో, మనస్సు ప్రశాంతంగా ఉంటుంది" అని వెళ్ళిపోయాడు మావయ్య.

ఆ మాటలు నాకు ఆశనిపాతంలా తగిలాయి. అంతకన్న నా రెండు చెంపలూ వాయించేసి ఉంటే బావుండేది అని అనిపించింది నాకు.

# ఓ అజ్ఞానంలోంచి....

E:\Seelamma\
Seelama1
32

కృష్ణపక్షంలో – ఓ అమృతం కురిసిన రాత్రి – వెన్నెల్లో ఆడపిల్లతో – మహాప్రస్థాన మార్గాన – చివరికి మిగిలేది ఏమిటని తర్కించుకుంటూ –

రాత్రుళ్ళకీ, పగళ్ళకీ తేడా తెలియకుండా – గంటలూ, రోజులూ, నెలలూ –

కథల్లో, నవలల్లో, కవితల్లో, మునిగిపోయి – జీవితమంతా ఇలానే ఉండిపోవాలని ఆశపడుతూ –

పత్రికల్లో ఉద్యోగమే నా ఈ ఆకలినీ, దాహాన్నీ తీరుస్తుందనీ – నా ప్రవృత్తికి అది సరిపోయే వృత్తి అనీ అనుకుని –

పాత్రికేయుడిగా ఉద్యోగంలో చేరిన రోజున –

ఇలాంటి పనులు చెయ్యాల్సి వస్తుందనీ, ఇలాంటి రాతలు రాయాల్సి వస్తుందనీ అనుకోలేదు నేను.

ఆ మనిషెవరో ఇరవై ఏళ్ళుగా ఒకే గదిలో ఉంటున్నాడనీ – నెలకొక్కసారే బయటికి వస్తాడనీ – ఇన్నేళ్ళుగానూ రోజూ ఉదయం, సాయంత్రం ఒకేలాంటి భోజనం తింటున్నాడనీ –

ఆ మనిషి జీవితం గురించి – అబద్ధాలు లేకుండా అందంగా – అందరినీ ఆకట్టుకునేలా రాయమని ఉత్తర్వు.

అందరి జీవితాలూ సుమారుగా అంతేగా – ఓ రోజులానే ఇంకో రోజు – దానిలానే మరో రోజు – మధ్య మధ్యలో పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ, చావులూ, పండుగలూ, అనారోగ్యాలూ లాంటివేవో వచ్చి కాస్త మార్పు తేకపోతే అన్ని రోజులూ ఒకటే.

ఆ పెద్ద మనిషెవరో – అతనికెవరూ ఉన్నట్లు లేరు – అందుకే అలా స్వేచ్ఛగా – ఆ గదిలో అలా ఉండిపోగలుగుతున్నాడు.

అలాంటి మనిషి గురించి రాస్తేనే పత్రికకి రీడర్‌షిప్ పెరుగుతుందట. ఎవరు చదువుతారో అని అనుకుందుకు లేదు.

శ్రియ భోజనంలో ఆఖరుగా ఏం తింటుందో – త్రిష పడుకునేముందు ఏం చేస్తుందో – ఆర్తికి దేశంలో ఎక్కడ షాపింగ్ చెయ్యడం ఇష్టమో – లాంటి విషయాలని ఎంతో ఆసక్తితో చదివే జనం.

పత్రికలు వార్తలు వేస్తాయి. అంతకన్న ముఖ్యం – పత్రికలు వార్తల్ని తయారు చేస్తాయి – ఆ వార్తతో పాటే వ్యక్తుల్ని – ప్రముఖ వ్యక్తుల్ని – తయారు చేస్తాయి.

ఎవరో ఒకరి గురించి రాసి పత్రిక అమ్మకాన్ని పెంచడమే కాదు – ఆ మనిషిని పెద్ద మనిషిని చేస్తున్నారు పత్రికల జనం.

ఆ రోజు – ఇరవై ఏళ్ళుగా ఓ గదిలోనే ఉంటున్న ఆ వ్యక్తిని వార్తల్లో వ్యక్తిగా చెయ్యడం – ఒక్క పెరుగూ అన్నం, అరటి పండూ తప్ప ఇన్నేళ్ళగాను ఇంకేమీ తినని వ్యక్తిని ప్రముఖ వ్యక్తిగా చెయ్యడం నా పని.

నా వంతు కర్తవ్యం చెయ్యడానికి ఆ గదికి వెళ్తోంటే – కృష్ణశాస్త్రీ, తిలకూ, యండమూరీ, శ్రీశ్రీ, బుచ్చిబాబూ – నవ్వుతూ – జాలిగా చూస్తున్నట్లే అనిపించి ఈ జీవితం ఎక్కడనుండి ఎక్కడికి వచ్చిందా అని బాధేసింది.

గది దాకా వెళ్ళాక కూడా ఈ పనికిమాలిన పని చెయ్యడం ఎందుకు – మానేద్దాం అని అనిపించగానే – పెళ్ళాం పిల్లలూ, వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ గుర్తుకొచ్చి – గది తలుపు చప్పుడు చేసాను. తలుపు తెరుచుకుంది.

లోపల డెభై ఏళ్ళ ముసలాయన విచారంగా కనిపిస్తాడనుకుంటే – ముప్పై ఏళ్ళ స్త్రీ నవ్వుతూ కనిపించింది.

ఆ మనిషి గురించి నే విన్న సమాచారం తప్పో – తట్టిన గది తలుపు తప్పో – అని అనుకునేలోగా– “రాండి” అంటూ లోపలికి దారి తీసింది ఆ స్త్రీ.

లోపలికి వెళ్ళాలా వద్దా అన్న సందేహాన్ని తీరుస్తున్నట్లు – “మీరొస్తారని చెప్పిండు సారు” అంది. అంటూ నవ్వింది. ఎందుకు నవ్విందో అర్థం కాలేదు.

ఆ పెద్ద మనిషి ఒక్కడూ ఉండడం లేదులా ఉంది – ఓ తోడు కూడా ఉంది – ఎలాంటి తోడో తెలియదు – డబ్బున్నదో లేనిదో తెలియడం లేదు కానీ చూడ్డానికి మాత్రం బావుంది మనిషి.

“సారు తానం చేస్తున్నడు. ఓ పదినిమిషాల్లో వచ్చేస్తడు. కూసోండి” అంటూ గట్టిగా నవ్వుతూ కుర్చీ చూపించింది. ఆ మనిషి ఏం మాట్లాడుతున్నా నవ్వుతుంది లాగుంది. అదీ గట్టిగా.

గది చిన్నదే. గది మధ్యగా మంచం. మంచం మీద చిందరవందరగా పడిఉన్న పక్క బట్టలూ, లుంగీ, బనియనూ – మంచం కింద మూతలు పెట్టకుండా రెండు సూట్కేసులూ – మంచం పక్కనే ఉన్న అలమారలో అడ్డదిడ్డంగా పుస్తకాలూ, పాత హిందూ పేపర్లూ – మంచానికి కాస్త పక్కగా పాత ఇనుప కుర్చీలు రెండు – అందులో

ఒకదాంట్లో నేను, మరో దాని పక్కన తలుపు తీసిన ముప్పై ఏళ్ళ స్త్రీ.

"సారు గది సర్దనియ్యడు – నే సర్దితే తర్వాత తనకేం కంపియ్యవంటడు". ఆ గది అలా ఉండడానికి తన తప్పు లేదన్నట్లు చెప్పింది. గట్టిగా నవ్వుతూనే.

"నువ్వూ....."

"సారుకి మొదట్నుంచీ నేనే పనిచేస్తున్న – ఇరవై ఏళ్ళ పై మాటే". ఫలానా ప్రాంతానిది అని చెప్పడానికి వీల్లేకుండా అన్ని ప్రాంతాల మాటలూ, యాసా కలిసిపోయాయి. ఆ నవ్వు మాత్రం ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టుగా ఉంది.

"ఇక్కడే ఉంటావా?" గదిని మరోమారు పరికించి చూస్తే ఓ మూల స్టవ్వూ, చాలా కొంచెం వంట సామానూ కనిపించాయి. ఓ మగాడే తప్ప ఆడవాళ్ళు ఉంటున్న జాడే లేదు గదిలో.

"పక్కనే ఉంటాం మేం. సారు ఈ ఊరొచ్చిన కొత్తలో ఈ ఇంటి యజమాని మా అయ్యని. పిలిచి సారుకి కావల్సిన పనులు చెయ్యమని చెప్పిండు. ఆయన వెంబడే నేనూవచ్చేటిదాన్ని. అయ్య పెద్దోడయిపోయినాక నేనే పనులన్నీ చేస్తున్న. పైసలు మస్తుగ ఇస్తడు సారు."

"నెలకు ఎంత ఇస్తాడు" విని విని నేనూ ఏకవచన ప్రయోగంలోకి వెళ్ళిపోయాను.

"సారుకి నెలకు నాలుగువేలు పెంషను వస్తది. వెయ్యి ఉంచుకుని మిగిలిన మూడువేలు నాకే ఇచ్చేస్తడు. సారుకి కావల్సింది పొద్దునే కాఫీ, మద్దెనేలా, రాత్రీ పెరుగన్నం, అర్టిపండూ ..... అంతే.... ఇంకేమీ తినడు సారు."

"ఈ మాత్రం అన్నం తనే చేసుకోవచ్చు – అంత మాత్రానికి నువ్వెందుకు.... మూడువేలు జీతమెందుకు."

"సారు పని ఏమీ చెయ్యడు. పేపరు చదువుతడు. అదిగో అందులో ఉన్నయే – ఆ పుస్తకాలే మళ్ళీ మళ్ళీ చదువుతడు. ఇక్కడ కొచ్చినప్పుడు తెచ్చిండు ఆ పుస్తకాలు – అవ్వే చదువుతడు. వంట పనీ, ఉతుకుడు పనీ – అన్నీ నేనే."

అన్నీఅని అంటున్నప్పుడు ఆ గొంతులో కాని, కళ్ళల్లో కానీ ప్రత్యేకంగా ఏవీ కనిపించలేదు కానీ – చక్కని చీరకట్టూ బొట్టూతో – మనిషి మాత్రం ప్రత్యేకంగా అందంగా కనిపిస్తోంది. ముప్పై ఏళ్ళకి పైన ఉండవు. పదిహేనేళ్ళకి పైనుండే ఇక్కడ పనిచేస్తోందంటే – ముసలాడి దగ్గర నుండి నెలకు మూడువేలు తీసుకుంటోందంటే – ఏమేం పనులు చేస్తుందో.

మగాడి మనసు మగాడి మనసులానే పని చేస్తుంది. ముసలాడు మగాడు. నోటికి కావల్సిన తిండి – పెరుగూ అన్నం, అరటి పండుతో సరిపెట్టుకున్నా తక్కిన తిండి





దగ్గర మాత్రం కక్కూర్తి పడకుండా ఉండి ఉండడు.

ముసలాడి మనస్సు ఎలా పనిచేస్తోందో కానీ నా మనస్సు మాత్రం మామూలు మగాడి మనస్సులానే పనిచేస్తోంది. ఓ ఆడది అదీ అంతగా డబ్బు లేని ఆడది పనిమనిషిగా కనిపించగానే మగాడి దగ్గర డబ్బులు తీసుకుని ఏం కావాల్సినా చేస్తుందని ఎంత తొందరగా ఆలోచించేస్తున్నాను. అలా ఆలోచిస్తున్నందుకు నాలో నేనే సిగ్గుపడుతూ –

"నీ పేరు...." అని అడిగాను.

"లచ్చిమి."

"సార్ పేరు?"

"సారు పేరు సారే. నాకు తెల్వదు. సారు చెప్పడు."

"ఇక్కడికి ఎవ్వరూ రారా?"

"ఎప్పుడన్న ఎవరన్న ఒకరు వస్తరు. ఏవో మాట్లాడతరు. సారు ఎక్కువ ముచ్చట్లు చెప్పడు. ఒక్కటో రెండో మాటలు – అంతే. వాళ్ళు చెప్పేది వింటడు. నవ్వుతడు. అంతే."

"ఎవరెవరు వస్తారు?"

"వాళ్ళ పేర్లు నాకు ఎరుకలే. ఓ పది పన్నెండుమంది ఉంటరు. వాళ్ళే మళ్ళ మళ్ళ వస్తరు."

"భార్యా పిల్లలు లేరా?"

"భార్య సంగతి తెల్వదు. ఒక్క ఆడపిల్ల ఉన్నది. మొదట్లో సంవత్సరానికి ఒక్క తూరో రెండు తూర్లో వచ్చి పదిరోజులు ఉండి వెళ్లేది. నా కన్న కొంచెం పెద్దది. పదేళ్ళకి ముందు పెళ్ళి చేసుకున్నది. అమెరికా వెళ్ళిపోయింది. మూడేళ్ళకి ముందు ఒక్క తూరి వచ్చింది. మళ్ళా రాలే. సారు నెలకొక్కతూరి ఫోన్ చేసి మాట్లాడతడు. అంతే."

"నెలకోసారా? అంతేనా?"

"సారు నెలకొక్కసారే ఈ గది దాటి బయటకి వెళ్తడు. అదీ బేంకుకు పోయి పెంషన్ పైసలు తీస్కుందుకు. పైసలు తీస్కుని అమెరికాలో అమ్మాయితో ఫోన్ మాట్లాడి వస్తడు. వచ్చీ రాంగానే నాకు మూడు వేలు ఇచ్చేస్తడు. మళ్ళీ నెల వరకూ బయటకి పోడు."

"రోజంతా ఏం చేస్తాడు?"

"ఏమీ చెయ్యడు. నే పొద్దున్నే పేపర్ తీసుకొచ్చి ఇస్త. చదువుతాడు. నే కాఫీ ఇస్తే

తాగుతడు. అన్నం పండు ఇస్తే తింటడు. పండు లేకుంటే ఏమీ అనడు. అసలు కోప్పడ్డు. నవ్వుతూనే ఉంటడు."

"నీలానేనా?"

"సారు నవ్వు మంచిగుంటది." అంటూ గట్టిగా నవ్వింది.

ఇంకా ఆ ముసలాడి గురించి తెలుసుకోవల్సింది ఏముందో తెలియడం లేదు. ఓ ప్రత్యేక వ్యాసం రాసేందుకు సరిపడేన్ని వివరాలు ఇచ్చింది లక్ష్మి. కాసిన్ని వివరాలతోనే ఎంత వ్యాసమైనా ఎలా తయారు చెయ్యాలో – ఇన్నేళ్ళ జర్నలిజంలో బానే నేర్చుకున్నాను. ఇంక అతను వచ్చేవరకూ కూచోనక్కర్లేదు. వెళ్ళిపోవచ్చు.

"సారు ఒక్కోసారి గంటపైనే తానం చేస్తడు." అంది నా మనస్సులో ఆలోచనల్ని అర్థం చేసుకున్నట్టు.

ముసలాడికి నాలుగువేలు పెన్షన్ వస్తోంది అంటే ఏం ఉద్యోగం చేసుంటాడో – ఆ వివరం కూడా తెలిస్తే బాగుండును.

"నాకు మంచిగ తెల్వదు. ఎక్కడో కాలేజీలో టీచరుద్యోగం చేసిండనుకుంటా. ఎక్కడో ఏమో ఎరుకలేదు."

ఇంక మిగిలింది ఫొటో.

"మీరు ఫొటో అడిగితే లేదని చెప్పమన్నడు సారు."

ముసలాడికి ఎందుకో నన్ను కలవడం ఇష్టం లేదు. ఇంక ఎవ్వరినీ కూడా కలుస్తున్నట్లు లేదు. లక్ష్మి చెప్పిందాన్నిబట్టి ఎవరో కొందరు కలవడానికి వస్తారు కానీ వాళ్ళతో కూడా సరిగ్గా మాట్లాడ్డులా ఉంది.

మనిషి చాలా వింతావాళ్ళా ఉన్నాడు. ఓ రకమైన పిచ్చి ఉండి ఉంటుంది. ఎవ్వరితోను సంబంధం లేకుండా ఉండడం ఓ రకమైన పిచ్చే. పిచ్చి కాకపోతే లోకంతో సంబంధం ఉంచుకోని యోగిలాంటి వాడైనా అయ్యుండాలి. ఏమైనా సామాన్యుడు కాదు. పిచ్చివాడైనా – యోగి ఐనా అసామాన్యుడే – అటో, ఇటో.

భార్య ఉందో లేదో తెలియదు. కూతురితో సంబంధం ఉండీ లేనట్లే. లక్ష్మితో ఉన్న సంబంధం – అనుమానించేదో, అబ్బురపోయేదో అయుండదు.

లక్ష్మి చెప్పిన వివరాలతో – ముసలాడితో మాట్లాడినట్లు ఫీచర్ రాసేస్తోంటే – ఎలా ఉన్నావ్ – ఏం రాస్తున్నావ్ – అంటూ పక్క డెస్కు హస్కు –

ఫలానా వీధిలో ఫలానా ఇంట్లో ఓ వింత వ్యక్తిని కలవడానికి వెళ్ళానని అంటే –

"నేనంతకు ముందు రెండుసార్లు వెళ్ళాను. కలవడం అవలేదు. ఆయన ఎవరినీ కలవరు. కలిసినా ఏమీ చెప్పరు. నువ్వు కలిసి మాట్లాడావంటే నీ అదృష్టమే. రాయడం ఎందుకు మానేసారో చెప్పారా?"

"నేనూ కలవలేదు. రాయడం మానెయ్యడం ఏమిటి?"

"ఆయన దగ్గరికి వెళ్ళింది ఎందుకు? రెండు దశాబ్దాలుగా ఎందుకు రాయడం లేదని అడగడానికి కాదా?"

"రాయడం ఏమిటి? రెండు దశాబ్దాలుగా గది నుండి రాకుండా ఉన్న వ్యక్తి గురించి వ్యాసం రాయమని నన్ను పంపితే –"

"ఆయన ఎవరనుకుంటున్నావు? దశాబ్దానికి ఒకటి చొప్పున రెండు దశాబ్దాలలో రెండు అద్భుతమైన నవలలు రాసారే – ఆయన– హిమజ్వాల, అనుక్షణికం గుర్తులేవా?"

"ఆయన....."

"అవును. ఆయనే."

ఆ రాత్రి నిద్రలేదు. బుర్రనిండా ఆలోచనలే.

ఎన్ని రోజులు. ఎన్ని నెలలు. ఎన్ని సంవత్సరాలు. ఆయన రచన ఆహారంతో నా ఆకలి తీరిందో – ఒక్కో నవలని, ఎన్నెనిసార్లు చదివానో – అర్థం చేసుకుందుకు, ప్రయత్నించానో, ఎంతకాలం ఆలోచించి, అనుభవించి అంతర్లీనం చేసుకున్నానో – చేసుకున్నానని అనుకున్నానో.

ఆయన సృష్టించిన పాత్రలూ, సంఘటనలూ ఎంతకాలం నా జీవితంలో భాగమై పోయాయో – నన్ను చుట్టేసి కట్టేసి – నన్ను ఆయనకి దగ్గర చేసేసాయో –

అలాంటి రచయితను, తత్త్వవేత్తను ఎంత అన్నం తింటాడని చూడ్డానికా నేను వెళ్ళింది. వెళ్ళి కూడా చూడకుండా వచ్చేసానా?

రేపు తప్పకుండా వెళ్ళాలి. వెళ్ళి ఎందుకు రాయడం లేదో కనుక్కోవాలి.

ఎందుకు రాయకూడదని నిర్ణయించుకున్నారో, తత్త్వశాస్త్రోపన్యాసకులుగా చేస్తున్న ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీవిరమణ చేసి ఇలా ఈ మారుమూల గదిలో ఎందుకు కాలక్షేపం చేస్తున్నారో తెలుసుకోవాలి.

అతిగా ఆరగించిన తాత్త్విక శాస్త్రం జీర్ణించక ఇలా వచ్చేసారో – లేక నిజంగా జీర్ణమై – ఈ జీవితంలోని అశాశ్వతా, అప్రయోజనం అర్థమై – ఈ లోకానికి దూరంగా – ఉండీ ఉండనట్లు, – అసలు లేనట్లు జీవిస్తున్నారా?

మూర్ఖత్వపు పంజరంలో నుండి విడి, అవతలి గట్టుకి చేరేందుకు ప్రశాంతంగా నిరీక్షిస్తున్నారా?

ఎన్ని ప్రశ్నలు – ఎదిగీ ఎదగని నా మనస్సులోనే ఇన్ని ప్రశ్నలు ఉంటే – జీన్‌పాల్ సార్త్రెలాంటి కొరుకుడు కాని కొయ్యని మథించి – తాత్త్విక సారాన్ని సాధించి –



E:\Seelamma\ Seelama1 34

కోరిక (డిజైర్)కీ విడుదల (లిబరేషన్) కీ – అర్థాన్ని పరిశోధించిన ఆయన బుర్రలో ఎన్ని ప్రశ్నలు ఉదయించి ఉంటాయో – ఎన్నింటికి సమాధానాలు దొరికి ఉంటాయో–

వాటిన్నిటినీ అందరితో పంచుకోకుండా – అసలు తానన్న వాడిని ఈ లోకంలో లేనట్లుగా – దేనితోనూ సంబంధం లేనట్లుగా బతికెయ్యడం – ఈ లోకానికి ఎంత తీరని నష్టం.

ఆయన ఏమంటారో – మాటలో మాటగా – పక్క డస్క్ చెప్పిన ఆయన మాట –

ఆయన రాయాల్సినదంతా రాయడం అయిపోయిందట – ఇంక రాయాల్సింది ఏమీ లేదుట.

నిజంగానే రాసింది రాశిలో మరీ అంత తక్కువ కాకపోయినా వాసిలో మాత్రం చాలా ఎక్కువే, ఐతే రాయాల్సింది అంతా అయిపోవడం అంటూ ఉంటుందా? ఈ అనంతమైన లోకం గురించి ఎంత రాస్తే అంతమైపోయినట్లు? ఎంత మంది ఎంత రాసినా – ఓ కొత్త అర్థం గోచరిస్తూనే ఉంటుందే. అప్పటికి అంతా తెలిసిపోయినట్లు ఉన్నా మళ్ళీ ఇంకొకరు ఇంకో కోణం నుంచి చూస్తే అంతా కొత్తే.

అర్థం చేసుకోగలిగిన భౌతిక విషయ జ్ఞానమే కోపర్నికస్ నుండి గెలీలియో నుండి న్యూటన్ నుండి – ఐన్‌స్టీన్ నుండి మారుతూనే ఉంది. అలాంటిది అర్థం అయే అవకాశమేలేని సృష్టి రహస్యం –

అసలు నేనెవరన్న ప్రశ్నకి సమాధానం – ఈ విశ్వం ఆద్యంతాల జ్ఞానం – అంతు చిక్కుతుందా? మానవజాతి ప్రయాణం అంతా ఒక అజ్ఞానం నుండి మరో అజ్ఞానంలేకేనా?

మనిషి ఒకనాడు గొప్ప జ్ఞానం అని అనుకున్నది కొన్నాళ్ళకి అజ్ఞానం అని తెలుస్తుంది. కొత్త జ్ఞానం లభించిందని మనిషి గర్వపడి ఆనందపడేలోగా అది అజ్ఞానం అని తేలుతుంది. అలా మనిషి ఓ అజ్ఞానంలో నుండి మరో అజ్ఞానంలోకి ప్రయాణిస్తూనే ఉన్నట్లనిపిస్తోంది.

అలా కాకుండా నిజమైన జ్ఞానం సాధ్యమై అదే ఆయనకి అంది ఈ లోకపు అనావశ్యకత అర్థమై ఈ మౌని జీవితం గడిపేస్తున్నారో – లేక జ్ఞానం అందదని నిర్ధారణ అయిపోయి నిరాసక్తతో – ఈ ఒంటరి జీవితం గడుపుతున్నారో –

ఏ విషయం ఆయన ముఖతా రేపు వినాలి. చెప్పడానికి ఏమీ లేదని ఆయన అన్నా – ఆయన్ని వదిలెయ్యకూడదు. వేధించైనా, మాట్లాడించాలి.

రాత్రి కలత నిద్ర నిండా కలలే – స్వప్నాలే – స్వప్నరాగ లీనా –

శ్రీపతీ – కృష్ణచైతన్యా – గీతాదేవీ – శశాంకా – వందనా – అనంత్ రెడ్డీ – మోహన్ రెడ్డీ – రవీ – గంగీ – శివరాం – మాధురీ – చారుమతీ – ఈ లోకంలోని అన్ని రకాల మనుషులూ రకరకాల రూపాల్లో ఆయన నవలల్లోంచి – కలల్లోకి వచ్చేసారు.

ఆయన రాయనిదేమీ మిగలనట్లూ ఈ లోకపు అన్ని భాగాల్ని స్పృశించినట్లూ – విశ్వతత్వాన్ని వివరించేసినట్లూ అన్ని కలలే. నిజమేదో ఆయన్ని రేపు కలిస్తే కానీ తెలియదు.

నిన్న రేపు అని అనుకున్నది – ఈ రోజు ఈ రోజైంది.

కాళ్ళు శరీరాన్నీ, ఆలోచనలు మనస్సునీ, ఆ యింటివైపు, ఆ గదివైపు, ఆ ముసలాడివైపు – ఆ చైతన్యస్రవంతివైపు –

తీసికెళ్తున్నాయి.

నిన్న ఖాళీగా ఉన్న మనస్సు నిండా ఈ రోజు ఆలోచనలు.

నిన్న ఖాళీగా ఉన్న గది దగ్గర ఈ రోజు మనుషులు.

ఏమై ఉంటుందా అని అనుకునేలోగానే – ఆ గుంపులో ఏడుస్తూ కనిపించింది లక్ష్మి.

నిన్నంతా నవ్వుతూ కనిపించిన లక్ష్మి ఏడుపు భయంకరంగా వికృతంగా అనిపించింది.

చూసి గుర్తుపట్టి – ఏడుస్తూనే దగ్గరకొచ్చి – "సారు చచ్చిపోయిండు" అంది ఏడుస్తూనే.

ఏం విన్నానో నాకు అర్థమయ్యేలోగానే – "నిన్న రాత్రి మామూలుగా అన్నం పండూ తిన్నడు. నవ్వుతూనే వున్నాడు. పొద్దటేలే నే కాఫీ తీస్కోచ్చిన. చూస్తే ఏమున్నది" – లక్ష్మి గుండెల్నిండా ఏడుపే.

ఆయన ప్రాణం పోయింది. క్షణం ముందున్న ప్రాణం క్షణం తర్వాత లేదు.

క్షణమంటే ఏమిటి? రెండు సంఘటనల, రెండు ఆలోచనల మధ్య దూరం కాలం. కాలానికి కొలమానం క్షణం.

ప్రతిక్షణానికీ ఆదీ అంతం ఉన్నాయి. ప్రతీక్షణం క్షణికమే ఐతే ఈ క్షణాల దొంతరకి ఆది ఏదో, అంతం ఏదో తెలియదు. ఎంతకూ అంతమవని ఈ నిరంతర అనుక్షణిక క్షణ పరంపర ఆద్యంతాలే అసలైన జ్ఞానం అయ్యుంటుంది.

ఆ జ్ఞానం ఆయనకి తన జీవితకాలంలో లభించిందో లేదో తెలియదు. మరణంతో లభిస్తుందేమో అసలు తెలియదు. మరణం ఓ తిరిగి రాని ప్రయాణం.

ఆ ప్రయాణం – శూన్యంలోకో – జ్ఞానంలోకో – లేక మరో అజ్ఞానంలోకో?

E:\Seelamma\
Seelama1
35

*(ఈ కథలో పేరు లేకుండా ప్రవేశించి, అలానే ఉండిపోయి, అదృశ్యమైపోయిన సుప్రసిద్ధ రచయిత నిజంగా నిజం. ఆయన రచనల గురించీ, వాటిలోని పాత్రల గురించీ చేసిన ప్రస్తావన కూడా నిజం. ఐతే ఈ కథ మాత్రం పూర్తిగా కల్పితం. మనకి బాగా తెలిసిన ఒక రచయిత చుట్టూ కథని అల్లడం ఓ రకంగా సాహసం. ఐతే ఈ సాహసం ఆయన మీద ఉన్న గౌరవంతో చేసిన ప్రయత్నమే.)*



E:\Seelamma\
Seelama1
36

*విపుల, నవంబర్, 1992*

# ఓ వందనోటు కథ

**"గో**దావరి నదికీ, వందనోటుకీ ఓ పోలిక ఉంది. రెండూ నాసిక్‌లోనే పుట్టాయి" అన్నాడు శర్మ ఉపోద్ఘాతంగా.

శర్మ నా ఫ్రెండు. రిజర్వ్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. నాకు బ్యాంకులు, తత్సంబంధమైన విషయాల్లో అనుమానాలు కలిగినప్పుడు శర్మనే అడుగుతుంటాను. శర్మకి చెప్పడంలో ఇష్టం ఉండడం వల్ల విడమర్చి అన్నీ విపులంగా వివరిస్తూంటాడు. చాలా రోజులుగా నల్లధనం గురించి నాకున్న అనుమానాన్ని అడిగితే సమాధానంగా చెప్పడం మొదలెట్టాడు శర్మ.

నా అనుమానం క్లుప్తంగా చెప్పాలంటే – దేశంలో ఎన్నో కోట్ల నల్లధనం ఉందంటున్నారు కదా – దేశంలోని డబ్బంతా ప్రభుత్వం, రిజర్వ్‌బ్యాంకుల ద్వారానే చెలామణిలోకి వస్తుంటుంది కదా – మరి ఆ డబ్బులో నల్లడబ్బుని విడగొట్టేసి ఆ నల్లడబ్బు ఉన్న వాళ్ళ దగ్గర లాగేసుకోవచ్చు కదా? కొన్ని వేలో, లక్షలో, వంద రూపాయలవో, పది రూపాయలవో కట్టలు పట్టేసుకుంటే సరిపోదా?

ఈ విషయంలో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌వాళ్ళు, పోలీసువాళ్ళు బ్యాంకుల సహాయం తీసుకోవచ్చు కదా? వాళ్ళకి కరెన్సీ నోట్ల గురించి బాగా తెలుస్తుంది కదా?

నా అనుమానం అంతా విని ప్రారంభించాడు శర్మ.

ఓ వంద రూపాయల నోటుని చూపించి ఇది నల్లదా కాదా అంటే చెప్పలేం. ఆ నోటు ఏ పరిస్థితుల్లో ఎవరి దగ్గరుంటుందో దాన్ని బట్టి నలుపు, తెలుపుఅన్న విశేషణం చేర్చగలం. నీకో వంద నోటు కథ చెప్తాను. అది వింటే, నీకువిషయం బాగా అర్థమవుతుంది.

పవిత్ర గోదావరి నది జన్మించిన త్రయంబకేశ్వరంబునకు సమీపంబునందున నాసికా నగరంబునందు ఓ ముద్రణాలయంబు కలదు. అందు ప్రతిదినము లక్షల కొలది రూపాయల నోట్లు ముద్రింపబడుచుండును. అనుదినమటుల జన్మించుచున్న నోట్లలో పందొమ్మిది వందల తొంబదియవ సంవత్సరము ప్రారంభమున ఒక వంద

రూపాయల నోటు ఉద్భవించెను. అది కొన్ని దినములు మరి తొంబది తొమ్మిది నోట్లతో కలిసి ఒక కట్టతో ఆ ముద్రణాలయము నందే పడి యుండెను. అనంతరము ఒక శుభ దినంబున వెలుపలికి వచ్చెను.

4 ఫిబ్రవరి 1990 :

ఆ వంద రూపాయల నోటు ఇంకో 99 నోట్లతో కలిసి ఒక కట్టగా మారింది. అలాంటి ఇంకా కొన్ని కట్టలు కలిపి ఒక పెట్టెలోకి చేరాయి. అలాంటి ఇంకా కొన్ని పెట్టెలు కలిసి పోలీస్ బందోబస్తీతో హైదరాబాద్ రిజర్వ్‌బ్యాంక్‌కి వచ్చాయి. అక్కడ అనుమతి లేకుండా ఎవ్వరూ ప్రవేశించడానికి వీలు లేని ఓ మారుమూల చీకటి గదిలోకి చేరింది ఆ నోటు.

4 మార్చి 1990 :

నెల రోజులుగా ఓ మూల పడి మూలుగుతున్న ఆ వంద రూపాయల నోటు తన కట్ట మిత్రులతో కలిసి విశాఖపట్నం ప్రయాణమైంది. మర్నాటికి అక్కడకి చేరి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి కరెన్సీ చెస్ట్‌లోకి చేరింది. అక్కడా దానికి హైదరాబాద్ గతే పట్టింది. మరో నెల రోజుల దాకా గాలీ, వెలుతురూ రాని ఒక పెద్ద ఇనపగోడల గదిలో బంధింపబడింది.

4 ఏప్రిల్ 1990 :

గోవిందరావు కలెక్టరాఫీసులో గుమాస్తా. నాలుగేళ్ళుగా ఉద్యోగం చేస్తున్న గోవిందరావు తన పొదుపు అలవాటుతో నెలనెలా కొంతగా డబ్బు మిగుల్చుకోగలిగాడు. ఆ డబ్బునతడు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వాళ్ళ మెయిన్ బ్రాంచిలో సేవింగ్స్ బ్యాంక్ ఎక్కౌంట్‌లో ఉంచుతుంటాడు.

అతనికి పెళ్ళయి ఓ సంవత్సరమవుతోంది. ముందు రోజు భార్యకి కాస్త నలతగా ఉంటోందంటే లేడీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాడు. లేడీ డాక్టర్ పరీక్ష చేసి అతను తండ్రి కాబోతున్నడన్న శుభవార్త చెప్పింది. గోవిందరావు భార్య కోసం కొన్ని టానిక్కులు రాసి ఇచ్చింది.

అవి కొనడానికి డబ్బు అవసరమై బ్యాంక్‌కు వెళ్ళాడు గోవిందరావు.

అంతకుముందు రోజు దాకా ఇనపగోడల జైలులో మగ్గిన వంద రూపాయల నోటు ఆ రోజే ఆ బ్రాంచి క్యాషియర్ దగ్గరకి చేరింది. ఆ వంద నోటే గోవిందరావు దగ్గరకి వచ్చింది.

గోవిందరావు జగదంబా సెంటర్ దగ్గర్లోని మెడికల్ షాప్‌కి వెళ్ళాడు. తనక్కావల్సిన మందులకి టానిక్కులకి అరవై పైనే అయింది. ఆ వంద రూపాయల నోటు, ఆ





మెడికల్ షాప్ యజమాని గుప్తా చేతుల్లోకి వెళ్ళింది. అక్కడ నుండి డబ్బు పెట్టెలోకి వెళ్ళింది. ఆ నోటు అప్పటికింకా నల్లడబ్బు కాలేదు.

4 మే 1990

జగదంబా సెంటర్లోని తన మందుల కొట్టు తెరుచుకు కూర్చున్నాడు గుప్తా. అతనికి ముందు రోజే ఓ విషయం తెలిసింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గారొకసారి తన కొట్టుకి చెకింగ్ కోసం ఈ రోజు వస్తున్నారని. (ఇలాంటి విషయాలు ఎంతో రహస్యంగా జరుగుతాయనీ, గుప్తాకి తప్ప ఇంకెవ్వరికీ ఆ రోజు చెకింగ్ వుందని తెలియదనీ శర్మ జోకు వేశాడు. అయితే అది ఈ వంద నోటు కథకి అనవసరం).

గుప్తాకి ఎవరు వస్తే ఎలా మర్యాద చెయ్యాలో బాగా తెలుసు. ఇన్నాళ్ళ వ్యాపారం అతనికెన్నో విషయాలు నేర్పింది.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ధర్మారావు గుప్తా కొట్టుకి వచ్చాడు. గుప్తా ధర్మారావుకి కూల్‌డ్రింక్ ఇప్పించి, అతని కుటుంబ విషయాల గురించి మాట్లాడసాగాడు. ధర్మారావు మధ్యలో ఒకసారి కొట్లో మందుల గురించి మాట్లాడబోతున్నట్లు నటించాడు. వెంటనే గుప్తా ఒక చిన్న కవర్ తీసి ధర్మారావుకిచ్చాడు. ఆ కవర్‌ని తన బ్రీఫ్‌కేస్‌లో వేసుకుని ధర్మారావు వెళ్ళిపోయాడు.

కవర్‌లో కొంత డబ్బు ఉంటుందని తెలిసిన ధర్మారావుకి అది ఎంత ఉంటుందో కూడా తెలుసు. కవర్‌లో ఎంత డబ్బు పెట్టాలో గుప్తాకి బాగా తెలుసు.

ఆ కవర్‌లో వున్న డబ్బులో ఉంది ఆ వంద రూపాయల నోటు. అప్పుడు ఆ వంద నోటు నల్లధనమైంది.

ధర్మారావుకిచ్చిన డబ్బుని గుప్తా తన జమాఖర్చుల పుస్తకంలో ఎక్కడ జమగా చూపించాడో, ఎలా ఖర్చుగా రాశాడో తెలియదు.

నెల జీతం తప్ప మరో ఆదాయం లేదని ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌కి చెపుతున్న ధర్మారావు ఆ డబ్బునెక్కడ దాస్తాడో మరి.

అక్కడ ఆ క్షణాన –

నాసిక్‌లో కానీ, హైదరాబాద్‌లో కానీ, విశాఖపట్నం స్టేట్‌బ్యాంక్‌లో కానీ, గోవిందరావు జేబులోకానీ నల్లధనం కాని ఆ వంద నోటు ధర్మారావు బ్రీఫ్‌కేస్‌లో మొదటిసారిగా నల్లబడింది.

4 జూన్ 1990

ధర్మారావు కూతురు పుట్టిన రోజది.

పుట్టిన రోజుకి మంచి ఫ్రాక్ కొనాలని కొట్టుకు వెళ్ళాడు ధర్మారావు. అక్కడున్న

చిరునవ్వుల సేల్స్‌గర్ల్ సరళ అతనికి ఎన్నో రకాల డిజైన్ల ఫ్రాక్‌లు చూపించింది. అందులో తనకి నచ్చిన ఫ్రాక్ తీసుకుని బిల్ తీసుకుని డబ్బిచ్చి బయటికి నడిచాడు.

బిల్ ఇచ్చి డబ్బు తీసుకున్నాడు యజమాని.

అంతకుముందు వారం రోజులుగా సరళ చేసిన అమ్మకాలకి కమీషన్‌గా వందరూపాయలిచ్చాడు యజమాని.

అలా సరళకివ్వబడింది ఆ వందనోటు.

అయితే బట్టల కొట్టు యజమాని ఆ డబ్బుని బిల్ రాసి తీసుకున్నాడు. అలా తీసుకున్న ఆ డబ్బుని సరళకి కమీషన్‌గా ఇచ్చాడు. అది జీతంలాంటిది.

అమ్మకం, జీతం నల్లధనం కిందరావు.

అంతవరకు నల్లధనం అనిపించుకున్న ఆ వందనోటు ఎకౌంట్ చెయ్యబడి నలుపు రంగుని చెరిపేసుకుంది.

మర్నాడు సరళ ఆ వందనోటుని బెంగుళూర్‌లో ఉన్న తన తండ్రికి ఒక కవర్‌లో పెట్టి పంపించింది. (నిజానికి కవర్‌లో డబ్బు పెట్టి పంపించడం పోస్టల్ రూల్స్‌కి వ్యతిరేకం. అయితే ఇది ఆ నోటుని నల్లడబ్బుగా మార్చదు. ఇంక పోస్టల్ రూల్స్‌ని అతిక్రమించడం ఈ కథకి అప్రస్తుతం).

14జూన్, 1990

సరళ నాల్గవ తమ్ముడికి దగ్గరున్న స్కూల్లో ఒకటవ క్లాసులో చేర్చడానికి తీసుకెళ్తే అయిదు వందలు డొనేషన్ కావాలన్నాడు ప్రిన్సిపాల్.

సరళ నాన్నగారికి సరళ తర్వాత నలుగురు మగపిల్లలు. ఆయన ఓ పెద్ద కంపెనీలో చిన్న గుమాస్తా. పిల్లల్ని చదివిస్తే పైకి వస్తారని ఆయన ఆశ.

సరళ బి.ఎ. చదివిన తర్వాత తన అత్తయ్యవాళ్ళు ఉంటున్న విశాఖపట్నం వెళ్ళి అక్కడే సేల్స్ గర్ల్‌గా పనిచేస్తోంది. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడయ్యాయి.

సరళ తమ్ముడి స్కూల్ ఎడ్మిషన్ కోసం ఇవ్వబడ్డ అయిదు వందల రూపాయల్లో, సరళ పంపిన నోటు కూడా ఉంది. పేరుకి డొనేషనే కానీ, దానికి రసీదులు లేవు. అది ప్రిన్సిపాల్ బంగారప్ప దగ్గర నల్లధనంగా మారింది.

4 ఆగస్ట్, 1990

బంగారప్ప మల్లేశ్వరంలో ఓ ఇల్లు కట్టించుకున్నాడు. అది నిజానికి ఇల్లు కాదు, ఓ పెద్ద బంగళా.

బంగారప్ప ఓ చిన్న పిల్లల స్కూలుని నడుపుతున్నాడు. అది చిన్న పిల్లల స్కూలే కానీ చిన్న స్కూలు కాదు. అక్కడ ఫీజులూ, డొనేషన్లూ కూడా చిన్నవి కావు.



E:\Seelamma\ Seelama1 38

బంగారప్ప స్కూలుని బంగారు గుడ్లు పెట్టే బాతులానే పెంచుకుంటూ వచ్చాడు. స్కూలు కూడా అలాగే పెరిగింది.

అలా డబ్బుని పెంచి, ఇల్లుని కట్టిస్తున్నాడు బంగారప్ప.

ఆ ఇంటికి చాలా అధునాతనంగా అందంగా కట్టడానికి శ్రీనివాసన్‌ని కాంట్రాక్టర్‌గా పెట్టుకున్నాడు. శ్రీనివాసన్ చాలా పెద్ద కాంట్రాక్టర్. ఎన్నో పెద్ద బిల్డింగులు కట్టించాడు. అతనికి గవర్నమెంట్ కాంట్రాక్టులు కూడా ఉన్నాయి.

శ్రీనివాసన్ ఇల్లు కట్టిస్తూ ఎప్పటికెంత అవసరమో, అంతా బంగారప్ప దగ్గర తీసుకుంటున్నాడు.

ఆ రోజు సిమెంట్ బస్తాలు తెప్పించడానికి తీసుకున్న అయిదువేల రూపాయల్లో ఆ వంద నోటు కూడా ఉంది.

సిమెంటు బస్తాలు కొనడానికి కంట్రాక్టర్ తీసికున్నది నల్లధనం కాదు.

4 సెప్టెంబర్, 1990

శ్రీనివాసన్‌కి చాలా గవర్నమెంటు కాంట్రాక్టులున్నాయి. ఇంకా దేశ వ్యాప్తంగా ఎన్నో కాంట్రాక్టులు తీసుకునే అభిప్రాయం ఉంది. ప్రతిసారి టెండర్ వేసినప్పుడు, శ్రీనివాసన్ కొందరు రాజకీయ నాయకుల్ని కలుసుకుంటుంటాడు. అవసరాన్ని బట్టి, వేసిన టెండర్ డిపార్ట్‌మెంట్‌ని బట్టి కలుసుకోవాల్సిన రాజకీయ నాయకుల్నీ ఇవ్వాల్సిన మొత్తాన్నీ నిర్ణయించుకుంటాడు శ్రీనివాసన్. అతనికింత వరకూ ఈ విషయంలో పరాజయం లేదు. ఈసారి ఓ గవర్నమెంట్ కాంట్రాక్ట్ కోసం ఢిల్లీలో ఓ రాజకీయనాయకుణ్ణి కలుసుకున్నాడు శ్రీనివాసన్.

కాంట్రాక్ట్ తనకే ఇప్పిస్తానని వాగ్దానం చేశాడా నాయకుడు. (రాజకీయ నాయకులు కూడా ఎలక్షన్లప్పుడు ప్రజలకు చేసే వాగ్దానాలూ, పనులు చేస్తామని కాంట్రాక్టర్లకు చేసే వాగ్దానాలు వేర్వేరుగా చేస్తారుట) నాయకుడి చేతికి చాలా వంద రూపాయల నోట్లు చేరాయి. అందులో ఉంది ఆ వంద రూపాయల నోటు నల్లగా.

4 అక్టోబర్, 1990

రాజకీయ నాయకుడికి తాను ఎన్నికయిన నియోజకవర్గం జన్మభూమికన్నా ముఖ్యమైంది. ఆ నియోజకవర్గంలోని ప్రజల బాగోగుల్ని స్వయంగా చూసుకుంటూంటాడు. ఎక్కడ ఏ గొడవయినా నాయకుడు తప్పకుండా అక్కడ హాజరయి తనకు చేతయినంత సాయం చేస్తుంటాడు.

అయితే సాయం చెయ్యడమంటే ఏంటన్న విషయంలో నాయకుడికి అనుమానాలు లేవు. తనకి ఎవరి అవసరం ఉందో, వాళ్ళకే అతని సాయం ఉంటుంది. ఇళ్ళు

కాలితే, తను ఇచ్చిన ధనం ఇల్లు కాలిన వాళ్ళకే చెందాలన్న దురాశ లేదు నాయకునికి. ఆ తగలబడ్డ ఇళ్ళవాళ్ళు తన ప్రస్తుత పొజిషన్‌కి నష్టం కలిగించకుండా చూసే చిన్న నాయకులకి ఆ ధనం అందితే చాలు.

ఉత్తర ప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో (అది నాయకుడి నియోజక వర్గంలోని గ్రామమే) ఏవో గొడవలయి, కొందరు చనిపోవడంతో, నాయకుడు అక్కడికి చేరాడు. మృతుల కుటుంబాల కోసం వెంటనే చందా ఇచ్చేశాడు. ఆ చందాలో ఉంది ఆ నల్లధనం. అయితే చందా నల్లధనం కానేకాదు.

చందాలు ప్రోగుచేసే ఓ పెద్ద మనిషి ఆ నోటుని సద్వినియోగ పరిచే ఉద్దేశంతో భద్రపరిచాడు.

4 నవంబర్, 1990

ఆ పెద్ద మనిషి ఆ నోటుని వాడేలోగానే, అది కాస్తా చిరిగింది. ఆయన దాన్నక్కడో బ్యాంక్‌లో ఇచ్చేశాడు. అక్కడ నుండి అది అంచెలంచెలుగా ఢిల్లీలోని రిజర్వ్‌బ్యాంక్ చేరింది. మళ్ళీ చీకటి గదిలోకి వెళ్ళిందా నోటు.

ఆ చీకటి గదిలో కొన్నాళ్ళు గడిచాక, రిజర్వ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఇరవై రెండేళ్ళ చిన్నారి సుందరి సుకుమారమైన వేళ్ళ మధ్యన నలిగిందానోటు. ఆ నోటు రిజర్వ్ బ్యాంక్ ద్వారా ముద్రించబడిందనీ, చిరిగిపోయిన కారణంగా మళ్ళీ దేశంలోకి వెళ్ళనవసరం లేదనీ, దాన్ని దహనం చేసెయ్యవచ్చనీ చిన్న సంతకం రాసి ధృవీకరించింది ఆ చిన్నారి. ఆ తరవాత ఇంకొన్ని సంతకాలయ్యాక, ఇద్దరు ఆఫీసర్ల సమక్షంలో చిరిగిపోయిన పాత వంద రూపాయల నోటు తగలబెట్టబడింది, అలాంటి మరెన్నో పాత నోట్లతో పాటు.

ఉపసంహారం:

"ఇదీ ఆ వందనోటు కథ. ఇప్పుడు చెప్పండి ఆ నోటు నల్లధనమా? కాదా? అలా నోటుని బట్టి అది నల్లదో కాదో నిర్ణయించడం ఎలా?" అని అడిగాడు శర్మ.

నాకంతా అయోమయంగా అనిపించింది.

"ఇవి ప్రభుత్వం, బ్యాంకులు చేసే పని కాదండీ. మన మనస్సులోనే ఉంది ఆ నలుపు. నల్లధనం ఉండకుండా ఉండాలంటే కరెన్సీ నోట్లను కాదు తెలుపు చెయ్యాల్సింది, మన మనస్సులను" అంటూ ముగించాడు శర్మ.

నిజమేననిపిస్తోంది నాకు. మీకేమనిపిస్తోంది?



E:\Seelamma\
Seelama1
39

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 24 జూన్, 1982

# అంతరాంతరాళం

**రా**జేశ్వరి డైరీ : 25 డిసెంబర్, 81.

అమ్మయ్య. మొత్తానికి ప్రయాణానికి ఒప్పించాను. లేకపోతే ఇంకేదన్నా ఉందా? ఒకటా? రెండా? వారం రోజులు ఈ రచయిత రాజేశ్వర్రావుగారితో ఇంట్లో వేగడమే. ఏడాది చివరదాకా ఉన్న సెలవు అన్నీ పెట్టేసి ఇంట్లో కూర్చుంటానని పొద్దునే చెప్పారు. ఆయన సెలవు పెట్టడమంటే ఏంటో తెలీదా నాకు? ఏదో ఇంగ్లీషు నాటకమో మరేదో సంస్కృత కావ్యమో తీసుకుని చదవడం మొదలెడ్తారు. ఆయన చదివితే పోతుందా? నాకు వినిపిస్తారు? అక్కడే నాకు చిర్రెత్తుకొస్తుంది.

అదీకాకపోతే ఓ నవల్రాయడం మొదలెడ్తారు. ఇంకంతే. రాసిన ప్రతీ మాట బాగుందా లేదాననే తప్ప, పెళ్ళాన్ని నేనున్నానని నాతో మాటా మంతీ ఉండదు. మామూలుగా అయితే కమలగారితో కబుర్లాడుకుంటూనో, విమల గారితో సినిమాకు పోయో కాలక్షేపం చేసుకోవచ్చు. ఈయనగారు సెలవుపెడ్తే ఇంట్లో కూర్చోమని బతిమాలుతారు. అలాగని నాకోసం ఏం చెయ్యరు. అలాంటి ఆయనతో కలిసి వారం రోజులు ఇంట్లోనా?

అందుకే తెగేసి చెప్పేసాను. సెలవు తీసుకుంటే ఎక్కడకన్నా పోదామని. ఓ పట్టాన ఒప్పుకోరే. అసలాయన పట్టుదలేంటో – నే చెప్పేదసలు పట్టదు. ఇదేం కొత్తా? అందుకనే బయల్దేరతీసాను. లేకపోతే ఈ వెధవ రెండు గదుల ఫ్లాట్లో ఈ మతిలేని మనిషితో వారం రోజులా?

సాయంత్రం ఆరుంపావుకి బొంబాయి వి.టి. చేరాం. అసలు తనతో నేనొస్తున్నాననే అనిపించదాయనకు. ఈయనతో ప్రయాణం పెట్టుకోవడమే కాని అంతా తన ధోరణే. ఏదో ఆలోచిస్తూ నెమ్మదిగా వస్తారు. ప్రయాణంలో వుండాల్సిన చురుకు లేదు.

ఆరుమ్ముప్పావుకు సరిగ్గా బయల్దేరింది పంచవటి ఎక్స్‌ప్రెస్. దారి పొడుగునా కొండలను గుట్టల్ని చూస్తూ కూర్చుంటారే తప్ప అసలు మాట్లాడరు. రాత్రి మన్మాడ్ చేరే దాకా మధ్యన తిండికి తప్ప నోరు విప్పనే లేదు.

బండి పావుగంట లేటుగా పన్నెండుకు ఐదు నిముషాలుందనగా మన్మాడ్ చేరింది.

అక్కడనుండి ఔరంగాబాద్‌కు బ్రాడ్‌గేజ్ నుండి మీటర్‌గేజ్‌కు మారాలి. చలి వణికించేసింది. ఆయన స్వెట్టర్ ఆయనకిచ్చి నేను శాలువ కప్పుకుంటుండగా కొంచెం దూరంలో చూసాను. ఆయనెవరో వాళ్ళావిడకు శాలువా కప్పుతున్నాడు. ఆ అదృష్టవంతురాలెవరా అని చూద్దును కదా సుధ, కాలేజీలో నా క్లాస్‌మేట్.

రాజేశ్వర్రావు డైరీ : 26 డిసెంబర్ 81.

పన్నెండింటికి వణికిస్తున్న చలిలోని చల్లదనాన్ని పక్కనున్న సతీమణి (కోపం తాలూకు వేడి) వల్ల పోగొట్టుకుంటూ మన్మాడ్ స్టేషన్‌లో బ్రాడ్‌గేజ్ ప్లాట్‌ఫారం నుండి మీటర్‌గేజ్‌ప్లాట్ ఫారం మీదకు మారుతుండగా నిన్న నేడుగా మారింది.

రాజేశ్వరికి నేను తనతో మాట్లాడ్డం లేదన్న కోపమే కాని నాకిష్టంలేని ప్రయాణం చేస్తున్నందుకు పోట్లాడ్డంలేదన్న సంతోషం లేదు. అయినా ఆవిడ చెప్పే విషయాలకు నా మనసుకూ మధ్య నా చెవులు మూసిన తలుపులు అవుతాయని ఆవిడకీ తెలుసు. ఇది మా ఇద్దరికీ రెండేళ్ళుగా వున్నదే. పెళ్ళితో వచ్చినవి పుస్తెలతోనే పోతాయేమో.

అసలు విశేషం సుధాకర్ కనిపించడం. ఇంజనీరింగ్‌లో నాతో కలిసి చదివాడు. మిగతా మిత్రలం మేం కాఫీలు తాగినన్నిసార్లు తను విస్కీ తాగేవాడు. మేం సినిమాలకెళ్ళినన్నిసార్లు తను వేశ్యాగృహాలు పావనం చేసేవాడు. ఇవన్నీ పెద్ద లెక్కలోనివి కావు.

తనుంటున్న గది అద్దెలెక్కలకీ, ఆ అద్దె పుచ్చుకోవాల్సిన ముసలాయన మనవరాలి లెక్కల చదువుకీ లంకె పెట్టాడు. ఆ అమ్మాయి నేర్చుకున్న లెక్కల గురించి ఎవరికీ తెలియదు కానీ, వాళ్ళిద్దరూ కలిసి తిరిగిన పిక్నిక్కుల లెక్కలు ఊరంతా తెలిసాయి. ఇంకా ఏం చేసాడో తెలీదు కానీ, చదువయ్యాక మళ్ళీ ఆ గదివంక చూళ్ళేదు. ఆ అమ్మాయి మాత్రం వీడికోసం చూసి చూసి ఆ గదిలోనే ఉరేసుకుంది.

గతం తాలుకు ఛాయలేం లేకుండా మామూలుగా మాట్లాడాడు. బొంబాయిలోనే పనిచేస్తున్నాట్ట. అజంతా, ఎల్లోరాలు చూడాలన్న కోరికతో ఇద్దరూ బయల్దేరారుట. తన భార్య సుధని పరిచయం చేశాడు. సుధ రాజేశ్వరితో కలిసి చదివింది, ప్రపంచం చాల చిన్నది. కలుసుకున్న మనుషుల్నే మళ్ళీ కలుస్తాం.

పన్నెండున్నరకి ఎల్లోరా ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. మన్మాడ్ నుండి సికింద్రాబాద్‌వైపు పోయే రైళ్లకి ఔరంగాబాద్ మీదుగా వెళ్ళడం వల్లనేమో. అజంతా, ఎల్లోరా అని పేర్లు పెట్టారు. మూడింటికి ఔరంగాబాద్‌లో దిగాం. ఒక గుజరాతీ ముసలాయన తనే స్వయంగా వచ్చి తను నడుపుతున్న చిన్న లాడ్జికి తీసుకెళ్ళాడు. వెంటనే నిద్రపోయాం. లేచేసరికి పదయింది. ఇంక ఈ రోజుకి అజంతా ఎల్లోరాలు వెళ్ళే ప్రసక్తి లేదని

E:\Seelamma\
Seelama1
40

దగ్గర్లో వున్న దౌలతాబాద్ కోట చూద్దాం అన్నారు వాళ్ళు. నేను రానన్నాను నా సగభాగం కోపానికి గురవుతూ.

అజంతా చిత్రసుందర్నీ, ఎల్లోరా శిల్పమంజర్నీ చూడ్డానికి వచ్చాను కాని ఈ పాడు పడ్డ కోటల్లో నాకేం ఇష్టం లేదు. వాళ్ళు వెళ్ళారు. సుధ – సుధాకర్ల ఆలోచన్లతో గడిపేసాను. సుధ అందంగా వుంది. అమాయకంగా వుంది. ఆకర్షణీయంగా వుంది. పాపం ఈ సుధాకర్ గురించి తెలీదేమో. సుధాకర్ పాతకథను రాజేశ్వరికి చెప్పి సుధకి చెప్పమందామనిపించింది.

ఆ ఆలోచన్లనుండి బయటికొచ్చాను. గుజరాతీ ముసలాయన చక్కటి టీతో ఎంతో స్నేహంగా మాట్లాడాడు. మామూలుగా టూరిస్ట్ స్థలాల్లో వుండే హోటళ్ళ యజమానుల కుండే కపటవ్యాపార లక్షణం లేదు మనిషిలో. తర్వాత ఇర్వింగ్‌వేలస్ రాసిన సెవెన్‌మినిట్స్ చదువుతూ పడుకున్నా రాత్రి వాళ్ళు తిరిగివచ్చేదాకా.

సుధ డైరీ: 27 డిసెంబర్ 81

నిన్న కోటెక్కి దిగిన అలుపు రాత్రి నిద్రలో పోయింది. అజంతా ప్రయాణానికి అంతా సిద్ధమయ్యాం. టూరిజం డిపార్ట్‌మెంట్‌వారి కండెక్టెడ్ టూర్‌లో వెళ్తే మంచిదన్నారు రచయిత రావుగారు. చిత్రలేఖనంలోని అందాలు గైడ్ చెప్తేకాని తెలియవన్నారు. మా హోటల్ ఓనర్ ద్వారా టిక్కెట్లు తెప్పించారు.

బస్సు మూడు గంటలు ప్రయాణం చేసి అజంతా చేరుకుంది. ఏ బస్సు ప్రయాణమైనా నాకు పడదు. కళ్లు మూసుకు కూర్చున్నా. పక్కనే సుధాకర్ ఏవో కబుర్లు చెప్పి నవ్విస్తూ మధ్య మధ్య ఏవన్నా తినడానికిస్తూంటే పాత జ్ఞాపకాలింకా పైకి తన్నుకొచ్చేసాయి.

రాజేశ్వరితో పరిచయమైనదెంతో దుర్ముహూర్తమయుంటుంది. ఆ పరిచయమే లేకపోతే వాళ్ళ కజిన్ తెలిసుండేవాడు కాదు. యవ్వనపు తొలిదశలోని తెలివి తక్కువతనంతో నేను వాడివెంట పడుండేదాన్నికాదు. నలుగురి నోళ్ళలోనూ పడుండేదాన్నీ కాదు.

అదే రాజేశ్వరి మళ్ళీ నా జీవితంలోకి వచ్చింది – పాతవిషయాలు మరచిపోయి, ఎంతో ఆదరంగా చూస్తున్న భర్త సాన్నిధ్యంలో సుఖంగా ఉంటున్న సమయంలో. ఆ విషయం రావుగారి చెవిలో ఊదితే, ఆయన సుధాకర్‌కి చెప్తే – నా సుధాకర్ నన్ను... ఇంకా చెప్పినట్లుగా లేదు. చెప్తే సుధాకర్ నన్నింకా ఇంత ప్రేమగా చూస్తాడా?

నేను సుధాకర్ని మోసం చేస్తున్నానా? ఈ విషయం చెప్పడం వల్ల కష్టాలొస్తాయి కానీ, ఇద్దరికీ శాంతుండదు కదా! అలాంటప్పుడు చెప్పడమెందుకు? ఇద్దరి బతుకులూ

హాయిగా ఉండనీయక.

మధ్యలో బస్సాపి అజంతా గుహల్ని ఎదురుగా ఉన్న వ్యూ పాయింట్ నుంచి చూపిస్తూ, అవి ఎప్పుడెలా వెలుపలికి వచ్చాయో వివరించాడు గైడ్. నా ఆలోచన్లలో నేనున్నా. సుధాకర్ నాకు చెప్పాడు మళ్ళీ. కొండను అర్థవలయాకృతిగా మలచుకొని గుహల్ని తవ్వారు.

రెండు గుహల్లోనే చిత్రాలున్నాయి. తక్కినవన్నీ తవ్వకాల్లోనూ, తర్వాతా పోయాయిట. ఉన్న వాటిల్లో ఒక చిత్రం నన్ను బాగా ఆకర్షించింది. నాలుగు లేడి శరీరాలకి ఒకే తల ఉన్న చిత్రం.

రావుగారు తన్మయత్వంతో అన్నారు "మన గతం అద్భుతం"అని. "మనది అద్భుతుమేమో కాని, నాది మాత్రం కాదు. రాజేశ్వరి మీతో చెప్తుందిలెండి" అనుకున్నాను. ఇంకా చెప్పిందో లేదో?

సుధాకర్ డైరీ : 28 డిసెంబర్ 81.

అజంతా అందాలు అందంగా ఉన్నాయి. రాజేశ్వరరావు తన డైరీలో అందంగారాసుకునుంటాడు – రచయిత. దాంతో పాటు నా జీవితం గురించి రాసుకునుంటాడు – రాస్కెల్ అలానే రాజేశ్వరిగారితో చెప్తాడు. ఆవిడ సుధ చెవి కొరుకుతుంది.

జీవితం ఇంతే. ఏమీ తెలియని వయసులో ఏదో చేసాను. శారద ఆత్మహత్యతో నాకు కనువిప్పయింది. ఇప్పుడు సుధ మీద ప్రేమ తప్ప నాలో మరో దురాలోచన లేదు. కానీ గతం బయటకొచ్చి, సుధకీ విషయం తెలిస్తే, నన్ను సుధ ప్రేమగా చూడకపోవచ్చు. సుధ అభిమానంగా చూడకపోతే నా బతుకు చీకటయిపోతుంది. పోనీ.

మన చేతుల్లో ఏముంది? ముంతాజ్ మరణానికి విలపించిన ప్రేమ చక్రవర్తి తాజ్ మహల్ కట్టించగలిగాడు. తన ప్రియురాల్ని బతికించుకోలేకపోయాడు. తన బాధ మరచిపోలేకపోయాడు.

తాజ్‌కీ, ఈ ఊళ్ళో ఈ రోజు చూసిన బీబీ – కా – మక్బారాకి పోలికే లేదు. తాజ్‌ను అనుకరిస్తూ ఔరంగాబాద్‌లో కట్టారుట దీన్ని. తాజ్‌మహల్ చిక్కిపోతే ఎలాగుంటుందో అలాగుందిది. తాజ్‌ని చూడని సుధకిది అందంగా ఉంది. సుధను ఆగ్రా తీసుకెళ్ళాలి. ఒక పున్నమి రాత్రికి – ఈ లోపుగా ఏం జరక్కుండా ఉంటే.

అలానే ఈ ఊళ్ళో గుహాలయాలు, "అజంతా ఎల్లోరా చూసినవాళ్ళకివి రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసినట్లుంటాయి" అన్నాడు రావు. "నాకు మాత్రం అంతూలే





కన్నా మా ఆయనే అందంగా ఉంటాడండోయ్" అంది సుధ. పిచ్చి సుధ. నామీదెంత ప్రేమో.

రాజేశ్వర్రావు డైరీ : 29 డిసెంబర్ 81

ఒకేరోజు మూడు విభిన్నమైన అనుభవాలు, అనుభూతులు. వందల సంవత్సరాల క్రితం రాయి నుండి మనిషి మలచిన రత్నం ఎల్లోరా – ఆనందంలో ముంచే అందం. తనేం చేసినా తన్ని బాధ పెట్టడానికేనని నన్ను శతృవుగా చూపే రాజేశ్వరి – అర్థం చేసుకోలేని అర్ధాంగి. తన భర్తనే దేవుడిగా కొలుచుకుంటున్న సుధ. అణకువ నిండిన ఆకర్షణ.

హిందూ, బౌద్ధ, జైన మతాల శిల్పం విడివిడిగా ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఎల్లోరాలో చైత్యాలు, విహారాలు చూస్తుంటే బుద్ధుడినీ ధర్మాన్ని, సంఘాన్నీ శరణుజొచ్చిన వందలాది భిక్షుకులతో నిండిన ప్రశాంత భూమి కళ్ళకి కట్టినట్టయింది. మూడంతస్తుల రాతి కట్టడాలను ఆ కాలంలో నిర్మించడమెంతటి ప్రక్రియ? "కైలాస్" అన్న గుహాలయం అన్నిటికీ తలమానికం. రాయిని దొలచి అంత పెద్ద గుడిని అంత అందంగా నిర్మించినవాళ్ళనేమనాలి?

ఈ రాతి శిల్పాల్లో ఏమీ లేదని కొంచెంసేపు చూసి రాజేశ్వరి ఓ చోట కూర్చుండిపోయింది. సుధాకర్ కూడా ఉత్సాహం చూపించలేదు. అతను విశ్రాంతి తీసుకుంటుంటే సుధ నాతో బయల్దేరింది. మేమిద్దరం చాలా దూరం గుట్టలెక్కి దిగి అన్నీ చూస్తూ ఆఖరి జైన గుహాలయం చూసొచ్చేసరికి ఆలస్యమైంది. కాని ఆఖరి గుహాలయం చూస్తుంటే మాత్రం అంత దూరం నడిచింది మంచిదేననిపించింది – అంత అందంగా ఉందా జైన శిల్పం.

తిరిగి వచ్చే ప్రయాణమంతా రాజేశ్వరి దెప్పటమే – తనతో వచ్చానా, మిగతావాళ్ళతో తిరగడానికా అని అంటూ 'జీవమున్న మనిషికన్న శిలలే నయమనిపించును' అని అన్న కవి ఈ మనిషిని చూసే అనుంటాడు.

ఎన్నో వ్యసనాలకి బానిస. ఒకమ్మాయి ఆత్మహత్యకు కారకుడయిన సుధాకర్‌ని సుధ అంతగా ప్రేమిస్తుంటే, మామూలుగా మంచివాణ్ణయిన నన్ను రాజేశ్వరెంత బాగా చూడాలి? నాకు ఆరాధన అక్కర్లేదు. అర్థం చేసుకుంటే చాలు. అసలు మా ఇద్దరికీ పెళ్ళయుండకూడదు.

ఈవిడకి నేను సుధాకర్ గతం చెప్తే, వాడి పేరుతో నా గతాన్ని చెప్తున్నానని తిట్టగలదు కూడా. ఈవిడతో నా జీవిత రహస్యాలు కూడానా? ఏదో తప్పనిసరి కాపురంతోసరి –

రాజేశ్వరి డైరీ – 30 డిసెంబర్ 81.

ఈ సుధకిదేం పిచ్చి? నాసిక్ వెళ్దాం అంది. ఈయనా సరే, గంగిరెద్దులా తలడించారు. ఈ వయసులో తీర్థయాత్రలేంటి? ఆకతాయిగా అందరితోను తిరిగిన దానికీ గోదారి స్నానాలు, దేవుడి దర్శనాలు తక్కువయ్యాయా? మొగుడి దగ్గరి ఇదో ఆటేమో.

ఈ సుధాకర్, పాపం. నోట్లో నాలుక లేని మనిషి. మెత్తని వాణ్ణి చూసి ఈవిడిష్టం వచ్చినట్లు మాట్లాడుతోంది. అయినా అతనెంతో జాగ్రత్తగా, ఓర్పుగా కావలసినవన్నీ చూసుకుంటున్నాడు. రాజేశ్వరరావు గారూ ఉన్నారూ. ఎందుకూ? భార్యనొక గయ్యాళి గంపగా ఊరంతా చిత్రించడానికి. ఆయనేదో సోక్రటీసు అయిపోయాననుకుంటారు – భార్య గయ్యాళయితే. భార్యని మనిషిగాచూళ్ళేని ఆయనకి పెళ్ళేంటి?

సుధ గతమేంటి? దాని బతుకేంటి? అలాంటి సుధను సుధాకరెంత చక్కగా చూసుకుంటున్నాడో. ఇలాంటి గతాలు దాగవు. అతనికి తెలిసే ఉంటుంది. అయినా కొందరి ఆలోచనా సరళిలో సరళత్వం ఉంటుంది. ఎవరి అదృష్టం వాళ్ళది. నా బతుకింతే. నా ఖర్మింతే, పేరుకి మొగుడూ పెళ్ళాలం కాని, నేనాయన దృష్టిలో సూర్యకాంతానికి అత్తగార్ని.

నిన్న ఎల్లోరాలోనూ అంతే. ఆ సుధతో వెళ్ళారు. ఈ రోజు నాసిక్‌లోనూ అంతే. పొద్దున్న ఔరంగాబాద్ నుండి మన్మాడ్ ఒక రైలు అక్కడ నుండి నాసిక్ మరో రైలు ఎక్కివచ్చేసరికి ఒంటి గంటయింది. ఇంక ఇక్కడవేం చూడ్డం పదదని త్రయంబకేశ్వరుణ్ణి చూడ్డానికి ఇద్దరూ ఇరవై మైళ్ళు వెళ్ళారు, అదో రాధ. ఈయనో కృష్ణుడు. నా బ్రతుకేదో బ్రహ్మాండంగా ఏడుస్తున్నట్లు ఆ సుధ సుధాకర్ల కాపురం గురించి నాకెందుకు?

సుధాకర్ డైరి : 31 డిసెంబర్ 81

నాసిక్‌లో రెండవరోజు సుధ కోసం దిగాను కానీ, నాకసలా గుళ్ళూ గోపురాల్లో నమ్మకం లేదు. ఆత్మని మించి మరెక్కడా పరమాత్మ లేదు. ఈ విషయం ఎప్పుడో సుధకి అర్థమయ్యేట్టు చెప్పాలి.

సుధకి తెలిసే ఉంటుంది. శారద ఆత్మహత్యతో నాలో ఎంతో మార్పొచ్చిందనీ, నన్నేదో వేదాంతం ఆవరించిందనీ అనుకున్నాను కాని, అది అహంకారమని సుధ నడవడికతో తెలిసొచ్చింది. ఏ విషయాన్నైనా తేలిగ్గా తీసుకోవడం సుధకెంత బాగా వచ్చో. మొన్న ఎల్లోరాలోనో, నిన్నిక్కడో సుధా, రావూ విడిగా ఉన్నప్పుడెప్పుడో రావు సుధతో శారద ఆత్మహత్య గురించి చెప్పే ఉంటాడు. అయినా సుధ దాని గురించి



E:\Seelamma\
Seelama1
42

పట్టించుకోవడం లేదు. మానసికంగా సుధ చాలా ఎత్తులో ఉంది. ఎలాంటిబలహీనతలనైనా సరిగ్గా అర్థం చేసుకోగలదు. నన్నింకా అదే అనురాగంతో అభిమానంతో చూస్తోంది. అది నిజంగా నా అదృష్టం.

గోదావరి పుట్టిన చోట స్నానం చేస్తూ, కాలారాం గుడిలో ప్రదక్షిణ చూస్తూ, సీతా విగ్రహం చూడ్డానికి గుహ లోకి వెళ్తూ నా కోసమే ప్రార్థించానంది, ఎంతమంచిది.

నాకోసమింత చేస్తున్న, నన్నింతగా ప్రేమిస్తున్న సుధని నేను సరిగ్గా చూసుకుంటున్నానో లేదో? ఇంక చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. జీవితంలో లభించిన వరాన్ని పూర్తిగా తెలుసుకోలేదన్నాడు. వజ్రాన్ని ఎన్నాళ్ళు గుర్తించకుండా ఉండగలం?

ఈ రోజుతో పాత సంవత్సరం సమాప్తం. ఇదే నా కొత్త సంవత్సరం రిజల్యూషన్. సుధకి ఎలాంటి కష్టం కలక్కుండా జీవితాంతం భద్రంగా సుకుమార కుసుమంలా చూసుకుంటాను. కొత్త సంవత్సరానికి నిజమైన ఆహ్వానం ఇదే.

సుధ డైరీ : 1 జనవరి 82.

ప్రపంచంలో కొంత భాగాన్ని చూసి తిరిగి బొంబాయిలో రెండు రూముల ఫ్లాటు కొస్తే ఎంతో ఇరుగ్గా ఉంటుందనుకున్నాను కాని, ఈ ప్రయాణంలో ఒకటి బాగా తెలిసొచ్చింది. నాకు సుధాకర్ విశాల హృదయమనే భవనంలో నిరంతరం చోటుందని కొత్త సంవత్సరం నాకిచ్చిన నిజమైన బహుమతిది.

ఎల్లోరాలోనో, నాసిక్‌లోనో సుధాకర్ రాజేశ్వరి ఇద్దరే ఉన్నప్పుడు రాజేశ్వరి తన కసిన్‌కీ నాకూ మధ్యనున్న సంబంధం గురించి చెప్పే ఉంటుంది. సుధాకర్ ఆదరణ తగ్గలేదు సరికదా ఎక్కువయింది. కొత్త సంవత్సరంలో నాకింకా ఏఏ చోట్లు చూడాలనుంటే అవన్నీ చూపిస్తానంటున్నాడు. ఎంత విశాలమైన గుండె గూడుంది నాకు? ఇది నిజంగా నా అదృష్టం.

ఈ సంవత్సరం నుండి సుధాకర్నింకా బాగా అర్థం చేసుకుని, అతనికి కావల్సినవేవో తెల్సుకొని అతనికి నచ్చేటట్లుండాలి. తన క్కావల్సినవి తను చెప్పడు. నా కోసం ఏదన్నా చేస్తాడు. ఇంక నేనూ అలానే వుండాలి. మా బతుకులిలా ఉంటే చాలు. ఇంకేం ఇవ్వక్కర్లేదా దేవుడు.

రచయిత డైరీ : 2 జనవరి 82

వారం రోజులు నాలుగూళ్ళు తిరిగొచ్చిన నాకు కనిపించింది.రెండు జంటలు ఉన్నట్లుండి కలుసుకోవడం, హాయిగా ఊళ్ళన్నీ తిరగడం. కాని వాళ్ళ డైరీల్లో ఇంకా చాలా కథుంది.

రాజేశ్వరరావు రచయిత. మంచి కళాహృదయం ఉన్నవాడు. అతని గొప్ప తనాన్ని గుర్తించలేదు రాజేశ్వరి. ఆవిడలోని మామూలు ఆడగుణాన్ని అంగీకరించలేదు రావు. రోజూ రోజుకీ వాళ్ళిద్దరు ఎంతో దూరమవుతున్నారు. ఇంతకీ వాళ్ళ పాత జీవితాలు ఎంతో నిర్దుష్టమైనవి.

సుధ సుధాకర్ ఇద్దరి జీవితాలు సంఘం దృష్టిలో ఎంతో నికృష్టమైనవి. వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఎంతో ఆదరించుకొని, అభిమానించుకొని, ఆరాధించుకుంటున్నారు.

వారం రోజుల ప్రయాణం మొదటి జంట నింకా దూరంగానూ, రెండవ జంటను మరీ దగ్గరగానూ చేసింది.

ఎంత చిత్రం!!



E:\Seelamma\

Seelama1

43



# క్రైం 2000

**“ను**వ్వెంత చెప్తున్నా నాకు భయంగానే ఉందిరా!”

“ఏం భయం లేదు, బాబాయ్! నేనున్నాగా నీకెందుకు భయం?”

“ఎవరన్నా చూస్తే....? ఎవరికైనా మనమీ పని చేస్తున్నామని తెలిస్తే?”

“ఎవరికీ తెలియదని చెప్తున్నానా? అందరికీ తెలిసేటట్లు చేస్తామా? నాకు ఆ బాంక్ గురించి అంతా తెలుసు. వాళ్ళ సెక్యూరిటీలో లోపాలన్నీ నేను కనిపెట్టేశాను.”

“నువ్వింకా చిన్నపిల్లాడివి. నువ్వు లోపాలని అనుకుంటున్నవి లోపాలో, కాదో! మనం ఏదన్నా చెయ్యబోయే లోపుగానే వాళ్ళకీ విషయం తెలిసిపోయి మనల్ని పట్టేసుకుంటారేమో?”

“నీదంతా చాదస్తం, బాబాయ్! అయినా నన్ను నువ్వింకా చిన్నపిల్లాడిలా చూడటం నాకేం నచ్చలేదు.”

“నువ్వు చిన్న పిల్లాడివి కాక పెద్దాడివేంటి? నిండా పదహారేళ్ళయినా రాలేదు!”

“ఇలాంటి విషయాల్లో నా వయస్సే సరైనది. నాకు అర్థమైనట్లుగా నీకు అర్థం అవుతుందా ఏమిటి?”

“నా భయమే అది. నువ్వు చెప్పేది నాకు కూడా అర్థమైతే ధైర్యంగానే ఉంటుంది. నీ భాషే నాకు అర్థమవడం లేదు. నువ్వు ఆ బేంక్‌నుండి డబ్బు ఎలా దొంగతనం చేస్తానంటున్నావో నాకు అసలు తెలియడం లేదు.”

“ఆ సంగతి నాకు వదిలెయ్యమంటున్నానా? నా మీద ఆ మాత్రం నమ్మకం ఉంచలేవా? నేను ఏం చేస్తానో, ఎలా చేస్తానో నీకు అనవసరం! ఈ రోజు రాత్రి సరిగ్గా పదకొండు గంటలకు ఆ బేంక్ నుండి కొన్ని లక్షల రూపాయల్ని తీసి నీ అకౌంట్లో వేస్తాను. ఆ తరువాత ఆ బేంక్‌లోని నీ అకౌంట్లో నుంచి కొంత చొప్పున వేరే బేంకులో ఉన్న నీ అకౌంట్లోకి మార్చేసుకో. ఆ విషయం ఎవరికీ తెలియదు. నన్ను నమ్ము!”

“అయితే రాత్రి పదకొండింటికి మనం ఆ బేంక్ దగ్గరకి వెళ్ళాలా?”

“అక్కర్లేదు. మనం నీ ఆఫీస్‌కి వెళ్తే చాలు. అక్కడ నీ గదిలోనే మనకి కావల్సిన

సరంజామా అంతా ఉంది."

"ఆఫీసులో నా గదిలోనా? ఎప్పుడు పెట్టావక్కడ? నిన్నా మొన్నా మా ఆఫీస్‌కి వచ్చినప్పుడా?"

"నేనేం తీసుకొచ్చి పెట్టలేదు. అదంతా నీ ఆఫీస్ గదిలోనే ఉంది. అయితే దాన్నెలా వాడాలో నీకు తెలియదు, నాకు తెలుసు. అంతే తేడా! ఈ రోజు రాత్రి పదకొండింటికి ఓ అరగంట ముందుగా నీ ఆఫీసులో ఏదో ఒక పని పెట్టుకుని వెళ్దాం. సరే నేను, బాబాయ్?"

"సరే."

❋ ❋ ❋

"ఈ టైంకి ఎందుకు వచ్చామా అని గూర్ఖాకి అనుమానం కలుగకుండా ఏదో చెప్పాను. కానీ నాకు భయంగానే ఉంది. చీకట్లో నువ్వు పని చేసుకోగలవా?"

"నువ్వు మాట్లాడకుండా చూస్తుండు. టార్చ్ లైట్ ఉందిగా అది సరిపోతుంది. నీ భయమే కానీ, మనం చేస్తున్న పని ఎవరి కంటా పడదు. అంతా సాఫీగా అయిపోతుంది.

"ఏం చేస్తున్నావు?"

"బేంక్ సైట్‌కి వెళ్తున్నాను."

"ఇక్కడ నుండి ఇలాగేనా?"

"అంతా ఇక్కడ నుండే?"

"ఏం అడ్డాలు ఉండవా?"

"ఎందుకుండవు? ఉంటాయి. అయితే ఈ అడ్డాలని దాటే మార్గం నాకు తెలుసు."

"ఇప్పుడెక్కడున్నావు?"

"బేంక్ సైట్‌లో వాళ్ళ సేవింగ్స్ బేంక్ అకౌంట్స్ దగ్గర."

"ఏం చేస్తావిప్పుడు."

"అది నీకు అర్థం కాదు కానీ, ఒక్క పది నిముషాల్లో నీ అకౌంట్‌లో లక్షకి తగ్గకుండా క్రెడిట్ అవుతుంది. సరేనా?"

"కానియ్యి. నేను చూస్తూంటాను. అయితే నువ్వు ఇక్కడ నుండి ఈ పని చేస్తున్నట్లు ఎవరికీ తెలియదా?"

"తెలియకుండా చేద్దామనే నా ప్రయత్నం. నన్ను మాట్లాడించకు. నాకు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. అదిగో కావల్సిన చోటుకి వచ్చేశాం. ఇదిగో దీన్ని మార్చేస్తే సరిపోతుంది."

"ఏంటది?"





"బేంక్ వాళ్లు వడ్డీ కట్టడానికి వాడేది. దాన్ని మనం మార్చేస్తే ఒక పది నిముషాల్లో మన పని అయిపోతుంది."

"ఎవరికైనా మనం ఇలా చేస్తున్నట్లు తెలుస్తుందా?"

"ఆ విషయం మనకి ఇప్పుడే తెలుస్తుంది. ఏవన్నా అలార్మ్ ఉన్నాయా? ఉంటే ఎవరన్నా చూస్తారా? చూస్తే మనల్ని పట్టుకోగలరా? ఇవన్నీ ఇప్పుడే తెలుస్తాయి. అందుకనే నాకు నెర్వస్‌గా ఉంది."

"తెలిసేందుకు కాని, పట్టుకునేందుకు కానీ అవకాశమే లేదన్నావు కదరా, బాబూ! ఇప్పుడిలా అంటావేంటి? నాకు భయం వేస్తోంది. నువ్వు తొందరగా చెయ్యి. నేనింక ఏమీ మాట్లాడను. అయ్యాక చెప్పు. అంతవరకూ కళ్ళు మూసుకుని దేవుణ్ణి ప్రార్థించుకుంటూ ఉంటాను."

"ఎస్! అయిపోతోంది. మార్చడం అయిపోయింది. నీ అకౌంట్‌లోకి ఆరు లక్షలు పైనే క్రెడిట్ అవుతోంది."

"అలా అరవకు. ఆరు లక్షలా? మై గాడ్! ఇందాక నువ్వు ఓ లక్ష రూపాయలని అన్నావు కదా!"

"ఎంతో పని అయ్యేవరకూ తెలియదు, బాబాయ్! ఒక్కోసారి ఇంతకన్నా ఎక్కువ కూడా రావచ్చు."

"ఒక్కోసారి అంటున్నావు. ఇలా మళ్ళీ ఇంకోసారి తీసుకోవచ్చునా ఏంటి?"

"నెలకో సారి తీసుకోవచ్చును. చూసుకో ఇక ఓ సంవత్సరంలో నువ్వు కోటీశ్వరుడైపోతావ్, బాబాయ్!"

"ఇది ఎవరికీ తెలియదు కదా? రేపు పొద్దున్నా బేంక్ వాళ్ళు మనింటికి వచ్చి పట్టుకోరు కదా! పోలీసులంటే నాకు చచ్చేంత భయం."

"ఎవరికీ తెలియదు. నువ్వేం భయపడకు. వచ్చే నెల వద్దామా, లేదా... అది చెప్పు..."

"ఇంత డబ్బు ఇంత సులభంగా వస్తోంటే, వదిలేసుకుంటామా? తప్పకుండా వద్దాం. అయితే ఎవ్వరికీ తెలియకుండా ఈ దొంగతనం చెయ్యాల్సిన బాధ్యత నీది."

"దీన్నసలు దొంగతనం అనరు. మనం ఎక్కడనుండీ డబ్బులు తీసెయ్యడం లేదు."

"మరి మనకి డబ్బెలా వస్తోంది?"

"అదే రహస్యం. దాన్ని వదిలెయ్యి. నువ్వు ఈ బేంక్ అకౌంట్లోంచి సాధ్యమైనంత తొందరగా డబ్బుని ఇంకో బేంక్‌లోకి మార్పించేయ్! ఆ తరువాత దాన్ని తీసేసెయ్యి. అదంతా నీ పని."

"అదేం కష్టం కాదులే. ఆ సంగతి నేను చూసుకుంటా. ఈ సంగతి నువ్వు చూసుకో."

"ఇంక పోదాం, పద!"

❁ ❁ ❁

"ఏంటి ఆ బేంక్ స్టేట్‌మెంట్‌ని అంత సేపు చూసుకుంటున్నారు?"

"రా, ఇలా వచ్చి కూర్చో! ఇందులో ఏదో తప్పు ఉన్నట్లుంది."

"తొందరగా చెప్పండి. నాకు వంటింట్లో బోల్డు పని ఉంది. ఏం, ఏదన్నా మనది కాని డబ్బు మన అక్కౌంట్‌లో వేశారా ఏంటి? అలా వేస్తే ఆ డబ్బుని వెంటనే తీసేసుకోండి."

"నీ కంతా సరదాయే కానీ, మనది కాని డబ్బు మన దాంట్లో వేస్తే మాత్రం మనం తీసేసుకుంటామా? మనకి రావల్సిన వడ్డీ మనకి సరిగ్గా వచ్చినట్లే లేదు."

"మనకి వడ్డీ ఎంత ఏంటి అది సరిగ్గా రావడానికి?"

"ఎంతయితే అంతే. మనకి ఈ బేంక్‌లో కొన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్స్ ఉన్నాయి కదా – ఆ వడ్డీ సరిగ్గా జమ చెయ్యలేదేమో అనిపిస్తోంది."

"మీకంతా అనుమానమే. వాళ్ళు సరిగ్గానే లెక్క కడతారు. అందులోనూ ఇప్పుడు లెక్కలు కట్టడానికి కంప్యూటర్లని వాడుతున్నారు. అందులో తప్పేం ఉండదు."

"న్యాయానికి ఉండకూడదు – కానీ – ఈ ఒక్క నెలా కాదు. మూడు నెలలుగా తప్పే ఉంది. అందుకే అనుమానంగా ఉంది."

"ఇంతకీ తేడా ఎంతేమిటి?"

"ప్రతి నెలా ఓ ఆరున్నర తేడా వస్తోంది."

"ఇంతా చేసి ఆరున్నరా? నేనింకా ఏ వందో, రెండొందలో అనుకున్నాను."

"ఆరున్నర ఎక్కువా, తక్కువా అని కాదు. అసలు ఎందుకు తేడా రావాలీ అనే నా ఆలోచన?"

"వెళ్ళి ఆ బేంక్ మేనేజర్‌ని అడగకండి, బావుండదు."

"ఇందులో బావుండక పోవడానికి ఏముంది? మనకి రావల్సింది రాకపోతే అది ఎంతైనా అడగచ్చు. అంతేకాదు, అసలు ఇలా ఎలా జరుగుతోందో కూడా తెలుసుకోవచ్చు."

"మీ ఇష్టం మీది! నా నోటి దురద కానీ నేను చెప్తే మాత్రం మీరు వింటారా ఏదన్నానా? ఇప్పుడే వెళ్తారా?"

"నువ్వలా అంటే నేనేం చేస్తాను? నాకు లెక్కంటే సరిగ్గా ఉండాలనిపిస్తుంది.



E:\Seelamma\
Seelama1
45

అందులోనూ లెక్క సరిగ్గా చూడాల్సిన బేంక్ వాళ్ళే ఇలా చేస్తే, అసలు బావుండదు. దానికి తోడు మనిషి లెక్క చేసేది కంప్యూటర్, అదెలా తప్పు చేస్తోందో?"

"తప్పు కంప్యూటర్‌ది అయ్యుండదు, అక్కడకి వెళ్ళాక తప్పు మీదే అని చెప్తారు వాళ్ళు. మీ తిక్క వదులుతుంది!"

"వాళ్ళేమంటారో చూద్దాం, వెళ్ళొస్తాను."

❁ ❁ ❁

"మీరు చెప్పేది కరెక్ట్‌గానే ఉంది. కానీ ఇలా ఎందుకు జరిగిందో నాకు తెలియడం లేదు. మీకు రావల్సిన వడ్డీ కన్నా, పోయిన మూడు నెలలుగా ఆరున్నర ఎందుకు తక్కువగా ఉందో తెలియడం లేదు."

"నా లెక్క సరిగ్గా ఉందో లేదో కనుక్కుందామని వచ్చాను. మీరూ నా లెక్కే కరెక్టని అంటున్నారు. మరి ఈ తప్పు ఎలా వచ్చి ఉంటుందో."

"ఇప్పుడు మొత్తం చేసేదంతా కంప్యూటరే. ఈ వడ్డీ లెక్క పెట్టే పని కూడా కంప్యూటరే చేస్తుంది. అందులో తప్పు వచ్చే అవకాశమే లేదు. ఇంతకు ముందు ఇలాంటి తప్పేదన్నా జరిగిందా మీ అక్కౌంట్‌లో?"

"లేదు. గత మూడు నెలలుగానే జరుగుతోంది."

"మీరెప్పుడు చూశారు?"

"మీరు నెలనెలా స్టేట్‌మెంట్ పంపిస్తారు కదా? మొదటి నెల చూడలేదు. పోయిన నెల చూశాను కానీ, అంతగా పట్టించుకోలేదు. ఈ సారీ అలానే ఉండడంతో మిమ్మల్ని అడుగుదామని వచ్చాను. మీరు తెలిసినవాళ్ళు కదా అని వచ్చాను. అంతే కానీ ఇంత చిన్న మొత్తానికి మీలాంటి పెద్ద ఆఫీసర్ని ఇబ్బంది పెట్టాలని కాదు."

"ఇదేం ఇబ్బంది కాదు. కానీ ఇది ఇలా ఎందుకు జరిగిందో నాకు అర్థం కావడం లేదు. వడ్డీ లెక్క కట్టే విధానం అంతా సరిగ్గానే ఉందనీ, ఆ కంప్యూటర్ ప్రోగ్రామ్స్ అన్నీ సరిగ్గానే పని చేస్తున్నాయనీ, అప్పుడప్పుడు మా వాళ్ళు వెరిఫై చేసి చెప్తూనే ఉంటారు. ఓ వారం క్రితం కూడా వాళ్ళు చెక్ చేశారు."

"నా అకౌంట్‌లో ఎందుకో ఏదో తప్పయి ఉంటుంది. మిమ్మల్ని ఈ విషయంలో ఇబ్బంది పెట్టినందుకు ఏమీ అనుకోకండి!"

"ఆ మాటే వద్దు. మేమున్నదే ఇలాంటివి చూసుకునేటందుకు. అసలు ఎందుకు జరిగిందా అని ఆలోచిస్తున్నాను. ఇలా ఇంకెవరి అకౌంట్‌లోనైనా జరిగితే, వాళ్ళు చెప్పడానికి రాకపోవచ్చు కూడా. మీరు వచ్చారు."

"అంటే ఇలా ఇంకెవరి అకౌంట్‌లోనైనా జరిగే అవకాశం కూడా ఉండి

ఉంటుందా?"

"ఏమో తెలియదు. వాళ్ళు వచ్చి చెప్తే కదా మాకుతెలిసేది. మీరు వచ్చినట్లు ఇంకెవరూ రాలేదు. అందుకని అంతా సవ్యంగా ఉందనే మేము అనుకుంటున్నాము."

"మీరు ఏమీ అనుకోనంటే ఒక్క మాట. మీరు ఇంకెవరిదైనా అకౌంట్ కూడా ఒకసారి చెక్ చెయ్యకూడదా?"

"మీ అనుమానం ఏమిటి?"

"అబ్బే నాకేం అనుమానం లేదు. నాలాగా ఇంకా ఎవరైనా నష్టపోతున్నారో, లేదో తెలుస్తుంది కదా అని."

"అలానే చూస్తాను. మీ అకౌంట్ ముందు సరిచేయిస్తాను. ఆ తర్వాత ఇంకొందరి అకౌంట్‌లలో వడ్డీ లెక్క సరిగ్గా ఉందోలేదో చూడమంటాను."

❁ ❁ ❁

"ఏంటి నాన్నా అలా ఆలోచిస్తూ కూచున్నావు."

"ఏం లేదమ్మా"

"ఏమీ లేకపోవడం ఏంటి? ఆఫీస్ నుండి వచ్చినప్పట్నుండీ చూస్తున్నాను. ఏదో ఆలోచిస్తూనే ఉన్నావు. ఏం ఏదన్నా సీరియస్ కేసా?"

"అవునమ్మా. ఓ బేంక్‌లో దొంగతనం గురించి."

"దొంగతనమా - అది మామూలు విషయమే కదా ఏమీ స్పెషల్ ఇంట్రస్ట్ ఉండదు."

"ఇది మామూలు దొంగతనం కాదు. అసలు దొంగతనమో, కాదో కూడా తెలియడం లేదు."

"అయితే చెప్పు, నేను నీకు సాయం చేస్తాను."

"నీ వయస్సెంత? పధ్నాలుగేళ్ళు. సి.బి.ఐ. ఆఫీసర్‌గా నా అనుభవమంత లేదు నీ వయస్సు. నువ్వు నాకు సాయం చేస్తావా? కేస్ గురించి విను. ఓ బేంక్‌లో ఒక కస్టమర్ అకౌంట్‌లో పోయిన మూడు నెలల నుండి వడ్డీ ఆరున్నర రూపాయలు తక్కువ క్రెడిట్ అవుతోందిట."

"ఆరున్నర రూపాయల దొంగతనం కేసు మీ సి.బి.ఐ.కి వచ్చిందా? దాన్ని ఇంత సీనియర్‌వి అయిన నీకు ఇచ్చారా? దాని కోసం నువ్వు తల బద్దలు కొట్టుకుంటూన్నావా?!"

"ఆ కస్టమర్‌కి అయినట్లే ఇంకా కొందరి అకౌంట్‌లలో కూడా అవుతోందిట. కొందరి అకౌంట్‌లో అంతకన్నా తక్కువా, మరి కొందరి అకౌంట్‌లో అంతకన్నా ఎక్కువానూ. అయితే ఎవరి దానిలోనూ పది రూపాయల కన్నా ఎక్కువ కాదు."

"అంటే మొత్తం అంతా కలిపితే తక్కువ కాదన్నమాట."

"అదీ విషయం. ప్రతీ నెలా ఓ లక్షకి తక్కువ కాకుండా పోతూ ఉండి ఉంటుందని అనుకుంటున్నారు. ఒక్కో నెల పది లక్షలు కూడా దాటొచ్చునేమో అంటున్నారు."

"బేంక్‌కి బాగా లాభం అన్న మాట."

"అదే కదా అసలు సంగతి. అలా అందరికీ తక్కువ వడ్డీ ఇస్తే బేంక్‌కి ఆ డబ్బు మిగలాలి కదా. అలా మిగలడం లేదు. బేంక్ ఇచ్చే మొత్తం వడ్డీ అలానే ఉంటోంది."

"అంటే బేంక్‌లో వాళ్ళు ఎవరో ఈ పని చేస్తూ ఉండి ఉండాలి."

"వడ్డీ లెక్క కట్టేది బేంక్‌లో పనిచేసే వాళ్ళెవరూ కాదు. అదంతా చేస్తున్నది కంప్యూటరే."

"ఇంతకీ ఆ బేంక్‌లో ఉన్న అందరి కస్టమర్ల అకౌంట్లలోనూ ఇలా తక్కువైందా? ఆ బేంక్ నెలనెలా ఇస్తున్న వడ్డీ సరిగ్గానే ఉంటోందంటే అలా తక్కువైన డబ్బు ఏమవుతున్నట్టు?"

"అదే కదా మనం తెలుసుకోవలసింది. నిజానికి బేంక్‌కీ ఏ నష్టమూ లేదు. నష్టం అంటూ జరుగుతూంటే అది కస్టమర్లకే. అదీ చాలా తక్కువ. అయితే అసలు ఎలా జరుగుతోంది, ఎందుకు జరుగుతోంది - ఇదీ మనం కనుక్కోవలసింది."

"ఇలా అందరి అకౌంట్‌లోనూ తక్కువగా క్రెడిట్ అయిన వడ్డీ ఇంకెవరి అకౌంట్‌లోనైనా క్రెడిట్ అవుతోందేమో చూశారా?"

"అలా చూడాలంటే, అందరి అకౌంట్‌లలోనూ ఎప్పుడూ ఎంత క్రెడిట్ అవుతుందో చూడాలి. అంటే లక్షల ఎంట్రీలు చూడాలి. అదేమంత తేలిక కాదుగా."

"అసలీ వడ్డీ లెక్క పెట్టే ప్రోగ్రాం చూస్తే సరిపోదూ?"

"అదీ చూశారు. ఆ ప్రోగ్రాం సరిగ్గానే ఉందిట. దానితో వడ్డీలు లెక్క కట్టి చూస్తే సరిగ్గానే వస్తున్నాయట."

"మరి ఆ ప్రోగ్రాంతోనే నెలనెలా వడ్డీ లెక్క కట్టి ఉంటారు కదా?"

"అవును"

"అప్పుడు సరిగ్గా చెయ్యక ఇప్పుడు సరిగ్గా చేస్తోందా? తమాషాగా ఉందే. పోనీ, ఒక్క విషయం చూశారా? ఎవరి అకౌంట్‌లోనైనా ఎక్కువగా వడ్డీ క్రెడిట్ అవుతోందా?"

"అది మేమూ అనుమానించామమ్మా. అందుకే అదీ చూశాం. ఎవరి దానిలోనూ ఎక్కువ వడ్డీ క్రెడిట్ అవడం లేదు."

"ప్చ్...! అంటే అకౌంట్ ఉన్న వాళ్ళందరికీ అందిన వడ్డీ. బేంక్ ఇస్తున్న వడ్డీ


E:\Seelamma\ Seelama1 46

ఒకటి కాదన్నమాట."

"కరెక్ట్. నిజానికి ఈ విషయం వడ్డీ లెక్క కట్టే ప్రోగ్రాం చెప్పాలి. అయితే అది ఆ విషయం చెప్పడం లేదు, ఆ ప్రోగ్రాం రాసిన వాళ్ళకీ, దాన్ని వాడుతున్న వాళ్ళకీ అదే ఆశ్చర్యంగా ఉంది."

"అంటే ఎవరో ఆ ప్రోగ్రాంని మార్చారన్న మాట."

"కానీ ఇప్పటికీ ప్రోగ్రాంలో ఏమి మార్పులు లేవంటున్నారు. ఆ బేంక్‌లో కంప్యూటర్ సంగతి చూసేవాళ్ళు."

"ఆ ప్రోగ్రాంని ఎప్పుడూ వాడతారో తెలుసా నీకు?"

"నెలకి ఒక్కసారే. అదీ నెల చివర."

"ఎప్పుడు? దాన్నెవరు వాడుతారు?"

"నిజానికి దాన్ని ఎవ్వరూ వాడరు. నెల చివరి రోజు రాత్రి పదకొండింటికి దానికదే వడ్డీ లెక్క కట్టేస్తుంది. అలా ఏర్పాటు చేసుకున్నారు ఆ బేంక్ వాళ్ళు."

"కంప్యూటర్లని వాడుతున్న వాళ్ళు చాలామంది ఆ పనే చేస్తారు. ఎవరన్నా మనిషి చేయాలంటే దాన్ని చేస్తారో లేదో అన్న అనుమానం ఉంటుంది. కంప్యూటర్‌నే అలా సెట్ చేస్తే ఇంక ఆ పని అవదేమోనన్న భయం లేదు."

"అంటే ఆ ప్రోగ్రాం రాత్రి పదకొండింటికి పని చేస్తుందన్నమాట."

"అవును."

"ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న వాళ్ళెవరైనా ఇలా ప్రోగ్రాం మార్చే అవకాశం ఉందా?"

"అక్కడ ఆ సమయంలో కంప్యూటర్లని మెయిన్‌టైన్ చేసే ఇంజనీర్లుంటారు. అయితే వాళ్ళెవరికీ ఈ పని చేసే అవకాశం లేదు. వాళ్ళకి ఈ సంగతులు తెలియవు. వాళ్ళకి ఈ పని చేసేందుకు అవసరమైన హక్కులు లేవు. ఆ పాస్‌వర్డ్ వాళ్ళకి తెలియదు."

"అది మనం ఖచ్చితంగా చెప్పగలమా?"

"అంతకన్నా ముఖ్యంగా వాళ్ళ ఎవరి అకౌంట్లలోనూ ఈ మధ్యకాలంలో ఎక్కువ డబ్బు క్రెడిట్ అవలేదు. వాళ్ళ జీవన విధానంలో కూడా ఏమీ మార్పు లేదు. ఇవన్నీ మేము చూశాం. మాకు వాళ్ళెవరి మీదా అనుమానం లేదు."

"అయితే ఇది బయటివాళ్ళ పనేనన్నమాట!"

"ఎవరూ ఆ సమయంలో బేంక్‌లోకి వచ్చిన దాఖలాలు లేవు. అక్కడి రిజిష్టర్లని చూశాం. సెక్యూరిటీ వాళ్ళని అడిగాం. బయటివాళ్ళు ఎవరూ వచ్చినట్లు లేదు."





"వాళ్ళు అక్కడికి రానక్కర్లేదు. ఎక్కడనుండైనా, ఇంటర్నెట్‌కి కనెక్ట్ అయిన ఏదో ఒక పీసీ నుండి బేంక్ వాళ్ళ కంప్యూటర్ మీద పనిచెయ్యవచ్చు."

"నేనూ విన్నాను. దాన్నేనా హేకింగ్ అంటారు?"

"అవును. బేంక్‌వాళ్ళు హేకింగ్ అవకుండా చాలా జాగ్రత్తలు తీసుకునే ఉంటారు. అయినా ఇంత ప్రపంచంలో ఎవరో ఒకరు ఏదో ఒక రకంగా హేకింగ్ చెయ్యగలగచ్చు. చేస్తే ఇలా కొత్తరకం దొంగతనాలు చెయ్యవచ్చు. అయితే ఈ దొంగతనం చేసే వాళ్ళు ఆరితేరిన దొంగలు అయ్యుండరు. సరదాగా మొదలెట్టి చేస్తున్న వాళ్ళు అయ్యుంటారు."

"అలాగని ఎలా చెప్పగలవు?"

"పెద్ద దొంగలే అయితే ఇలా కొంత కొంత తీసుకోవడం ఎందుకు? ఒక్కసారే చాలా డబ్బు తీసేసుకోవచ్చు కదా?"

"అంటే బేంక్ కంప్యూటర్‌ని హేక్ చెయ్యగలిగితే ఎంతైనా తీసేసుకోవచ్చునన్నమాట."

"బేంక్ అకౌంట్ అంటే ఏంటి డబ్బేగా? ఆ అకౌంట్‌ని మార్చగలిగితే ఇంక ఏముంది?"

"ఇప్పుడు మనం ఏం చెయ్యాలో చెప్పు?"

"ఎవరో బయటివాళ్ళు ఈ పని చేస్తున్నారేమో అని మనం అనుమానిస్తున్నామన్న విషయం ఎవరితోనూ అనవద్దు. ఈ నెలాఖరు రాత్రి, మనం ఆ కంప్యూటర్‌ని అబ్జర్వ్ చేద్దాం. మనకి ఎవరు ఏం చేస్తున్నారో తెలుస్తుంది. మనం అదృష్టం బావుంటే వాళ్ళు ఏ పీసీ నుండి చేస్తున్నారో కూడా తెలియవచ్చు."

"అయితే ఈ నెలాఖరు రాత్రి మనం ఆ బేంక్‌కి వెళ్దామా?"

"అక్కరలేదు. మనింటినుండే ఆ పని చెయ్యొచ్చు. మన పీసీ నుండే అంతా చూడొచ్చు. అయితే ఆ బేంక్ కంప్యూటర్ వాడేందుకు కావల్సిన పాస్‌వర్డ్సు అవసరం అవుతాయి. అవి మాత్రం కావాలి.

"బేంక్ వాళ్ళని అడిగి తీసుకుంటాను. ఈ పని చేసేవాళ్ళకి అవి ఎలా వచ్చి ఉంటాయి?"

"హేకింగ్ అంటేనే అది. ఇంటర్నెట్ మీద కూచుని ఏ కంప్యూటర్ సెక్యూరిటీలో ఎలాంటి లోపం ఉందీ, దాన్నెలా వాడుకోవాలీ అని చూస్తుంటారు. అలానే పాస్‌వర్డ్సు కనుక్కునే ప్రయత్నాలూ చేస్తూనే ఉంటారు."

"పాస్‌వర్డ్సు కనుక్కోవడం అంత తేలికా?"

'తేలికా అంటే కాదు. కాదూ అంటే తేలికే. అదో విద్య. మాలాంటి చిన్న పిల్లలకి అదో సరదా. నేనలా ఎన్నోసార్లు చేశాను."

"నువ్వు హేకింగ్ చేసావా?"

"సరదాకే నాన్నా. నువ్వేం భయపడకు. నేను దొంగలని పట్టుకుందుకే కానీ దొంగతనం చెయ్యడానికి నా విద్యను వాడను.

❁ ❁ ❁

"ప్రతి నెలా చేస్తున్నట్టే ఈ నెల కూడా ఎవరో ఈ పని చేస్తారన్న నమ్మకంతో వెయిట్ చేస్తున్నాం. అసలు నీ ఆలోచన కరక్టో, కాదో!"

"చూద్దాం, మీరిలా ఎన్నోసార్లు దొంగలకోసం, హంతకుల కోసం కూర్చుని ఉండరూ?"

"లెక్కలేనన్నిసార్లు, అయితే అప్పుడు దొంగో, హంతకుడో ఎటునుండి వస్తాడో, వస్తే ఎలా పట్టుకోవాలో ఆ విద్యలన్నీ తెలుసు మాకు. ఈ పర్సనల్ కంప్యూటర్‌ని చూస్తూ కూచుంటే ఏం జరుగుతుందో తెలియడం లేదు."

"అది నాకు తెలుసు. ఈ దొంగను పట్టుకునేందుకు గన్నులు పనిచెయ్యవు. కంప్యూటర్లే కావాలి."

"టైం పదకొండవుతోంది. వస్తాడేమో చూడు."

"వస్తాడో, వస్తుందో తెలియదు. ఆ కంప్యూటర్‌ని వాడుతున్న వాళ్ళు అందరి పేర్లూ కనిపిస్తున్నాయి చూశావా? మనం కాకుండా ఇంకా పదిహేను మంది ఉన్నారు. వాళ్ళలో పదమూడుమంది బేంక్‌కి సంబంధించిన వాళ్ళే. మిగతా ఇద్దరూ బయటనుండి పనిచేస్తున్నారు. వాళ్ళకి ఇప్పుడే తీరిక ఉందేమో వాళ్ళ అకౌంట్‌లో డబ్బెంత ఉందో చూసుకుంటున్నారు."

"అవన్నీ నీకు తెలుస్తున్నాయా?"

"ఎవరు పనిచేస్తున్నారో ఏ ప్రోగ్రాం వాడుతున్నారో అన్నీ కనిపిస్తాయి ఇందులో. అందరికీ కాదు. సిస్టం అడ్మినిస్ట్రేటర్ పాస్‌వర్డ్ తెలిసిన వాళ్ళకే. మనకా పాస్‌వర్డ్ తెలుసు కాబట్టి మనం చూడగలుగుతున్నాం. ఆ పాస్‌వర్డ్‌తో నిజానికి మనమీ బేంక్ కంప్యూటర్ మీద ఏదన్నా చెయ్యొచ్చు. అదిగో. ఇంకెవరో బేంక్ కంప్యూటర్ మీద పని చెయ్యడానికి వచ్చారు."

"పేరేమిటో?"

"వాళ్ళూ సిస్టం అడ్మినిస్ట్రేటర్‌గానే పనిచేస్తున్నారు. బేంక్‌లో ఇంకెవ్వరినీ సిస్టం అడ్మినిస్ట్రేటర్‌గా పని చెయ్యవద్దని చెప్పాం కాబట్టి వాళ్ళెవరూ అయ్యుండరు. వీడు



E:\Seelamma\ Seelama1 48

ఎవడో వడ్డీ దొంగే అయ్యుంటాడు."

"ఇలా బేంక్ సైట్‌లోకి వెళ్ళిపోవడం అంత సులభమా?"

"అలా అని నేనను. అయితే ఈ విద్య తెలిసిన వాళ్ళకి అంత కష్టమూ కాదు. ఎంత ప్రొటెక్షన్ పెట్టినా ఏదో ఒక మార్గం దొరుకుతుంది."

"ఇప్పుడేం చేస్తున్నాడు వాడు?"

"వాడో అదో అదిగో వడ్డీ కట్టే ప్రోగ్రాంని మారుస్తున్నారు. అంటే కంప్యూటర్ ఈ మారిన ప్రోగ్రాంతో వడ్డీ కడుతుందన్న మాట. నేను ఈ మార్చిన ప్రోగ్రాంని మన పీసీలోకి దించుతున్నాను. దీన్ని చూస్తే వాళ్ళు ఏం చెయ్యదలుచుకున్నారో తెలుస్తుంది."

"దించేసావా?"

"ఆ, వడ్డీ కట్టడం అయిపోయాక వాళ్ళు మళ్ళీ ఆ ప్రోగ్రాంని మొదట ఎలా ఉందో అలానే మార్చేస్తున్నారు. అయితే ఈ మార్పులన్నీ జరిగినట్లు తెలిపే రికార్డుని తీసేస్తున్నారు. అంతే కాదు. ఈ కంప్యూటర్‌లో పనిచేసినట్లు ఉండే రికార్డుని కూడా తీసేస్తున్నారు. చాలా బ్రిలియంట్ ఫెలో. అన్నీ పకడ్బందీగా చేస్తున్నారు. ఈ కంప్యూటర్ మీద ఎవరు  ఎప్పుడు ఏ పని చేశారో అన్న రికార్డుని లాగ్ అంటారు. అందులో వాళ్ల ఈ సమయంలో ఈ పని చేసిన విషయం రికార్డయి ఉంటుంది. దాన్ని తీసెయ్యకపోతే తరువాత చూసిన వాళ్ళకి ఎవరో ఈ సమయంలో ఈ పని చేసినట్లు తెలుస్తుంది.  లాగ్ లోంచి ఈ విషయాన్ని తీసెయ్యడం వల్లనే వాళ్ళు ఎవరికీ పట్టుపడలేదు. అయితే ఇలా తీసేయ్యడం మామూలుగా సాధ్యం కాకూడదు. ఇది ఈ కంప్యూటర్‌లో ఉన్న లోపం. దీన్ని వాడుకుంటున్నారు."

"అలా తీసేసిన డబ్బుని ఏం చేస్తున్నారు?"

"అది వాళ్ళు మార్చిన ప్రోగ్రాంలో ఉండి ఉంటుంది. అది చూస్తే తెలుస్తుంది. పని అయిపోయిందిగా, వెళ్ళిపోతున్నారు.

"అంటే మనం పట్టుకోకుండానే వెళ్ళిపోతున్నారా?

"ఈ ప్రోగ్రాంలో ఆ డబ్బుని ఏం చేస్తున్నారో ఉండి ఉంటుంది. దాంతో మనం పట్టుకోవచ్చునని అనుకుంటున్నాను నేను."

"తొందరగా చూసి చెప్పు."

"ఇదిగో ఇలా అన్ని అకౌంట్లలోనూ తగ్గించిన డబ్బుని ఈ  అకౌంట్ నంబర్‌లో జమ చేసుకుంటున్నారు.

"ఏది ఆ అకౌంట్ నంబర్?"

"ఇదిగో. ఈ అకౌంట్ నంబర్. ఈ నంబర్ ద్వారా బేంక్ రికార్డులో పేరూ అడ్రసూ

కనుక్కోవచ్చును. దాంతో ఇంక మీరు దొంగను పట్టుకోవచ్చును.”

“వాళ్ళు కాదు, బ్రిలియంట్! నువ్వు – నువ్వు నిజంగా నువ్వు గ్రేట్.”

“నాన్నా! నేనెవరిని? నీ కూతురిని. నన్ను నువ్వు పొగడచ్చా?”

“కూడదులే. ఆపుకోలేకపోయాను. రేపు పొద్దున్న వాళ్ళు దొరికాక అందరికీ ఈ విషయం అర్థం అయ్యేలా చెప్పే బాధ్యత మాత్రం నీది?”

❁ ❁ ❁

“ఇరవయ్యో శతాబ్దపు చివరిలో కొత్తగా వచ్చిన బేంకులన్నీ ‘ఈ’ – బేంకులే. మన ‘ఈ’ బేంక్ కూడా ఈ బేంకే. కష్టమర్లకి అవసరమైన సర్వీసులన్నీ కంప్యూటర్ల మీదే అందిస్తున్న బేంక్. నిజానికి కస్టమర్లకీ ‘ఈ’ బేంకులవల్ల చాలా లాభాలున్నాయి.

‘ఈ’ బేంకుకి దేశంలో చాలా బ్రాంచ్‌లున్నాయి. అయితే అన్ని బ్రాంచ్‌లు అకౌంట్లు సెంట్రల్‌గా ఉన్న ఒక కంప్యూటర్ మీదే ఉంటాయి. అందువల్లే కస్టమర్లు దేశంలో ఎక్కడ ఉన్నా తమ అకౌంట్‌ని వాడుకోగలుగుతారు. అంతే కాదు, ఇంటర్నెట్ ద్వారా తమకి కావల్సిన పనులన్నీ చేసుకోగలుగుతారు.

ఈ బేంకులో లక్షకి పైగానే ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండి ఉంటాయి. అందులో చాలా వాటి మీద నెలా నెలా వడ్డీ సేవింగ్స్ బేంక్ అకౌంట్‌కి క్రెడిట్ అవుతుంది. ప్రతి నెలా వడ్డీ కట్టి క్రెడిట్ చేసేందుకు ఒక ప్రోగ్రాం ఉంది. అది నెల ఆఖరి రోజున రాత్రి తనకు తానే పదకొండింటికి పనిచేస్తుంది. సామాన్యంగా ఇలాంటి పనులన్నీ కంప్యూటర్ చేత పగలు ఆఫీస్ సమయంలో కాక సాయంత్రాలో, రాత్రుళ్ళో చేయిస్తారు తక్కిన పనులకి అడ్డం రాకుండా.

ఈ కుర్రాడి బాబాయికి ఈ బేంక్‌లోనే అకౌంట్ ఉంది. వాళ్ళ బాబాయ్ ఇంటర్నెట్ ద్వారా తన అకౌంట్‌ని చూసుకుంటున్నప్పుడు ఈకుర్రాడు, బేంక్ సైట్‌ని హేకింగ్ చేసేందుకు చేసిన ప్రయత్నం ఫలించింది. హేకింగ్ అంత సులభం కాదు. ఎందుకంటే బేంకులు వాడే పెద్ద పెద్ద కంప్యూటర్లు పీసీల లాంటివి కావు. వాటి మీద పని చెయ్యడానికి పాస్‌వర్డ్స్ కావాలి. అంతేకాదు. ఆ కంప్యూటర్ల మీద అనుమతి లేకుండా పని చెయ్యడానికి లేకుండా ఎన్నో ఏర్పాట్లు చేయవచ్చు. అందుకే తెలివితేటలతో పాటు చాలా ఓర్పు కావాలి. రకరకాల ప్రయత్నాలు చేసి ఆ కంప్యూటర్లలో ఉన్న లోపాలు చూసి హేక్ చెయ్యొచ్చు. మాలాంటి చిన్న పిల్లలకి ఆ పని సరదా. అలా ఎందరో చేస్తుంటారు.

అయితే హేక్ చెయ్యడం చాలామందికి సరదా మాత్రమే. దాన్ని దొంగతనం కోసం వాడుకునే వాళ్ళు చాలా తక్కువ. అంతేకాదు. అలా దొంగతనం చెయ్యడానికి బాంక్‌లో అకౌంట్ ఉన్న వాళ్ళ తోడు అవసరం. ఈ కుర్రాడికి వాళ్ల బాబాయ్ ఆ పని చేశాడు.

నెలనెలా వడ్డీ లెక్క కట్టే ప్రోగ్రామ్‌ని అందరి అకౌంట్లలోనూ కొంత తగ్గించి లెక్కకట్టేట్లు మార్చడం సులభం. ఒక్కొక్కరి అకౌంట్లోనూ కొంచెమే తగ్గుతుంది కాబట్టి సామాన్యంగా ఎవరూ పట్టించుకోరు. అయితే అలా అందరి అకౌంట్లోనూ తగ్గించింది అంతా కలిపితే ఆ మొత్తం ఎక్కువే అవుతుంది. బేంక్ ఇస్తున్న మొత్తం వడ్డీ ఎంత ఉంచాలో అంతా వాళ్ళ రికార్డ్‌లో అలానే ఉంచెయ్యచ్చు. బేంక్ తక్కువ వడ్డీ ఇస్తున్నట్లు బేంక్‌కి అసలు తెలియనే తెలియదు.

అలా అందరి అకౌంట్లలోనూ తగ్గించిన మొత్తాన్ని వాళ్ళ బాబాయ్ అకౌంట్‌లో క్రెడిట్‌గా మార్చాడు. అందులో ఈ కుర్రాడు చాలా తెలివి తేటలు వాడాడు. వాళ్ళ బాబాయ్ అకౌంట్లో కూడా వడ్డీ లెక్క కొంచెం తక్కువగానే ఉంటుంది. దాంతో ఎవరికీ ఆ అకౌంట్ మీద కానీ, వాళ్ళ బాబాయి మీద కానీ అనుమానం రాదు.

అయితే మార్చిన ఆ ప్రోగ్రాంని అలానే ఉంచితే అందరికీ తెలిసిపోతుంది. అందుకే దాన్ని మళ్ళీ మార్చేసి ముందెలా ఉండేదో అలానే ఉంచేవాడు. ఆ కారణంగానే తర్వాత ఎవరు చూసినా ఎవరికీ ఏమైందో తెలియలేదు.

ఇవన్నీ చెయ్యాలంటే బేంక్ కంప్యూటర్‌లో కొన్ని లోపాలు ఉండాలి. ఈ బేంక్ కంప్యూటర్‌లో అలాంటి లోపాలున్నాయి. నిజానికి ప్రోగ్రామ్‌ని మారిస్తే మార్చినట్లు రికార్డు ఉంటుంది. ఆ రికార్డుని ఎవ్వరూ ఆఖరికి సిస్టం అడ్మినిస్ట్రేటర్ కూడా తొలగించడానికి వీలుండకూడదు. అయితే, ఈ బేంక్ కంప్యూటర్ మీద సిస్టం అడ్మినిస్ట్రేటర్‌కి అలా చేసే అవకాశం ఉంది. సిస్టం అడ్మినిస్ట్రేటర్ పాస్‌వర్డ్ తెలిసిన వాళ్ళందరూ అలా చేయవచ్చు. ఈ కుర్రాడు సిస్టం అడ్మినిస్ట్రేటర్ పాస్‌వర్డ్‌ని తెలుసుకోగలిగాడు. అందుకే ఆ పని చెయ్యగలిగాడు.

నిజానికి ఆ పాస్‌వర్డ్‌తో అతను ఏదన్నా చేసి ఉండొచ్చు. అయితే అతను కానీ, అతని బాబాయ్ కానీ, ఆరితేరిన దొంగలు కారు.

పెద్ద పెద్ద దొంగతనాలు చేసే అలవాటు ఉన్న వాళ్ళయితే ఒక్కసారే చాలా డబ్బుని తీసుకుని వెళ్ళిపోతారు. అంత డబ్బుని ఒక్కసారే ఏం చెయ్యాలో తెలియని వాళ్ళు సామాన్యంగా ఇలాంటి పనులు చేస్తారు. అంతేకాదు. ఇందులో పట్టుపడే అవకాశం చాలా తక్కువ. వడ్డీ తక్కువ వచ్చిన వాళ్ళలో ఆ ఒక్కాయనకి చాదస్తం ఉంది కాబట్టి అంత తక్కువ తేడా ఉన్నా బేంక్‌కి వచ్చి చెప్పారు కానీ, చాలామంది అలా వచ్చి చెప్పడానికి మొహమాటపడతారు. ఆ మొహమాటమే ఇలాంటి దొంగతనాలని

బయటికి రానియ్యదు. అంతే కాదు. దొంగతనం చేసే వాళ్ళు కూడా దీన్ని థ్రిల్లింగ్‌గా తీసుకుంటారు కానీ పెద్ద దొంగతనంగా తీసుకోరు."

"నువ్వు చెప్తున్నది చూస్తుంటే కంప్యూటర్లలో సెక్యూరిటీ తక్కువగా ఉందనిపిస్తోంది."

"నిజానికి కంప్యూటర్లలో సెక్యూరిటీ ఎక్కువ. అయితే దాని సెక్యూరిటీని మనుషులే నిర్ణయిస్తారు. ఈ బేంక్ కంప్యూటర్‌లో కొన్ని లోపాలున్నాయి. వాటినే ఈ కుర్రాడు వాడుకున్నాడు. ఉదాహరణకి కంప్యూటర్ మీద ఎవరు ఎప్పుడు ఏ పని చేశారన్న రికార్డ్‌ని తొలగించడానికి వీలుండకూడదు. ఈ కంప్యూటర్‌లో ఆ లోపం ఉంది. అలానే ఏ సమయంలోనైనా ఎవరు ఏ పని చేస్తున్నారో చూసే వాళ్ళుండాలి. ఈ కంప్యూటర్‌కి అలా మానిటర్ చేసే వాళ్ళు రాత్రిపూట లేరు.

సెక్యూరిటీలో ఏమాత్రం లోపం ఉన్నా, ఈ బేంకుల నుండిఎవరికీ తెలియకుండా ఇలాంటి దొంగతనాలు చెయ్యడం సులభం. ఈ దొంగతనాలకి కత్తులూ, గన్నులూ అక్కర్లేదు. ఈ దొంగతనాలూ చిన్నవాళ్ళే సులభంగా చెయ్యగలరు. వాళ్ళకి కంప్యూటర్ల మీద పని చెయ్యడం చాలా తొందరగా వచ్చేస్తుంది."

"అది ఆ పిల్లాడు చేసిన తప్పుల వల్ల వీలైంది. ఒకటి ఎవరూ చిన్న మొత్తాన్ని పట్టించుకోరని అనుకున్నాడు. రెండు ఆ ప్రోగ్రామ్‌ని కంప్యూటర్ మీద మార్చాడు. అందుకే నాకు దాన్ని నా పీసీ మీద దింపుకుని చూడ్డానికి వీలైంది. దాంతో ఆ అకౌంట్ నంబర్ దొరికింది. అలా కాక తన కంప్యూటర్ మీదే ఆ ప్రోగ్రాం రాసేసుకుని, అక్కడ నుండి దాని ఎక్సిక్యూటబుల్ మాత్రం బేంక్ కంప్యూటర్ మీదకి పంపి వాడిఉంటే, అప్పుడు నాకు ఆ అకౌంట్ నంబరు తెలిసేది కాదు."

"నువ్వు ఎక్సిక్యూటబుల్ అన్నావు. అంటే ఏమిటి?"

"అదంతా చెప్పాలంటే కంప్యూటర్ క్లాస్ మొదలెట్టాల్సి ఉంటుంది. మొదలెట్టనా?"



E:\Seelamma\
Seelama1
50

*ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, ఆగస్టు 31 – సెప్టెంబర్ 6, 1994*

# గూళ్ళు

**ప**గటిపూట మేత కోసం అటూ ఇటూ ఎగురుతూ తిరిగిన పక్షులు గూళ్ళకి చేరుకుంటున్న సాయం సమయం.

నగరంలోని రోడ్ల నిండా అన్ని రకాల వాహనాలూ హడావుడిగా తిరుగుతున్నాయి.

వందలేసి మందిని మోసుకువెళ్తున్నా బస్సులు నిండు గర్భిణీ స్త్రీలలా భారంగా కదులుతున్నాయి.

రంగు రంగుల కార్లు భూలోకమ్మీదున్న కుబేరుల కోసం లక్ష్మీదేవి పంపించిన రథాల్లా ఉన్నాయి.

"మనం ఇద్దరం – మనకిద్దరు" అన్న స్లోగన్‌కి సజీవ రూపాల్లా ఇద్దరు పెద్దవాళ్ళను, ఇద్దరు పిల్లలను మోసుకు తిరుగుతున్నాయి స్కూటర్లు.

ఎక్కినవాళ్ళకి రోడ్డు మీద వెళ్తున్నామా, ఆకాశంలో ఎగురుతున్నామా అనిపించేటట్లు వెళ్తున్నాయి ఆటోలు.

వాహనాలన్నిటి నిండా జనమే!

ఆఫీసుల నుండి ఇళ్ళకి తిరిగి వెళ్తున్నవాళ్ళూ, షాపింగ్‌లకీ, సినిమాలకీ, షికార్లకీ వెళ్తున్నవాళ్ళూ, రాత్రి డ్యూటీకి వెళ్తున్నవాళ్ళూ. ఆఫీసునుండి ఇంటికి వెళ్తున్నవాళ్ళలో ఒకడు శేఖర్. శేఖర్ మోపెడ్ నడుపుకుంటూ వెళ్తున్నాడు.

పొద్దున్న ఇంటి నుండి ఆఫీసుకి బయలుదేరుతున్నప్పుడు మరిచిపోకుండాఏదో తీసుకురమ్మని చెప్పింది శ్రీమతి. ఏదో తెమ్మందని గుర్తుకొస్తోంది కానీ, ఏం తెమ్మందో గుర్తుకు రావడం లేదు.

సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికిబయలుదేరుతుండగాబాస్ పిలిచి, ఒక నెల రోజుల క్రితం వచ్చిన ఒక ఉత్తరానికి తొందరగా సమాధానం పంపించమన్నాడు. ఆ ఉత్తరాన్ని చూసినట్లు లీలగా గుర్తొస్తోంది కానీఎక్కడ పెట్టాడో గుర్తుకు రావడం లేదు.

ఈ ఆలోచనలు శేఖర్ బుర్రలో కదులుతున్నాయి.

వాటితోనే శేఖర్ మోపెడ్ కూడా కదులుతోంది.

దారిలో ఎక్కడో ఆగి, ఏదో కొనాలని అనుకుంటూనే తనుంటున్న ఫ్లాట్ల దగ్గరకు వచ్చేశాడు శేఖర్.

నేల మీద కాక, మరో మూడంతస్తులున్న నాలుగంతస్తుల మేడలో – అంతస్తుకు ఎనిమిది ఫ్లాట్ల చొప్పున ముప్పై రెండు ఫ్లాట్లు.

చిన్న చిన్న గూళ్ళలాంటి ఫ్లాట్లు.

నగరంనిండా అలాంటి గూళ్ళే!

రెండు మూడంతస్తులతో మొదలుపెట్టి పాతిక, ముప్ఫై అంతస్తుల దాకా పెరుగుతోంది నగరం.

పెరగగలిగినంత కాలం అడ్డంగా పెరిగిన నగరం, ఇంకా అడ్డంగా పెరిగేందుకు అవకాశం లేక నిలువుగా పైకి లేస్తోంది.

శేఖర్ ఫ్లాట్‌ల మెట్లెక్కుతున్నాడు.

ఒక్కో అంతస్తు దాటుతుండే ఒక్కో రకమైన శబ్దం వినిపిస్తోంది.

మూడవ అంతస్తుకి ఎక్కాక, అటూ ఇటూనాలుగేసి గుమ్మాలున్న వరండాలోకి నడిచాడు శేఖర్.

వరండా ఇరుగ్గా ఉంది. పగలు కూడా వెలుతురు రాని వరండా అది!

తన ఫ్లాట్ దగ్గరకెళ్ళి కాలింగ్ బెల్ నొక్కబోయి, ఆగి, తలుపు గొళ్ళాన్ని నెమ్మదిగా శబ్దం చేశాడు శేఖర్.

గొళ్ళెం శబ్దం వినిపించలేదేమో, తలుపు తీయడానికి శ్రీమతిరాలేదు.

పక్క ఫ్లాట్ తలుపు తీసి ఉంది.హాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్న ఆ ఇంటివాళ్ళు శేఖర్‌కి కనిపిస్తున్నారు.

పక్కింటి వాళ్ళే అయినా, శేఖర్‌కి వాళ్ళతో పరిచయం లేదు.

ఆ ఇంట్లో వాళ్ళు బయటకు రావాలంటే శేఖర్ అడ్డుగా ఉంటాడు. అలా నిల్చోవడం ఇబ్బందిగా ఉంది శేఖర్‌కి.

కాలింగ్ బెల్ మోగిస్తే ఇంట్లో ఆ సమయానికి నిద్రపోతున్న పిల్లకి మెలకువ వస్తుందేమో అని బెల్ కొట్టకుండా మళ్లీ తలుపు గొళ్ళెంతోనే కొంచెం గట్టిగా శబ్దం చేశాడు శేఖర్.

లోపలున్న శ్రీమతికి ఈసారి శబ్దం వినిపించినట్లుంది. తలుపు తీస్తున్న అలికిడి అయింది.

శేఖర్ తలుపు తోసుకుని లోపలికి వెళ్ళి, మళ్ళీ నెమ్మదిగా తలుపు మూసి, చూసేసరికి హాల్లోంచి వంటింట్లోకి వెళ్తోంది శ్రీమతి.





శ్రీమతి పేరు హేమ.

వంటింట్లోకి వెళ్ళిన హేమతో – "కొంచెం కాఫీ ఇస్తావా?" అన్నాడు శేఖర్ ఓ కుర్చీలో కూర్చుంటూ.

ఆ మాటకి సమాధానం ఇవ్వకుండా, "మీరు పిల్లకి పాలపొడి డబ్బా తెచ్చారా?" అని అడిగింది హేమ వంటింట్లోనుంచి.

"ఆఁ ఇప్పుడు గుర్తుకొచ్చింది. నువ్వు పొద్దున్న చెప్పింది పాలపొడి డబ్బా కదూ?" అన్నాడు శేఖర్.

"కాదు, పట్టుచీర!" అంది హేమ. అలా అంటున్న హేమ కంఠంలో కోపం స్పష్టంగా తెలుస్తోంది.

"నిజం, హేమా! నువ్వేదో తెమ్మన్నావని గుర్తుంది కానీ, అది పాలపొడి డబ్బా అని గుర్తు లేదు" అన్నాడు శేఖర్.

"ఆఫీసులో ఫ్రెండ్స్‌తో కూర్చుని కబుర్లాడుకుంటూ కూర్చుంటే, ఇవన్నీ ఎక్కడ గుర్తుంటాయి?"

"నువ్వు ఆఫీసంటే ఏదో క్లబ్బనుకుంటున్నావా?"

"కాక! అక్కడ మీ కేదైనా పనా, పాటా?"

"ఈ రోజేమిటి ఇంత కోపంగా ఉన్నావు! ముందు కాఫీ ఇయ్యి. తాగిన తరువాత పాలపొడి డబ్బా తెచ్చేస్తాను."

"వంట పూర్తవగానే నేను స్నానం చేయాలి. అదయ్యాక మీకుకాఫీ ఇస్తాను. ఈలోగా మీరు పాలపొడి డబ్బా తీసుకురండి! పొద్దున్న లేవగానే పిల్ల పాలకి ఒక్కక్షణం కూడా ఉండదు. ఈ రోజు మధ్యాహ్నమే డబ్బా ఊడ్చేశాను."

"నువ్వు ముందే చూసుకోవాలి. ఇప్పుడా చూడటం?"

"నేను మీకు పొద్దున్నే చెప్పాను. అయినా ఇప్పుడా సంగతులన్నీ అనవసరం! మీరెళ్ళిపాలపొడి డబ్బా తీసుకురండి. ఈ లోగా నేను నీళ్ళు పోసుకుంటాను. ఈ వంటింట్లో అరగంట నుంచి వేగిపోతున్నాను."

"నేనూ అరగంట పైగా, ఈ వెధవ రోడ్ల మీద బండి నడుపుకుంటూ వచ్చాను. తల పగలిపోతుంది!"

"ఈ వంటింట్లో కూర్చోండి అరగంట! ఒళ్ళు వేడెక్కి చెమటలు కారి నానా అవస్థా పడిపోతారు. ఇది వంటిల్లు కాదు, నరకం!"

"నరకం! నరకం! అని నన్నెత్తి పొడవక్కర్లేదు. ఇంకో ఇల్లు చూసుకునేదాకా మనకు ఇది తప్పదు!"

“ఇంకో ఇల్లు?! ఈ ఇల్లు దొరకడమే గగనమైపోయింది. మనకి ఇంకో ఇల్లా?”

‘హేమా! అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు! మనం ఉంటున్నది ముగ్గురం. అందులోనూ పిల్లకి సంవత్సరం కూడా నిండలేదు. మనకి ఈపాటి ఇల్లు చాలదూ!”

“చాలకేం? నిక్షేపంలా సరిపోతుంది! ఈ గాలీ, వెలుతురూ లేని అగ్గిపెట్టెని ఇల్లు అనుకోగలిగితే!”

“ఇంట్లో గాలి తక్కువే. అయితే బయటకెళ్ళిచూడు! గాలంతా దుమ్ము! ఒక్క దుమ్మే కాదు, పెట్రోలు కంపుకొడుతున్న గాలి. ఆ రోడ్లలో అరగంట ఆ గాలి పీలుస్తూ బండి నడిపితే మన ఆయుర్దాయంలో గంట తగ్గిపోతుంది, తెలుసా!”

“ఈ ఉపన్యాసం తర్వాత వింటాను కానీ, ముందు మీరెళ్ళిపాలపొడి డబ్బా తెండి!”

“నేను వెళ్ళను. కావలిస్తే నువ్వే వెళ్ళి తెచ్చుకో!” అన్నాడు శేఖర్ మొండిగా.

వంటింటి గుమ్మం దగ్గర కొచ్చి హాల్లో కూర్చున్న శేఖర్‌ను చూసింది హేమ. హేమ మొహం కోపంగా ఉంది. ఆ కోపం అలసటలోనుంచి నిస్సహాయతలో నుంచి వచ్చినట్లుంది. అదేమీ చూసే స్థితిలో లేడు శేఖర్.

అతని మొహంలోనూ అదే అలసట, అదే నిస్సహాయత, అదే కోపం!

హేమ కోపంగానే అరిచింది – “వెళ్ళకపోతే మానెయ్యండి! పిల్లకి పాలు లేక, అది ఏడిస్తే నాదేమీ పూచి కాదు!” అని.

“అసలీ డబ్బా పాలెందుకు మొదలుపెట్టావు?” అన్నాడు శేఖర్.

కోపం మనిషిలోని వివేకాన్ని తగ్గిస్తుంది. వివేకం తగ్గినప్పుడు మనిషి అనవసరమైన వాదాలు చేస్తాడు. మనుషుల మధ్య వాదం చాలాసార్లు అసలు విషయం మీద కాకుండా అనవసరమైనవిషయం మీద జరుగుతుంది. అందులో వ్యంగ్యం, ఎత్తిపొడుపూ చోటు చేసుకుంటాయి. దాంతో సమస్యకు పరిష్కారం వెతుక్కోవడం మానేసి, ఒకరినొకరు తప్పు పట్టేందుకు ప్రయత్నిస్తారు.

ఇప్పుడు హేమా, శేఖర్లు చేస్తున్నదీ అదే!

“డబ్బా పాలు కాక, మన కో దొడ్డీ, అందులో ఓ గేదే ఉన్నాయిగా పాలు పిండి తాగించడానికి!’ అంది హేమ.

“మనింట్లో లేకపోతేనేం,పాలు పోసేవాళ్ళుంటారు కదా!”

“ఉంటారు. నేనూ అదే మాట అన్నాను. మీరే, పట్నంలో పాలు పోసేవాళ్ళు పోసేవి పాలు కావు. నీళ్లు అని చెప్పి, డబ్బా పాలే పొయ్యమన్నారు. అవునా? కాదా?”

“మనకు దొరికేవి నీళ్ళపాలు. అవునా, కాదా?”

“కొంచెం ధర ఎక్కువ ఇస్తే మంచి పాలు పోసేవాళ్ళు దొరుకుతారేమో?”



E:\Seelamma\
Seelama1
52

“సర్లే! మనింటి దగ్గరకు గేదెను తీసుకొచ్చి పిండడానికి కుదురుతుందా? అయినా ఇళ్ళ దగ్గరకు వచ్చి పాలు పిండి పోసేవాళ్ళు దొరుకుతారా ఈ మహానగరంలో?”

“ఏదీ – మనం ప్రయత్నిస్తేగా మనకు తెలిసేదీ!”

“సరేలే! ఈ విషయాన్ని ఇంక వదిలెయ్! నాకు ఇవ్వగలిగితే కొంచెం కాఫీ ఇవ్వు!”

“పిల్ల పాల సంగతి మీకెందుకు? మీకు మీ కాఫీ ఉంటే చాలు!” అంటూ విసురుగా కాఫీ కప్పుతో వచ్చి, శేఖర్ పక్కనే ఉన్న చిన్న బల్ల మీద కప్పుని శబ్దమయ్యేలా పెట్టి, స్నానం చేసేందుకు లోపలకు వెళ్ళిపోయింది హేమ.

ఆ ఫ్లాట్‌ని డిజైన్ చేస్తున్నప్పుడు అందులో ఉండబోయే మనుషుల అవసరాల గురించి అసలు ఆలోచించినట్లు లేదు. ముందోహాలు, హాలు నానుకుని ఓ పక్కగా ఇరుకైన వంటిల్లు, రెండో పక్క చిన్న పడగ్గది. దాని పక్కనే టాయ్‌లెట్ –కమ్–బాత్రూమ్!”

హాల్లో ఒక పక్క నాలుగు కుర్చీలు, మరో పక్క చిన్న డైనింగ్ టేబుల్ వేసే సరికి, ఒకరికి తగలకుండా ఒకరు నడిచేందుకు వీలు కాకుండా ఉంది హాలు.

పడగ్గదిలో రెండు మంచాలు వేయడంతో ఆ గదిలో కాస్త విశాలంగా మసిలేందుకు కొంచెం కూడా అవకాశం లేదు.

వంటింట్లో ఒకసారి ఒక్కరే ఉండగలరు.

ఉండగలరంటే, అక్కడ ఒక్కరు పట్టగలరని మాత్రమే. నిజానికి గాలి సరిగ్గా రాని వంటింట్లో ఎవరికైనా పది నిముషాల పైన ఉండడం కష్టమైన పనే!

ఒక్క వంటింట్లోనే కాదు. ఆ ఇంట్లో ఏ గదిలోనూ గాలి అంతగా రాదు. దానికి తోడు అది వేసవి కాలం అవడంతో, ఇంట్లో ఉండడం పొయ్యిలో ఉన్నట్లుగా ఉంది.

హేమ లోపల స్నానం చేస్తోంది.

శేఖర్ హాల్లో కాఫీ తాగుతున్నాడు.

పగలంతా ఆఫీసులో కష్టపడి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి, హేమ కోపంగా ఉండడం శేఖర్‌కి కొంచెం బాధగా అనిపించింది. హేమ అనవసరంగా కోపం తెచ్చుకునే మనిషి కాదు. పొద్దుట నుంచి ఇంట్లో ఒక్కత్తే పిల్లని చూసుకుంటూ ఉండడంతో విసుగ్గా ఉండి ఉంటుంది. అందుకే కోపంగా మాట్లాడి ఉంటుంది. అంత కోపంలోనూ తనకు కాఫీ చేసి ఇచ్చింది. అద్భుతంగా ఉంది కాఫీ – అచ్చు హేమ లాగానే!

స్నానం చేసి వస్తున్న హేమతో, “కాఫీ అద్భుతంగా ఉంది, నీలానే!” అన్నాడు శేఖర్.

“ప్రాణం లేచొచ్చినట్లుంది. స్నానం చేస్తే!” అంది హేమ.

అలా అంటున్న హేమ మొహం ప్రశాంతంగాఉంది.

"ఇప్పుడు చూడు, ఎంత బావున్నానో! ఇందాక ఆ రుసరుసల మొహం చూస్తే నా హేమేనా అనిపించింది."

"ఆ హేమా, ఈ హేమా ఒక్కతే! అయితే అప్పుడు నరకంలాంటి వంటింట్లో అరగంట మగ్గిన హేమను ఇప్పుడేమో" – అని హేమ ఏదో అనబోయేంతలో

"ఆరముగ్గిన మామిడిపండులాంటి హేమని!" అన్నాడు శేఖర్.

నవ్వింది హేమ. నవ్వి, "కాఫీ కడుపులో పడగానే అయ్యగారికి కవిత్వం వస్తోందే!" అంది.

"అది కడుపులో పడిన కాఫీ మాహాత్యం కాదు, కంట్లో పడిన హేమ నవ్వు మహాత్యం" అన్నాడు శేఖర్.

"కవిత్వంలో పడి పాలపొడి డబ్బా మరిచిపోతున్నారు!"

"లేదు, గుర్తుంది. నీళ్ళు పోసుకుని వెళ్తాను. ఒళ్ళంతా చిరాగ్గా ఉంది."

"ఇంట్లో ఒక్క బకెట్ నీళ్ళే ఉన్నాయి. అవి రేపు పొద్దున్న దాకా కావాలి" అంది హేమ కొంచెం నొచ్చుకుంటూ.

"ఏం? అన్నాడు శేఖర్.

"మధ్యాహ్నం పిల్లకి రెండుసార్లు విరోచనాలు! అయ్యాయి. అదంతా కడగడానికి ఓ బకెట్ నీళ్ళయిపోయాయి. మీ స్నానానికి నీళ్ళు లేవు."

"ఇప్పుడెలా ఉంది పిల్లకి?" అన్నాడు కంగారుగా శేఖర్.

"కంగారు పడాల్సిందేమి లేదు. మామూలు విరేచనాల్లా మధ్యాహ్నం రెండుసార్లయ్యాయి. ఇప్పుడు తగ్గిపోయాయి. ఇందాక నేను నీళ్ళు పోసుకోకపోయుంటే, మీకు నీళ్లు మిగిలేవి. కానీ వంటింట్లో చెమట స్నానమయ్యాక నీళ్ళ స్నానం చేయకుండా ఉండలేకపోయాను. అప్పటికీ సగం బకెట్ నీళ్ళే పోసుకుందామనుకున్నాను. కానీ, మొదలెట్టాక ఆపలేకపోయాను. ఏమీ అనుకోకండి!" అంది హేమ తను ఆ పని చేసి ఉండకూడదన్న భావాన్ని ధ్వనిస్తూ.

"నీళ్ళు మళ్ళీ రేపు పొద్దున్నేనా?"

"అంతే! ఇందాక సెక్రటరీ గారబ్బాయి వచ్చి చెప్పి వెళ్ళాడు. ఇప్పుడు ఉదయం ఆరింటి నుండి పదింటిదాకా నీళ్ళొస్తున్నాయిగా. రేపటి నుండి తొమ్మిదింటికి ఆపేస్తారుట!"

'రోజూ మూడు గంటలిస్తే చాలు మనకు. ఆ సమయంలో మనం పనులన్నీ పూర్తి చేసేసుకుని, ఉన్న నాలుగు బకెట్లలోనూ నీళ్ళు పట్టుకుంటే సరిపోతాయి. ఈ



E:\Seelamma\
Seelama1
53

నీళ్ళు పరవాలేదు, మంచినీళ్ళ సంగతేమిటి?"

"మంచినీళ్ళ గురించి ఆ అబ్బాయి ఏమీ చెప్పలేదు.

"అంటే రాత్రి పదకొండింటికి పావుగంట వస్తాయన్నమాట!"

"అయ్యుండాలి. ఈ అర్థరాత్రి మంచినీళ్ళ ప్రహసనం కష్టంగా ఉంది."

"కార్పొరేషన్ నీళ్ళు రాత్రి పదింటికే వస్తున్నాయట!"

"అది సరే!" ఆ నీళ్ళు పట్టి ఉంచి తెల్లారగట్ల మనకు ఇవ్వవచ్చు కదా!"

"ఉన్నది ఒక్కటే టాంక్. అందులోకి పడితే కార్పొరేషన్ నీళ్ళు పట్టాలి. లేకపోతే బోర్ నీళ్ళు పట్టాలి. రెండూ కలపలేరు. అందుకే రాత్రి పదింటికి కార్పొరేషన్ నీళ్ళు రాగానే సంప్‌లో పట్టి, అక్కడి నుంచి పై టాంక్‌కు ఎక్కించి, వెంటనే మనకు మంచినీళ్ళు ఇచ్చేస్తున్నారు. ఆ తర్వాత ఖాళీ అయిన టాంక్‌లోకి బోర్ నీళ్ళు ఎక్కించి, పొద్దున్నే మనకి ఇస్తున్నారు. మన అసోసియేషన్ వాళ్లు బాగానే మేనేజ్ చేస్తున్నారు. తక్కిన ఫ్లాట్‌ల వాళ్ళతో పోలిస్తే."

"రెండుటాంకులు కడితే సరిపోయి ఉండేది."

"మనం ఈ ఇంటి ఓనర్లం కాదు. ఓనర్లకు లేని బాధ మనకెందుకు?" అన్నాడుశేఖర్.

"నీళ్ళ కోసం అవస్థ పడుతున్నది మనం! మనకు కాక ఇంకెవరికి బాధ?" అంది హేమ.

"సరేలే, ఈ వ్యవహారం గురించి మనకెందుకు కానీ, పిల్ల ఇప్పుడు లేస్తుందా?"

"నేను జోస్యం చెప్పగలనా?"

"కన్నతల్లికి పిల్ల ఎప్పుడు లేస్తుందో తెలియదా?"

"కన్నతండ్రికి తెలుస్తుందా?"

"తల్లికీ, తండ్రికీ తేడా లేదూ?"

"ఉంది. పిల్లకి చాకిరీ చేసేది తల్లి. పిల్ల ఏడిస్తే సముదాయించేది తల్లి. పిల్లతో హాయిగా ఆడుకునేవాడు తండ్రి."

"అది ఒకప్పటి కాలంలో. ఇప్పుడు కాదు. ఇప్పుడు నేను నీకు పిల్లను పెంచడంలో సాయం చేయడం లేదూ?"

"చేస్తున్నారు, అయితే పిల్లను పెంచే పని నా దయినట్లు, ఆ పనిలో సాయం చేయడం మీరు నాకు చేస్తున్న ఉపకారం అనుకుని చేస్తున్నారు. అవునా?"

"ఏమో?" అన్నాడు అదోలా మొహం పెట్టి శేఖర్.

"నే నా మాట ఊరికే అన్నాను కానీ, ఏమి అనుకోకండి" అంది హేమ శేఖర్

మొహాన్ని చూసి – అతనికి బాధ కలిగినట్లు గుర్తించి.

"చాలామంది భర్తలతో పోలిస్తే నేను నయం కాదూ?"

"తప్పకుండా! మీ నాన్నగారితో, మా నాన్నతో పోలిస్తే!" అంది హేమ. అని, మళ్ళీ తనే – "పిల్లకి రేప్పొద్దున్నకి పాలు ఉన్నాయి. అయితే మీరు రేపు ఆఫీసుకు వెళ్ళే లోగా పాలపొడి డబ్బా తేవాలి" అంది.

"అమ్మయ్య!" అన్నాడు శేఖర్ ఏదో బరువు తీరినట్లు.

"పొద్దున్నంతా హడావుడి కదా!" అంది హేమ.

"రేపు పొద్దున్న నువ్వు కూడా రా! మోపెడ్ మీద వెళ్ళి వచ్చేద్దాం. పిల్లకి కూడా అలా తిరిగి వచ్చినట్లుంటుంది. నిన్ను ఇంటి దగ్గర దింపేస్తా!" అన్నాడు శేఖర్.

"మనం రోడ్డు మీద నడవకుండా మోపెడ్ ఉంది సరే, ఈ మూడంతస్తుల మేడ ఎక్కి దిగడానికి లిఫ్టు లేదే! ఇంటి దాకా రావడం ఒక ఎత్తు. ఈ ఎత్తు మీదున్న ఫ్లాట్‌కి ఎక్కి రావడం ఇంకో ఎత్తు."

"సరేలే, పాలపొడి డబ్బా రేపు నేనే తెస్తాలే కానీ, మంచినీళ్ళు రాత్రి పదకొండింటికి వస్తాయి కదా! మనం తొందరగా పడుకుంటే సరిగ్గా ఆ సమయానికి మళ్ళీ లేవచ్చు. లేకపోతే నిద్ర సరిపోదు."

"మీకేం, మీకు నిద్ర బానే పడుతుంది."

"ఏం నిద్రలెద్దూ! రాత్రి పదకొండింటి దాకా నీళ్ళ కోసం ఎదురు చూడడం, ఆ తర్వాత అయిదింటిదాకా పిల్ల లేచేస్తుందేమోనని భయపడడం, అయిదింటికి అది లేచాక ఇక నిద్ర ఏముంటుంది?"

'దానికేమిటో సాయంత్రం అయిదూ, అయిదున్నర నుండి తెల్లారగట్ల అయిదింటిదాకా పడుకోవడం అలవాటయింది."

"నువ్వలా అలవాటు చేసి ఉంటావు."

"ఇంట్లో ఏం జరిగినా తప్పు భార్యదే కదా!" అంది హేమ.

"ఊరికే అన్నాను కానీ, భోం చేసి పడుకుందాం, వంట ఏం చేశావు?" అన్నాడు డైనింగ్ టేబుల్ దగ్గరకు నడుస్తూ శేఖర్.

"బంగాళదుంపలు వేయించాను" అంది తనూ లేస్తూ హేమ.

"నిన్న కూడా అదేనేమో!" అన్నాడు శేఖర్ మంచినీళ్ళ గ్లాసులు పెడుతూ.

"వేసవికాలం కూరలేం దొరుకుతున్నాయి? పెద్ద మార్కెట్‌లో ఉంటాయేమో! ఆఫీసు నుండి వచ్చేటప్పుడు మీరు చూడరు?" అంది వంటకాలు టేబుల్ మీద సర్దుతూ.

"నిన్న చూశాను. అక్కడా ఏమీ ఎక్కువగా లేవు." అంటూ భోజనం చేయడం





మొదలెట్టాడు శేఖర్.

"మార్కెట్‌లో మామిడి పళ్ళు కనిపించాయా?" అని అడిగింది హేమ తనూ తినడం మొదలుపెట్టి.

"ఎక్కువ లేవు. అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఇంకో వారం పోతే దొరకుతాయేమో!"

"ఆc దొరకుతాయి ఆకాశంలో."

"సీజనంతా కలిపి రెండు మూడుసార్లు రెండేసి పళ్ళు కొనుక్కు తినగలుగుతామేమో! మా చిన్నప్పుడు పళ్ళు గాదెలో మగ్గుతుంటే ఎవరికి కావలసినన్ని పళ్ళు వాళ్ళు తీసుకు తినడమే!" అంది హేమ.

"గుర్తు చేయకు. ఒక్క మామిడిపండేమిటి, ముంజెకాయలు, పుచ్చకాయలు, బొప్పాయి పళ్ళు – అలా తింటూనే ఉండేవాళ్ళం! అవన్నీ పల్లెటూళ్ళో."

"ఇప్పుడు అక్కడా దొరుకుతున్నాయో, లేవో! అయినా ఇక పల్లెటూళ్ళు ఎక్కడ మిగులుతాయి? అన్నీ నగరాలే అయిపోతున్నాయి. అదేకదా అభివృద్ధి?"

"ఏం అభివృద్ధో నీళ్ళు దొరక్కపోవడాన్ని అభివృద్ధి అని ఎలా అంటాం?" అన్నాడు శేఖర్.

"ఇరవై ఏళ్ళ క్రితం ఈ ఊళ్ళో నీళ్ళకి ఇబ్బంది ఉండేది కాదు. ఇరవై ఏళ్ళలో జనాభా మూడింతలు పెరిగిపోయింది. చుట్టూ ఎన్నో ఫ్యాక్టరీలు వచ్చేశాయి. ఇక నీళ్ళెక్కడ దొరకుతాయి?" అంది హేమ.

తను తిన్న కంచాన్ని తీసుకెళ్ళి సింక్‌లో పెట్టి, చెయ్యి కడుక్కుంటూ, – "అడగడం మర్చిపోయాను, ఉత్తరాలేమైనా వచ్చాయా?" అని అడిగాడు శేఖర్.

"చెప్పడం మరిచిపోయాను, లోపల గూట్లో పెట్టాను చూడండి. మీ అన్నయ్యగారి దగ్గర నుంచి అనుకుంటా వచ్చింది" అంది హేమ టేబుల్ మీద నుండి గిన్నెలు తీస్తూ.

"చింపి చూడొచ్చుగా?" అన్నాడు శేఖర్.

"ఏం రహస్యాలు రాసుకుంటారో? నా కెందుకులెండి?"

ఉత్తరం చదివి, "అన్నయ్య, వదిన, పిల్లలు ఈ నెలాఖరుకి ఇక్కడ కొద్దామనుకుంటున్నారట. మనం ఊళ్ళోనే ఉంటామా, ఎక్కడికైనా వెళ్తామా అని అడుగుతూ రాశాడు అన్నయ్య. రామా, వద్దా అని అర్థమయ్యేటుంది" అన్నాడు శేఖర్.

"ఏం రాస్తారు?" అంది టేబుల్ తడుస్తూ.

"రావద్దంటే అన్నయ్య ఏమనుకుంటాడో, వదిన ఏమనుకుంటుందో?"

"అయిన వాళ్ళను రావద్దంటామా?" అంది హేమ. శేఖర్ మాట్లాడలేదు.

"నీళ్ళ సమస్య ఉంటే నేం? మనవాళ్ళన్న వాళ్ళను రమ్మన్నకుండా ఎలా ఉండగలం? రమ్మని రాయండి. వాళ్ళేం మనకి పరాయివాళ్ళు కాదుగా!" అంది తనే మళ్ళీ హేమ.

"మీ అక్కయ్యా వాళ్ళని నీళ్ళకి ఇబ్బందిగా ఉంది, రావద్దని రాశామనే కదూ నీ కోపం?" అన్నాడు శేఖర్.

"ఛ!ఛ! నాకేం కోపం లేదు. మా అక్కయ్యా వాళ్ళు మనింటికి వస్తే నేం, రాకపోతే నేం! మీ అన్నయ్యా వాళ్ళని రమ్మని రాయండి!" అంటూ లోపల గదిలోకి వెళ్ళిపోయింది హేమ.

శేఖర్ లోపలికి నడిచాడు.

రెండు మంచాలు కలిసి వేసిన పక్క మీద మధ్యగా పిల్ల పడుకుంది.

పిల్లకి ఓ పక్కగా ముడుచుకుని పడుకుంది హేమ.

హేమ పక్కకి వెళ్ళి నెమ్మదిగా – "నువ్వు నన్నర్థం చేసుకో, హేమా! నీళ్ళకి ఎలాగోలా సర్దుకుందాం. వస్తామన్న వాళ్ళను రావద్దంటే వాళ్ళకేం కోపం వస్తుందో తెలియదు. అటు వాళ్ళూ నన్నే కోపగించుకుని, ఇటు నువ్వూ నన్నే కోపగించుకుంటే నేనేం చేస్తాను?" అన్నాడు శేఖర్.

"ఇక ఆ విషయం వదిలేయండి! నేను పడుకున్నది ఈ విషయం గురించి ఆలోచిస్తూ కాదు. పదకొండింటికి నీళ్ళు వస్తాయి. వంటింట్లో మంచినీళ్ళ కుళాయి తెరిచి ఉంచండి! నీళ్ళొచ్చే శబ్దానికి లేవొచ్చు!" అంది హేమ.

శేఖర్ వంటింట్లోకి వెళ్ళి కుళాయి కింద బిందె పెట్టి, కుళాయి తెరిచి, ముందు గది తలుపు వేసి ఉందో, లేదో చూసి, లైట్లన్నీ తీసేసి, పడగ్గదిలోకి వచ్చి పక్క మీద పిల్లకి ఇంకొకవైపు పడుకున్నాడు.

పడుకుని, "నిద్రపోయావా?" అని అడిగాడు.

"లేదు" అంది హేమ.

"బాగా ఉక్కగా ఉంది. దానికి తోడు ఇంటికి వచ్చాక స్నానం చేయలేదేమో, బాగా చిరాగ్గా ఉంది" అన్నాడు.

"సారీ!" అంది హేమ.

"ఛ ఛ! మన మధ్య సారీ లేమిటి హేమా! నీకు మాత్రం స్నానం చేయాలనిపించదా? అదేం పట్టించుకోకు!"

"నాకేదో భయంగా ఉందండీ!" అంది హేమ.



E:\Seelamma\
Seelama1
55

"ఎందుకు? అన్నయ్యా. వదినా వస్తే వాళ్లకి సదుపాయాలు చేయగలుగుతామా, లేదా అనా?"

"అది కాదు"

"మరి ఇంకెందుకు భయం?"

"మన జీవితాల్లో ఏదో స్తబ్దత చోటు చేసుకుంటున్నట్లనిపిస్తోంది నాకు!"

"నాకలా అనిపించడంలేదు"

"లేదని మీకనిపిస్తోందోమో కానీ, నాకు మాత్రం ఒక రోజుకీ, ఇంకో రోజుకీ తేడా తెలియకుండా, రోజులన్నీ యాంత్రికంగా గడిచిపోతున్నట్లనిపిస్తోంది."

"ఈ నగరాలూ, ఈ నాగరికతా – ఇవన్నీ మనిషిని యంత్రాలలాగా మార్చేస్తున్నాయి. ఇది మన ఒక్కరి సమస్య కాదు."

"మనుషులు యంత్రాలలాగా అయిపోయి, పనులు మాత్రం చేస్తూంటే ఇక మిగిలేదేముంది? మనిషికీ, మనిషికీ మధ్య ఉన్న సున్నితమైన సంబంధాలు ఏమవుతాయి?"

"మన మధ్య సంబంధం బాగానే ఉంది. అందుకు సాక్ష్యం ఇదిగో, మన మధ్యనే ఉంది?" అంటూ పిల్లకి దగ్గరగా జరిగాడు శేఖర్.

హేమ కూడా పిల్లకి దగ్గరగా జరిగి, "ఎంతసేపూ గాలి లేదనీ, నీళ్ళు లేవనీ, ఇరుగ్గా ఉందనీ అనుకుంటూ ఉంటే మన మనసు ప్రశాంతంగా ఎలా ఉంటుంది? ప్రశాంతత లోపిస్తే ఆలోచనలు సక్రమంగా చేయలేం. సంతోషంగా ఉండలేం. మన చుట్టూ ఉన్న మనుషుల్ని విసుక్కుంటాం. పరిసరాలన్నీ సమస్యలే కనిపిస్తాయి. ఈ సమస్యలు మనకు నగరాలు ఇస్తున్నవే కదా?"

'సమస్యలని మనుషుల జీవితాల్నుండి విడదీయలేం. మనిషి అడవుల్లో తిరుగుతూ ఉండలేకే కదా స్థావరాలు ఏర్పాటు చేసుకుని, నగర నిర్మాణం మొదలెట్టింది?"

"అయితే ఆ నగరాలను నదీ తీరాల్లో నిర్మించాడు. నీళ్ళు దొరకని ఎడారుల్లో కాదు, గాలి కలుషితమైన చోట్లలో కాదు. నాకిక్కడ నుంచి పారిపోవాలనిపిస్తోంది." అంది హేమ – పాప తలపై నుండి తన చేతిని శేఖర్ చేతుల మీద వేస్తూ.

"ఎక్కడికి వెళ్దాం?" అన్నాడు శేఖర్ హేమ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"ఎక్కడికైనా సరే, ఎక్కడైతే హాయిగా నీళ్ళు పోసుకోగలుగుతామో, ఎక్కడైతే మంచినీళ్ళ కోసం అర్ధరాత్రి నిద్ర మానుకోనక్కర్లేదో, అక్కడికి?"

"అక్కడ మనకేముంటుంది?" అన్నాడు శేఖర్.

అలా అన్న శేఖర్ని ఆశ్చర్యంగా చూసి, అక్కడే కదా అసలు జీవితం ఉన్నది?"

అంది హేమ.

"అక్కడ  మన జీవితం గడిచే మార్గం ఏముంది?"

"మీ ఊళ్ళో మనకో మూడెకరాల పొలం ఉంది కదా! దాన్ని సాగు చేసుకుంటే సరిపోదూ!"

"సరిపోవచ్చు. అయినా, హేమా! దూరం నుండి అంతా బాగా కనిపిస్తుంది. అక్కడ మాత్రం సమస్యలు ఉండవా? అక్కడ ఉండలేకే కదా చాలామంది అక్కడి నుంచి నగరాలకు చేరుకుంటున్నారు! అక్కడ వైద్య సదుపాయాలూ, విద్యా సదుపాయాలూ తక్కువ. ఆ ఊళ్ళో చదువు లేకే కదా నేను పట్నంలో మామయ్య దగ్గరుండి చదువుకున్నది! నీకు తెలుసో, లేదో చుట్టాలింట్లో అవసారనికి ఉండడం చాల కష్టం. ఆ గతి మన పిల్లకి పట్టకూడదు!"

"ఇంతకీ మీ చదువు ఎందుకు? ఉద్యోగం కోసం, ఉద్యోగం జీతం కోసం, జీతం జీవించడం కోసం, అయితే మనం ఇప్పుడు జీవిస్తున్నామా అని నా అనుమానం" అంది హేమ.

"మనం ఈ నగరాన్ని వదిలి వెళ్ళగలమా?" అని అడిగాడు శేఖర్.

"ఇదేం అయస్కాంతమా మనల్నీ పట్టి ఉంచేసుకునేందుకు?" అని అడిగింది హేమ.

"ఇది ఉత్త అయస్కాంతం కాదు. బ్లాక్ హోల్! ఇక్కడికి రావడమే కానీ, ఇక్కడ నుంచి వెళ్లిపోవడం లేదు."

"మీరెన్ని చెప్పండీ, నాకిక్కడ ఉండాలని లేదు."

"నాకూ లేదు" అన్నాడు శేఖర్.

"మరి ఎందుకు ఉండడం?"

"వెళ్ళిపోదాం. మన ఊరి దగ్గర ఉన్న చిన్నటౌన్‌లో ఏదైనా ఉద్యోగంచూసుకుని వెళ్ళిపోదాం. మన ఊళ్ళోనే ఉంటూ, అక్కడకెళ్ళి రావచ్చు."

"ఈ మాట మీరు మొదటిసారి కాదు అంటున్నది."

"అవును. మొదటిసారి కాదు. ఇలా  చేయాలని నాకు చాలాసార్లు అనిపిస్తుంది. అయితే అలా చేసే ధైర్యం నాలో లేదు. నాలోనే కాదు, ఈ నగరంలో ఉన్న చాలామందిలో లేదు."

"నగరాలలో ఉంటున్న తక్కినవాళ్ళు మనం అనుకుంటున్నట్లు జైల్లో ఉంటున్నట్లు అనుకుంటున్నారో, లేదో?"

"అందరిలోనూ ఈ ఫీలింగ్ ఉండే ఉంటుంది. ఒకసారి కాకపోతే ఒకసారైనా



E:\Seelamma\ Seelama1 56

ఇలా అనుకునే ఉంటారు. అయితే అందరికీ నగరంలోనే జీవించాల్సి వస్తోంది. నువ్వన్నట్లు జైళ్ళలోఉన్నట్లు కాదు. గోడౌన్లలోని పేకేజీ పెట్టెల్లా."

"అవును, పెట్టెలలాగానే – అనుభూతులు లేకుండా" అంది హేమ. అలా అంటున్న హేమ గొంతులో ఎంతో నిస్సహాయత ధ్వనించింది.

"మన చుట్టూ జనం ఉన్నారు. అయినా మనం ఒంటరివాళ్ళమే.మనం ఎవరిమో తెలియని, మనకు వాళ్ళెవరో తెలియని జనం మధ్య రైళ్ళల్లో, బస్సుల్లో ప్రయాణం చేస్తూ అజ్ఞాతంగా కాలం గడిపేస్తున్నాం" అన్నాడు శేఖర్.

"ఈ పెట్టెలలాంటి ఇళ్ళల్లో నేలకి వంద అడుగుల ఎత్తున నీళ్ళకి ఇబ్బంది పడుతూ ఎందుకీ జీవితం?" అంది హేమ.

"వెళ్ళిపోదాం. హేమా! తొందరలోనే మనం మన ఊరెళ్ళిపోదాం. అక్కడ మనం నేలకి దగ్గరగా ఉండగలం? అక్కడ గాలి కలుషితం కాలేదు. ఇంకా నీళ్ళకి ఇబ్బంది లేదు అక్కడ. అక్కడ చెట్లున్నాయి చెరువు ఉంది."

"అలాంటి ప్రశాంతమైన వాతావరణంలో మనకి విసుగు తగ్గొచ్చు. ఒకరి నొకరం విసుక్కోవడం తగ్గొచ్చు" అంది ఆనందంగా హేమ.

"హేమా! మన చుట్టూ మన ప్రమేయం లేకుండా చాలా మార్పులు జరిగిపోతున్నాయి. ఆ మార్పులతో మనుషులకు కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యలు అర్థం కాక మనుషులు సతమతమవుతున్నారు. గాలికాలుష్యం, ఇరుకు ఫ్లాట్లూ, వాటిలో నీళ్ళ ఇబ్బందులూ – ఇవి మన ముందు తరాలకి తెలియవు. మనం ఈ సమస్యలతో ఇమడలేకపోతున్నాం. అయినా ఇమడక తప్పదు మనకు. ఈ అశక్తత మనలో  అశాంతిని కలిగిస్తోంది. ఆ అశాంతి రకరకాలుగా పైకి వెలిబుచ్చుతున్నాం మనం."

"ఈ అశాంతి పోవాలంటే మనం ఈ నగరాల నుండి, ఈ నాగరికత నుండి ప్రకృతికి దగ్గరగా వెళ్ళిపోవాలి."

"అప్పుడు మగ్గులతో నీళ్ళు పోసుకోవడం కాదు, చెరువులో ఈదుతూ స్నానం చేయవచ్చు" అని శేఖర్ ఏదో కలలో చెప్తున్నట్లు చెప్తుండగా, వంటింటి కుళాయిలో నుంచి గాలి శబ్దం మొదలైంది.

"నీళ్ళు మొదలయ్యాయి" అంది హేమ.

"నువ్వు పడతావా?" అన్నాడు శేఖర్.

"ఒళ్ళంతా నొప్పులుగా ఉన్నాయి. మీరు పట్టండి" అంది హేమ.

"రోజూ నేనే పడుతున్నాను. ఈ రోజు నువ్వు లేస్తే ఏం పోతుంది?" అన్నాడు

శేఖర్.

"రోజూ మీరు పడుతున్నారా? ఎందుకు ఈ ఉత్తి మాటలు? మీరు లేవక్కరలేదులెండి! నేనే లేస్తాను!" అంది హేమ లేవకుండానే.

"నీళ్ళు వస్తున్నాయి. బిందె నిండేలోగా లేచి వెళ్ళి, బిందె నిండగానే ఇంకో బిందె పెట్టాలి. పడుకుని ఊరికే వెళ్తానంటే చాలదు!" అన్నాడు తను కూడా లేవకుండా శేఖర్.

"నీళ్ళు పట్టేపని నాదే నన్నట్లు మాట్లాడకండి?" అంది హేమ లేచి వంటింటి వైపు నడుస్తూ.

"ఆగు! నేను వెళ్తాను!" అన్నాడు హేమకి అడ్డొస్తూ శేఖర్.

హేమ మంచం మీదకెళ్ళి పడుకుంది.

శేఖర్ వంటింట్లోకి వెళ్ళాడు.

ఆ బిల్డింగ్‌లోని అన్ని ఫ్లాట్లలోనూ మంచినీళ్ళు పడుతున్న శబ్దం వినిపిస్తోంది.

అందరిళ్ళలోనూ మనుషుల హడావుడి, బిందెల సవ్వడి వినిపిస్తూనే ఉంది.

నీళ్ళ ధార సన్నగా ఉంది.

అందరూ ఒకేసారి పట్టుకోవడం మొదలెట్టడంతో ధార సన్నగానే ఉంటుంది. అయితే ఎవరు నీళ్ళు పట్టుకోకుండా ఉంటారు? బిందెలు నిండితే పెద్ద గిన్నెలలోనూ, తర్వాత చిన్న గిన్నెలలోనూ, అవీ నిండిపోతే గ్లాసులలోనూ పట్టేందుకు సిద్దంగా ఉంటారు. ఒక్క నీటిబొట్టును కూడా వృథాగా పోనివ్వరు.

పావుగంట గడిచేసరికి నీళ్ళు రావడం ఆగిపోయాయి.

నీళ్ళొస్తున్నంతసేపూ సందడిగా ఉన్న ఫ్లాట్లలో నెమ్మదిగా నిశ్శబ్దం ఆవరించుకో సాగింది.

వంటింట్లో లైటు ఆర్పి పడగ్గదిలోకి వచ్చాడు శేఖర్.

"అన్ని బిందెలూ నిండాయా?" అని అడిగింది హేమ.

నిద్ర మత్తులో ఉన్న హేమ గొంతు మత్తుగా వినిపించింది శేఖర్‌కి. అది అతనిలో ఓ మత్తుని కలిగించింది.

"నిండాయి" అంటూ హేమను చూశాడు.

చెదిరిన చీరలో ఉన్న హేమని చూసి, అటు నడవబోయి, రోజంతా పనితో అలసిపోయిన హేమను నిద్రపోనిద్దామనుకుని, అటు వెళ్ళకుండా పిల్లకి ఇటు పడుకున్నాడు శేఖర్.

పగలంతా అలసిన శరీరాలు విశ్రాంతి తీసుకోసాగాయి.



E:\Seelamma\ Seelama1 57

ఎప్పుడూ పూర్తిగా విశ్రాంతి తీసుకోలేని బుర్ర కూడా ఆలోచనలను నెమ్మదిగా వెనక్కి నెట్టెయ్యసాగింది.

మర్నాడు ఉదయం అయిదింటికి, పిల్ల లేచేవేళకే హేమ – శేఖర్‌ల బుర్రలలో మళ్ళీ ఆలోచనలు మొదలయ్యేది.

అయితే ఈ నగరం నుండి, ఈ నాగరికత నుండి దూరంగా వెళ్ళిపోదామనుకున్న వాళ్ళ ఆలోచన పొద్దున్నే పైకి లేస్తుందో, బుర్రలోనే ఉండిపోతుందో?

తాత్కాలికంగా కొన్నాళ్ళు ఆ ఆలోచన లోపలే ఉండిపోయినా ఎప్పుడో ఒకప్పుడు తీవ్రంగా పైకి లేవక తప్పదేమో!

అప్పుడు నాగరికత నగరాల నుండి దూరంగా నడవడం మొదలెడుతుందేమో?

ఏమో!

'స్వాతి' మాసపత్రిక – డిసెంబర్, 1987

# తల్లి



**నా**కు రాఘవతో పెళ్ళయి రెండేళ్ళు అవుతోంది. ఒకసారి వెనక్కి చూసుకుంటే మేమిద్దరం చాలా సంతోషంగా ఉన్న క్షణాలన్నీ గుర్తుకు వస్తాయి. అసలు మా ఇద్దరి మధ్యా ఎప్పుడూ పెద్ద గొడవలు రాలేదు. చిన్న గొడవలు రాబోతే మేమే సర్దేసుకున్నాం. ఆఫీసు వాళ్ళిచ్చిన విశాలమైన ఇల్లు అందంగా ఉంటుంది. తను పొద్దున్నే ఆఫీసుకి వెళుతూ నన్ను నా ఆఫీస్ దగ్గర దింపేస్తాడు. సాయంత్రం కూడా కలిసి వస్తాం.

మా అత్తా మావయ్యే నాకు అత్తగారూ, మావగారూను. వాళ్ళ దగ్గర నాకు చనువూ ఉంది. వాళ్ళకి నేనంటే ఇష్టమూ ఉంది. వాళ్ళిద్దరు మేమిద్దరం – మాది సుఖ సంతోషాల నిలయం.

"ఇంకా పిల్లలు లేరా?" అని ఎవరన్నా అడిగితే ఇప్పుడే అంత తొందరేముందని దాటేస్తున్నాం.

ఇలా రోజులు గడుస్తూ, పెళ్ళయి రెండేళ్ళు అవుతుండగా –

అత్తయ్యా, మావయ్య హైద్రాబాద్ వదలి గోదావరి జిల్లాలవైపు వెళ్ళారు.

మేం కూడా మా బాబయ్యగారమ్మాయి అంటే రాఘవకి మరో మరదలు పెళ్ళికి రెండు వారాల తర్వాత బయలుదేరి వెళ్ళటానికి రిజర్వేషన్ చేయించుకున్నాం. మేం బయల్దేరడానికింకా వారం రోజులుండనగా –

ఒకరోజు సాయంత్రం ఆఫీసునుండి వచ్చి తలుపు తీసుకుని మేము ఇంటి లోపలికి అడుగు పెట్టేసరికి – సన్నగా అరుపులు వినిపించాయి. అవి పిల్లి పిల్లల అరుపుల్లా గుర్తించి అటూ ఇటూ చూసేసరికి అవి ముందు గది నుండి వస్తున్నట్లు తెలిసింది.

ఇద్దరం గది గుమ్మం దగ్గరికి తొందరగా – అక్కడి నుండి చాలా నెమ్మదిగా వెళ్ళి చూస్తే, ఆ గదిలో వున్న పెద్ద గూట్లో మూలగా పిల్లి పిల్లలున్నాయి. అవి అప్పుడే పుట్టినట్లున్నాయి. చిన్నవి – చాలా చిన్నవి. అంతచిన్న పిల్లల్ని నేనింతకు ముందు చూళ్ళేదు. మొత్తం మూడు పిల్లలు. మూడూ ముడుచుకున్నాయి. పెద్ద పిల్లి వాటిని దగ్గరగా తీసుకుని తలెత్తి చూస్తోంది. మేం దగ్గరికి వెళ్తే ఏం చేసి ఉండేదో కానీ, మేం గదిలోంచి బయటకి వచ్చేశాం. బెడ్రూంలోకి వచ్చి బట్టలు మార్చుకుని మళ్ళీ వెళ్ళాం, పిల్లి పిల్లలున్న గదిలోకి.

అత్తా మావయ్యలుంటే పిల్లి ఆ గదిలో పిల్లల్ని పెట్టి ఉండేది కాదేమో – కానీ ఇప్పుడేం చేయాలి?

'నువ్వు తియ్యగలవా?' రాఘవ నన్నడిగాడు.

"అమ్మ బాబోయ్" నిజంగా వాటిని ముట్టుకోవలసివస్తే అన్న ఆలోచనవల్ల కలిగిన భయంతో అన్నాన్నేను.

'అసలు పెద్దపిల్లి మనల్ని దగ్గరికి రానియ్యదు' అన్నాడు రాఘవ.

'మరెలా?' అన్నాన్నేను.

'చూద్దాంలే' అంటూ బయటకి నడిచాడు రాఘవ.

'నేను కాస్సేపు పిల్లల్ని చూశాను.'

చిన్న గొట్టాల్లా ఉన్నాయి. కాళ్ళు మరీ చిన్నవి. అసలు అవి పిల్లలవుతాయంటే నాకు నమ్మకం కుదర్లేదు.

వంట చేస్తున్నంతసేపూ నాకు ఒకటే ఆలోచన – వాటిని ఎలా బయటపడెయ్యాలని.

భోజనం చేస్తూ నేనదే మాటన్నాను.

"అవి మరీ చిన్న పిల్లలు. బయటపడేస్తే ఏమవుతాయో" అన్నాడు రాఘవ.

"ఇంట్లో ఉంటే ఇల్లంతా పాడు చెయ్యవూ?" నేనన్నాను.

"కాని బయటపడెయ్యడం ఎలా?" నా ప్రశ్న నాకే అప్పజెప్పాడు.

"కొంచెం పెద్దవయితే పరవాలేదు. అవి మరీ చిన్నవి బయట కుక్కలు కూడా ఉన్నాయి."

"ఓ వారంలో పెద్దవవుతాయా?"

"వారానికి కొంచెం చూడ్డం, నడవడం వస్తాయేమో."

"మనం వెళ్ళడానికింకా వారం ఉందిగా. మనం వెళ్ళేదాకా అక్కడే ఉంచి ఆ రోజు బయటపెడదాం" అన్నాడు రాఘవ.

'పడేద్దాం' అన్న మాట పోయి 'పెడదాం' అన్నమాట వచ్చిందని గుర్తించాను నేను.

"అప్పుడు మాత్రం యింట్లో ఉంచేస్తే ఏం?" నేనన్నాను.

'వెళ్ళేటప్పుడు తలుపులూ, కిటికీలూ అన్నీ వేసిసి వెళ్తాంగా. వాటికి దారి ఉండదు."

"సర్లే, ఇంకా వారం ఉందిగా, ఈలోగా అవే వెళ్ళిపోతాయేమో".

"పిల్లి పిల్లల్ని ఏడిళ్ళు మారుస్తుందంటారు. తల్లే పట్టుకెళ్ళిపోతుందేమో"అన్నాడు రాఘవ.

తల్లి అన్నమాట బలేగా అనిపించింది నాకు. పిల్లి తల్లి, తల్లిపిల్లి.

వంటిల్లు, డైనింగ్ హాల్, డ్రాయింగ్ హాల్ మా బెడ్రూం వేరే ఉండడం వల్ల ఆ గదిలో ఎక్కువ కావాల్సినవి లేకపోవడం వల్ల ఆ గదిలో పిల్లిపిల్లలుండడం మాకు నష్టం లేదని నిర్ణయించుకుని వాటిమానానికి వాటిని ఆ గదిలో ఉంచేశాం.

పొద్దున్న మెలకువ రాగానే పిల్లి పిల్లల్ని చూడ్డానికి వెళ్ళాను నేను.

"పొద్దున్నే పిల్లి శకునం మంచిదికాదంటారు" అన్నాడు రాఘవ తనుకూడా లోపలికి వస్తూ.

"చూడు, ఎలా పడుకున్నాయో" అన్నాన్నేను.

"మూడు పిల్లల్ని తనలోకి ఇముడ్చుకుని పడుకునుంది తల్లిపిల్లి. పిల్లలు మూడు ఎంతో హాయిగా ముడుచుకుని పడుకునున్నాయి.

"నిన్న సాయంత్రం నుండి, పెద్దపిల్లి కదిలినట్లు లేదు" అన్నాడు రాఘవ.

నాకసలు వాటిని వదిలి కదలబుద్దెయ్యలేదు. నాకే ఆశ్చర్యంగా ఉంది. పిల్లులు కుక్కలూ లాంటి జంతువులనింట్లో పెంచడం నాకిష్టం లేదు. అసలలా పెంచే వాళ్ళంటేనే నాకదోరకమైన చులకన భావన. రాఘవకి కూడా అంతే.

మరి అలాంటిది పిల్లలతో పాటు ఈ పిల్లి ఇంట్లో ఉంటే అసహ్యించుకోవడం మాట అలా ఉంచి వాటి దగ్గరే కూర్చోవాలనుకుంటున్నాం ఎందుకనో.

అదే మాట రాఘవతో అన్నాను.

రాఘవ క్కూడా అదే ఆలోచన వచ్చిందిట.

"మనం ఈ పిల్లలు కాస్త పెద్దవయితే భరించలేం. అప్పుడు మనకవి నచ్చవు. పిల్లలు కాబట్టి చూస్తున్నాం – అంతే" అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

పిల్లి పిల్లల్ని ఇంకో చోటుకి తీసుకెళ్తుందేమో అనుకున్నాం గాని అలా జరగలేదు. రోజూ పొద్దున్న, సాయంత్రం పిల్లినీ, పిల్లల్నీ చూస్తూనే వున్నాం.

అవి పాలు తాగడం, వాటిని తల్లి నాకడం, ఇవన్నీ మాకు వింతగా, ఎంతో హాయిగా అనిపించేవి.

మేం వెళ్ళే రోజు రానే వచ్చింది.

ఇద్దరి శెలవూ ఆ రోజే మొదలవుతుంది. ఇంట్లోనే వున్నాం.

పని మనిషి రెండో పిల్ల సాయంత్రం నాలుగు ప్రాంతంలో వచ్చి పిల్లల్ని బయట





పెట్టేస్తానని చెప్పింది. పెద్దపిల్లి ఉంటే మరెవ్వరినీ దగ్గరికి రానియ్యదని, తల్లి ఉండగా తియ్యలేనని చెప్పింది పని పిల్ల.

పెద్దపిల్లి బయటికి వెళ్ళినపుడు, ఆ గది తలుపులు వేసేసి ఉంచి, పని పిల్ల వచ్చాక ఆ తలుపు తీసి ఉంచి, తక్కిన అన్ని తలుపులూ వేసేసి వెనక దారి నుండి తీసుకువెళ్ళి సపోటా చెట్టు నీడలో పెట్టించెయ్యాలని అనుకున్నాం.

పొద్దున్న భోజనాలయ్యాక కబుర్లు చెప్పుకుంటూ కూర్చునుండగా తల్లిపిల్లి బయటకి వెళ్ళడం చూసి గది తలుపులు వేసేశాం.

ప్రయాణానికి కావలసినవన్నీ సర్దుకున్నాం.

అప్పుడు చూశాం పిల్లిపిల్లలున్న గది ముందు వేసిన తలుపు దగ్గర నిలబడ్డ పెద్ద పిల్లిని.

తలుపు దగ్గరే అటూ, ఇటూ తిరుగుతోంది.

కొంచెం సేపు వెనక్కి తిరిగి వెళ్ళి మళ్ళీ తలుపు దగ్గరకే వెడుతోంది.

అసలక్కడ నుండి కదలడం ఇష్టం లేనట్లుగా తిరుగుతోంది పెద్దపిల్లి.

తలుపుకి మరీ దగ్గరగా వెళ్ళి అన్ని పక్కలా చూస్తోంది. ఎక్కడన్నా లోపలికి వెళ్ళేందుకు దారి కనిపిస్తుందేమోనని.

అలా కొంచెంసేపు తిరిగాక వెళ్ళిపోయింది.

'పాపం' అనుకున్నాన్నేను.

'వెళ్ళిపోయింది' అన్నాడు రాఘవ.

"ఛ మనం ఇలా చేస్తున్నాం ఏమిటి" అనుకున్న మాటే అన్నాన్నేను.

"అసలింతకీ పనిపిల్ల వస్తుందా" అన్నాడు రాఘవ.

"తప్పకుండా వస్తానంది. దానికోసం సపోటా చెట్టుకింద పక్క కూడా వేసింది" అన్నాను. అని అటు పక్కకి నడిచాను. రాఘవ అనుసరించాడు నన్ను. చుట్టూ చిన్న అట్ట ముక్కలు పెట్టి చిన్న గూడులా తయారు చేసింది పనిపిల్ల. పిల్లలు మూడు వెచ్చగా పడుకుందుకు రెండు పాత గుడ్డలతో పక్కవేసింది. ఎప్పుడైనా సరే పని బాగా చేస్తుందని తెలిసినా, రాఘవ మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. "దీనికెంత ఇంటరెస్టో" అని.

"ఏ పక్కనుండన్నా కుక్కలు రావడానికి అవకాశం ఉందేమోనని రెండు పక్కలా కూడా గోడ వుండడం చూసి దానికి తృప్తి కలిగింది" అలా అంటున్న నా గొంతులో ఏదో అడ్డుపడ్డట్లయ్యింది.

"మనం ఊరికి వెళ్ళాల్సిన అవసరం లేకపోతే వాటిని బయట పెట్టాల్సిన అవసరం

ఉండేది కాదు" రాఘవ కంఠంలో ఏదో వణుకు వినిపించింది నాకు. ఎటో తిరుగుతూ అన్నాడు. "మన పనిపిల్ల తీసికెళ్ళిపోదా?" కళ్ళనీళ్ళు తిరిగాయేమో.

నాకు ఆశ్చర్యం వేసింది. పెద్ద విషయాలకి కూడా చలించని రాఘవ ఇలాంటి చిన్న విషయానికి ఇంత ఇదవుతున్నాడేంటని ఆలోచిస్తే ఇది మరీ అంత చిన్న విషయం కాదనిపించింది.

ఇలానే మనుషులకి చేస్తే –

చిన్న పిల్లలు కనిపించని తల్లి మనసు ఎలా వుంటుందో?

వెళ్ళిపోయిందనుకున్న పిల్లి వెళ్ళలేదు. ఇంటి చుట్టూ తిరుగుతోంది.

అక్కడక్కడా వాసన చూస్తోంది. కొన్నిచోట్ల మట్టి తవ్వి మరీ చూస్తోంది.

మా ఇద్దరికీ ఏం చెయ్యాలో తెలియడం లేదు.

ఆ పిల్లలని మేము తియ్యలేం అలాగని తలుపుతీసి వుంచలేం.

పనిపిల్ల వచ్చే సమయానికి తల్లి పిల్లి పిల్లల దగ్గరుంటే వాటిని తీయడం కుదరకపోవచ్చు. ఈ రోజు ఊరికి వెళ్ళి పోతూ వాటిని లోపలపెట్టి తలుపులు వేసి వెళ్ళడం కుదరదు.

మాకు మనస్సులు సరిగ్గా లేవు. టైం మూడున్నరయ్యింది. ఇంకా అరగంటకి కాని పనిపిల్ల రాదు.

సరే కారమ్స్ ఆడదామని కూర్చున్నాం హాల్లో. పిల్లి మళ్ళీ లోపలికి వచ్చింది.

"దాన్ని చూస్తే బాగా జాలేస్తోంది" అన్నాడు రాఘవ.

"అసలటు చూడకు" అటే చూస్తూ అన్నాన్నేను.

మనుషుల మొహాల్లోనే తప్ప జంతువుల మొహాల్లో ఫీలింగ్స్ కనిపిస్తాయన్న ఆలోచన లేదు నాకు. కనిపించినా క్రూరత్వం తప్ప మరొక భావం ఉండదనుకునే నాకు –

ఆ ముఖంలో ప్రపంచంలో ఉన్న దైన్యత్వం అంతా కనిపించింది.

అది నా భ్రమ ఏమో అనుకున్నాను.

"దాని మొహం చూడు పాపం ఎంత జాలిగా పెట్టిందో" అన్నాడు రాఘవ.

నా భావం భ్రమ కాదన్నమాట.

ఆ మొహం నాకింకేమీ అక్కర్లేదు – నా పిల్లలు కనిపిస్తే చాలన్నట్లుగా ఉంది. దానికి ఆలోచనలుంటే అది దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటుంది – 'నా పిల్లలని చూపించు దేవుడా' అని.

పిల్లి హాల్లో ముందు ద్వారం ద్వారా మళ్ళీ బయటకి వెళ్లింది. ఆ గది కిటికీ దగ్గరికి వెళ్ళింది. కిటికీ తలుపులు కూడా మూసేశాం. ఆ గది చుట్టూ వెళ్లి ఇంటి



E:\Seelamma\ Seelama1 60

చుట్టూ తిరిగి హాలు వెనుక తలుపు నుంచి మళ్ళీ లోపలికి వచ్చింది.

నాలుగుసార్లలా ఇంటి చుట్టూ తిరిగి ఎక్కడికో వెళ్లింది పిల్లి.

పని పిల్ల వస్తే బాగుండుననుకుంటుండగా వచ్చిందా పిల్ల. ప్రాణం లేచివచ్చింది.

హాలు ముందు తలుపు వేసేశాం.

సపోటా చెట్టుదగ్గర రాఘవ కాపలా ఉన్నాడు.

నేను గది తలుపు తీశాను. పిల్లలు అలానే పడుకునున్నాయి.

చిన్న అట్టపెట్టెలోకి తీసుకుంది మూడింటినీ. ఆ అట్ట పెట్టెను హాలు వెనక ద్వారంలోంచి తీసుకొచ్చింది. సపాటా చెట్టు క్రింద పొద్దున్న చేసిన పక్కమీద పడుకోబెట్టింది.

అన్ని గదుల తలుపులు కిటికీలు వేసేశాం. కాని హాలు ముందు, వెనక తలుపులు మాత్రం తీసిఉంచాం,

పనిపిల్ల వెళ్ళిపోయింది.

మేం హాల్లో సోఫాలో కూర్చుని వున్నాం.

పిల్లి ముందు నుండైనా వెనుక నుండైనా ఇంట్లోకి రావచ్చు. గది చుట్టూ తిరిగి వెనుక నుండి ఇంట్లోకి వస్తుంటే సపోటా చెట్టు దగ్గరకు వస్తుంది. అప్పుడు పిల్లల్ని చూస్తుంది అని మా నమ్మకం.

పిల్లి ముందు గేట్లోంచి మొక్కల దగ్గర చూసుకుంటూ మా దగ్గరికి వచ్చింది. పిల్లలని పెట్టిన గది దగ్గరికి వెళ్ళింది. ఇంకా అది మూసే ఉంది.

కాని మధ్యలో పిల్లల్ని తీసి మరో చోట పెట్టామన్న విషయం దానికి తెలియదు.

తలుపు ముందు కొంచెంసేపు కూర్చుంది.

లేచి తెరచి ఉన్న తలుపులోంచి బయటకి వెళ్ళింది.

సపోటా చెట్టుకి కొంచెం దూరం నుండి వెడుతున్నట్లు మేం చూశాం. పిల్లి పిల్లలు పక్కమీద పడుకునున్నాయి.

అరవడం లేదు.

ఒకదాని మీదకొకటి, ఒకదాన్లో ఒకటి ముడుచుకుపోతున్నాయే తప్ప కదలడం లేదు.

తల్లిపిల్లికి పిల్లలక్కడ ఉన్నట్లు తెలియలేదు.

ఇంటిచుట్టూ మళ్ళీ తిరిగింది. గది ముందు చాలాసేపునిలబడింది. మళ్లీ తిరగడం మొదలుపెట్టింది.

ఈసారన్నా చూస్తే బాగుండును అనుకుంటుంటే, పిల్లలకి రెండడుగులదూరం

నుంచి వెళ్ళిపోయింది పిల్లి.

'పిల్లల పక్కన పాలు పెడితే' అన్న ఆలోచన నాకు వచ్చింది. చిన్నగిన్నెలో పాలుపోసి చెట్టు దగ్గర పిల్లి వెళ్తున్న దారిలో పెట్టాను. పాలకోసం ఆగిన పిల్లికి పిల్లలు కనిపిస్తాయని నా ఉద్దేశ్యం.

పిల్లి మళ్ళీ అటు వెళ్ళింది. పాల గిన్నె పక్కనుండి వెళ్లిపోయింది.

నాకెంతో ఆశ్చర్యం వేసింది. పాలెక్కడున్నాయా అని వెతుక్కుని, గిన్నెలు బోర్లా తోసుకుని తాగే పిల్లి ప్రక్కన గిన్నెలో పాలు కనిపించినా తాగలేదు. అదేమాట రాఘవతో అన్నాను.

"ఇప్పుడా పిల్లికి పిల్లలు తప్ప ఇంకేమీ అక్కర్లేదులా ఉంది" అన్నాడు.

"ఏమీ ఆలోచనల్లేని పిల్లులకి కూడా పిల్లలంటే ఇంత ఇష్టమా?" అన్నాను.

"దానికి ఆలోచనల్లేవని ఎందుకనుకుంటున్నావు?" నిజంగా నా మనస్సులోకీ ఇదే అనుమానం వచ్చింది.

"ఇప్పుడనిపిస్తోంది పిల్లికి కూడా నిజంగా ఆలోచనలున్నాయేమోనని" అన్నాడు రాఘవ.

"అది పిల్లల్ని చూసేస్తే బావుండును" నేనింక ఆగలేకపోతున్నాను.

రాఘవ మొహంలో కూడా ఆతృత కనిపిస్తోంది.

ఇంతలో పిల్లి గది ముందు మూసిన తలుపు దగ్గిర ఆగింది. దానికేదో అనుమానం కలిగినట్లు నేలను వాసన చూసింది.

అక్కడ ఏం తెలిసిందో పిల్లికి –

అక్కడనుండి అలానే తల నేల దగ్గరగా ఉంచి వాసన చూస్తూనే పరుగెత్తుకుంటూ పిల్లి పిల్లలున్న చోటుకి వెళ్లిపోయింది.

"పనిపిల్ల పిల్లల్ని చేత్తోకదా తీసుకెళ్లింది. నేలమీద అసలు పెట్టలేదు. మరి ఈ పిల్లికి పిల్లల వాసన ఎలా తెలిసిందో" అన్నాడు రాఘవ.

"ఇది ఇలా అవుతుందని విన్నాను కాని, ఇదే మొదటిసారి చూడ్డం. దీనికి ఇక్కడ ఈ వాసన ఎలా దొరికిందో, అసలది వాసనేనా" అన్నాను నేను.

"మన ముక్కులకి అందనిదేదో ఈ జంతువులకి తెలుస్తుందంటారు అలాంటిదేమో –జస్ట్ ఫెంటాస్టిక్" అన్నాడు రాఘవ.

మేమిలా అనుకుంటుండగా చిన్న పిల్లిపిల్లని నోట్లో కరుచుకు వస్తోంది పిల్లి.

"మళ్ళీ ఇటువస్తుందేమిటి" అన్నాన్నేను.

"వేరే ఇంటికి తీసుకెళ్తుందా?" నేను అనుమానాన్ని చెప్పేలోపల అది మూసిన



E:\Seelamma\
Seelama1
61

గది ముందు కొంచెంసేపు నిలబడింది. మళ్లీ బయటికి వచ్చింది. తక్కిన రెండు పిల్లలూ ఏం జరుగుతోందో తెలియనట్లు అలా పడుకునేవున్నాయి.

ఒక పిల్లిపిల్లను పెట్టుకుని తల్లిపిల్ల ఇంటి చుట్టూ తిరగసాగింది. ఆ గది లోపలికి వెళ్ళేందుకు దారికోసమన్నట్లు.

దాని కళ్ళల్లో పిల్లలు దొరికాయన్న ఆనందం ఉందేమో. అవే కళ్ళలో పిల్లల్ని పెట్టుకునే చోటు లేదన్న బాధ కూడా ఉందేమో. ఆ కళ్ళు ఆ రెండు ఫీలింగ్స్‌నీ చూపడం లేదు. తన పిల్లలకి చోటుకోసం వెదుకుతున్న తల్లిమాత్రం స్పష్టంగా కనిపించినట్లయింది నాకు.

"చూడు దానికెంత పట్టుదలో పిల్లలకి చోటుకోసం అలా తిరుగుతోంది" అన్నాడు రాఘవ.

కొంచెం సేపయ్యాక పిల్లనోట్లో లేకుండా వచ్చింది పిల్లి.

తరువాత మరో పిల్లి పిల్లను అలానే తీసుకెళ్ళింది. మూడో పిల్లని కూడా తీసుకెళ్ళిపోయింది.

"అమ్మయ్య" అని నిట్టూర్చి వాచి చూసుకునేసరికి ఆరయింది.

"అమ్మయ్యో టైమయిపోతోంది" అని తొందరగా తెమిలి బయల్దేరేసరికి ఆరున్నరయింది.

వెనక తలుపు వెయ్యడానికి వెళ్ళాన్నేను.

గిన్నెలో పాలు తాగుతోంది పిల్లి.

నా వెనకే వచ్చిన రాఘవ కూడా చూశాడు.

నా భుజం మీద చెయ్యివేసి నా చుట్టూ తన చేతుల్ని వేశాడు. మా ఇద్దరిలోను ఒకటే భావం ఉన్నట్లనిపించింది నాకు. ఎందుకో ఈ రెండేళ్ళుగా మేము చేస్తున్నది ప్రకృతి నియమానికి విరుద్ధమేమో అనిపించింది నాకు.

*విశాలాంధ్ర దినపత్రిక, 1994*

# తెరవెనుక

E:\Seelamma\
Seelama1
62

**కొం**డల వెనుకనుండి ఉదయించిన చంద్రుడు, చంద్రుడిలా కాక ఆకాశంలో నిరాధారంగా తేలుతున్న గుండ్రని లైట్ డోమ్‌లా కనిపిస్తున్నాడు.

కొండల మధ్యనున్న లోయ, లోయలా కాక వెన్నెల నిండిన గిన్నెలా కనిపిస్తోంది.

ఓ కొండ మీద వున్న గెస్ట్‌హౌస్ వెనక ఆవరణలో కూర్చుని చూస్తున్నాడు శ్రీధరరావు.

కొండకి కిందున్న పట్టణానికి ఆఫీసు పనిమీద వచ్చాడు శ్రీధరరావు వారం రోజుల క్రితం. అతనికి ముందు రోజే ఆఫీసు పని అయిపోయింది. వారం రోజులు భార్యా పిల్లలకి దూరంగా ఉన్న తర్వాత తొందరగా ఊరెళ్ళిపోవాలనిపించింది. కానీ తిరిగి ఊరెళ్ళేందుకు రైలు రిజర్వేషను మర్నాటికి కానీ దొరకలేదు. ఆ ఒక్క రోజూ కొండపై గడుపుదామనుకుని పైకి వచ్చాడు.

వేసవికాలం సాయంత్రం కొండమీద చల్లగా, హాయిగా వుంది. రాత్రయ్యే కొద్దీ చలిగా తయారవుతోంది. శ్రీధరరావుకిది కొత్త అనుభవం. ఈ అనుభవాన్ని భార్యా పిల్లలతో పంచుకొంటే బావుండేదనిపిస్తోంది అతనికి.

అందాన్ని అనుభవించడంలో కన్నా అనుభవిస్తున్నామన్న, ఆలోచనలోనూ, అనుభవించామని చెప్పుకోడంలోనూ ఆనందాన్ని అనుభవిస్తారు చాలామంది, చాలాసార్లు. పరిసరాలతో తాదాత్మ్యం చెంది ఆనందించటం అందరికీ అన్ని సమయాలలోనూ జరగదు. శ్రీధరరావు కూడా అలాంటి తాదాత్మ్యంలో లేడు. ఉన్నానన్న భ్రమలో కూడా లేడు. ఆ పరిసరాలలో, భార్యతో కలిసి గడిపితే బావుంటుందన్న ఆలోచనలోని ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

వారం రోజులు తన వాళ్ళకి దూరంగా ఉండాల్సి రావడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఉద్యోగరీత్యా ఎక్కువ టూర్లకి వెళ్ళాల్సిన అవసరం లేదతనికి. పెళ్ళయిన కొత్తల్లో, తనదంటూ ఒక కుటుంబాన్ని తన మనస్సులో కల్పించుకోడానికి ముందు, అతని భార్య తనదైన తన తల్లిదండ్రుల ఇంటికి ఎక్కువసార్లు వెళ్ళి వస్తూండేది. పెళ్ళయిన కొన్నేళ్ళకి తనకి పిల్లలు పుట్టి తనదైన కుటుంబాన్ని తాను నిర్మించుకున్నాక ఎక్కువగా వెళ్ళడం లేదక్కడికి.



పెళ్ళవడానికి ముందు ఒంటరిగా వుండడం కష్టంగా వుండేది కాదు శ్రీధరరావుకి. తల్లిదండ్రులకి దూరంగా వుండడంతో ఎక్కువ ఒంటరితనం అనుభవించలేదు కానీ – భార్యనుండి దూరంగా వున్నపుడు బాగా ఒంటరితనం అనుభవిస్తున్నాడతను.

అలాంటి సమయాలలో కాలక్షేపం చేసేందుకు శ్రీధరరావుకి మందు అలవాటుకానీ, మగువ అలవాటు కానీ లేవు. అలాంటి అవసరం కానీ అవకాశం కానీ శ్రీధరరావుకి కలగలేదింతవరకూ.

శ్రీధరరావు చంద్రుడినీ, కొండలనీ, లోయనీ కళ్ళతోనూ – ఆ పరిసరాల్లో తన భార్యా పిల్లలతో తిరుగుతున్న దృశ్యాన్ని మనస్సులోనూ చూస్తున్నాడు.

తనూ, తన భార్య, తన పిల్లలూ, తన ఉద్యోగం ఈ పరిధిలోనే వుంటాయి శ్రీధరరావు ఆలోచనలు సామాన్యంగా.

"భోంచేస్తారా?" అన్న ప్రశ్న శ్రీధరరావుని ఆ ఆలోచనల్లోంచి పరిసరాల్లోకి తీసుకొచ్చింది.

"ఈ ఊరు బాగుందోయ్– ఎంతసేపు నడిచినా అలసట వుండదు. ఎంత సమయం గడిచినా ఆకలవదు" అన్నాడు శ్రీధరరావు.

సమాధానంగా నవ్వాడు సుధాకర్.

సుధాకర్ ఆ గెస్టు హౌస్‌కి మేనేజర్. పేరుకి మేనేజర్ కానీ, అతను చేస్తున్నది వాచ్‌మన్ పని. ఆ గెస్ట్‌హౌస్ శ్రీధరరావు పనిచేస్తున్న కంపెనీ యజమానిది. అప్పుడప్పుడు తన కుటుంబంతో వచ్చి వుండేందుకు కట్టించుకున్నాడతను. ఆ కంపెనీలో పనిచేస్తున్న ఎవరైనా అటు పక్క పనిమీద వస్తే ఆ గెస్టు హౌస్‌లో వుండొచ్చు. శ్రీధరరావు అలానే వుంటున్నాడు.

సుధాకర్ భార్య అక్కడ వుంటున్న వాళ్ళకి వండిపెడుతుంది.

"నాకెందుకో ఏమీ తినాలని లేదు" అన్నాడు శ్రీధరరావు కుర్చీలోంచి లేవకుండానే.

"ఒంట్లో కులాసాగానే వుందికదా?" అని అడిగాడు సుధాకర్.

"అనారోగ్యం ఏమీ లేదు. మధ్యాహ్నం కొండమీదకి రావడానికి ముందు బాగా భోంచేసి వచ్చాను. అందుకని ఆకలిలేదు"

"పోనీ పళ్ళూ, పాలూ ఏవయినా తీసుకుంటారా?"

"తీసుకురా – ఇక్కడే తిని, తాగుతాను" అన్నాడు శ్రీధరరావు. లోపలకెళ్ళి నాలుగు అరటిపళ్ళూ, పాలూ తీసుకొచ్చాడు సుధాకర్. పళ్ళు తినడం మొదలెట్టాడు శ్రీధరరావు.

దూరంగా నిల్చున్నాడు సుధాకర్.

"ఎంతకాలంగా వుంటున్నావిక్కడ?" అని అడిగాడు శ్రీధరరావు సుధాకర్‌ని.

"నాలుగేళ్ళనుండి?"

"ఈ కొండమీద నీకేంటి కాలక్షేపం?"

"నేనేం ఒక్కడినే లేను – మా ఆవిడుంది" అన్నాడు చిన్నగా నవ్వుతూ సుధాకర్.

"పిల్లలా?" అని అడిగాడు శ్రీధరరావు. సుధాకర్ వయస్సుని అంచనా వేసేందుకు ప్రయత్నిస్తూ.

"అదేనండీ మా బెంగ. పెళ్ళయి ఆరేళ్ళవుతోంది. ఇంకా పిల్లలు లేరు మాకు" అన్నాడు సుధాకర్.

అతని తెలుగు ఉచ్చారణ స్పష్టంగా ఉంది. ఆమాటే అన్నాడు శ్రీధరరావు సుధాకర్‌తో. సమాధానంగా సుధాకర్ –

"మాదసలు ఏలూరండీ, బి.ఏ. చదువుతూండేవాడిని. అప్పుడో అమ్మాయితో పరిచయమైంది. ఆ అమ్మాయిని పెళ్ళాడ్డానికి ఇంట్లోంచి వచ్చేయాల్సి వచ్చింది. తరువాత చదువుసాగలేదు. నేనిలా వాచ్‌మెన్‌లాంటి మేనేజర్ ఉద్యోగం చేస్తున్నాను. ఆ అమ్మాయి అదే మా ఆవిడ వంటపని చేస్తోంది. బాగానే సాగుతోంది మా జీవితం" అన్నాడు.

"ఆఫీసు వాళ్ళు జీతం బాగా యిస్తారా?"

"ఫరవాలేదు. ఈ పనే కాకుండా మేం యిక్కడ వేరే ఏవయినా చిన్న చిన్న పనులు చేస్తుంటాం. ఇక్కడుండి వెళ్తున్నవాళ్ళు కూడా ఏదో కొంత యిస్తుంటారు. బాగానే వుంటుంది సంపాదన."

"అద్దె లేకుండా ఇంత పెద్ద ఇంట్లో వుంటున్నారు. ఎవ్వరూ లేనప్పుడు టెంపరరీగా అద్దెకిస్తూంటారా?" అని అడిగాడు శ్రీధరరావు.

నవ్వేశాడు సుధాకర్.

"ఏంటి ఆ నవ్వుకి అర్థం? నేనేం బాస్‌కి చెప్పనులే" అన్నాడు శ్రీధరరావు మళ్ళీ.

సుధాకర్ మాట్లాడలేదు.

పళ్ళు తినడం పూర్తిచేసి పాలు తాగడం మొదలెట్టాడు శ్రీధరరావు.

"ఈ రోజు రాత్రికిందున్న పట్నంలో పనుంది" అన్నాడు సుధాకర్.

"మరి–" అని ఆగిపోయాడు శ్రీధరరావు.

"నేనే వెళ్తున్నాను, మా ఆవిడ యిక్కడే వుంటోంది. మీకేం ఫరవాలేదు" అన్నాడు సుధాకర్.

"కిందకి వెళ్ళడం ఎలా?" అన్నాడు శ్రీధరరావు ఖాళీగ్లాసు కింద పెడుతూ.



E:\Seelamma\
Seelama1
63

"రాత్రి పది దాకా బస్సులున్నాయి. మళ్ళీ ఆరింటికి మొదలు" అన్నాడు సుధాకర్ గ్లాసునీ, అరటిపండు తొక్కలనీ తీస్తూ.

బి.ఎ. చదువుతూ ఆపేసానన్న అతని మాటలు గుర్తొచ్చాయి శ్రీధరరావుకి.

"నేనింక వెళ్తాను. ఏమీ అనుకోకండి. మీ గదిలో మంచినీళ్ళు పెట్టాను. మామూలుగా ఇంక అవసరాలేం వుండకపోవచ్చును. మీకేదన్నా అవసరమైతే మాత్రం మొహమాట పడకుండా ఆ ఆవిడనడగండి. మీరు పడుకున్న గదికి పక్క గదిలోనే పడుక్కుంటుందావిడ" అని చెప్పి వెళ్ళిపోయాడు సుధాకర్.

అక్కడే కూర్చున్నాడు శ్రీధరరావు. ఏమీ ఆలోచించకుండా ఊరికే కూర్చోడం కష్టం. శ్రీధరరావు ఆలోచిస్తున్నాడు.

ప్రేమించిన అమ్మాయికోసం ఇల్లొదిలి వచ్చేశాడుట సుధాకర్.

ఆ అమ్మాయి కూడా అంతేనేమో. తన వాళ్ళని వదలి వచ్చేసుంటుంది. ఆరేళ్ళ క్రితం బి.ఏ. చదువుతూ పెళ్ళి చేసుకున్నానంటున్నాడు. అంతే పాతిక సంవత్సరాలు పైన వుండవు సుధాకర్‌కి. ఆ అమ్మాయి వయస్సు సుమారుగా అంతే వుండి వుండొచ్చు.

సుధాకర్ బావున్నాడు. సుధాకర్ ప్రేమించిన ఆ అమ్మాయి కూడా అందంగా వుండి వుండచ్చు. అలాగని నిశ్చయంగా అనుకోలేం. ప్రేమకు అందం అంత ముఖ్యం కాదు.

ఎవరు ఎవరినెందుకు ప్రేమిస్తారో తెలియదు. ఓ వయస్సులో అమ్మాయిలూ, అబ్బాయిలూ ఒకరంటే ఒకరికి సహజంగా వుండే ఆకర్షణని ప్రేమ అని అనుకుంటారు. ఓ వయస్సు దాటాక అది ప్రేమ కాదనీ ఆకర్షణ అనీ తెలుస్తుంది. ఈలోగా ఇద్దరి మధ్య ఓరకమైన ప్రేమ కలగచ్చు. అలా కలిగితే కలిసి సుఖంగా వుండగలుగుతారు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న వీళ్ళిద్దరూ సుఖంగా వున్నారో లేదో తెలియదు.

ఈ ఆలోచనల్లోంచి నెమ్మదిగా తేరుకుంటూ టైం చూశాడు. పదిన్నరయింది.

ఇంక పడుకుందామని లోపలికి నడిచాడు.

కారిడార్‌కి ఒక పక్క వంటిల్లు, భోజనాల గదీ వున్నాయి. మరో ప్రక్క రెండు గదులున్నాయి. మొదటి గదిలో తన సామానుంది. అంటే రెండో గదిలో ఆ అమ్మాయి పడుకునుంటుంది.

కారిడార్‌లో నీలంరంగు దీపం వెలుగుతోంది. అన్ని గదులు తలుపులు తీసే వున్నాయి. అతనికి ఆశ్చర్యంగా అనిపించింది. సుధాకర్ భార్య పడుకున్న గది తలుపు కూడా తీసేవుంది. తలుపుకి నీలంరంగు తెర వేలాడుతోంది. లోపల కూడా చిన్నదీపం

వెలుగుతున్నట్లుంది. గదిలోపలి నుండి ఏ అలికిడీ లేదు. ఆ అమ్మాయి పడుకుని వుండవచ్చునని అనుకుంటూ తన గదిలోకి నడిచాడు శ్రీధరరావు.

మంచినీళ్ళు తాగి పెద్ద దీపం ఆర్పేసి బెడ్‌లైట్ తీసుకుని మంచంమీద పడుకున్నాడతను.

పక్కగది ఆలోచనలు ముసురుకున్నాయి.

తను పడుకున్న గదికీ, పక్కగదికీ మధ్య తలుపుల అడ్డం లేదు. ఆ గదిలో ఆ అమ్మాయి నిద్రపోతోంది. నిజానికి నిద్రపోతోందో లేదో తెలియదు, అలికిడి లేదు కాబట్టి నిద్రపోతోందనుకోవాలి.

అయితే ఆ అమ్మాయి గది తలుపులు ఎందుకు వేసుకోలేదో తెలియడం లేదు. పక్కమీద ఊరికే పడుకునుండగా నిద్ర పట్టేసిందేమో. మెలకువ వచ్చినపుడు లేచి తలుపులు వేసుకుంటుందేమో. గది లోపల చిన్న దీపం మాత్రం వుంది.

తన భర్త లేని సమయంలో తక్కిన ఇళ్ళకి దూరంగా విసిరెయ్యబడ్డటున్న ఓ గెస్ట్‌హౌస్‌లో ఇంకో మగాడు పడుకుంటాడని తెలిసి కూడా ఈ అమ్మాయి తన గది తలుపులు వేసుకోకుండా పడుకోడం చాలా ఆశ్చర్యంగా వుందతనికి.

ఎవ్వరూ ఏమీ చెయ్యరన్న నమ్మకం ఎక్కువైనా వుండి వుండాలి. లేదా ఎవ్వరూ ఏమీ చెయ్యరని అనుకునే అమాయకురాలైనా అయి వుండాలి. అంత అమాయకురాలు అయ్యుండకపోవచ్చును. అసలా అమ్మాయి గురించి తనకేమీ తెలియదు. అయినా ఆ అమ్మాయి ఆలోచనలే వస్తున్నాయి తన బుర్రలోకి.

గెస్ట్‌హౌస్ పైన గదులున్నాయి. ఆ అమ్మాయి పైనున్న గదుల్లో పడుకోకుండా కింద తన పక్కనున్న గదిలోనే ఎందుకు పడుకుందో? పైన విడిగా పడుకుందుకు భయమయి ఉండవచ్చు. అసలందుకే తలుపులు తీసుకుని పడుకుందేమో. తలుపులు వేసుకుని పడుకుందుకు భయమేమో.

భయం రెండు రకాలుగానూ వుంటుంది. కొందరికి తలుపులు వేసుకోడం భయంగా వుంటుంది. కొందరికి తీసుకుందుకు భయంగా వుంటుంది. తన భార్యకి తలుపులు తీసుకుని పడుకోడానికి భయం. ఈ అమ్మాయికి వేసుకుని పడుకోడం భయమయి వుంటుంది.

ఆ భయం ఎంత తీవ్రమైనదై వుంటుందంటే, ఇంకో మగాడు తన్నేదన్నా చేస్తాడన్న భయాన్ని మించినదై వుంటుంది.

ఇంకో మగాడు తన్నేదన్నా చేస్తాడన్న భయం లేదేమో ఈ అమ్మాయికి. బాగా వయస్సు మీరినా, అంద వికారంగా వున్నా ఆడవాళ్ళకి ఈ భయం వుండకపోవచ్చు.



E:\Seelamma\
Seelama1
64

ఈ అమ్మాయికి పాతికేళ్లకి మించి వుండవు. ఇంక అందంగా వుంటుందో లేదో తెలియదు.

మధ్యాహ్నం ఈ గెస్ట్‌హౌస్‌కి వచ్చినప్పట్నుంచి తను ఈ అమ్మాయిని చూళ్ళేదు. రాత్రి భోంచేసి ఉంటే భోజనాల గదిలో వడ్డించి వుండేదేమో. తను భోం చెయ్యలేదు. ఈ అమ్మాయిని చూడ్డం కోసమైనా భోంచేసి వుండాల్సింది. ఈ రాత్రి ఇలా పడుకోవాల్సి వస్తుందని అప్పటికి తనకి తెలియదు.

ఆ అమ్మాయి ఎలాగుంటుందోనన్న కుతూహలం పెరగసాగింది శ్రీధరరావులో. లేచి పక్క గది దగ్గరికెళ్ళి తెర తీసి చూస్తే ఆ అమ్మాయి కనిపిస్తుంది. లోపల చిన్నదీపం వెలుగుతోంది. ఆ అమ్మాయి మరీ స్పష్టంగా కనిపించకపోయినా, అందంగా ఉందో లేదో తెలియవచ్చు. లేచి వెళ్ళి తెర తీద్దామనుకున్నాడు కానీ...

చిన్నతనం నుండి తనలో పెరిగిన సంస్కారం అడ్డొచ్చింది శ్రీధర్‌రావుకి. ఒంటరిగా పడుకుని వున్న పరాయి స్త్రీ గదిలోకి తొంగి చూడ్డం సభ్యత కాదనిపించింది.

తనలో ఆ అమ్మాయంటే ఎందుకంత కుతూహలం కలుగుతోందా అని అనిపించసాగింది. శ్రీధరరావుకి. తనలో ఏదో ఒక మూల ఆ అమ్మాయంటే ఒక ఆకర్షణ కలుగుతోందేమోనన్న అనుమానం కలుగసాగింది. అసలు చూడని అమ్మాయి మీద ఆకర్షణ కలుగుతుందా? కలుగచ్చు. స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ సహజం. ఇంకెవ్వరూ లేని ఒంటరితనంలో ఆడా మగా మధ్య ఆకర్షణ కలగవచ్చు.

ఆ అమ్మాయంటే తనకి ఆకర్షణ కలుగుతోందన్న భావాన్ని అంగీకరించలేకపోతున్నాడు శ్రీధరరావు. అతనికి భార్యా, పిల్లలున్నారు. తన భార్యతో తప్ప ఇంకో స్త్రీతో అతని కింత వరకూ సంబంధం లేదు. ఆఫీసులో అమ్మాయిలతో పని చేస్తున్నా అది అఫీషియల్ రిలేషన్ షిప్ కానీ మేన్ – ఉమెన్ రిలేషన్ షిప్ కాదు.

అయితే ఈ రోజు గెస్ట్‌హౌస్‌లో పడుకునుండగా, పక్కగది తలుపులు వేసుకోకుండా పడుకుని వున్న అపరిచిత అమ్మాయి గురించి ప్రత్యేకమైన ఆలోచనలు కలుగుతున్నాయి.

ఆ ఆలోచనల్లో శ్రీధరరావుకి నిద్రపట్టడం లేదు. అసలు కళ్ళు మూతలు పడ్డం లేదు.

పక్క గదిలోంచి ఏ అలికిడీ లేదు.

ఇంతకీ ఆ అమ్మాయి పక్క గదిలో వుందా? పక్క గదిలో పడుకోలేదోమో? మేడ పైన గదిలో పడుకుందేమో. సుధాకర్ పక్క గదిలో పడుకునుంటుందని చెప్పాడు. అయితే ఆ అమ్మాయి పడుకోలేదేమో.

లేచి గది తలుపులకున్న తెర తీసి చూస్తే కానీ తెలియదు. అంటే లేచి తెర తీసి చూడాలి.

ఒకవేళ తను తెర తీసి చూసేసరికి ఆ అమ్మాయి ఆ గదిలోనే మెలకువగా వుండి తన్ని చూసి ఏం కావలని అడిగితే ఏం చెయ్యాలి? మంచినీళ్ళు కావాలని అడగవచ్చు కానీ, సుధాకర్ తన గదిలో మంచినీళ్ళు పెట్టి వెళ్ళాడు.

ఏదయినా అవసరం అయితే సుధాకర్ తన భార్యని అడగమన్నాడు. ముందు తనో అవసరం సృష్టించుకోవాలి. రాత్రి తనకేం అవసరాలు వుంటాయి?

ఏ తలనొప్పి లాంటిదో వస్తే మందు కావాలంటే అడగవచ్చు. అయితే తనకి ప్రస్తుతం నొప్పు లేమీ లేవు. అయితే తలనొప్పి వచ్చిందని అబద్ధం చెప్పవచ్చు.

అబద్ధం ఆడడం తప్పా, కాదా అన్న ప్రశ్నకి సమాధానం వెతకడం కష్టమని శ్రీధరరావుకి తెలుసు. కొన్ని సమయాలలో అబద్ధం చెప్పడం నిజం చెప్పడం కన్నా ఉపయోగకరంగా వుంటుంది. చెప్పే వాళ్ళకే కాకుండా, విన్న వాళ్ళకి కూడా. అయితే స్వార్థ చింతనతో అబద్ధం ఆడటం అంత మంచిది కాదేమోననిపించింది శ్రీధరరావుకి.

అబద్ధం ఆడటంలోని మంచి చెడులు తప్పొప్పులు వీటి తర్కంలోకి వెళ్ళడం మానేసి, తన ఆలోచనలో స్వార్థం వుందా లేదా అని ప్రశ్నించుకోసాగాడు. ఆ అమ్మాయి అందంగా వుందో లేదో అని చూడ్డంలో స్వార్థం వుందా?

స్వార్థం వుందేమోననిపించసాగింది అతనికి. అయినా చూడాలన్న కోరిక పెరుగుతూనే వుంది. చూసీ – ఒకవేళ ఆ అమ్మాయి అక్కడ పడుకోలేదని తెలిస్తే, ఇంక ఈ ఆలోచనలకి స్వస్తి చెప్పవచ్చు. అలా కాక ఆ అమ్మాయి ఆ గదిలోనే పడుకునున్నా, అందంగా లేదని తెలిస్తే ఆ అమ్మాయికి మరో మగాడంటే భయం వుండేందుకు అవకాశం లేదని సరిపెట్టుకోవచ్చు ఒకవేళ అందంగా వుంటే –

ఈ ప్రశ్నకి సమాధానం దొరకలేదు శ్రీధరరావుకి.

అయినా లేచి వెళ్ళి చూడాలనిపించింది. ఆ అమ్మాయి ఆ గదిలోనే మెలకువగా వుండి ఏం కావలని అడిగితే తల నొప్పి మందు కావలని అడగవచ్చు.

సుధాకర్ చెప్పనే చెప్పాడు – ఏదన్నా కావల్సి వస్తే మొహమాటం లేకుండా ఆ అమ్మాయిని అడగమని.

ఏం అవసరం కలుగుతుందని సుధాకర్ అనుకుని వుంటాడు? ఏ అవసరమైనా మొహమాట పడవద్దని ఎందుకంత గట్టిగా చెప్పాడు.

సుధాకర్ మాటల్లో కొత్త అర్థాలు కనిపించసాగాయి శ్రీధరరావుకి. సుధాకర్ తమ ఇద్దరినే వదిలేసి ఎందుకు వెళ్ళినట్లు? పట్టణంలో అతనికి రాత్రి పనేముంటుంది?

E:\Seelamma\
Seelama1


చుట్టు పక్కల డబ్బు కోసం చిన్న చిన్న పనులు చేస్తామని అన్నాడు. అలాంటి పనయ్యుండవచ్చు. అయితే మాత్రం రాత్రి పూట ఈ మారుమూల గెస్ట్‌హౌస్‌లో భార్యని పరాయి మగాడితో వుండమని వెళ్ళిపోవడం ఆశ్చర్యంగా వుంది. కావాలనే అలా చేశాడేమో ననిపించసాగింది.

తన పెళ్ళయిన కొత్తలో తనెప్పుడయినా ఎక్కడికైనా వెళ్ళాల్సి వస్తే తన తమ్ముడు ఉండేవాడు. తనకి తమ్ముడే అయినా ఇంట్లో తన భార్యకిపరాయి మగాడే. వాళ్ళిద్దరినీ ఇంట్లో వదిలేసి వెళ్తున్నానని తనేనాడూ అనుకోలేదు. అంతేగాదు. తన భార్య ఒక్కత్తే ఉండక్కరలేకుండా తమ్ముడున్నాడని సంతోషించేవాడు.

సుధాకర్ కూడా అలాగే అనుకుని వుండవచ్చు. మామూలుగా ఈ గెస్ట్‌హౌస్‌లో వుండేది వాళ్ళిద్దరే. ఈ రోజు తను వున్నాడు. తను తోడుగా వుంటాడన్న ధైర్యంతోనే తన భార్యని వదిలి పట్టణం వెళ్ళాడేమో సుధాకర్.

ఈ ఊహ నచ్చలేదు శ్రీధరరావుకి. తన తమ్ముడు తనింట్లో వాడు. తను వీళ్ళిద్దరికీ పరాయివాడు. తన తమ్ముడి మీద తనకి నమ్మకం ఉండడానికి వాడి గురించి తనకి బాగా తెలుసు. తన గురించి సుధాకర్‌కి ఏమీ తెలియదు.

సుధాకర్ కావాలనే ఇద్దరినీ ఇంట్లో వుంచేసి వెళ్ళాడు. అంతే కాకుండా తనకేం కావాల్సి వచ్చినా ఆ అమ్మాయిని మొహమాటపడకుండా అడగమన్నాడు.

వారం రోజులుగా భార్యకి దూరంగా వున్న వాడికి రాత్రి కావల్సిందేమిటో తెలియనివాడు కాదు సుధాకర్. అలాగే రాత్రి పూట ఇలాంటి వాతావరణంలో ఓ అమ్మాయిని మొహమాటపడకుండా అడిగేదేమిటో కూడా అతనికి తెలుసు.

సుధాకర్ కావాలనే ఆ అమ్మాయిని ఇంట్లో వుంచి తను వెళ్ళిపోయాడు. తనని అవసరం తీర్చుకోమన్నాడు.

వీళ్ళు ఈ పనిని మామూలుగా చేస్తూండి వుంటారు. అందుకనే ఇంకెవరి కన్నా అద్దెకిస్తున్నారా అంటే సమాధానం చెప్పలేదు సుధాకర్.

ఆ అమ్మాయి సుధాకర్ భార్య అయ్యుండకపోవచ్చును. ఇద్దరూ కలిసి వ్యాపారం చేస్తూండి వుంటారు.

భార్యని పర పురుషులకి అప్పగించి వెళ్ళే భర్తలు సామాన్యంగా వుండరు. అలాగే మరో మగాడుండగా తలుపులు తెరుచుకుని పడుకునే భార్యలు కూడా అరుదుగా వుంటారు.

ఈ అమ్మాయి నిశ్చయంగా పడుపు వృత్తి చేస్తోంది. సుధాకర్ ఆ అమ్మాయికి కష్టమర్స్‌ని తీసుకొస్తూండి వుంటాడు. ఈ పనికి ఈ గెస్ట్‌హౌస్‌ని

వాడుకుంటున్నారిద్దరూ.

తను ఆఫీసులో వాడే కాబట్టి, నేరుగా చెప్పలేక, డొంక తిరుగుడుగా చెప్పి వెళ్ళిపోయాడు.

అవతలి మనుషుల నడవడిక మీద నైతిక పరమైన జడ్జిమెంట్స్ చేస్తున్నానని అనుకుంటూనే, చేస్తున్నాడు శ్రీధరరావు.

ఆ అమ్మాయి తన కోసం ఆ గదిలో ఎదురు చూస్తూండి వుంటుంది. కొంత సేపటి దాకా తను వెళ్ళకపోతే ఆ అమ్మాయే తన గదిలోకి రావచ్చును.

తనకు తెలియకుండానే ఆ అమ్మాయి కోసం ఎదురు చూడ్డం మొదలుపెట్టాడు శ్రీధరరావు. ఆ అమ్మాయి తప్పకుండా తన గదిలోకి వస్తుందనిపించసాగిందతనికి.

వస్తే ఏం చెయ్యాలా అని ఆలోచించసాగాడతను.

వేశ్యలు, పడుపు కత్తెలు, వెలయాళ్ళు ఇవన్నీ పుస్తకాల్లో మాటలతనికి. నిజంగా వాళ్ళెలాగుంటారో, ఎలా ప్రవర్తిస్తారో తెలియదతనికి.

తెల్లచీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని వస్తుందేమో ఆ అమ్మాయి. వచ్చి తనకి ఒంటరిగా పడుకుందుకు భయంగా వుందని తన పక్కన పడుకుంటుందేమో.

శ్రీధరరావుకి తన శోభనం రాత్రి గుర్తొచ్చింది. తన భార్య అలా వచ్చి పడుకోలేదు. ఆలికీ, వెలయాలికీ అదే తేడా అయ్యుంటుంది.

ఆ అమ్మాయి అలా చేస్తే తనేం చెయ్యాలన్న ఆలోచన కలిగింది శ్రీధరరావుకి. తనకి తన జీవితమంతా భార్యతోటే. ఇన్నాళ్ళుగా జీవితాన్ని అలా గడిపాక. ఈ రోజు ఈ అమ్మాయితో గడుపుతాడా? తన భార్య గురించీ, ఆవిడంటే తనకున్న ప్రేమ గురించి చెప్పి పంపించి వెయ్యాలి.

ఇంకా ఆ అమ్మాయి ఎందుకు రావడం లేదనిపించసాగింది శ్రీధరరావుకి.

ఆ ఆలోచనల్లో, ఎదురు చూడ్డంలో సమయం పన్నెండున్నరయింది. అయినా నిద్ర రావడంలేదు. శ్రీధరరావుకి.

ఎంత సేపయినా ఆ అమ్మాయి రాక పోవడం బాగా నిరుత్సాహంగా అనిపించసాగిందతనికి.

అంతకు ముందు రాత్రి కూడా ఇలాంటి బేరం తగిలి నిద్ర లేకుండా వుండి వుంటుంది ఈ అమ్మాయి. అందుకే బాగా నిద్ర పట్టేసి వుంటుంది. మెలకువ రాగానే వస్తుంది అనుకున్నాడు.

ముందు రాత్రి ఇక్కడున్న అదృష్టవంతుడెవ్వరా అని అనుకుని, వాణ్ణి అదృష్టవంతుడని అనుకుంటూ తను కూడా అదృష్టవంతుడే కదా అని అనుకున్నాడు.

తను ఈ కారణంగా అదృష్టవంతుడా? అలా అనుకోవడం కొంచెం చిన్నతనంగా అనిపించింది.

ఇంకో అమ్మాయితో ఓ రాత్రి గడపడం అదృష్టం అవుతుందా? అలాగని చాలా మంది అంటారు. తన స్నేహితుల్లో చాలామంది అలా చెప్తారు. స్వంత భార్యలతో కాక ఇంకెవరన్నా స్త్రీలతో కాలం గడపడం హాయిగా వుంటుందంటారు. తనకి ఆ అనుభవం లేదు.

కొత్త వాటిని అనుభవించడంలో ఎప్పుడూ ఓ థ్రిల్ వుంటుంది. వేసవి కాలం కొండమీద గడపడం కొత్త అనుభవం అనే గదా తను కొండ మీద కొచ్చింది. ఎప్పుడూ వాడే పేస్టులను, సబ్బులను మార్చి కొత్త వాటిని కొనడం ఎందుకు? కొత్త వాటిని అనుభవించాలనే కదా?

ఈ అనుభవం కూడా అలానే చూడవచ్చు నేమో.

ఊరు కాని ఊరులో తనేం చేసినా ఎవ్వరికీ తెలియదు. అసలిక్కడ వున్నానన్న సంగతి కూడా ఎవ్వరికీ చెప్పక్కర్లేదు.

తన భార్యకి తెలిసే అవకాశమే లేదు.

తన భర్త తనతో కాక మరెవ్వరితోనైనా సంబంధం పెట్టుకున్నాడని తెలిస్తే, ఏభార్యా సహించదు. అయినా తను ఈ అమ్మాయితో సంబంధం పెట్టుకోవడం లేదు. అసలు తను ఈ ఊరు మళ్ళీ రాడు. రోజుకో మగాడితో వ్యాపారం చేసే ఈ అమ్మాయికి తనంటే ప్రత్యేకమైన అభిమానం వుండదు. మర్నాటికి తను గుర్తుండడు. ఇది ఓ రాత్రి సంబంధం. అదీ ఆర్థికపరమైన సంబంధం.

ఓ సినిమా చూసినట్లు – అంతే.

శ్రీదరరావు మంచం మీద లేచి కూర్చున్నాడు.

ఆ అమ్మాయి నేనలాంటి దాన్ని కాదని అనదు. ఓ రాత్రికి రేటింత అని చెప్తుంది. ఎంతయినా వందల్లోనే కానీ, వేలల్లో వుండదు.

ఓ సరదాకీ, ఓ కొత్త అనుభవానికి ఆ మాత్రం జీవితంలో ఓసారి ఖర్చు పెట్టవచ్చు.

ఈ విషయం ఇంకెవ్వరికీ తెలిసే అవకాశం లేదు.

ఈ పరిస్థితి తను కావాలని కల్పించుకున్నది కాదు. తనలా చెయ్యడు కూడా. అనుకోకుండా అన్నీ కలిసి వచ్చాయి. అలా కలిసి వచ్చినప్పుడు అదేంటో చూడ్డంలో తప్పు లేదు.

ఏవన్నా వ్యాధులు అంటుకుంటాయేమో నన్న భయం ఓ క్షణం పాటు కలిగింది. దానికి తగ్గ జాగ్రత్తలు ఆ అమ్మాయి తీసుకుంటూనే వుంటుందనుకుని సర్ది

చెప్పుకున్నాడు. ఎలాగైనా ఆ విషయం గురించి ముందే అడిగి తెలుసుకోవచ్చునను కున్నాడు.

లేచి తన గదిలోంచి బయటకి నడవసాగాడు.

అతని అడుగులు నెమ్మదిగా పడుతున్నాయి.

అతనిలో సన్నగా ఒణుకు ప్రారంభమైంది.

ఒళ్ళంతా ఆవిరి కమ్మినట్లవుతోంది.

గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఆ అమ్మాయి పడుకున్న గది ముందు నిలబడి తెర తీసేందుకు తెర మీద చెయ్యి వేశాడు.

అతనికెందుకో భయం వేసింది.

ఆ పని చెయ్యకూడదనిపించింది.

అక్కడ నిలబడాలని అనిపించలేదు.

తొందరగా నడుచుకుంటూ తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

ఎప్పుడూ చేద్దామని అనుకోని పనిని ఎందుకు చేద్దామనుకున్నాడు? తనలో ఈ ఆలోచన ఎందుకు కలిగింది?

తనలోని మంచితనం చుట్టూ వున్న సమాజంలో మంచి వాడినని పేరు తెచ్చుకోవడం కోసం తను పెంచుకున్నదా?

తనకు తెలియని అమ్మాయితో కొత్త పరిసరాలలో సామాన్యంగా తను చెడ్డదని భావించే పని చెయ్యడానికి తనెలా పూనుకున్నాడు?

ఎవ్వరికీ తెలియదనిపిస్తే తనుఎవరి నన్నా చంపి, ఓ లక్ష రూపాయలు దొంగతనం కూడా చేస్తాడేమో.

తను అనవసరంగా ఆలోచిస్తున్నాడు.

ప్రత్యేకమైన పరిస్థితుల్లో తాత్కాలికమైన చిత్త చాంచల్యం తనను ఆ గదివైపు నడిపింది. అయితే తనలో వున్న నిగ్రహం తనని ఆ గదిలోకి వెళ్ళనీయలేదు. ఆ తెర తీయనియ్యలేదు.

అయితే ఆ సమయంలో కొంత భయం వేసినట్లయిందెందుకో?

ఆ అమ్మాయి లేచి అరుస్తుందనా?

ఈ విషయం తన భార్యకి ఎవరి ద్వారానైనా తెలుస్తుందనా?

ఎయిడ్స్ లాంటిది వస్తుందనా?

ఇవేవీ కావు. తను తనకిష్టం లేని పనిని చేస్తుండడం వల్ల భయం కలిగింది.



E:\Seelamma\
Seelama1
67

అందుకే ఆ పనిని చెయ్యలేదు.

చాలాసేపు ఈ ఆలోచనల్లో గడిపాక తెల్లారగట్ల నిద్ర పట్టింది శ్రీధరరావుకి.

మెలకువ వచ్చి టైం చూసేసరికి ఏడు దాటుతోంది.

తొందరగా సామాను సర్దుకుని, సూట్‌కేస్ పట్టుకుని బయల్దేరాడు.

వంటింట్లో శబ్దాలు వినిపిస్తున్నాయి. ఆ అమ్మాయి లేచి పని చేసుకుంటున్నట్లు.

ఓసారి తొంగి చూద్దామనుకున్నాడు. చెప్పి వెళ్ళవచ్చుననుకున్నాడు. డబ్బు కోసమే గానీ ప్రేమాభిమానాల కోసం బతకని వాళ్ళ మొహాలు చూడక్కర్లేదనుకుని బయల్దేరి బస్టాండువైపు నడిచాడు.

దారిలో సుధాకర్ ఎదురయ్యాడు.

అతనేదో చెప్పేలోగానే "అర్జెంటు పనుంది – వెళ్తున్నా" అని చెప్పి బస్టాండ్‌కి వచ్చేశాడు.

తనొచ్చి బస్సు ఎక్కిస్తానని సుధాకర్ చెప్పినా వినిపించుకోలేదు శ్రీధరరావు.

బస్సు కొండ దిగసాగింది.

శ్రీధరరావు ఆలోచిస్తూనే వున్నాడు.

ముందు రాత్రి తనలో ఎంత అలజడి కలిగినా తను శారీరకంగా, ఏ తప్పు చెయ్యలేదు. తన మంచితనాన్ని కాపాడుకున్నాడు.

అయితే కొన్ని ప్రశ్నలు అతన్ని వీడడం లేదు.

అసలు తప్పు ఆలోచనలో వుందా? ఆచరణలో వుందా?

ఆలోచనలో చెడూ, ఆచరణలో మంచీ వుండడమే పిరికి తనమా?

వ్యక్తిగతంగా మనుషులకుండే పిరికి తనమే సమాజానికి లాభదాయకమా?

ఎందరో ఇలాంటి వాళ్ళు ఉండబట్టే తనూ, తన భార్యా, తన పిల్లలూ, సుఖంగా వుండగలుగుతున్నారా?

అసలు నిజంగా తప్పొప్పులు లేవా?

ఈ ప్రశ్నలకి సమాధానాలు తెలియవు శ్రీధరరావుకి.

అసలెవరికన్నా సమాధానం తెలుసో తెలియదో కూడా తెలియదతనికి.

# ది నెట్



**తా**ళం తీసుకుని ఇంట్లోకి అడుగు పెట్టింది మాధవి. ఉదయం తను ఇంట్లోంచి వెళ్తూ ఎలా ఉంచి వెళ్ళిందో అలానే ఉంది ఇల్లు. అప్పుడు ఎక్కడ ఏ వస్తువు ఉందో, ఇప్పుడూ అక్కడే ఉంది. ఏ మార్పూ లేదు.

మార్పు చైతన్యానికి చిహ్నం. ఏ మార్పు లేని ఇల్లు చేతనారహితంగా, నిర్జీవంగా కనిపిస్తోంది.

ఎండలోంచి ఎ.సి. గదిలోకి వెళ్తే, గదిలోని చల్లదనం శరీరానికీ, మనస్సుకి తగులుతుంది.

అలానే బయట నుండి ఇంట్లోకి వచ్చిన మాధవిని, గదిలోని ఒంటరితనం చుట్టేసింది.

అది కొన్ని గంటల ఒంటరితనం కాదు. ఎప్పుడూ ఉండేది.

మూడు పడగ్గదులూ, వంటిల్లూ ఉన్న అందమైన ఫ్లాట్‌లోని హాల్లో సోఫాలో కూర్చుని ఆ రోజు తండ్రి దగ్గర నుండి ఉత్తరం తీసి చదువుకుంది మాధవి.

అమ్మకి ఆరోగ్యం సరిగ్గా ఉండడం లేదనీ, తన్ని చూని చాలా రోజులయిందనుకుంటోందని వీలయితే ఒకసారి చూసి వెళ్ళమని రాసారు నాన్న.

తనని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి చూసిరావడం కుదరడం లేదు తనకి అన్న ఆలోచన అసంతృప్తిగానే ఉంటుంది మాధవికి.

అలాగని వాళ్ళు మరీ దూరంగా లేరు. అయిదు వందల మైళ్ళు కూడా ఉండదు వాళ్ళుంటున్న ఊరు. తన భర్త అశోక్ ఒక్కో రోజు అయిదు వేల మైళ్ళు ప్రయాణం చేస్తాడు. తనకి ఆరు నెలలకోసారి అయిదు వందల మైళ్ళు ప్రయాణం చేసి తల్లిదండ్రుల దగ్గరకి వెళ్ళడం కుదరడంలేదు.

తను వెళ్ళాలంటే, అశోక్ ఎక్కడకైనా వెళ్ళాలి. అశోక్ ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా, తిరిగి ఎప్పుడు వస్తాడో తెలియదు. భర్త తిరిగి వచ్చే సమయానికి తను ఇంట్లో లేకపోతే అతనికి కష్టం. అంతే కాదు, ఇద్దరూ దగ్గరగా ఉండేందుకు, ఒకరికొకరు దగ్గరయేందుకు అరుదుగా దొరికే అవకాశాన్ని వదులుకోవడం ఇష్టం లేదు మాధవికి.

అశోక్ ఢిల్లీ నుండి తిరిగి వస్తాడో, ఇంకా ఎటైనా వెళ్తాడో తెలియదు. ఏ విషయమూ తెలిస్తే, రెండు రోజులు ఊరెళ్ళి రావాలనిపించింది మాధవికి.

సోఫాలో కూర్చుని ఆలోచిస్తున్న మాధవి ఆలోచనలకు అడ్డు వస్తూ ఫోను మోగింది.

అశోక్ దగ్గర నుండే ఫోన్.

"బావున్నావా?" అని అడిగాడు అశోక్.

"బావున్నాను. నాన్న దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. రేపూ, ఎల్లుండీ నాకు సెలవులు. ఒకసారి ఊరెళ్ళి వద్దామనుకుంటున్నా" అని మాధవి అంటూంటే -

"ఓహ్ - నేను ఇప్పుడు ఎయిర్ పోర్ట్ నుండి మాట్లాడుతున్నాను. ఇంకో మూడు గంటల్లో ఇంట్లో ఉంటాను. మళ్ళీ సోమవారం బయల్దేరి వెళ్ళాల్సి ఉంటుంది. నేనున్న రెండు రోజులూ నువ్వుండవా?" అని అడిగాడు అశోక్.

"మీరున్న రోజుల్లో నేనెందుకు వెళ్తాను? మీరు వస్తారో, రారోనని వెళ్దామనుకున్నాను" అని అంది మాధవి.

"ఇప్పుడే బయల్దేరుతున్నాను. చాలా రోజులయింది నిన్ను చూసి" అన్నాడు అశోక్.

"ఇలాంటివి గుర్తుంటాయా మీకు?" అని అడిగింది మాధవి.

"అలా అంటావేంటి మాధవీ! ఇంత అందమైన నిన్ను పెళ్ళి చేసుకుని, ప్రతి రోజూ రోజంతా నీతో గడపలేకపోతున్నానన్న బాధలేదూ నాకు? ఐ యామ్ వెరీ ప్రౌడాఫ్ యువర్ బ్యూటీ" అన్నాడు అశోక్.

"మీ కోసం చూస్తున్నాను. మీరు రండి. నేను తర్వాత ఎప్పుడైనా వెళ్తాను ఊరు" అంది మాధవి.

అన్నట్లుగానే మూడు గంటల్లో వచ్చాడు అశోక్.

వస్తూనే స్నానం పూర్తి చేసుకుని, మాధవిని బయట హోటల్‌కి డిన్నర్‌కి తీసుకెళ్ళాడు. ఆ రాత్రి సరదాగా గడిచిపోయింది.

మర్నాడు ఉదయం లేస్తూనే కంప్యూటర్ మీద తన పనిలో మునిగిపోయాడు అశోక్.

అతనికి కాఫీ అందిస్తూ - "నాలుగు రోజుల క్రితం మావగారి దగ్గరి నుండి ఉత్తరం వచ్చింది" అంది మాధవి.

తన పని అవకుండానే "ఏం రాసారు?" అని అడిగాడు.

"ఉండండి - ఉత్తరం తెస్తాను" అని లేవబోతున్న మాధవిని ఆపి -

"ఏం రాసారో చెప్పు. అందులో ఉన్నదంతా చదివే ఓపిక లేదు నాకు" అన్నాడు అశోక్.

"ఇద్దరూ కులాసాగా ఉన్నారు. వీలయితే మిమ్మల్ని ఒకసారి వచ్చి చూసి వెళ్ళమన్నారు. మీరు వాళ్ళు దగ్గరకి వెళ్ళి ఓ సంవత్సరం అవుతోంది."

"అక్కడికా – నాకా – నాకెక్కడ కుదురుతుంది మాధవీ! అందుకే వాళ్ళనోసారి రమ్మంటే వాళ్ళు రారు"

"వాళ్ళు ప్రయాణం చెయ్యలేరు. అదే కాదు. వాళ్ళకీ అక్కడ పనులు లేవా?"

"అక్కడ – ఆ ఊళ్ళో – వాళ్లకి ఏ పనీ లేదు. వాళ్ళు ఆ ఇంటినీ, ఆ పొలాన్నీ వదిలిరారు – అంతే.

"పుట్టి పెరిగిన ఊరు – కలిసి బతికిన ఇల్లూ – బతుకునిచ్చిన పొలం – వీటిని వదిలి వాళ్ళు రాగలరా?"

"ప్రపంచం ఎంతో మారిపోతోంది మాధవీ – వాళ్ళే ఇంకా ఇల్లనీ, ఊరనీ సెంటిమెంట్లలో ఉన్నారు"

"సెంటిమెంట్లే లేకపోతే బతుక్కి అందం, అర్థం ఉంటాయా?"

"ఇప్పుడు నీతో నేనా మెట్టవేదాంత చర్చ చెయ్యలేను. నన్ను నా మెయిల్ చూసుకోనీ."

మెయిలంటే ఈ మెయిల్ అనబడుతున్న ఎలక్ట్రానిక్ మెయిల్.

అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో, జపాన్‌లోనో, ఏ దేశంలోనైనా, ఒక కంప్యూటర్ ముందు కూర్చుని, తను రాయదల్చుకున్నది రాసి, తను పంపదలచుకున్న వాళ్ళకి పంపడానికి, ప్రపంచంలోని మేధావులు చేసిన నిరంతర కృషి ఫలితంగా పుట్టి పెరుగుతోంది ఇంటర్నెట్.

సంవత్సరాలు గడిచే కొద్దీ లక్షల కంప్యూటర్లు ఇంటర్నెట్‌లో భాగమైపోయి, భూమి మీద ఏ మూల నుండి ఏ మూలకైనా ఎలక్ట్రానిక్ ఉత్తరాలు పంపుకునే సాధకాలైపోతున్నాయి.

ఆ ఇంటర్నెట్ మీద తనకు పరిచయం వున్నవాళ్ళూ లేనివాళ్ళూ తన కసలు తెలియనివాళ్ళూ రాస్తున్న ఉత్తరాలను చూసుకుంటూ, వాటికి సమాధానాలు రాసుకుంటున్నాడు అశోక్.

తమను చూడడానికి రమ్మని తండ్రి రాసిన ఉత్తరం చదవడానికి తీరిక లేనంత పనిలో మునిగిపోయాడు.

ఆ కంప్యూటరూ – ఆ ఇంటర్నెట్టూ – అదో లోకం.

ఆ లోకంలో అశోక్‌ని వదిలేసి తను ఇంకో గదిలోకి వెళ్ళింది మాధవి.

ఒకే ఇంట్లో – రెండేళ్ళ క్రితం పెళ్లయిన భార్యాభర్తలు – వేర్వేరు గదుల్లో ఎవరి



E:\Seelamma\
Seelama1
69

లోకంలో వాళ్ళున్నట్లు ఉన్నారు.

శాస్త్రజ్ఞుల మేధో నిర్మితమైన ఇంటర్నెట్ మీద ప్రపంచంలోని నలుమూలలా జరిగే విశేషాలను చూసుకుంటూ భర్త –

తనలోకి తాను చూసుకుంటూ భార్యా –

మాధవి ఆలోచిస్తోంది.

తనని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులూ – తనంటే ఎంతో ప్రేమా, ఆప్యాయతా ఉన్న తల్లిదండ్రులూ – తనకి దూరంగా వున్నారు.

అలాగే తన భర్తను నవమాసాలూ మోసిన తల్లీ, ప్రేమగా పెంచిన తండ్రీ – కొడుక్కి దూరంగా కాలం గడుపుతున్నారు.

అలాగని వాళ్ళ కోసం తన భర్త తన జీవితాన్ని త్యాగం చేసుకోవడం కూడా సరయినదిగా తోచదు. అతని చదువూ, తెలివి తేటలూ అతన్ని ఉద్యోగంలో ఉన్నత పదవులకి తీసుకెళ్ళాయి. ప్రపంచంలో జరుగుతున్నవి తెలుసుకోవడం అతని ప్రవృత్తీ – వృత్తీ.

అశోక్ ఎక్కడెక్కడి మనుష్యుల తోనో ఇంటర్నెట్ ద్వారా సంబంధాలు పెంచుకుంటున్నాడు. ఆ సంబంధాలన్నీ ఇంటలెక్చువల్ సంబంధాలు. అంటే బుద్ధికి సంబంధించినవి.

అదే మనిషి, తన భార్యతోనో, తన తల్లిదండ్రులతోనో ఉంచుకోవల్సిన సంబంధాన్ని ఉంచుకోవడం లేదు. ఈ సంబంధం ఇమోషనల్. అంటే హృదయానికి సంబంధించినది.

తనలో తాను ఆలోచించుకోవడం మాధవికి కొత్తకాదు. రెండేళ్ళుగా మాధవి తనతో తాను ఉంటున్నట్లే.

పెళ్ళికి ముందు తన తల్లితండ్రులతో, అన్నయ్యతో గడిపిన జీవన విధానం వేరు. అందరూ కలిసి కూర్చోడం, కలిసి గడపడం వాళ్ళకి అలవాటు.

తన భర్త ప్రవర్తన అందుకు భిన్నంగా ఉంటుంది.

తన భర్త తన తల్లితండ్రులకన్న, తన అన్నయ్య కన్న సంఘంలో ఉన్నత స్థాయిలో ఉన్నాడు. గౌరవం పొందుతున్నాడు.

అయితే, తన వాళ్ళలో ఎవ్వరికీ తన భర్త దగ్గర కాలేదు. అలాగని అతను చెడ్డవాడేం కాదు.

మాధవిఆలోచనలను భంగపరుస్తూ కాలింగ్ బెల్ మోగింది. పని మనిషి అయ్యుంటుందని అనుకుంటూ లేచింది మాధవి.

మాధవి ఒంటరితనపు ఎడారిలో పనిమనిషి ఒయాసిస్సు.

పని చేసుకుంటూ మాదవితో కబుర్లు చెప్తుంది పనిమనిషి.

ఒక్కోసారి తన భర్త తనను అంతకు ముందు ఎక్కడికి తీసుకువెళ్ళాడోనన్న విషయాన్ని సంబరంగా చెప్తుంది. ఇంకోసారి, భర్త తాగి వచ్చి తనని ఎలా కొట్టాడోనని దీనంగా వివరిస్తుంది. కొట్టి ఏడ్చాడని కూడా చెపుతుంది.

పని మనిషీ, ఆమె భర్తా చదువు కున్న వాళ్ళు కారు. బాగా చదువుకొని, ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళలా ఉండరు వాళ్ళు.

తన భర్తకి తనంటే ఇష్టం లేకపోలేదు. అయితే దాన్ని చూపించుకొనే తీరికా, ఓపికా లేవు అశోక్‌కి.

ఆ విషయం మాధవికి తెలుసు.

పనిమనిషి పని పూర్తి చేసుకుని వెళ్ళిపోయింది.

అశోక్ ఇంట్లో ఉన్నా ఒకరకమైన ఒంటరితనమే మాధవికి.

మధ్యాహ్నం ఇద్దరూ కలిసి భోంచేసారు.

ఇద్దరి మధ్యా సంభాషణలు రెండు మూడు నిముషాల కన్నా ఎక్కువ సాగవు. అశోక్ తన పనీ, తన కంప్యూటరూ, ఇంటర్నెట్టూ వీటి గురించి ఇష్టంగా మాట్లాడుతాడు. అందులో ఎక్కువ కాకపోయినా, కొంత ఆసక్తి ఉంది మాధవికి. అయితే తన ఫీలింగ్స్ గురించి మాట్లాడాలనుకుంటుంది మాదవి. ఫీలింగ్స్‌ని వ్యక్తం చేసే భాష వేరు. ఆ భాష అశోక్‌కి అలవాటు లేదు.

ప్రేమా, కోపం, బాధా – ఇవన్నీ అనుభూతులు. వాటిని వ్యక్తం చేసేందుకు శాస్త్రీయమైన భాష లేదు. ఇద్దరు మనుషులు కలిసి జీవించుకుంటూ – ఒకరితో ఒకరు పరస్పరం ఈ అనుభూతుల్ని పంచుకుంటూ, ఈ భాషను పెంచుకుంటారు.

అలా పెంచుకునేందుకు, వాళ్ళు ఒకరి కోసం ఒకరు సమయం వెచ్చించాలి.

అశోక్ అలా చేస్తున్నట్లు కనిపించదు.

అందుకే అతనికి మాధవి మాటలు నచ్చినట్లుండవు –

మాధవికి ఈ ఒంటరి తనంలోనే పుట్టిన కోరిక– తల్లి కావాలని. అయితే అశోక్‌కి మాధవి అప్పుడే పిల్లల్ని కనే యంత్రం కావడం ఇష్టం లేదు. అశోక్‌కి ఇష్టం లేని పని చెయ్యడం మాధవికి ఇష్టం లేదు.

పిల్లల్ని కనడం, పెంచడం – ఇవన్నీ మనిషి మామూలుగా చేసే పనులు. ఒక విధంగా చూస్తే – ప్రకృతి మనిషికి తప్పకుండా చెయ్యాలని నిర్దేశించిన పనులివి. మనిషి తెలివి తేటలను పెంచుకుని, వ్యాపకాలు పెంచుకునీ ఈ పనులను ఇష్టపడడం



E:\Seelamma\
Seelama1
70

లేదు.

అశోక్‌తో ఏ విషయం గురించీ వాదించదు మాధవి. తనలో తాను అనుకుంటుంది. అనుకుంటుందని అశోక్‌కి తెలియదు. తెలిస్తే ఏం చేస్తాడో, ఇద్దరికీ తెలియదు.

సాయంత్రం బయట తిరిగి వచ్చారు. అశోక్ మాధవికి ఒక చీరా, తనకో డ్రెస్సు కొన్నాడు. రాత్రి బయట హోటల్లోనే డిన్నరు.

ఆ రాత్రీ, మర్నాడూ – అంతకు ముందు రోజులానే గడిచాయి.

అశోక్ నిద్రపోయినా, మాధవికి నిద్రరాలేదు.

ఉదయం లేచి అశోక్ వెళ్తాడు. మళ్ళీ నాలుగయిదు రోజులకి వస్తాడు. కొన్నాళ్ళుంటాడు. మళ్ళీ వెళ్తాడు. ఉన్నంత సేపు కూడా ఉద్యోగపు పనే. కంప్యూటర్లు వచ్చి, ఇంటికీ, ఆఫీసుకీ దూరం చెరిపేశాయి. ఇంట్లో ఉన్నా ఆఫీసూ పనే.

పెద్ద ఉద్యోగం – అన్ని అవసరాలను తీర్చే సాధనాలూ – డబ్బూ – అన్నీ ఉన్నాయి. అయినా ఏదో లోపం ఉన్నట్లుంది.

నిద్ర రాని మాధవి లేచి బాల్కనీలో కూర్చుంది.

ఆకాశంలో పున్నమి చంద్రుడు అందంగా కనిపిస్తున్నాడు. చంద్రుడిని చూస్తోంది మాధవి.

"ఏం చేస్తున్నావు?" అని అడుగుతూ వచ్చాడు అశోక్.

"పున్నమి చంద్రుడిని చూస్తున్నాను. ఎంతో అందంగా వున్నాడు. ఈ ఎలక్ట్రిక్ దీపాలు లేకపోతే ఇంకా అందంగా కనిపించేవాడు" అంది మాధవి.

"ఈ ఎలక్ట్రిసిటీయే లేకపోతే మనబ్రతుకులు ఎలా ఉండేవో – ఎంత హీనంగాబతుకుతుండేవాళ్ళమో, ఎలక్ట్రిసిటీ వచ్చి మన బతుకుల్ని వెలిగిస్తోంది. మానవజాతి పురోగమనంలో ఎలక్ట్రిసిటీ పెద్ద మైలురాయి. అది నాగరికతా చిహ్నం" అన్నాడు అశోక్.

"ఏది పురోగమనమో, ఏది తిరోగమనమో ఎవరికి తెలుసు?" అంది మాధవి ఆకాశంలోని చుక్కల్ని చూస్తూ.

"నీ మాటలు నాకు సరిగ్గా అర్థం కావు. అర్థం కావంటే వాటి అర్థం నాకు తెలియదని కాదు. పారిశ్రామిక రంగం వల్లనే మనిషి ఈ రోజు ఇంత సుఖంగా, హాయిగా జీవిస్తోంటే దీన్ని తిరోగమనం అంటావా?" అన్నాడు అశోక్.

"మనిషి ఎదుగుదలని రకరకాలుగా చూడొచ్చు ఒకటి మనిషి మేథస్సుని చూసి. రెండు మనిషి హృదయాన్ని చూసి. మీరన్నట్లు మనిషి మేథోపరంగా పురోగమిస్తున్నాడేమో. హృదయపరంగా పురోగమనమో, తిరోగమనమో మనకి

తెలుసా?" అంది మాధవి.

"మాధవీ సాధారణంగా నేనే విషయం గురించీ నీతో వాదనలు చెయ్యను. ఒక్క విషయం అర్థంచేసుకో. సైన్స్ మనిషి పురోగమనానికి చిహ్నం. అది తిరోగమనం కానే కాదు" అన్నాడు అశోక్.

"నాకూ వాదించడం ఇష్టం లేదు. అయితే రెండేళ్ళుగా నాలో నేను దాచుకొన్న కొన్ని విషయాలు మీతో చర్చించాల్సిన అవసరం వచ్చినట్లుంది. మీకు మరో పని లేకపోతే కొంతసేపు మాట్లాడుకుందాం" అంది మాధవి.

మాధవి కూర్చున్న కుర్చీకి ముందు, నేల మీద కూర్చుని మాధవి ఒళ్ళో తల పెట్టి, ఆమె మొహం చూస్తూ కూర్చున్నాడు అశోక్.

అందంగా ఉండే మాధవి, వెన్నెలలో ఇంక అందంగా కనిపిస్తోంది.

మాధవిని చూస్తూ "ఎంత అందంగా ఉన్నావో నువ్వు" అన్నాడు.

"నన్ను చూసే తీరిక ఏది మీకు" అంది మాదవి.

"మాధవీ నాకు రకరకాల ఉద్యోగ బాధ్యతలు ఉన్నాయి. అంత మాత్రాన నువ్వంటే ప్రేమ లేదని కాదు."

"కాదు కాదని నాకు తెలుసు. కానీ, మీకూ నాకూ మధ్య దూరం రోజు రోజుకూ తరగాల్సింది పోయి పెరుగుతోందేమో అనిపిస్తోంది నాకు."

"అలా అనుకోకు మాధవీ! నేను ఇలా కొన్నాళ్ళు గడిపితే చాలు, మనకి కావల్సినంత సంపాదించుకుంటాం. ఇంక ఈ హడావిడి ఉండదు."

సమాధానం చెప్పకుండా నవ్వింది మాధవి.

"అంతేకాదు, నాకు నా ఉద్యోగం ద్వారా ఎంతో ఆనందం లభిస్తోంది. ఈ కంప్యూటర్లూ, ఇంటర్‌నెట్టూ, ప్రపంచంలోని ఎన్నో విశేషాలను తెలుసుకునేందుకు, విశ్లేషించుకుందుకు ఉపయోగపడుతున్నాయి.

ఇంటర్‌నెట్ విలువ ఇంకా అందరికీ అర్థమవడంలేదు. నీకూ సరిగ్గా అర్థం అయినట్లు లేదు. లక్షల కంప్యూటర్లని లింక్ చేస్తోంది. ఆ కంప్యూటర్లని వాడుతున్న వారిని దగ్గర చేస్తోంది.

ప్రపంచాన్ని దగ్గర చేసేందుకు ఎందరో అల్లుతున్న గూడు ఇది మాధవీ."

అలా అంటున్నా అశోక్ గొంతులో ఏవో ఉద్విగ్నత ఉంది.

"అయ్యుండవచ్చు. నేను కాదనడంలేదు. ఆ గూడు మిమ్మల్ని నా గూటి నుంచి వేరు చేస్తోంది."

"అలా అనకు, నేను నీకూ, ఈ ఇంటికీ దూరం కాను."



E:\Seelamma\ Seelama1 71

"నాకే కాదు మీరు మీ తల్లిదండ్రులకీ దూరం అవుతున్నారు"

"మాధవీ, సమాజంలో మామూలుగా వచ్చే మార్పు ఇది. తల్లిదండ్రులు వృద్ధులవడం వేరేగా ఉండడం సహజం."

"పెద్దవాళ్ళు నిస్సహాయంగా ఒంటరిగా ఉండడం సహజం అని మీరంటున్నారు. నాకు అలా అనిపించడంలేదు. అది జంతువులలో సహజం అయ్యుండవచ్చు. మనిషి కుటుంబం అనే అందమైన గూటిని కట్టుకున్నాడు. అందులో అందరూ ఒకరికొకరు సాయంగా, తోడుగా ఉండడడానికి కావల్సిన నీతి నియమాలని, సమాజపు కట్టుబాట్లనూ అల్లుకున్నాడు. అదే నాగరికత అనుకున్నాను నేను. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం అవడాన్ని నాగరికత అంటున్నారని ఈ మధ్యే అర్థమవుతోంది నాకు. పిల్లల్ని కనకపోడం, కన్నా వాళ్ళని ఎవరి ద్వారానో పెంచడం, తల్లిదండ్రుల్ని వదిలెయ్యడం – ఇదేనా నాగరికత?" అలా అంటున్న మాధవి గొంతులో ఆవేశం లేదు. ఎన్నాళ్ళుగానో మనస్సులో దాచుకున్న ఆలోచనల్ని పంచుకోవడం కోసం, స్పష్టంగా గంభీరంగా చెప్తున్నట్లు చెప్పింది.

"మనిషి ఎదగాలంటే తన కోసం తను శ్రమ పడక తప్పదు. తల్లిదండ్రుల్ని చూసుకోవడంలో కాలం గడిపేసిన మనిషి, స్వయంగా ఏమీ గొప్ప పనులు చెయ్యలేడు. అందరూ అలా కాలం గడిపితే, సమాజం ఎక్కడ వేసింది అక్కడే ఉంటుంది. ముందుకు సాగదు" అన్నాడు అశోక్.

"ముందుకి సాగడం అంటే ఏమిటో నాకు తెలియదు"

"నీకు తెలియదు, అందుకే నేను చెప్పేది విను. వ్యవసాయం రంగం, పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాయి. ఆ తర్వాత ఇరవయ్యో శతాబ్దపు మనిషి సాధించిన విజయం కంప్యూటర్లు. అంతకన్న గొప్పది కమ్యూనికేషన్. దాంతో మొదలయింది. ఈ విశ్వాన్ని కలిపే కంప్యూటర్ల నెట్‌వర్క్. అదే ఈ రోజు 'ది నెట్' గా మనల్నందర్నీ దగ్గర చేస్తోంది. ఈ విప్లవం అంతకు ముందు విప్లవాలకన్నా గొప్పది – నిజం"

"ఏది గొప్పదో, ఏది కాదో తెలీదు నాకు. నాకు తెలుసున్నది ఒక్కటే. మీరు నాకూ, మీ తల్లితండ్రులకూ దూరం అవుతున్నారు. మీరే కాదు మీలాంటి చాలామంది అంతే. పారిశ్రామిక విప్లవం, కుటుంబ వ్యవస్థని కొంత కృంగదీసింది. ఇప్పటి ఈ విప్లవం ఇంకేం చేస్తుందోననే నా భయం. మనుషులు మనుషుల్లా కాకుండా, మిషన్లలా, మిషన్ల ద్వారా ఆలోచిస్తున్నారు.

మనిషి మీరు చెప్పిన ప్రగతి ద్వారా దూరాన్ని అధిగమిస్తున్నాడంటున్నారు. అది మీకు కనిపించే దూరం. ఈ విశ్వపటం మీది దూరం. అయితే మనుషుల మధ్య

దూరం కాదు. ఆ దూరం ఇంకా ఎక్కువవుతోంది.

మనిషి మెదడు ఎదుగుతోంది. హృదయం కుంచించుకుపోతోంది. అనుభూతులు లేని మనిషి మనిషేనా? అది పురోగమనమేనా?" అంటూ అడిగింది మాధవి.

"మాధవీ నువ్వు చెప్తున్న దాంట్లో కొంత నిజం ఉండి ఉండవచ్చు. అంత ఆలోచించే తీరిక లేదు నాకు. మెదడునీ, హృదయాన్ని వేరు చేసి, హృదయం, ప్రేమా, అనురాగం, దయా ఇలాంటి మాటల సెంటిమెంట్లలో ఇరుక్కున్నన్నాళ్ళూ మనిషి మెదడు ఎదగదు. విజ్ఞానం వల్ల మనిషికీ, సమాజానికీ ఉపయోగం ఉంది. నన్ను అందులోంచి బయటకి తియ్యకు" అని అర్థిస్తున్నట్లు మాధవి చేతుల్లో తలదాచుకున్నాడు అశోక్.

మాధవి మాట్లాడలేదు.

అశోక్ మాట్లాడలేదు.

ప్రపంచాన్నంతా ఒక దగ్గరకి చేసే ఇంటర్‌నెట్ "ది నెట్"ని తయారు చేసుకుంటున్న మనుషుల్లో ఒకడు అశోక్. ఎంతో విజ్ఞానాన్ని చాలామందికి అందించగల సమర్థుడు.

అయితే అది కొందరి జీవితాలకే పరిమితం అవుతోందన్న స్పృహ లేదతనికి.

'ది నెట్' కొందరిని, కొన్ని పనుల కోసం దగ్గరచేస్తోంది. అయితే అది వాళ్ళ చుట్టూ వలలా బిగుసుకుంటోంది. బిగుసుకుని వాళ్ళని వలలా బంధించేస్తోంది. అందులో ఇరుక్కున్న వాళ్ళు మిగిలిన వారికి దూరంగా వెళ్ళిపోతున్నారు. భార్యలూ,భర్తలు, పిల్లలూ, తల్లిదండ్రులూ, బంధువులూ, మిత్రులూ అందరూ ఈ రోజు వలకి ఈవల ఉన్నారు. అందుకే నెట్ మనుషులకూ, నెట్ లేని మనుషులకూ దూరం పెరుగుతోంది.

వల పెద్దదై అందరినీ అందులోకి లాగేసుకోగలిగినా, వల చిరిగి అందరూ బయటికి వచ్చేసినా ఫరవాలేదు.

అలా కాకపోతే అనుభూతులు ఏమవుతాయో?

అనుబంధాలు ఏమవుతాయో?

అవి లేని మనిషి మనిషేనా?

ఏమో!



E:\Seelamma\
Seelama1
72



# పక్షులు

**"నే**ను ఆయనతో కలిసి జీవించలేను. నాకు విడాకులిప్పించెయ్యండి" అంది అమృత సుడిగాలిలా వచ్చి.

అమృత ఎప్పుడూ అలానే వస్తుంది.

ఆరేళ్ళ క్రితం ఓసారి ఇలానే వచ్చి –

"నేను ఆయన లేకుండా జీవించలేను. నాకు ఆయనతో పెళ్ళి జరిపించెయ్యండి" అంది.

అప్పుడూ ఇలానే సుడిగాలిలాగానే వచ్చింది.

పెళ్ళి విషయంలో తొందరపడవద్దని నచ్చచెప్పేందుకు ఎంతో ప్రయత్నించాను నేను

"మీ అమ్మానాన్నలు ఈ పెళ్ళి ఎందుకు వద్దంటున్నారో ఆలోచించమ్మా" అని చెప్పాను.

నుదుట మీద పడుతున్న జుట్టుని తల విదిలింపుతో వెనక్కి తోసేసుకుని, నాకు సమాధానం చెప్పింది అమృత –

"వాళ్ళు పాతకాలం మనుషులు అకుంల్. అమ్మకి చాదస్తం – నాన్నకి మొండితనం. వాళ్ళు చూసిన మగాణ్ణే నేను పెళ్ళాడాలన్న ఛాందస భావం వాళ్ళది. కాలం మారిందని తెలియదు వాళ్ళకి. అంతెందుకు – మన ఊళ్ళో కాలేజీలో చదువుతున్న ఏ అమ్మాయైనా చీర కడుతుందా? నన్ను చీర కట్టుకోమంటుంది మా అమ్మ. ఈ డ్రెస్సులు వేసుకోవద్దంటుంది. అయినా మీకు వాళ్ళ గురించి తెలియనిదేముంది?"

"డ్రెస్సులు వేరు. అవి మనకి ఏవి నప్పుతాయో, ఏవి సుఖంగా ఉంటాయో అవి వేసుకుంటాం. పెళ్ళలా కాదు" అని నేనేదో చెప్పేంతలో –

"పెళ్ళికొడుకు కూడా అంతేకదా? నాకు నచ్చాలి. నా జీవితం సుఖంగా ఉండాలి. అదే కదా పెళ్ళికి లక్ష్యం" అంది అమృత.

"డ్రెస్ కొనుక్కున్నాక అది నచ్చకపోతే పారెయ్యవచ్చు. పెళ్ళికొడుకు అలా కాదు." అన్నాను నేను.

"పారెయ్యవచ్చుననుకునే డ్రెస్‌ని కొనేడప్పుడే ఎంతో ఆలోచిస్తాం కదా, మరి, పెళ్ళికొడుకుని చూసుకుందుకు నేనెందుకు ఆలోచించలేదనుకుంటున్నారు."

"నువ్వు ఆలోచిస్తావు సరే – నీ జీవిత భాగస్వామిని ఎన్నుకునే అనుభవం నీ వయస్సుకి ఉందా?"

"అలా అనుభవం వచ్చేవరకూ, ఆగితే, పెళ్ళి చేసుకునే వయస్సు వెళ్ళిపోతుంది"

"నా జోక్ బావుంది. కానీ –"

"నేను జోక్‌గా చెప్పడం లేదు. సీరియస్‌గానే చెప్తున్నాను. అమ్మా నాన్నలకి నాకన్న పాతికేళ్ళ ఎక్కువ అనుభవం ఉంది. అయితే ఆ అనుభవం ముందుతరానికి చెందింది. అది ఈ తరానికి పని చెయ్యదు. ప్రతి తరం వాళ్ళు వాళ్ళ అనుభవాన్ని వాళ్ళ జీవితంలోంచి పొందాలి. అందుకే తల్లిదండ్రులు పిల్లాడిని చూసి పెళ్ళి చెయ్యడం నాకు నచ్చదు. నువ్వేం మాట్లాడ్డం లేదేం ఆంటీ" అంది అమృత శ్రీమతితో.

శ్రీమతి నా వైపు చూసి, నవ్వి, అమృతతో –

"పిల్లలకి వాళ్ల జీవిత భాగస్వాములని ఎన్నుకునే స్వేచ్ఛ ఉండాలి. నా అభిప్రాయం కూడా అదే. అందులోనూ మన దేశంలో చాలా సంవత్సరాలుగా ఈ స్వేచ్ఛ ఆడవాళ్ళకి లేదు. అందుకే ఈ మహిళా ఉద్యమాలన్నీ జరుగుతున్నాయి. తండ్రి, కూతురేదో తన ఆస్తి అయినట్లు అల్లుళ్ళకి ధారపొయ్యడం సరయిన పని కాదు. ఆడది ఎవ్వరి ఆస్తీ కాదు. అస్తిత్వం ఉన్న ఒక చైతన్యవంతురాలు. అందుకే నిన్ను నువ్వెనుకున్న వాళ్ళకిచ్చి పెళ్ళి చేయిస్తాను" అంది.

"ఎప్పుడు?" అంది అమృత ఆనందంగా.

"ముందు నువ్వెన్నుకున్న అతనితో మాట్లాడనీ – ఆయన తరపు వాళ్ళెవరైనా" అన్న శ్రీమతి మాటలకి మధ్యలో అడ్డొస్తూ –

"ఆయన కెవ్వరూ లేరు" అంది అమృత.

"అయితే రేపు మీ అమ్మా నాన్నలతో మాట్లాడతాను. వాళ్ళు ఒప్పుకోరు. మీ ఇద్దరికీ రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేయిస్తాను" అంది లాయరైన శ్రీమతి.

"థాంక్యూ" అని మా శ్రీమతి బుగ్గల మీద ముద్దెట్టుకుని "ఇప్పుడే ఆయనకి చెప్తాను" అంటూ పరుగెత్తుకుని వెళ్ళిపోయింది అమృత.

అమృత పరిగెత్తుకుని వెళ్ళడం చూస్తోంటే పక్షి ఎగురుతున్నట్లనిపిస్తుంది.

పక్షి ఎగరడంలో ఓ అందం ఉంది. శరీరాన్ని నిశ్చలంగా ఉంచుకుని, గాలిలో కదులుతుంది పక్షి. ఓ పక్కకి ఎగురుతూ హఠాత్తుగా ఓ రెక్క కదలికతో, ఓ రెప్పపాటులో మరో పక్కకి తిరిగి ఎగురుతుంది.



E:\Seelamma\ Seelama1 73

అమృత కదలిక అలానే ఉంటుంది. అమృత నడక పరుగులా, ఆ పరుగు పక్షి ఎగరడంలా ఉంటుంది.

పక్షి ఎగరడంలో స్వేచ్ఛ కనిపిస్తుంది. అమృతలోనూ అదే స్వేచ్ఛ కనిపిస్తుంది.

అమృత వెళ్ళిన వైపు నేను చూస్తుండగా –

"అమ్మాయిలకి వాళ్ళకి కాబోయే భర్తలని ఎన్నుకునే స్వేచ్ఛ ఉండాలి కదా?" అని అడిగింది శ్రీమతి నన్ను.

"తప్పకుండా ఉండాలి" అన్నాను నేను.

"మరెందుకు అమృతను ఈ పెళ్ళి చేసుకోవద్దన్నావు?"

"నేను చేసుకోవద్దనలేదు. ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. అయితే ఎన్నిక సరయిందో కాదో ఆలోచించుకోమన్నాను."

"నీ ఎన్నిక సరయిందా?" అని అడిగింది శ్రీమతి నవ్వుతూ.

"సరయిందనే అనిపిస్తోంది" అన్నాను నేను నవ్వుతూ.

"నీకు నీ ఎన్నికా, నాకు నా ఎన్నికా సరయినవే అనిపిస్తున్నాయి. అలాగే అమృతకి కూడా సరయిందే అవుతుంది" అంది శ్రీమతి.

అన్న నెల రోజులలోగా అమృత కోరుకున్న అతనితో అమృత పెళ్ళి చేయించింది. అమృతకి అమ్మా నాన్నలతో సంబంధం తెగిపోయింది.

నాకు బాధనిపించింది – ఇరవైయేళ్ళు తనని పెంచిన తల్లిదండ్రుల్ని అమృత వదిలేసి వచ్చిందని. నాదంతా సెంటిమెంటని కొట్టిపారేసింది అమృత.

అమృత భర్తకి ఓ మంచి ప్రైవేట్ కంపెనీలో పెద్ద ఉద్యోగం. మంచి సంపాదన. ఎమ్మె రెండో సంవత్సరం చదువుతున్న అమృత చదువు ఆగిపోనియ్యలేదతను.

చదువయ్యాక అమృత ఉద్యోగంచేస్తానంది. అది అతనికి అంతగా నచ్చలేదు. అయినా అభ్యంతర పెట్టలేదు.

ఓ కాలేజీలో లెక్చరర్‌గా పనిచెయ్యడం మొదలెట్టింది అమృత.

ఇద్దరూ సుఖంగా కాలం గడిపేవాళ్ళు.

పెళ్ళయిన రెండేళ్ళకి అమృత తల్లయింది.

పెళ్ళి చేయించిన మా శ్రీమతే, అమృతకి తల్లయి పురుడుపోసింది.

పిల్లాడు పుట్టాక అమృతకీ, భర్తకీ గొడవలు మొదలయ్యాయి.

పిల్లాడిని పెంచడం ఓ ఉద్యోగం లాంటిది. ఎవరి ఉద్యోగం వారికున్న వాళ్ళకి ఆ పని చెయ్యడం కష్టమయ్యేది. అమృత మెటర్నిటీ లీవు అయిపోయినప్పట్నుంచి ఇంటి పనులతో పాటు పిల్లాడి పని కూడా చేసే పనిమనిషిని పెట్టుకుందుకు ప్రయత్నించారు.

ఏ పనిమనిషీ ఎక్కువకాలం ఉండేది కాదు. ఇంకో పనిమనిషి దొరికే వరకూ ఎవరు సెలవు తీసుకోవాలన్న విషయం మీద గొడవ వచ్చేది.

ఉద్యోగం మానెయ్యమనేవాడు అమృత భర్త. మాననేది అమృత.

అమృత తల్లిదండ్రుల సాయం తీసుకోమనేవాడు భర్త. ఒకసారి వదిలేసి వచ్చిన ఇంటికి మళ్ళీ వెళ్ళననేది అమృత.

వీటికి తోడు అమృత భర్తకి ఉద్యోగరీత్యా కాన్ఫరెన్సులకీ సెమినార్లకీ వెళ్ళాల్సిన అవసరం ఉంది. అందుకోసం అతను వేరే ఊళ్ళు వారం పది రోజులు వెళ్తాడు. పిల్లాడు పుట్టడానికి ముందు ఈ విషయం గురించి అంతగా పట్టించుకోని అమృత పిల్లాడు పుట్టాక టూర్లు తగ్గించుకోమంది. అతను మానలేదు.

ఇలాంటి గొడవలతో ఇద్దరూ దూరం కాసాగారు. గొడవలు బాగా పెరిగినట్లున్నాయి – విడాకులిప్పించమని అడుగుతూ వచ్చింది అమృత.

"తొందరపాటు వద్దమ్మా" అన్నాను నేను మళ్ళీ మామూలు ధోరణిలో.

"ఇది తొందరపాటు కాదు అంకుల్. పిల్లాడు పుట్టినప్పట్నుంచి చూస్తున్నాను. నన్నాయన సరిగ్గా చూసుకోవడం లేదు" అంది అమృత.

"పెళ్ళయ్యాక ఇలాంటి చిన్న చిన్న గొడవలు తప్పవు"

"చిన్న గొడవలు కావు అంకుల్ – నాకూ ఆయనకీ అసలు పడ్డం లేదు. అసలు ఇద్దరం కలిసి ఉండే కాలమే తక్కువ. అదంతా ఒకరినొకరు ఏదో ఒకటి అనుకోడంతోనే సరిపోతోంది. ఇంక కలిపి ఉండడం కుదిరే పనికాదు"

"ఏ మొగుడూ పెళ్ళాం దెబ్బలాడుకోరు అమృతా? అభిప్రాయ భేదాలు రావడం, ఒకరినొకరు అనుకోవడం, దెబ్బలాడుకోవడం ఇవన్నీ సంసారంలో మామూలే. వాటికి విడాకులు తీసుకుంటారా? మీ ఆంటీకీ, నాకు ఎన్నో విషయాల్లో అభిప్రాయాలు కలవ్వు. ఎన్నిసార్లు ఇద్దరం కీచులాడుకోలేదు?"

"మీరు ఏదో చెప్పకండి అంకుల్ – నాకు కావల్సినవి విడాకులు. ఉద్యోగం, డబ్బు సంపాదించడం, టూర్లు – ఇవే ఆయన జీవితం, నేను ఆయనకి అక్కర్లేదు. టూర్లకి వెళ్ళేటప్పుడు, ఓ లేడీ స్టెనోని వెంట పెట్టుకు వెళ్తున్నారుట. ఇంక నా అవసరం ఏముంది?"

"ఎవరో కిట్టనివాళ్ళు చెప్పింది నమ్మకమ్మా.

"ఎవరో అన్నది కాదు. ఆఫీసులో వాకబు చేస్తే తెలిసింది."

"అలా వాకబు చెయ్యాల్సినంత అపనమ్మకం నీలో ఎందుకు కలిగింది? అది తప్పు. అదొదిలెయ్యి– నువ్వు అతనితో సరిగ్గా వుంటే ఇలా అయ్యేది కాదు"



E:\Seelamma\ Seelama1 74

అన్నానునేను.

"సరిగ్గా ఉండడమంటే ఏంటి అంకుల్ – నేనేం పాతకాలం పతివ్రతలా ఆయన కాళ్ళు నొక్కుతూ కూర్చోలేను. నా పనులు నాకూ ఉంటాయి. అసలు కుటుంబం అంటే అందరూ అన్ని పనులూ చెయ్యడమే కదా? అలాంటప్పుడు ఆడవాళ్ళని కొన్ని పనులకి నియమించడం బానిసత్వం కాదా?" అంది అమృత.

ఆ మాటలని సమర్థిస్తూ శ్రీమతి "ప్రకృతి స్త్రీ శరీరాన్ని పిల్లల్ని కనేందుకు అనుకూలంగా నిర్మించిందని ఇక ఇంటి పనులన్నీ ఆడవాళ్ళే చెయ్యాలనడం సబబు కాదు. అమృతే కాదు – ఏ స్త్రీ అయినా భర్త చెప్పినట్లు పడి ఉండాల్సిన అవసరం లేదు" అంది.

"నేను కూడా పడి ఉండమనడం లేదు. మనకి తెలిసినంతవరకు అమృత భర్తకి అమృత భరించలేనన్ని చెడ్డగుణాలు లేవు. అమృత అతని నుండి విడిపోవడానికి ముందు కొంత ఆలోచించమంటున్నాను – అంతే. అంతకు ముందు అతని కోసం అమ్మా నాన్నల్ని వదిలేసుకుంది. వాళ్ళని వదిలేసుకోకుండా ఉంటే, వాళ్ళే ఈ పిల్లాడిని పెంచేవాళ్ళు" అన్నాను నేను.

"ఆరేళ్ళ క్రితం అయిపోయిన విషయాల గురించి మాట్లాడుకోవడం అనవసరం. గతం గురించి ఆలోచించటం అవివేకం" అంది శ్రీమతి.

దానితో నేనూ ఏకీభవించాను.

"అయిపోయిందానికి కారణాలు వదిలేద్దాం. ఇప్పుడేం చెయ్యాలి?" అన్నాను.

"విడాకులెలా తీసుకోవాలో చూడండి" అంది అమృత.

లాయర్ శ్రీమతి సమాధానం చెప్పింది –

"స్త్రీకి పెళ్ళి చేసుకుందుకెంత స్వేచ్ఛ ఉందో, విడాకులు పొందేందుకు కూడా అంత స్వేచ్ఛా ఉంది. అంతకు ముందు కష్టమయ్యేవి కానీ, ఇప్పుడు విడాకులు కష్టం కాదు. ఆడవాళ్ళు కోరుకుంటే మరీ సులభంగా ఇప్పించవచ్చు."

"అయితే ఆ పని ప్రారంభిద్దాం" అంది అమృత.

"అమృతా – మరోసారి ఆలోచించు" అన్నాను నేను.

"ఏం ఆలోచించను– ప్రతిరోజూ ఒకరి నొకరం దెప్పుకుంటూ, ఒకరి వల్ల ఒకరికి సుఖం లేదనుకుంటూ ఎన్నాళ్ళు కలిసి ఉండగలం?" అంది అమృత.

"ఒకరినొకరు అర్థం చేసుకుందుకు ప్రయత్నించండి."

"ఆయన స్వార్థపరుడు. ఆయన నా పరంగా దేన్నీ చూడరు. ఆయనతో కాపురం నాకు కుదరదు."

"అతనూ అదే అంటాడేమో" అన్నాను నేను.

"అంటే మరీ మంచిది. ఇద్దరికీ కలిపి ఉండలేమన్న అభిప్రాయమే ఉంటే, విడిపోవడమే ఉత్తమం కదా ఆంటీ" అంది అమృత శ్రీమతితో.

శ్రీమతి ఏదన్నా అనేలోగా నేను "సమస్య మీ ఇద్దరికీ మాత్రమే సంబంధించింది కాదు అమృతా – మీకో బాబు ఉన్నాడు. వాడి సంగతి ఏంటి?" అన్నాను.

"వాడికి సమస్యే లేదు. వాడు నా దగ్గరే ఉంటాడు. నాకు ఉద్యోగం ఉంది. ఇంకా డబ్బు అవసరమైతే ట్యూషన్లు చెప్తాను" అంది అమృత.

శ్రీమతిలోని లాయర్ వెంటనే "ఆ అవసరం లేదమ్మా అతను బాగా సంపాదిస్తున్నాడుగా – అతని ద్వారా నెలకింతని నీకు ఇప్పించేటట్లు చూస్తాను. పెళ్ళయినా, విడాకులైనా మగాళ్ళే లాభం పొందేవారు. అలా కాదని తెలియజెప్పాలి" అంది.

శ్రీమతి మామూలుగా ఏ విషయంలోనూ ఆవేశపడదు. అయితే ఆడవాళ్ళకి అన్యాయం జరుగుతోందని అనిపించినప్పుడు ఆవిడకి బాగా ఆవేశం వస్తుంది. ఆవిడ ఆలోచనలూ, ఆవేశం సరయినవిగానే కనిపిస్తాయి. చాలా ఏళ్ళుగా అణగదొక్కబడిన జాతి నిద్రలేస్తున్న తరుణం ఇది. అన్యాయాల్ని ఎదిరించక తప్పదు.

అయితే అమృతకి అన్యాయం జరుగుతున్నట్లు నాకనిపించలేదు. అందుకే ఆ అమ్మాయి విడాకులు తీసుకోడం మంచిది కాదనిపిస్తోంది నాకు. విడాకులు తీసుకునే హక్కు ఉండడం వేరు. దాన్ని వినియోగించుకోడం వేరు.

"మీ ఆయన తాగడు – నిన్ను కొట్టడు – పరాయిస్త్రీలతో గడపడు" అని నేను చెప్తున్న మాటలకి మధ్యలో అడ్డొస్తూ–

"టూర్లకి ఆడ స్టెనోని తీసుకెళ్తున్నాడని చెప్పాగా" అంది అమృత.

"ఆఫీసు పనికి తీసుకెళ్తేనేం" అన్నాను నేను.

"ఆఫీసులో వున్న తక్కిన మగ స్టెనోలు వస్తానంటే వద్దని ఈవిడనే తీసికెళ్తున్నారట" అంది అమృత.

"పోనీ, ఈసారి టూర్‌కి ఆయనతో నువ్వూ వెళ్లు"

"నా ఉద్యోగం"

"పోనీ – ఉద్యోగం"

వెంటనే శ్రీమతి అంది – "ఆ మాట మాత్రం అనవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమృత ఉద్యోగం మానెయ్యకూడదు. ఆడవాళ్ళకి ఆర్థికంగా పెద్ద అండ ఉద్యోగమే."

"ఆ విషయం నాకూ తెలుసు. అయితే కొన్నాళ్ళు మాని మళ్ళీ చేసుకోవచ్చు కదా? ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం, కుటుంబం రెండూ చూసుకోవడం అమృతకి కష్టమవుతోంది కదా?" అన్నాను నేను.

"ఏమీ కష్టం కాదు. ఎందరలా చేసుకోడం లేదు? పురుషాహంకారం ఉన్న మగవాళ్ళకీ, ఆడవాళ్ళు తమతో సమంగా ఉద్యోగం చెయ్యడం నచ్చడం లేదు మనదేశంలో. తరాలుగా నరాలలో జీర్ణించుకున్న భావాలు అంత తొందరగా పోవు. కాలం మారుతోంది, కొన్నాళ్ళలో అందరి మనస్సులూ మారుతాయి. ఈ సమస్యలన్నీ అప్పుడు తొలగిపోతాయి" అంది శ్రీమతి.

ఈ విషయంలో నాకు చాలా అనుమానాలున్నాయి. అమెరికాలాంటి దేశాలలో కూడా కుటుంబ సమస్యలున్నాయంటారు. అవి ఎలా పోతాయో నాకు తెలియలేదు. అయినా ఈ విషయంలో నేను శ్రీమతితో వాదించను. అభిప్రాయాలు ఒకటి కావని తెలిసినప్పుడు వాదించుకోకపోవడం ఉత్తమం. శ్రీమతి కూడా నాతో ఈ విషయం గురించి వాదించదు.

అమృతకి విడాకులు ఇప్పించే ధోరణిలో ఉంది శ్రీమతి. ఆపడం నా తరం కాకపోవచ్చు. అయినా నా ప్రయత్నాన్ని ఆపకుండా –

"విడాకులతో, ఇరుకుగా ఉన్న గూటి నుండి నువ్వు విముక్తి పొందుతావు. స్వేచ్ఛగా ఉంటావు. అది నీకు బావుంటుంది. అయితే బాబు విషయం చూడు. బాబుని మీ ఇద్దరూ కలిపి ఈ భూమ్మీదకు తీసుకువచ్చారు. వాడి బాధ్యత మీ ఇద్దరిదీను. వాడికి తండ్రిని లేకుండా చెయ్యొచ్చా నువ్వు?" అన్నాను అమృతతో.

"వాడికి తల్లినీ, తండ్రినీ నేనే అయి పెంచుతాను" అంది అమృత ఎవ్వరి మాటా వినే మానసిక స్థితిలో లేదు అమృత.

అమృతకి కావల్సిన విడాకుల్ని ఇప్పించింది శ్రీమతి.

శ్రీమతి విడాకులిప్పించినప్పుడల్లా నాకు బాధగా ఉంటుంది.

వైద్యపరంగా అవసరమైనప్పుడు కాకుండా – కేవలం తల్లి కోరిందన్న కారణంగా డాక్టర్ అబార్షన్ చేస్తే ఎలా అనిపిస్తుందో – అలా అనిపిస్తుంది నాకు శ్రీమతి విడాకులిప్పించినప్పుడు.

డాక్టర్లకి అబార్షన్‌లు చెయ్యడం, లాయర్లకి విడాకులిప్పించడం అలవాటయిపోతున్నాయి.

అమృత వేరే ఇల్లు తీసుకుంది. దగ్గరున్న స్కూలుకి బాబు వెళ్ళి వస్తున్నాడు.

రెండు మూడు రోజులకోసారయినా అమృత మా ఇంటికి వస్తూంటుంది.

వచ్చినప్పుడల్లా తనకి విడాకులిప్పించినందుకు శ్రీమతికి కృతజ్ఞతలు చెప్తూనే

E:\Seelamma\ Seelama1 75

ఉంటుంది.

పెళ్ళయిన కొత్తలో పెళ్లి చేయించినందుకు కూడా ఇలాగే కృతజ్ఞతలు చెప్పేది.

ఆరేళ్ళబాబు తల్లయినా అమృత అందంగానే ఉంది. అసలు అమృత అందం తరగకుండా పెరుగుతోంది. దానికి తోడు, తన అందాన్ని ఇంకా అందంగా కనిపించేటట్లు చూసుకోడం అమృతకి బాగా తెలుసు. ఆ అమ్మాయి కట్టుకునే డ్రెస్సుల డిజైన్లు ఆ అమ్మాయి సుకుమారమైన అవయవ నిర్మాణానికి సరిగ్గా సరిపోతాయి. ఆ డ్రెస్సుల రంగులు ఆ శరీరం రంగుకి అందంగా అమరుతాయి. ఆ రంగులకి సరిపోయేట్లుగా బొట్టూ, లిప్‌స్టిక్, చెప్పులూ, గాజులూ, గొలుసూ, రింగులూ వేసుకునే నేర్పూ, ఓర్పూ ఉన్నాయి అమృతకి.

ఇంక జుట్టు సంగతి సరే సరి – రకరకాలుగా మలుస్తుంది.

కుమ్మరి బంకమట్టితో ఎన్నిరకాల అందమైన బొమ్మల చెయ్యగలడో, తనజుట్టుతో అన్ని రకాల అందమైన ముడులు వెయ్యగలదు అమృత.

పొడుగ్గా, నల్లగా, ఒత్తుగా జుట్టునివ్వడం అమృతని సృష్టించిన బ్రహ్మ పనయితే, ఆ జుట్టుని రకరకాలుగా ముడుచుకునే బ్రహ్మ అమృత.

తాను బ్యూటిఫుల్‌గా ఉండి, తనకి తానే మేకప్ చేసుకునే బ్యూటీషియన్ అమృత.

అందుకేనేమో – కాలేజీలో అమృతా మేడమ్ గారికి తక్కిన ఆడపిల్లల కన్నా ఎక్కువమంది ఆరాధకులున్నారని వినిపించసాగింది. మేడంకి అందగత్తెగానే కాక, మంచి లెక్చరర్‌గా పేరుందని విన్నాం.

అమృత జీవితం సుఖంగా గడుస్తోందని అనుకుంటుండగా –

అమృత కొన్నాళ్ళు కనిపించడం మానేసింది.

రెండు మూడు రోజులకోసారయినా అమృత కనిపించకపోతే మాకు తోచదు. ఓ రోజు సాయంత్రం అయిదున్నర అవుతుండగా వాళ్ళింటికి వెళ్ళాం – అయిదింటికి కాలేజీ అవగానే అమృత ఇంటికి వచ్చేస్తుందన్న ఉద్దేశ్యంతో.

ఇంట్లో అమృత లేదు. బాబు ఉన్నాడు.

ముందు గదిలో సోఫాలో ఒక్కడే కూర్చొని ఉన్నాడు. ఆరేళ్ళ పిల్లాడిలో ఉండాల్సిన ఉత్సాహం లేదా మొహంలో. కళ్ళలో చురుకుదనం లేదు. ఎంతో అలిసిపోయినట్లున్నాడు. ఎక్కడో ఆలోచిస్తున్నట్లు కూర్చున్నాడు.

"అమ్మ లేదా?" అని అడిగాను.

"ఊహూ" అని ఊరుకున్నాడు. ఎక్కడకెళ్ళిందో చెప్పాలన్న ధ్యాస లేదా అబ్బాయిలో.

"నువ్వేం చేస్తున్నావు?" అన్నాను ఆ అబ్బాయి పక్కనే కూర్చుని.



E:\Seelamma\
Seelama1


"ఏం లేదు" అన్నాడు.

"కామెడీ కాసెట్లున్నాయిగా వి.సి.ఆర్‌లో పెట్టుకు చూడచ్చుగా" అన్నాను నేను.

"ప్చ్" అన్నాడు అనాసక్తంగా.

"స్కూల్నుండి ఎప్పుడు వచ్చావు?" అని నేనడిగిన ప్రశ్నకి "మూడింటికి" అని సమాధానం చెప్పాడు.

మూడింటికి ఇంటికి వచ్చిన వాడు ఇంకా యూనిఫారంలోనే ఉన్నాడు. కాళ్ళకి బూట్లు విప్పేశాడు కానీ, సాక్స్ అలానే ఉన్నాయి. జుట్టు బాగా చెదిరి ఉంది.

"అమ్మ రోజూ అయిదింటికి ఇంటికి వచ్చేస్తుంది కదూ?" అని అడిగాను.

"ఒక్కోసారి రాదు" అన్నాడు వాడు.

"నువ్వే తాళం తీసుకుని భోంచేస్తావా?"

"లంచ్ స్కూల్లోనే" అన్నాడు వాడు.

"ఈ రోజు ఏం చేసిపెట్టింది మీ అమ్మ?" అని అడిగింది శ్రీమతి వాడితో ఏదో ఒకటి మాట్లాడాలన్నట్లు.

"ఈ రోజు నేను స్కూలుకి బయల్దేరే టైంకి వంటవలేదు. బ్రెడ్ పెట్టింది లంచ్ బాక్స్‌లో. నాకు ఇష్టం లేదు" అన్నాడు వాడు.

"తినలేదా?" అంది శ్రీమతి.

"ప్చ్" అన్నాడు వాడు.

"మరి ఆకలెయ్యదూ?" అని అడిగింది శ్రీమతి.

"పాలు తాగాను – బిస్కట్లు తిన్నాను" అన్నాడు వాడు.

"ఎప్పుడు – ఇంటికి వచ్చాకా?'

"కాదు – స్కూలికి వెళ్ళేటప్పుడు'

"ఇంటికొచ్చాక పాలు" ఇంకేం అడగాలో తెలియనట్లు ఆగింది శ్రీమతి.

"ఫ్లాస్కులో ఉన్నాయి" అన్నాడు వాడు.

"తాగావా?" అంది శ్రీమతి ఫ్లాస్క్ తీస్తూ.

"లేదు" అన్నాడు వాడు.

ఫ్లాస్కులోంచి పాలు కప్పులోకి పోసి ఇచ్చింది.

వాడు నెమ్మదిగా తాగుతున్నాడు. తాగుతూ మధ్యలో –

"అమ్మ ఈ రోజు ఆలస్యంగా వస్తుందేమో" అన్నాడు.

"ఎందుకని?" అడిగాను నేను.

"డాడీతో బయటకి వెళ్తానంది" అన్నాడు వాడు.

నేను నా చెవుల్ని నమ్మలేకపోయాను.
"డాడీ ఇంటికి వస్తుంటారా?" అని అడిగాను.
"ఇంటికి ఎప్పుడూ రారు – ఎప్పుడన్నా వస్తారు. అమ్మా, డాడీ బయటకి వెళ్తారు" అన్నాడు వాడు.
"నీతో ఆడుకోరా?" అన్నాను.
"డాడీకి నేనంటే ఇష్టం లేదు – అమ్మ కోసమే వస్తారు – నాతో మాట్లాడరు" అన్నాడు వాడు.
"నువ్వే మాట్లాడొచ్చుగా" అన్నాను.
"నాకీ డాడీ అంటే ఇష్టం లేదు" అన్నాడు వాడు.
"ఎందుకని" అన్నాను నేను ఆశ్చర్యంగా"
"డాడీ రానప్పుడు అమ్మ నాతోనేఉండేది. డాడీ వచ్చాక బయటకెళ్ళిపోతోంది."
"తప్పు. ఆయన మీ డాడీ. అలా అనకూడదు."
"ఆయన మా నిజం డాడీ కాదు – డాడీ అని మా అమ్మ చెప్పింది – నాకు మా డాడీ అంటేనే ఇష్టం" అన్నాడు వాడు.
వాడు చెప్పింది నాకు వెంటనే అర్థం కాలేదు. అర్థం అయిన వెంటనే పిచ్చెక్కినట్లయింది.
"నువ్వు చెప్తున్నది మీ అసలు డాడీ గురించి కాదా?" అన్నాను.
"ఈయనే నాకు అసలు డాడీట– అమ్మ చెప్పింది – అయితే మా అసలు డాడీ వేరేగా" అన్నాడు.
వాడలా అంటున్న సమయానికి వచ్చింది, పక్కన మరో కుర్రాడితో అమృత.
ఆ కుర్రాడికి ఇరవై ఏళ్ళ కన్న తక్కువే ఉండవచ్చు. అమృత అతనికన్న చిన్నదానిగా, అందంగా కనిపిస్తోంది. వస్తూనే –
"మీ ఇంటికెళ్ళి వస్తున్నాం. మీకు ఇతన్ని పరిచయం చేద్దామనుకున్నాను. మీరే ఇక్కడున్నారు. ఇతను నా స్టూడెంట్ – కమ్ ఎవిరీథింగ్" అంది నవ్వుతూ.
అమృత నిజం చెప్పింది. ఊరికే నా స్టూడెంటని చెప్పి ఊరుకోలేదు. అమృతలో నిజాయితీ ఎన్నడూ లోపించదు.
అమృత ఆనందంగా ఉంది. మొహంలో బాగా తెలుస్తోంది.
"పాలు తాగావా?" అని బాబు నడిగింది.
"ఊ" అన్నాడు వాడు.
"లోపల గదిలో కూర్చుని చదువుకో" అని పంపించింది.





లోపల గదిలోకెళ్ళి మంచంమీద కూర్చున్నాడు – మోకాళ్ళ మీద తల ఆన్చుకుని మమ్మల్ని చూస్తూ.
"ఏం తీసుకుంటారు?" అని అడిగింది అమృత.
ఏమీ వద్దన్నాను నేను.
అతని పక్కన కుర్చీలో కూర్చుంటూ –
"కొన్నాళ్ళుగా నాలో ఏదో ఒంటరితనం కలగసాగింది. ఆ ఒంటరితనాన్ని కనుక్కుని దాన్ని పోగొట్టాడితను – ఐ లవ్ హిమ్" అంది అమృత.
నాకు ఆ మాటలు వినిపించడంల ఏదు. లోపల గదిలో మంచం మీద ఒక్కడే కూర్చుని మమ్మల్ని చూస్తున్న బాబునే చూస్తున్నాను నేను.
వాడు అమృత కడుపులో తొమ్మిది నెలలున్నాడు. అమృత తను కావాలని ఏరికోరి పెళ్ళి చేసుకున్న అతని ద్వారానే వాణ్ణి కన్నది. ఆరేళ్ళుగా అమృత వాడికి తల్లి.
అయినా వాడు ఒంటరిగానే ఉన్నాడు.
అమృత తన ఒంటరితనానికి తోడు చూసుకుంది.
ఆరేళ్ళవాడు ఆ పని చెయ్యలేదు.
నాకు అమృత తల్లితండ్రులు గుర్తొచ్చారు.
వాళ్ళూ ఈ బాబులానే ఒంటరిగా ఉండి ఉంటారు.
వాళ్ళకెవరు తోడు ఉంటారు?
ఈ ఆలోచనలు నన్నక్కడ ఎక్కువ సేపు ఉండనియ్యలేదు.
శ్రీమతిని వెళ్దామా అని అడిగాను. వెళ్ళడానికి లేచింది శ్రీమతి.
బయటకి వచ్చేస్తూ అమృతతో–
"బాబుని ఏదన్నా మంచి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించు" అని చెప్పాను.
అమృత సమాధానం కోసం ఆగకుండా అక్కడ నుంచి నడిచాను. దారిలో శ్రీమతి–
"చాలామంది అమ్మాయిలు తల్లితండ్రుల మాట విని, తమకి ఇష్టం లేని పెళ్ళి చేసుకుని కష్టపడుతున్నారు. స్వతంత్రంగా స్త్రీకి భర్తని ఎన్నుకునే స్వేచ్ఛ ఉండక్కర్లేదా?" అని అడిగింది.
"ఉండాలి" అన్నాను.
"అలానే ఇష్టం లేని మగాడితో తప్పనిసరిగా కాపురం చేస్తున్న చాలామంది భార్యలు అవస్థ పడుతున్నారు. వాళ్ళకి విడాకులు ఇచ్చే స్వేచ్ఛ ఉండక్కర్లేదా?" అని మళ్ళీ అడిగింది.
"ఉండాలి" అన్నాను నేను మళ్ళీ.

"మరి ఇప్పుడు అమృతకిలా అయిందేమిటి?"

"అమృతకేమయింది? బాగానే ఉందిగా" అన్నాను.

"బాబు సంగతి" అంది శ్రీమతి.

"బాబుకి ఏమీ చేసే స్వేచ్ఛ లేదుగా ఇంకా" అన్నాను.

"సరిగ్గా చెప్పు" అంది.

"నాకూ సరిగ్గా తెలియదు– ఇప్పుడే ఆలోచిస్తున్నాను. వ్యక్తి స్వేచ్ఛ వల్ల సమాజానికి కలిగే కష్టసుఖాల గురించి. ఎవరికి వారు తమకి కావల్సిందే చేస్తే ఏమవుతుందా అని. అమృతని నేను తప్పుపట్టడం లేదు. అమృత తనకి కావల్సినట్లు తను ఉండాలనుకుంటోంది. అలా ఉండలేకపోవడం స్వేచ్ఛ లేకపోవడం. అయితే అలా ఉండడం వల్ల తల్లితండ్రులకీ, పిల్లాడికీ కష్టం కలుగుతోంది. ఎక్కడో ఏదో లోపముంది" అని ఆగాను నేను.

"ఎక్కడ?" అని అడిగింది శ్రీమతి.

"వేల సంవత్సరాలుగా ఓ పటిష్టమైన వివాహ వ్యవస్థ ఉంది మన దేశంలో. ఉమ్మడి కుటుంబాలూ, ఒకరి కష్టాలనొకరు చూసుకోవడం ఇవన్నీ ఈ వ్యవస్థలో భాగాలు. అయితే ఈ పద్ధతిలో వ్యక్తులకి స్వేచ్ఛ తక్కువ. అందువల్ల కొందరు సుఖపడేవాళ్ళు. కొందరు కష్టపడేవాళ్ళు.

అమెరికాలాంటి దేశాలలోఈ వివాహం మనదేశాలలో లాగా పవిత్రమైనది కాదు. తెంచుకోరానిది కాదు. అక్కడ వివాహాన్ని రద్దు చేసుకోవడం సులభం. వాళ్ళకి స్వేచ్ఛ ఎక్కువ. అయితే అందువల్ల ఒకరి కష్టాల నింకొకరు పట్టించుకోడం తక్కువగా ఉండవచ్చు.

సామాజిక నియమాలు మనుషుల్ని బంధిస్తాయి. నియమాలు గట్టిగా పాటించని చోట స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. రెండు చోట్లా కష్టసుఖాలు ఉంటాయి.

ఓ వ్యవస్థలో వాళ్ళు రెండో వ్యవస్థ బావుంటుందనుకుంటారు. అందుకే మనదేశంలో స్వేచ్ఛ కావాలని చాలామంది కోరుకుంటున్నారు. అమృత లాంటి వాళ్ళు చాలామంది ఉంటారీదేశంలో.

ఎలాగుండాలన్నది ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవాల్సిందే. అయితే ఓ నిర్ణయం తీసుకునే ముందు దాని పర్యవసానాలు పూర్తిగా ఆలోచించుకోవాలి. మంచి చెడ్డల్ని బేరీజు వేసుకోవాలి. మనకేది కుదురుతుందో దాన్ని ఎన్నుకోవాలి.

అన్ని కాలాలలోనూ, అన్ని దేశాలలోనూ ఏ వ్యవస్థ మంచిదో మనం నిర్ణయించలేం. ఈ విశ్వం పరిమాణంతో పోలిస్తే మనమెంత – సముద్రంలో నీటి కణమంత."





నా మాటలు వింటూ శ్రీమతి నా చెయ్యిని గట్టిగా పట్టుకుంది. దేన్నో కోల్పోతానేమోనన్న భయం కనిపించింది ఆ మొహంలో.

"భయపడకు నేను నిన్ను వదలను" అన్నాను.

"నాకా భయం లేదు" అంది శ్రీమతి.

"ఇంకేమిటి?" అన్నాను నేను.

"అమృత అతన్ని కూడా వదిలేస్తుందా?" అంది.

"అమృతకి అతన్ని వదిలే స్వేచ్ఛ ఉంది. అలానే అతనికీ అమృతని వదిలేసే స్వేచ్ఛ ఉంది. ఎవరు ఎవరిని వదిలేస్తారో తెలియదు. బాబుకి మాత్రం అమ్మని వదిలేసే స్వేచ్ఛ ఇంకా రాలేదు. ఇంకో పది పన్నెండేళ్ళు – వాడూ వెళ్ళిపోతాడు. అమృత వాళ్ళమ్మనీ, నాన్ననీ వదిలేసి వచ్చెయ్యలేదూ? వాడూ అంతే."

శ్రీమతి దగ్గరగా జరిగింది.

నేనావిడ చుట్టూ చెయ్యి వేశాను.

ఇద్దరం కలిసి నడుస్తున్నాం.

పాతికేళ్ళ క్రితం అగ్ని చుట్టూ తిరుగుతూ ఇద్దరం కలిసి వేసిన ఏడడుగులూ గుర్తొచ్చాయి నాకు. శ్రీమతికీ అవే గుర్తొస్తూ ఉండి ఉంటాయి.

# మీ

E:\Seelamma\
Seelama1
79

**మీ**రు పోతే జనం తండోపతండాలుగా రాడానికి మీరు గొప్పవారు కాదు. రాజకీయాలో, సినిమాలో, ఆటలో, సంగీతమో, నాట్యమో, సాహిత్యమో, వ్యాపారమో – ఏ రంగంలోనూ ఏదో సాధించారు అన్న పేరు మీకు లేదు. మీరు ఎవ్వరికీ తెలియరు. అందుకే మీకు గొప్పవారిగా గుర్తింపులేదు. అందుకే ఎక్కడా సంతాపసభలు జరగడంలేదు. పొగడ్తల వర్షం కురవడం లేదు.

ప్రాణం ఇంత సులువుగా పోతుందనుకోలేదు నేను. ఉదయం నేను ఆఫీసుకి వెళ్తున్నప్పుడు కూడా నన్ను సుఖంగా ఉండమంటూ దీవించారు. ఈ రోజు కాదు కొన్నాళ్ళుగా మీ నోట అదే మాట వస్తోంది. రోజూ ఉదయం నిద్రలేస్తూనే మీ దగ్గరకి నేను వచ్చినప్పుడల్లా, కలకాలం పిల్లాపాపలతో హాయిగా నువ్వు ఉండాలని అంటూండేవారు.

ఇప్పుడింక మీ నోటి వెంట నేను ఆ ఆశీర్వాదాలు వినలేను. మీరింక నాతో ఏమీ చెప్పరు. నేనూ మీతో  ఇంక ఏమీ చెప్పుకోలేను. అందుకే నా మనస్సులో మాటల్ని చెప్పడానికే –  ఈ ఉత్తరం – మీకు అందదని తెలిసి కూడా రాస్తున్నాను. ఇదే మీకు నేను రాస్తున్న మొదటి ఉత్తరం. ఇదే ఆఖరి ఉత్తరం కూడా.

ఈ ఉత్తరం మీకు పంపించలేననీ, ఇది మీకు అందదని కూడా నాకు తెలుసు. అయినా, నా కోసం నేను రాసుకుంటున్న ఉత్తరం ఇది.

'శీర్యతే ఇతి శరీరం' అని అన్నారు. మీ శరీరం  ఎప్పుడో చిక్కి శల్యమైపోయింది. మిమ్మల్ని చూస్తే ఎముకలూ, చర్మమూ తప్ప ఏమీ కనిపించేవికావు కొన్నేళ్ళుగా. అలాగని అంతకుముందు మీరు మంచి బలంగా ఉండేవారు కారు. మిమ్మల్ని తెలిసిన వాళ్ళందరూ మిమ్మల్ని నాజూకైన మనిషనే అనేవారు.

నాకు తెలిసి మీరు ఎప్పుడూ ఎండకి కానీ చలికి కానీ తట్టుకోగలిగేవారు కాదు. చేతిలో గొడుగు లేకుండా మీరు బయటికి వెళ్ళడం నేనెప్పుడూ చూడలేదు. అలాగే ఎప్పుడూ ఫ్యాన్ పెట్టుకుని పడుకోలేదు. ఫ్యాన్‌గాలి తట్టుకోలేకపోయేవారు.

'నా వల్ల మీ అందరికీ ఇబ్బంది. నా కోసం మీరు కూడా ఏ.సీ. ఫ్యానూ మానెయ్యాల్సి వస్తోంది. అసలు నేను ఈ సంఘానికి ఫిట్ కాను' అని అనేవారు.

అలాంటి మీ శరీరానికి ఏమీ అవకూడదన్న తాపత్రయంతో మంచు మీద ఉంచాం. అసలే చల్లబడిన మీ శరీరం ఆ మంచు చల్లదనాన్ని తట్టుకోగలదా అని అనిపించింది ఒక్కసారి. ఐతే ఈ శీతోష్ణాలని అనుభవించని స్థితికిచేరుకుంది మీ భౌతిక శరీరం. ఆత్మ అంటూ ఉంటే అది ఈ పాటికి శరీరాన్ని వదిలేసి ఉంటుంది. ఆత్మ ఉంటుందన్న నమ్మకం మీకు లేదు. అలాగని అపనమ్మకమూ కాదు. మరణం తర్వాత ఏమవుతుందన్నది మరణం తర్వాతే తెలుస్తుంది అని అనేవారు.

ఒకవేళ శరీరం కాకుండా నిజంగాఆత్మలాంటిదేదన్నా ఉండి ఉంటే మీ ఆత్మకి – అంటే మీకు – మరణానంతరం ఏమవుతోందో తెలుస్తూ ఉండి ఉంటుంది. ఐతే మీరు నాకు ఆ సంగతి చెప్పరు.

మీరే అనేవారు – మరణించిన వాళ్ళెవ్వరూ ఇంత వరకూ మనకు కనిపించి మరణించాక ఇలా ఉంటుందని చెప్పలేదు – అని. అందుకే మీరు చెప్పడం లేదు. జీవితం అంతా ఎక్కువ మౌనాన్నే పాటించిన మీరు ఇప్పుడు ఇంక పూర్తిగా మునులైపోయారు.

ఇలా మాట్లాడకుండా కదలకుండా పడుకుని ఉన్న మిమ్మల్ని చూస్తూ ఓ రాత్రంతా గడపాలని అనుకుంటున్నా నాకు భయం కానీ బాధ కానీ కలగడంలేదు. నాకు భయం బాధా కలగకుండా చేసింది మీరే. ఈ లోకం నుండి వెళ్ళిపోవడానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవడమే కాక నన్నూ సిద్ధం చేశారు మీరు. ఎనిమిదేళ్ళ క్రితమే – వెయ్యి చంద్రుళ్ళని చూశాను. ఇంక ఎన్నాళ్ళు బతికినా ఎక్కువే. ఆ దేవుడు ఏరోజు దయతలిస్తే ఆ రోజు వెళ్ళిపోవడమే. నేను పోతే నువ్వు బాధపడకు అని చెప్పారు. నాకు ఆ మాటలే గుర్తొస్తున్నాయి.

అందుకే కదలకుండా కట్టెలా అయిపోయిన మీ శరీరాన్ని, చూసినా నాకు కష్టం కలగడం లేదు. ఏడుపు రావడంలేదు. ఈ సన్నివేశాన్ని నాకు మీరు ముందే చూపించేశారు. రాబోయే మరణం గురించి ఏ మాత్రం బెంగపడకుండా దానికోసం ఎదురు చూస్తూ కాలం గడిపేశారు మీరు.

ప్రతి ప్రాణికి ప్రాణం అంటే తగని తీపి ఉంటుందని నా నమ్మకం. అలాంటిది ప్రాణం పోయే రోజు దగ్గర పడుతోందని ఆందోళన పడడం కాదు – దగ్గర పడాలని కోరుకోగలిగారు మీరు.

ఈ రోజు కాదు. ఇరవై ఏళ్ళ క్రితం. మీకు ఇంకో పది నిముషాల్లో ఆపరేషన్ అవుతుందనగా కూడా, ప్రతి రోజులాగానే పేపర్ చదువుకుంటూ ఉండగలిగారు

మీరు – నిశ్చలంగా, నిర్భయంగా.

మధ్యాహ్నం నిద్రలోనే శాశ్వత నిద్రలోకి జారిపోతూ కూడా మీలో అదే నిశ్చింతా, అదే నిర్భయం. మృత్యువుని కాదు మృత్యుభీతిని జయించిన మృత్యుంజయులు మీరు. అందుకే మందులు అయిపోతున్నాయి తీసుకురా అని చెప్పగలిగినంత మామూలుగా, నేను చచ్చిపోయాక, నాకుకొరివి పెట్టాలి నువ్వు అని కూడా చెప్పగలిగారు.

మీ జీవిత యాత్రలాగానే  ఏ ఆర్భాటాలు లేకుండా సాగిపోతోంది మీ అంతిమయాత్ర.

చుట్టుపక్కల నాలుగైదు గ్రామాల్లో తప్ప ఇంకెక్కడా ఆ ఊరు ఉందనే తెలియని చిన్న పల్లెటూరిలో తాటాకింట్లో ఎప్పుడో తొంభై ఏళ్ళ క్రితం ప్రారంభమైన మీ జీవిత యాత్ర ముంబయి మహానగరంలో పెద్ద కాంక్రీట్ సౌధంలో పరిసమాప్తమైంది.

ఎంతటి సుదీర్ఘ ప్రయాణం. రెండు ప్రపంచ సంగ్రామాలూ, భారతదేశ స్వతంత్రం, ఆంధ్ర రాష్ట్రావతరణంలాంటి ముఖ్యమైన సంఘటనలు ఎన్ని చూశారు మీరు. పందొమ్మిది వందల ముప్ఫైలలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక సంక్షోభం – ఎక్కడో పల్లెటూరిలో ఉన్న మీ మీద చూపించిన ప్రభావం మీ నోటి గుండా ఎన్నోసార్లు విన్నాను నేను.

మీకింకా ఎనిమిదేళ్ళు రాకుండానే మీ నాన్నగారు పోయారు. దగ్గర చుట్టాలు మోసం చేస్తే ఎవరో స్నేహితుల సాయంతో చదువు సాగిస్తోంటే వచ్చింది ఈ ఆర్థికసంక్షోభం. చదివిన చదువుతో చిన్న ఉద్యోగం ప్రారంభించిన మీరు తర్వాత ప్రైవేటుగా ఎం.ఎ. చేశారు. అసలు కాలేజీకే వెళ్ళని మీరు కాలేజీ లెక్చరర్‌గా పనిచేశారు. మమ్మల్ని ఏ కష్టం తెలియకుండా పెంచి పెద్దచేశారు. పెళ్ళిళ్ళు చేశారు.

మనవల్నీ, మనవరాళ్ళనీ చూసుకున్నారు. ఇన్నేళ్ళ జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు చూశారో? అయినా ఎప్పుడూ  చెయ్యాల్సిన పనిని చెయ్యకపోవడం లేదు. అక్కరలేని పనిని చేసిందీ లేదు.

అనవసరమైన విషయాల్లో తలదూర్చకపోవడం చాలా కష్టం. మీ పక్కన నిలబడి ఎవరైనా మాట్లాడుకుంటుంటే– వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో వినాలనే కుతూహలమే ఉండేది కాదు మీకు. ఏమిటి మాట్లాడుతున్నారు అని అడిగేవారే కాదు.

నేనెందరో ముసలివాళ్ళను చూశాను. వాళ్ళకి అక్కరలేనిది లేదన్నట్లు అన్నీ అడిగి తెలుసుకుంటూ, అడక్కపోయినా సలహాలు చెప్తూ, అవి ఎవరూ వినడం లేదని సణుక్కుంటూ – తాము బాధపడుతూ చుట్టుపక్కల వాళ్ళని బాధపెడుతూ ఉంటారు.

మీకు అనవసరమైన విషయాల గురించి పట్టించుకునే వారు కారు మీరు. ఆ



E:\Seelamma\ Seelama1 80

గుణం ఎలా వచ్చిందో? మీరొక్కరూ కూర్చుని ఎన్ని గంటలైనా పేషన్స్ ఆడుకుంటూనో, పేపర్ చదువుకుంటూనో గడిపెయ్యగలిగేవారు –  ఎవరితోనూ సంబంధం లేకుండా. మావయ్య అనేవాడు 'మీరు ఎవరో ఋషి అయ్యుంటారు – శాపవశాత్తూ భూలోకంలో కొన్నాళ్ళు గడుపుతున్నారు' అని.

ఆ మాట నిజమే అనిపిస్తోంది నాకు. ఏ శాపం మిమ్మల్ని మా దగ్గర ఉంచిందో, అది మా పాలిటి వరం అయ్యుంటుంది. కష్టసుఖాలకి వెరవకుండా – ఒక జీవన్ముక్తుడిలా అతి సాధారణంగా జీవితయాత్ర సాగించారు. ఆఖరి యాత్ర కూడా అలాగే సాగిపోతోంది. నన్ను కనిపెంచిన మిమ్మల్ని ఇలా కట్టెల మీద పడుకోబెట్టి కొరివి పెట్టాల్సిన రోజు వస్తుందని ఎప్పటినుండో నాకు భయం ఉండేది.

నేను ఆ పని చెయ్యగలనా అని భయపడుతూనే ఉండేవాడిని. నన్ను చిన్నప్పుడు ఆడించినవో, కొంచెం పెద్దయ్యాక చదువు చెప్పించినవో, ఉపనయనం చేసి చెవిలో గాయత్రీ మంత్రాన్ని చెప్పినవో జ్ఞాపకాలు నన్ను చుట్టేసి, అసలు నేను ఈ పని చెయ్యలేనేమో అని అనుకునేవాడిని.

నన్ను చిన్నప్పుడు ఎత్తుకు తిప్పిన మీ భుజాలనీ, చిరునవ్వుతోనే పలకరించే మీ మొహాన్నీ, ఆశీర్వదించడానికి సిద్దంగా ఉండే మీ చేతులనీ నేను కాల్చగలనని నేను అనుకోలేదు.

అంతా మామూలుగా అయిపోయింది. మీరే పక్కన ఉండి నేనేం చెయ్యాలో చెప్తూ మీ దహన సంస్కారం చేయించుకున్నట్టు అనిపిస్తోంది నాకు.  లేకపోతే నాకు ఇంత శక్తి ఎక్కడ నుండి వస్తుంది? కట్టెలతోపాటు మీ కట్టె కూడా కాలిపోతోంటే చూస్తూ ఉండగలిగిన మనస్సు ఎలా వస్తుంది?

కాశీలో పోవడం కన్న – కన్న కొడుకు దగ్గర పోవడం ఎంతో పుణ్యం అనేవారు మీరు. పుణ్యం మీది కాదు. నాది. చివరిదాకా నా దగ్గరే ఉండి నేను చెయ్యాల్సిన పనులన్నీ నా చేత పూర్తిగా చేయించారు – చివరికి మీ తలకి కొరివి పెట్టే పనిని కూడా. ఇక ముందు నన్ను ముందుకు నడిపించాల్సినవి మీ జ్ఞాపకాలే. అవి నాలో నిరంతరం ఉంటూనే ఉంటాయి. ఐనా మీరు లేరన్న భావం నన్ను వదలదు.

శ్మశానం నుండి ఇంటికి వచ్చేసరికి – అందరూ ఉన్న ఇల్లే అయినా ఖాళీగా అనిపిస్తోంది నాకు. మీరు పడుకునే మంచం మీరు లేకుండా ఒంటరిగా ఉంది. ఈ మంచం వయస్సు నా వయస్సు కన్న ఎక్కువ. పట్టెమంచమే కాని ఇంకో మంచం మీకు సరిపోదని ఎన్ని ఇళ్ళు మారినా, ఊళ్ళు మారినా, దాన్ని మనతో పాటే తీసుకు వచ్చేవాడిని. ఇంక దాని అవసరం లేదు. చేతన లేని ఆ మంచం ఏమనుకుంటుందో

కానీ నాకు నిజంగానే ఒంటరిగా అనిపిస్తోంది.

మనం ఒకరితో ఒకరం మాట్లాడుకునే సమయం ఎక్కువ ఉండేది కాదు. నాకు ఊహరాని వయస్సులో సంగతి నాకు తెలియదు కానీ, నాకు కొంత జ్ఞాపకం ఉన్నప్పట్నుంచి మనిద్దరి మధ్యా మాటలు ఎక్కువ ఉండేవికావు. అయితే నాకు అబ్బిన విద్య కానీ, వివేకం కానీ – అదంతా మీ దగ్గర నుండి వచ్చిందే.

రోజుకి ఓ పదిముక్కలకన్న ఎక్కువ మాట్లాడకపోయినా అన్నిటిలోను మీకు నా మీదున్న అభిమానం వ్యక్తమయ్యేది. అంతకు మించి నాకు ప్రపంచం మీద అవగాహన పెంచేవి మీ మాటలు. వీటన్నిటికన్న ముఖ్యంగా నేనెంత సాధించినా, నన్ను నేల మీద నిలపెట్టేవి మీ మాటలే. చిన్నప్పుడు ఏదన్నా ప్రైజ్ వచ్చిందని చెప్తే – ఎవరికో ఒకరికి ఇవ్వాలి కదా అనేవారు.

నువ్వేదో సాధించేశావనో, నువ్వేదో గొప్పవాడివి అయిపోయావనో అనుకోవద్దన్న సూచన అంతర్లీనంగా ఉండేది. నన్ను మీరు ఎప్పుడూ తిట్టలేదు. ఇంక కొట్టడం అన్న ప్రశ్న లేదు. అయితే అలాంటివి ఏమీ లేకుండానే మీరు జీవించిన జీవితమే – మీ మాటలే – నా జీవితానికి మార్గదర్శకాలై నన్ను నడిపించాయి. నడిపిస్తూనే ఉంటాయి.

మీరు శారీరకంగాలేరు కాని – మీరు నాలో నిక్షిప్తమైపోయి ఉన్నారు. అందుకే లేరన్నమాట నిజం కాదు. అసలు నేనెవరు? మీరొక పక్కా, అమ్మొక పక్కా – కలిపి నేను. చెట్టులోంచి వచ్చిన విత్తు మరో చెట్టు అవుతుంది. మళ్ళీ అందులోంచి విత్తనం వస్తుంది. అది మళ్ళీ చెట్టవుతుంది. అలానే మీరూ, నేనూ మీరు పోయినా నేనున్నాను. అంటే మీరు ఉన్నట్లే. మీరే కాదు. మీ అమ్మానాన్నలు, వాళ్ళ వాళ్ళ అమ్మానాన్నలు... అలా ఎన్ని తరాల నుండో వస్తోంది ఈ జీవన పరంపర. ఇంకెన్ని తరాలో ఇలా వస్తూనే ఉంటుంది. ఈ చక్రానికి ఆద్యంతాలు మనకు తెలియవు. అసలు ఉన్నాయో లేవో కూడా తెలియదు. ఇప్పటికి మీకు తెలిసిందేమో నాకు తెలియదు.

చెప్పడానికి మీరు లేరు. మీకు ప్రతీకగా మీ ఆస్థికల్ని ఏరుకున్నాను. ఆస్థికల్ని నదిలో కలపడం అనే ఆచారం మన జీవన విధానంలో భాగం అయిపోయింది. గోదావరి సముద్రంలో కలిసే ప్రదేశంలో పుట్టిన మిమ్మల్ని – గోదావరి పుట్టిన ప్రదేశంలో కలిపేశాను. ఇలాంటి వాటి మీద నమ్మకం లేని నేను ఇవన్నీ చెయ్యడం నాకే ఆశ్చర్యంగా ఉంది. మీరు అనే వారు ప్రేతాలూ, శ్రాద్ధాలూ – ఇవన్నీ నిజమని నమ్మడానికి ఏ విధమైన ఆస్కారం లేదని.

ఐతే మీరు వీలున్నంత కాలం తద్దినాలు పెడుతూనే ఉన్నారు. అదీ పూర్తి శ్రద్ధతో. అయితే పెట్టిన ప్రతిసారీ ఒకటే మాట అనేవారు. ఇవన్నీ చేస్తున్నది, నేను నమ్మి కాదు. పోయిన వాళ్ళు వాటిని నమ్మారు. వాళ్ళ నమ్మకం కోసం అని. ఐతే నేనెందుకు చేస్తున్నానో నాకే తెలియదు. నాకే కాదు – మీకూ నమ్మకం లేదు. మన పూర్వీకులు నమ్మి చేసిందాన్ని మనం ఎందుకు ఆపెయ్యడం అనేవారు మీరు.

అందుకే నేను కూడా చేస్తున్నానేమో. ఏ రోజు తనతోటి మనిషిపోతే ఆ శరీరాన్ని, ఏ జంతువులో తినెయ్యడానికి వదిలెయ్యకుండా మనిషి పాతిపెట్టడమో, దహనం చెయ్యడమో మొదలెట్టాడో, అప్పటి నుండి ఎన్నో లోకాలని సృష్టించెయ్యడం మొదలెట్టాడు. ఈ లోకానికీ, పై లోకాలకీ సంబంధం పెంచుకుంటూపోయాడు.

మంత్రాలు నేర్చుకున్నాడు. అగ్నిని ఆశ్రయించాడు. బ్రాహ్మణుల్ని తయారుచేశాడు. తండ్రుల, తాతల, ముత్తాతల ఉత్తమ లోకమార్గం కోసమని కర్మకాండని నియమబద్ధం చేశాడు.

ఒకవేళ ఉత్తమ లోకాలే ఉంటే – వాటికి కావల్సిన మార్గం – ఏ మనిషికి ఆ మనిషి తనజీవితకాలంలోనే తన ప్రవర్తనతో వేసుకోవాలి కానీ మనిషి పోయాక తర్వాత తరం వాళ్ళు చేసే కర్మల వల్ల అవి సాధ్యమౌతాయనడంలో నాకూ మీకూ నమ్మకం లేదు. మనిషి ఉన్నన్నాళ్ళూ అతనికి ఏంచేశామో అంతే. తర్వాత చేసేది మనశ్శాంతి కోసం. జీవితకాలంలో ఏమీ చెయ్యకుండా తర్వాత దానాలనీ విందులనీ ఆర్భాటం చేసేవాళ్ళెందరో? ఆర్భాటాలు మీకు నచ్చే విషయం కానేకాదు.

నా ఉద్దేశ్యంలో – ఎవ్వరికీ అన్యాయం చెయ్యని, చేద్దామని తలవని మీరు ఉత్తమలోకాలకు వెళ్ళడానికి కావల్సిన అర్హతను స్వయంగా సంపాదించుకున్నారు. నేనేం చేస్తున్నా అది నా తృప్తి కోసం. అంతే.

అమ్మ ఏం చేసిపెట్టినా ఏమిటని కూడా చూడకుండా తినేవారు మీరు. ఇది కావాలి అన్న కోరిక ఎప్పుడూ లేదు. తిండి మీదే కాదు. దేని మీదా లేదు. తిండీ, బట్టా, గూడూ – సాధారణంగా బతకడానికి ఎంత కావాలో అంతే. అంతకు మించి ఏ కోరికా లేదు. పదో రోజు కార్యక్రమంగా పిండాలు పెట్టిస్తూ, మీకు ఏదన్నా కోరిక ఉంటే అది తీరుస్తానని అనుకోమన్నారు నన్ను. అసలు మీకు ఏం కోరిక ఉందని అది తీరుస్తానని అనుకోను నేను?

అలా పిండాలు పెట్టగానే అలా కాకులు వచ్చాయి. కాకులు రాకపోవడానికీ, మీ కోరికలు తీరకపోడానికీ సంబంధం ఉండే అవకావం లేదు. కానీ మీకు ఏం కోరికలు మిగిలిపోయాయని అవి రాకుండా ఉండడానికి? మిగలడానికి కోరికలు ఉండాలి. కోరికలే లేవు మీకు. ఈ భూమ్మీద మీరు చెయ్యాల్సిన పనులన్నీ ఒక్కటి కూడా


E:\Seelamma\ Seelama1 81

మిగల్చకుండా పూర్తి చేసేశారు మీరు. ఆ పనులన్నీ కూడా చెయ్యాలన్న కోరికతో కాదు – చెయ్యాలన్న బాధ్యతతో చేశారు.

ఇంక మీకు జీవించాల్సిన అవసరం కూడా లేదనిపించిన రోజున జీవితం మీదా కోరిక పోయింది మీకు. ఒకవేళ అంతకు ముందు ఉండి ఉంటే.

తామరాకు మీద నీటిబొట్టులా ఉండడం అంటే ఏమిటో చెప్పి కాదు – జీవించి చూపించారు మీరు నాకు. కర్మయోగికి అసలయిన నిర్వచనం మీరు. ఋషిగా బతకడానికి అడవులకి వెళ్ళక్కరలేదు. సమాజంలో జనం మధ్య ఉంటూ కూడా అది సాధ్యమే అని నిరూపించిన జీవితం మీది.

పన్నెండు రోజుల కార్యక్రమం పూర్తయింది. అంటే ఇంక చేసేదంతా శుభకార్యమే అని అంటున్నారు బంధుమిత్రులందరూ. ఇన్నాళ్ళూ చేసింది అశుభకార్యమని అనిపించలేదు నాకు.

నలుగురినీ పిలిచి భోజనాలు పెట్టాలన్నారు. ఇక్కడ మిమ్మల్ని తెలిసిన వాళ్ళు చాలా తక్కువ. నాకు తెలిసినవాళ్ళే అందరూ. ఇక్కడే కాదు. ఎక్కడా మీరు ఎక్కువమందితో బంధం కలుపుకోలేదు. ఈ బంధాలకి అతీతంగా జీవితం గడిపేశారు. నలుగురినీ కలవాలనీ, ఏదో చేసి నలుగురి మెప్పు పొందాలన్న కోరిక మీకుఎప్పుడూ లేదు.

అసలు గొప్పవాణ్ణి కావాలని అనుకోకపోవడమే మీ గొప్పతనం. ఏదో చేసెయ్యాలనీ, నలుగురిలోనూ ప్రత్యేకంగా కనిపించాలనీ అనుకునే మనుషులకి అసలు ఏ ప్రత్యేకతా అక్కరలేదని అనుకోగలిగిన మీ ప్రత్యేకత అర్థం కాదు. అది గొప్పతనం అని ఎవరికో కానీ అనిపించదు. అందుకే మీకు గొప్పవారిగా గుర్తింపు లేదు. అందుకే ఎక్కడా సంతాప సభలు జరగడంలేదు. పొగడ్తల వర్షం కురవడంలేదు. దండలూ,ఊరేగింపులూ లేకుండా మామూలుగా సాగింది మీ అంతిమయాత్ర.

మీ జీవితం లాగానే మీ మరణమూ సాదాగా గడిచిపోయింది. సామాన్యంగా జీవితం గడిపేసిన అసామాన్యులు మీరు. నలభై ఏడేళ్ళ మీ కొడుకుగా మీకు సన్నిహితంగా ఉండే భాగ్యం నాకు ప్రసాదించినందుకు –

ఇక ఎన్నటికీ కనిపించని మీ పాదాలకు సాదరంగా ప్రణమిల్లుతూ

మీ....



E:\Seelamma\
Seelama1
82



# మెరీనా... ఓ మెరీనా...

**అ**దే సముద్రం.... అదే ఆకాశం... అదే ఇసుక. ఐతే అంతా కొత్తగా ఉంది. ఏదో పెద్ద మార్పొచ్చి కాదు. అసలు మార్పు రావడానికి సముద్రం, ఆకాశం, ఇసుకా ఏం మారిపోతాయి?

బీచ్ కూడా ఈ ఇరవై ఏళ్ళలోనూ పెద్దగా మారిపోలేదు. ఐనా నాకు కొత్తగా కనిపిస్తోంది.

సాయంత్రం అయిదయిందంటే చాలు – బీచ్‌కి వచ్చి వాలిపోయేవాళ్ళం – నేనూ, సుందర్, శ్రీరాం, ప్రకాష్. ఒక్కక్కరిదీ ఒక్కో కుటుంబ వాతావరణం – ఒక్కో చదువూ – ఒక్కో ఆర్థిక పరిస్థితీ – ఐతే అవన్నీ అడ్డంగా ఉండేవి కావు. అసలు వాటి గురించి ఆలోచనే ఉండేది కాదు. హాయిగా, జాలీగా, ఆనందంగా, అందమైన సముద్రతీరంలో మేం –

మేం మాత్రమే లోకంలో ఉన్నట్లుగా – అక్కడకి వచ్చే తక్కినవాళ్ళమీద జోక్స్ వేసుకుంటూ – కబుర్లు చెప్పుకుంటూ, కలలు కంటూ – డబ్బెవరిదన్న ప్రసక్తి లేకుండా ఐస్‌క్రీములూ, మామిడికాయలూ, మురుకులూ తింటూ – అలల్లో నించుంటూ, ఇసుకలో పరుగెడుతూ, పడవల్లో కూర్చుంటూ –

ఒకటీ రెండు రోజులు కావు – సంవత్సరాలు – కాలేజీలో చదువుకున్నంత కాలం ఈ మెరీనా తీరం మాకు సాయంకాలాల ఆలవాలం అయిపోయింది. రోజూ వచ్చేవాళ్ళం. వానాకాలంలో కూడా గొడుగు వేసుకుని వచ్చేవాళ్ళం. ఒక్కోసారి సముద్ర తీరం మొత్తానికి మేం నలుగురం ఉండేవాళ్ళం.

అదే మెరీనా తీరానికి ఇరవై ఏళ్ళ తర్వాత వచ్చి చూస్తే అంతా కొత్తగా కనిపిస్తోంది.

కూచున్న మనుషులూ, అమ్ముకునే కుర్రాళ్ళూ, ఆఖరికి అడుక్కునేవాళ్ళూ – అంతా కొత్తే. 'అమెరికా నుండి వస్తున్నాను – ఆదివారం సాయంత్రం నలుగురం మళ్ళీ సముద్ర తీరంలో కలుద్దాం' అని –

ముగ్గురికీ మెయిల్స్ రాస్తే శ్రీరాం 'బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళాలి – రాలేకపోతున్నాను' అని రాసేశాడు. ప్రకాష్ అర్జంట్ పని ఉంది రాలేనేమో అయినా

చూస్తాను' అని రాశాడు. సుందర్ వీలు చేసుకుని వస్తానని రాశాడు.

అందరూ సంసారాల్లో ఇరుక్కుపోయారు. బాధ్యతలూ, బంధువులూ, బంధాలూ నేనూ, నా భార్యా ఈ చట్రంలో ఇరుక్కుపోలేదు. అందుకే స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ కాలం గడిపేస్తున్నాను.

బీచుల్లో, కేసినోల్లో, నైట్‌క్లబ్బుల్లో – మందుల్లో, విందుల్లో అమ్మాయిలతో విలాసంగా సాగిపోతోంది జీవితం. ఎప్పుడు ఎక్కడికి కావలంటే అక్కడికి వెళ్ళడం, ఏం కావాలంటే అది చెయ్యడం.

మేం నలుగురం సామాన్యంగా కూచునే చోటు – అది ఓ పడవచాటు – అక్కడకెళ్ళి కూచున్నాను. అక్కడికి వచ్చే జంటలని చూసి వాళ్ళెవరై వుంటారా – భార్యాభర్తలా, ప్రేమికులా, అన్నాచెల్లెళ్ళా, స్నేహితులా అని షెర్లాక్ హోమ్స్ లెవల్లో కబుర్లాడుకునేవాళ్ళం. అలాంటిది ఈ రోజు అందరూ నన్ను చూసి 'వీడెవడా ఇక్కడ కూచున్నాడు' అని అనుకుంటున్నారనిపిస్తోంది.

సమయం గడుస్తోంది. కానీ సుందర్ రాలేదు. టైం బాగా మెయిన్‌టైన్ చెయ్యడం వాడికి అలవాటు. అంతేకాదు. బీచుల్లోనూ, గుళ్ళలోనూ అందమైన అమ్మాయిల్ని చూస్తూ కాలక్షేపం చేయడం వాడికి బాగా ఇష్టం. వాడు వస్తే ఆ పనిని చెయ్యచ్చని వాడి కోసం ఎదురుచూస్తూ కూచున్నాను. నలభై ఏళ్ల నా జీవితం నా కళ్ళ ముందు సినిమారీల్లా కనిపించింది.

ఈ బీచ్‌లో గడిపిన సాయంత్రాలు మళ్ళీ రావేమో అని ఒక్కసారిగా అనిపించింది.

అవి తిరిగి రావని తెలియక కాదు. తెలుసు. కానీ బలంగా అనిపించడం మాత్రం వేరు.

ప్రకాష్, శ్రీరాం, సుందర్ లేకుండా నేను ఒక్కణ్ణే అక్కడ కూచోడంతో ఏదో విలువైనది పోగొట్టుకున్నట్లుగా అనిపించింది. అదేంటో అర్థం కావడం లేదు – కానీ ఏదో పోయినట్లుగానే ఉంది.

అందుకే అదే సముద్రం, అదే ఆకాశం, అదే ఇసుకా – అంతా కొత్తగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో మార్పొచ్చి మాత్రం కాదు.

సుందర్ కూడా రాడేమోనని నిరాశగా లేచి అటూ ఇటూ కాస్సేపు నడిచి, మళ్ళీ అక్కడకొచ్చాను.

నేను ఖాళీ చేసి వెళ్ళిన చోట ఇంకెవరో ఉన్నారు.

టీన్స్‌లో ఉన్న ఓ అందమైన అమ్మాయి జీన్స్‌లో, టీషర్ట్‌లో గుండ్రని మొహంతో, చక్కటి రంగుతో సన్నగా, నాజూగ్గా ఉంది.



E:\Seelamma\
Seelama1
83

ఆ అమ్మాయి జనం వచ్చే వైపుకి చూస్తూ కూచుంది. ఎవరి కోసమో ఎదురు చూస్తోందిలా వుంది. ఎవరై ఉంటారో. బాయ్‌ఫ్రెండ్ కోసమేమో. ఇంతటి అందగత్తె బాయ్‌ఫ్రెండ్ ఎలాగుంటాడో చూడాలని నాకు కుతూహలం కలిగింది.

నేనూ వచ్చే జనం వైపు చూస్తూ కూచున్నాను – సుందర్ కోసమే కాదు – ఆ అమ్మాయి కోసం ఎవరొస్తారో వాళ్ళ కోసం కూడా.

మధ్య మధ్యన నేను ఆ అమ్మాయిని చూస్తోంటే ఆ అమ్మాయీ నన్ను చూస్తోంది.

నేను చూస్తున్నానని చూడగానే మొహం తిప్పేసుకుంటోంది. అయితే ఆ కళ్ళలో మాత్రం నన్ను చూడాలన్న కోరిక నాకు స్పష్టంగా కనిపించింది.

చీకటి పడుతోంది. సుందర్ రాకపోవచ్చు. అయినా పరవాలేదు. ఈ అమ్మాయి ఉందిగా అని అనుకుంటుండగా – ఆ అమ్మాయి లేచింది.

వెళ్ళిపోతుందా అని అనుకుంటుండగా నా వైపు నడుచుకుంటూ రాసాగింది.

ఆమె ధోరణి నాకేం అర్థం కాలేదు.

"మీరెవరికోసమన్నా చూస్తున్నారా?" అని అడిగింది. కంఠం చూడ్డానికే కాదు. వినడానికీ బావుంది.

"లేదు – మీరు – నువ్వు – నువ్వు" అని ఏమనాలో తెలీక నేను ఆగిపోయాను. నా జీవితంలో మొదటి సారి అలా – నేనో అమ్మాయి ముందుమాటలు రాకుండా ఉండిపోవడం.

"నేనో పెద్దమనిషిని మా ఇంటికి తీసుకుని వెళ్ళాలి – ఆయన కోసం చూస్తున్నాను" ఆ అమ్మాయి నా దగ్గరకి వచ్చి అలా అనడంలో వున్న ఉద్దేశం ఏమిటో నాకు అర్థం కాలేదు.

మనసు రకరకాల ఆలోచనలు చేస్తోంటే –

"మీకూ కంపెనీ లేనట్లుంది – నేనిక్కడ కూచోనా?" అని అడిగింది ఆ అమ్మాయి.

"ఇటీస్ మై ప్లెషర్" అన్నాను నేను.

"మీరు కాలిఫోర్నియా నుండి వస్తున్నారు కదూ?" అని అడిగింది.

నా యాసని బట్టి అమెరికా నుండి అని తెలుసుండచ్చు – కాలిఫోర్నియా అని ఆ అమ్మాయికి ఎలా తెలిసిందో నాకు అర్థం కాలేదు.

అదే అడిగితే నవ్వేసింది. ఆ నవ్వు పదహారేళ్ళ అమ్మాయి నవ్వులా అందంగా ఉంది.

"ఏదో పోగొట్టుకున్నట్లు కనిపిస్తున్నారు మీరు".

"అవునేమో" అన్నాను నేను.

E:\Seelamma\
Seelama1
84

"ఏం పోయింది? ఎక్కడ పోయింది?"

"ఏం పోయిందో తెలియదు. పోయింది మాత్రం ఇక్కడే – ఈ బీచ్‌లోనే"

"ఏం పోయిందో చెప్పండి – నేనూ వెతుకుతాను. నన్ను నా ఫ్రెండ్స్ డిటెక్టివ్ అంటారు. ఎవరివి ఎక్కడ ఏం కనిపించకపోయినా నాకు దొరికిపోతాయి" అంది ఉత్సాహంగా ఆ అమ్మాయి.

"నేను పోగొట్టుకున్నది కనిపించేది కాదు. అసలది ఏంటో నాకు అర్థం కావడం లేదు."

"ఎప్పుడు పోయింది?" అడిగిందా అమ్మాయి.

"చాలా ఏళ్ళయి ఉంటుంది. ఇరవై ఏళ్ళేమో"

"ఇరవై ఏళ్ళ క్రితం మీరు పోగొట్టుకున్నది ఇప్పుడు ఇక్కడ వెతుకుతున్నారా" అంది నన్నో పిచ్చివాడిని చూస్తున్నట్లు.

"ఏం దొరకదా? దొరుకుతుందనే ఆశతో ఇక్కడికి వచ్చాను నేను" అన్నాను.

"ఇన్నాళ్ళూ ఇక్కడెందుకుంటుంది – ఎవరో ఒకరు తీసేసుకుని ఉంటారు"

"నేనిక్కడ పోగొట్టుకున్నది నా బాల్యం, పూర్తిగా బాల్యం కూడా కాదు – నా కౌమారం – అంటే నా టీన్స్" అన్నాను నేను.

"నేనిప్పుడు టీన్స్‌లో వున్నాను. అలానే ఇక్కడ చాలామంది ఉన్నారు. మాలో ఎవరికి దొరికిందో మీరు పోగొట్టుకున్న బాల్యమో, కౌమారమో" అంది.

ఆ అమ్మాయి మామూలుగా అన్న ఆ మాటలు నన్ను బలంగా తాకాయి. అందులో అంతర్లీనంగా నాకు వేదాంతం వినిపించింది.

రస్కిన్ బాండ్ కథ గుర్తుకొచ్చింది.

చిన్నప్పుడు కొందరు స్నేహితులు ఒక నీటి గుంట దగ్గర ఆడుకుంటూ వుంటారు. పెద్దయ్యాక అదే గుంట దగ్గర వాళ్ళకి ఇంకెవరో చిన్న పిల్లలు ఆడుకుంటూ కనిపిస్తారు.

ఓ మనిషి ఓ దశని పోగొట్టుకుంటే – ఇంకెవరో ఆ దశలోకి వస్తారు – రావాలి.

ఎంత లోతైన జీవిత సారాన్ని ఎంత అమాయకంగా చెప్పింది ఆ అమ్మాయి.

"రండి మా ఇంటికి వెళ్దాం" అంది.

ఎందుకు అని అడక్కుండా బయల్దేరాను.

వాళ్ళింటికి వెళ్ళడానికి ఆటో ఎక్కాం.

పక్కపక్కన కూచున్నాం. అలా కూచుందుకు ఆ అమ్మాయి ఏమీ సంకోచపడలేదు. కుదుపులకి ఒకరికి ఒకరం తగిలినప్పుడు కూడా ఆ అమ్మాయికి ఏమీ



అనిపించలేదు.

బాల్యం...అమాయకత్వం... నమ్మకం... నాలోపోయినవి ఆ అమ్మాయిలో పోలేదు.

గూళ్ళలా ఉన్న ఫ్లాట్స్ దగ్గర ఆ అమ్మాయి ఆటో ఆపించింది. వాళ్ళ ఫ్లాట్ పొందికగా బావుంది. లోపలికి వెళ్ళి సోఫాలో కూచున్నాను. లోపల్నుండి సుందర్ వచ్చాడు. ఆశ్చర్యపోయాను.

"నేను రాలేకపోయాను. అందుకే అమ్మాయిని పంపాను" అన్నాడు సుందర్.

"అంకుల్‌కి నేనెవరో తెలియదు. సర్ప్రైజ్ చేద్దామని వివరాలేవీ చెప్పకుండా మనింటికి తీసుకుని వచ్చాను" అంది ఆ అమ్మాయి.

సుందర్‌కి కాస్త జుట్టు నెరిసింది. గోల్డ్‌రిమ్ కళ్ళద్దాలతో, కాస్త వయస్సు వచ్చినట్లుగా కనిపిస్తున్నాడు కానీ బాగా హుందాగా వున్నాడు.

నా పక్కనే కూచుని, నా చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. అంతకు ముందులా కాదు.

అప్పుడు ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ చాలా సరదాగా దూకుడుగా వుండేవాడు.

"ఎలాగుంది బీచ్?" అని అడిగాడు.

"అక్కడ కూచుంటే ఏదో విలువయినది పోగొట్టుకున్నట్లు అనిపించింది. నా జీవితంలో ఇంత వరకూ ఎప్పుడూ అలా అనిపించలేదు. నువ్వు అప్పుడప్పుడు వెళ్తూ వుంటావు కదా – నీకలా ఎప్పుడైనా అనిపించిందా?" అని అడిగాను నేను.

"జీవితమే అంత కదా – ఏదో పోతుంది – ఇంకేదో వస్తుంది. ఓ దశ నుండి ఇంకో దశకి ఎదుగుతూ ఉంటాం" అన్నాడు సుందర్.

"అందులో ఉన్న అందం, ఆనందం..." అంటూ నేను ఏమనాలో తెలియక ఆగిపోయాను.

"అవును. అవి పోయాయి. అయితే వేరేవి వచ్చాయి" అన్నాడు సుందర్.

"వచ్చాయా? ఏం వచ్చాయి?"

"మనం టీనేజ్‌లో జీవితాన్ని ఒకలా గడిపాం. ఆ అనుభవాలు అప్పుడు అందంగా కనిపించీ ఆనందాన్నిచ్చాయి. ఇపుడు వయస్సు పెరిగింది. వాటిని తియ్యని జ్ఞాపకాల్లా మనసు పొరల్లో ఉంచుకోవాలి కానీ – మళ్ళీ అవే కావాలనుకుంటే ఎలా?

చిన్నప్పుడు పిల్లలు బొమ్మలతో ఆడుకునీ, చాక్లెట్లు తినీ ఆనందిస్తారు. పెద్దయిన తర్వాత కూడా అంతేనా? మనం మారుతాం. ఆనందపడే విషయాలు కాలానుగుణంగా మారుతాయి"

"ఇప్పుడు నువ్వు ఆనందపడే విషయాలు ఏమున్నాయి?" అని అడిగాను.

"అబ్బాయిని చెస్ క్లాస్‌కి తీసుకెళ్ళడం – అమ్మాయికి లెక్కలు నేర్పించడం, శ్రీమతికి వంటింట్లో సాయం చెయ్యడం, కుటుంబంతో బీచ్‌కి వెళ్ళడం..." అంటూ చెప్పడం ఆపాడు సుందర్.

ఒక్క నిముషం వాడు జోక్ చేస్తున్నాడేమో అని చూశాను. కాదు. వాడు సీరియస్‌గానే చెప్తున్నాడు.

"చెల్లికి మంచి వరుడ్ని చూసి పెళ్ళి చెయ్యడం, అమ్మని ఆసుపత్రికి తీసుకువెళ్ళడం, నీకు తెలియదు రాజా – ఆనందం స్వేచ్ఛలోనే ఉందనుకుంటాం. అయిదే అది బంధంలోనూ వుంటుంది. ఏ బాధ్యతా తీసుకోకుండా జీవితాన్ని విలాసంగా గడిపెయ్యడంలో ఆనందం ఎంత వుందో తెలియదు కానీ బాధ్యతలో మాత్రం చాలా ఆనందం ఉంది."

"బాధ్యతలో ఆనందమా?"

"నన్నడిగితే ఓ వయస్సొచ్చాక బాధ్యతలోనే ఆనందం ఉంటుంది. టీనేజ్‌లో జల్సాగా ఉండడంలో ఆనందం వుంది. అప్పుడు అది అనుభవించాం. ఇప్పుడు ఇందులో ఆనందం అనుభవిస్తున్నాం. అనుభవించాలి కూడా" అన్నాడు సుందర్.

ఓ వయస్సు వచ్చాక బాధ్యత తీసుకోవడంలోనే అందం, ఆనందం ఉంటాయని వాడు చెప్పినమాటలు నాకు సూటిగా తగిలాయి. ఇందాక – నేను పోగొట్టుకున్న బాల్యం తనలాంటి వాళ్ళకి దొరికి ఉంటుందని ఆ అమ్మాయి అన్న మాటల కన్నా బలంగా గుండెలో నాటుకున్నాయి.

"మీ గురించి ఆయన ఎప్పుడూ చెబుతూ వుంటారు కానీ మిమ్మల్ని కలవడం ఇదే మొదటిసారి. ఎలా వున్నారు అన్నయ్యగారూ కులాసాగా ఉన్నారా" అంటూ సుందర్ శ్రీమతి వస్తోంటే – మియామీ బీచ్ ఒడ్డునా, పేరిస్ నైట్‌క్లబ్బులో – ఎక్కడా కనిపించని – ఓ నిండుతనం, ఓ సంపూర్ణత్వం కదిలి వస్తున్నట్లు అనిపించింది నాకు.



E:\Seelamma\
Seelama1
85

స్వాతి – 1988

# ముహూర్తం

నలభైయేళ్ళ క్రితం సంఘటన. అప్పటికి వెంకట్రామయ్య పెంకుటిల్లు ఇంకా మేడవలేదు. ఊరికింకా కరెంటు రాలేదు. ఊరికి ఒక మైలు దూరంలో ఉన్న తారు రోడ్డు మీద నుండి ఊళ్ళోకి మట్టిరోడ్డు కూడా లేదు.

రెండు పిల్లకాలువల మధ్యనున్న గట్టు మీద నుండి అరటి తోటలోకి అడ్డం పడి వెళ్తే రోడ్డు మీద బస్సు లాగే చోటికి చేరచ్చు.

బండి సుబ్బన్న ఆ దారినే జాగ్రత్తగా బండిని తోలుకుంటూ కమలని బస్సులాగే చోటుకి తీసుకొచ్చాడు.

ఆ రోజు బాగా ముసురుపట్టింది.

గట్టిగా గాలి కూడా వీస్తోంది.

అయినా సీతారామశాస్త్రి పెట్టిన ముహూర్తం మీద గురికొద్దీ ఆ రోజే కోడల్ని ప్రయాణం కట్టించాడు వెంకట్రామయ్య.

కానుపుకి పంపడానికి ఆ రోజు దివ్యమైన ముహూర్తం అన్నాడు సీతారామశాస్త్రి.

దట్టమైన మబ్బునూ, విపరీతమైన గాలినీ చూసి ప్రయాణం మర్నాటికి మారిస్తే బాగుంటుందేమోనని అందామనుకున్నా

తండ్రితో ఆ మాట అని ప్రయోజనం లేదని ఊరుకున్నాడు రాఘవరావు.

కమలకి ఆ ఆలోచన వచ్చినా మావగారితో అనడానికి భయం.

ఆ భయమే అణుకువగా కనిపించేది వెంకట్రామయ్యకి.

అదే ఎంతో గర్వంగా అనిపించేది కూడా.

చేతిలో పొన్నుకర్రా, చెంపల నిండా బుర్రమీసాలూ, వందెకరాల పొలం, నోరెత్తని కొడుకు, అణుకువగా ఉండే కోడలు – ఇవన్నీ వెంకట్రామయ్య గర్వంగా చూసుకునే ఆస్తులు.

కమల నిజంగా గర్వంగా చూసుకోదగ్గ ఆస్తి.

కమల చాలా బావుంటుంది అంటే సరిపోదు.

కమల శరీరపు రంగు ముందు పాలరాయి కూడా పాలిపోయినట్లుంటుంది.

ఆ రంగు అంతకు ముందు ఎవ్వరూ చూసుండరు.
దేవుడు కమల కోసమే ఆ రంగుని ఇన్నాళ్ళూ దాచుకున్నాడేమో అనిపిస్తుంది – ఆ తెలుపు, గులాబీరంగు కలయికని చూస్తే.
కమల శరీరంలో ఏ భాగానికి ఎక్కువ తక్కువలు లేవు.
అందంగా ఉండే కళ్ళు, ముక్కు, పెదవులు, జుట్టూ –
అన్నింటినీ ఎంతో శ్రద్ధతో అందంగా మలిస్తే కమలవుతుంది.
అందుకే వెంకట్రామయ్యకి కమల కోడలయిందని మరీ గర్వం.
వెంకట్రామయ్యా, రాఘవరావు ముందుగా నడుచుకుంటూ వెళ్ళారు బస్సులాగే చోటకి.
బస్సులాగాల్సిన చోటికి పక్కనే పెద్దపాకలో చిన్న హోటలుంది.
అదొక్కటే అక్కడ ఇల్లు అయినా, పాకయినా.
వెంకట్రామయ్యా, కొడుకూ పాకలో కూర్చున్నారు.
కాస్సేపటికి –
బండిని అక్కడున్న చెట్టు కింద ఆపి తాము వచ్చామని చెప్పడానికన్నట్టు హోటల్ గుమ్మం దగ్గరకెళ్ళి నిలబడ్డాడు సుబ్బన్న.
రాఘవరావు తండ్రి చూడకుండా బయటికి తొంగిచూశాడు.
చెట్టు కింద బండిలో కూర్చునుంది కమల.
వాన కురిసినా పూర్తిగా తడవదనుకున్నాడు రాఘవరావు.
బస్సు కోసం చూస్తున్నారు నలుగురూ –
అలాచూస్తూండగానే –
చినుకులు మొదలయ్యాయి.
జల్లు పెద్దదయింది.
కుంభవృష్టిగా తయారయింది.
గాలి బాగా పెరిగింది.
వానలో తడవకుండా గుమ్మంలోకి తప్పుకున్నాడు సుబ్బన్న.
గాలికి వానజల్లు బండిలోకి వచ్చేస్తోంది.
తడిసిపోయిన కమలకి చలి బాగా ఎక్కువయింది.
ఎంత ముడుచుకుకూర్చున్నా వణుకుతూనే ఉంది.
బస్సు వచ్చేస్తే బాగుండుననిపించింది.
అలా కాకపోయినా, తన్ని కూడా పాకలోకి పిలిస్తే బాగుండుననుకుంది.





లోపల కూర్చున్న రాఘవరావుకి ఇబ్బందిగా ఉంది.
వానలో కమల తడుస్తోందని తెలుసతనికి.
కమలని లోపలికి రమ్మంటే తండ్రి ఏమనుకుంటాడోనని భయం.
కమలకి చలి తగ్గడం లేదు. లేచి లోపలికి వెళ్దామంటే మావగారున్నారు లోపల. ఆయన ఏమంటారోనన్న ఆలోచన.
వెంకట్రామయ్య మనస్సులోకి కమల బండిలో తడుస్తోందన్న ఆలోచన వచ్చిందో, లేదో తెలియదు.
వచ్చినా తన కోడలు పాక హోటల్లోకి రావడమేంటని ఊరుకున్నాడేమో.
విడవకుండా వాన.
ప్రళయకాల పర్జన్య గర్జనల్లా ఉరుములు.
విలయకాలోద్భవిత బడబాగ్ని కీలల్లా మెరుపులు.
గాలి వీస్తూనే ఉంది.
నిలువెత్తు తాడి చెట్లు సగం దాకా వంగి లేస్తున్నాయి.
కొమ్మలు ఊగుతూనే ఉన్నాయి.
సుబ్బన్న బండినీ, ఎద్దునూ చూస్తున్నాడు.
రాఘవరావు దొంగతనంగా కమలని చూస్తున్నాడు.
వెంకట్రామయ్య ముమూర్తం దాటిపోతుందేమోనని చూస్తున్నాడు.
సరిగ్గా అప్పుడే–
బండి పక్కనున్న చెట్టు కొమ్మ విరిగి బండి మీద పడింది.
ఆ ఊపుకి బండి చక్రాలు విరిగాయి.
ఎద్దు ఒక్క ఉదుటున పైకి లేచి పక్కకి వాలింది.
కొమ్మ కింద బండిలో కమల.
శరీరమంతా బండిలో తల మాత్రం బయటకి.
ముగ్గురూ పరిగెత్తారు.
సుబ్బన్న కొమ్మని తొయ్యబోయాడు. అది కదల్లేదు.
రాఘవరావు చెయ్యి వేశాడు. వెంకట్రామయ్య సాయం చేశాడు.
కొమ్మ కదల్లేదు.
బాధతో కమల అరుస్తోంది.
కమల మొహం చూడలేకపోతున్నారు ముగ్గురూ.
కొమ్మ ఎత్తడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఆ బరువుని ఎత్తేస్తే బతుకుతానని ఏడ్చింది కమల.

ఏడుస్తూండిపోయింది కమల.

ఏడుస్తూనే పోయింది కమల.

*(ఈ కథ నలభై యేళ్ళ క్రితం నిజంగా జరిగిందట. అయితే కమల ఎత్తమన్న బరువు – చెట్టు కొమ్మదా, ముహూర్తం మీద గురిదా, గొప్పింటి ఆడవాళ్ళు పాకహోటల్లోకి రాకూడదన్న భావానిదా – అన్న విషయం నాకింకా అర్థం కాలేదు*

E:\Seelamma\
Seelama1
87





# యజ్ఞం

**నే**ను ఉద్యోగంచేస్తాననగానే మా ఆయన సరేననడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

నా ఉద్యోగ ప్రయత్నంలో ఆయన నాకు సహకరిస్తూంటే, నేను పొంగిపోయాను.

భార్యకి ఉద్యోగం చేసుకునే స్వేచ్ఛ ఉందని గుర్తించిన ఆయన్ని భర్తగా పొందినందుకు నేను గర్వపడ్డాను. నా మొదటి నెల జీతం అందుకున్న రోజున ఆనందం పట్టలేక, ఆ జీతాన్ని అలాగే తీసుకువెళ్ళి ఆయన చేతుల్లో పెట్టేసినప్పుడు, "మైత్రీయీ, ఇది నీ సంపాదన. నీ ఖర్చుల కోసం వాడుకో. నీకు నచ్చిన చీరలూ, నగలూ కొనుక్కో. రేపే నీ పేరున బేంక్ అకౌంట్ తెరిచి, అందులో ఈ డబ్బు వేసేద్దాం" అని అన్న ఆయన్ని దైవంగా ఆరాధించడం మొదలెట్టాను.

నేను ఆఫీసుకి వెళ్తున్న కొత్తలో ఆయన నాకు ఇంటి పనుల్లో కొంత సాయం చేస్తాననేవారు.

"మీకెందుకు శ్రమ? ఈ పనులు నాకు కొత్తా కావు, కష్టమూ కావు" అని ఆయన్ని ఆ పనుల నుండి తప్పించేసి, నేనే చేసుకుంటోంటే చాలా నొచ్చుకున్నట్లు – "ఉద్యోగంచేస్తూ బాగా శ్రమపడుతున్నావు మైత్రేయీ" అని అన్నారాయన.

"చెయ్యగలిగినన్నాళ్ళూ చేస్తాను. చెయ్యలేని రోజున మానేస్తాను" అన్న నా సమాధానానికి బదులుగా "నువ్వు ఉద్యోగం మానెయ్యద్దు మైత్రేయీ, బాగా చదువుకున్నావు. చదివిన చదువు వృథా అయిపోతుందని బాధపడాల్సి వస్తుంది. అలా రాకుండా ఉండడం కోసమైనా ఉద్యోగం చెయ్యి అని చెప్పిన ఆయన మాటలు నాకు పన్నీటి జల్లుల్లా, అమృతపు చినుకుల్లా అనిపించాయి.

ఇరవై నాలుగేళ్ళు నన్ను పెంచి పెద్ద చేసిన అమ్మానాన్నలకు దూరంగా వచ్చేస్తున్నప్పుడు నాకు బాధా, భయం కలిగాయి.

ఇంకో నగరంలోనో, దేశంలోనో మంచి ఉద్యోగం సంపాదించుకున్న పిల్లాడు తల్లి తండ్రులని వదిలి వెళ్ళడానికి ఎలా ఫీలవుతాడో నాకు తెలియదు. ఆడపిల్లగా పుట్టిన నాకు అది తెలిసే అవకాశం లేదు.

పెళ్ళయి, పుట్టింటి నుండి వెళ్ళిపోతున్న అమ్మాయి మాత్రం చాలా మథనపడుతుందని నేను ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకున్నాను. తనవాళ్ళను వదిలి, ఇంకోకరితో జీవితం గడపడానికి వెళ్లడం అంత సులభం కాదు.

ఆడది అలా చేస్తుండకపోతే, ఇన్ని తరాలుగా సమాజం ఇలా నడిచి ఉండేది కాదు.

నేను ఆడదాన్ని. పుట్టినింటిని వదిలి భర్త ఇంటికి వచ్చిన దాన్ని. భర్త ఇంటిలోనే ఉండాల్సినదాన్ని. ఆయనకు వంశోద్ధారకుల్ని అందించవలసిన దాన్ని.

ఈ సంగతులన్నీ నాకు తెలుసు. ఈ జ్ఞానాన్ని నా చుట్టూ ఉన్న సమాజం నాకు ఇన్నేళ్ళూ అనుక్షణం నేర్పుతూనే ఉంది. ఈ భావాలను నాలో భాగంగా చేసేసుకున్నాను. అలాంటి నాకు అన్ని విధాలా సహకరించే భర్త దొరకడం నా అదృష్టం అనుకున్నాను.

పెళ్ళయిన కొన్నాళ్ళకు "అమ్మానాన్నలని చూడాలని ఉంది. వెళ్ళివద్దామా?" అని నేనడిగితే – "నువ్వెళ్ళిరా" అని నన్ను పంపించారు. పంపిస్తూ "అమ్మానాన్నల్ని చూసిన ఆనందంలో నన్ను మరిచిపోక, తొందరగా రా" అని ఆయన అన్నందుకు, అమ్మ ఇంకో రెండు రోజులు ఉండమని బలవంత పెట్టినా, ఆయనకు భోజనం కుదరదని చెప్పి వచ్చేశాను.

ఆ తర్వాత కొన్నాళ్ళకు అమ్మ నన్ను చూడాలనుందని ఉత్తరం రాసింది.

"అమ్మ రమ్మంటోంది వెళ్ళనా?" అని ఆయన్ని అడిగాను.

"మొన్ననేగా వెళ్ళావు" అని అన్నారాయన.

"అమ్మా నాన్నలకి ఎవరున్నారు నేను తప్ప అన్నాను. ఇంకో నెలాగి సంక్రాంతికి వస్తానని రాయలేవా మైత్రేయీ" అని నన్ను ఆయన కోరితే, ఆయన కోరికను కాదనలేకపోయాను.

సంక్రాంతికి వారం రోజులు ముందు, నన్ను తీసుకురమ్మని అమ్మ ఆయనకి నాన్న చేత ఉత్తరం రాయించింది.

"వెళ్తావా?" అని అడిగారాయన.

"మీరు రారా?" అని అడిగాను నేను.

"నేను వస్తే అల్లుడి మర్యాదలు చెయ్యాలని శ్రమపడి పోతారు వాళ్ళు. మావగారు రిటైరైపోయారు. ఆయనకి వచ్చే పెన్షన్ డబ్బుతో కాలం గడిపేస్తున్నారు వాళ్ళు. నేను రావడం వాళ్లకి ఇబ్బంది."

"అయిన వాళ్ళు వస్తే ఎవ్వరూ ఇబ్బంది అనుకోరు."

"నువ్విలా చిన్నబుచ్చుకోకు మైత్రేయీ. వాళ్లకి డబ్బు ఇబ్బంది ఉన్నమాట నిజం.





అంతేగాక అక్కడికి వచ్చి ఉండడం నాకూ కష్టమే. అక్కడ ఇల్లు ఇరుకు. సదుపాయాలు సరిగ్గా ఉండవు. నీకైతే. మీ అమ్మానాన్నల దగ్గరకి వెళ్ళడం కాబట్టి బానే ఉంటుంది."

"మీ ఇష్టం" అని నేనొక్కదాన్నీ ఊరెళ్ళాను.

ఆయన అమ్మా నాన్నల ఆర్థిక పరిస్థితి గురించి మాట్లాడేవరకు, నేను ఎక్కువగా ఆలోచించలేదు. ఉద్యోగం కూడా నేను డబ్బు కోసం చెయ్యడం మొదలెట్టలేదు.

ఉద్యోగం చెయ్యకుండా ఇళ్లకి అంకితమైపోతున్న స్త్రీలు, తమ చుట్టూ వున్న ప్రపంచాన్ని పూర్తిగా అవగాహన చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని అనిపించడం వల్లా –

అమ్మా, అమ్మమ్మా తరాల స్త్రీలు చదువు ఉద్యోగం లేక ఇంట్లోనూ, బయటా తమ కంటూ ఓ స్థిరమైన ఉనికిని సంపాదించుకోలేకపోయారని ఆలోచించడం వల్లా నేను ఉద్యోగంలో చేరాను.

అమ్మ ఉద్యోగం చెయ్యలేదు. నాన్న జీతం నెల సరి ఖర్చులకు సరిపోయుంటుంది. నన్ను చదివించడం వాళ్ళకు తలకు మించిన భారం అయ్యుంటుంది. ఒక్క కూతురినే అవడం వల్ల, ఆ భారాన్ని మోసి ఉంటారు వాళ్ళు.

నాన్నకి వచ్చిన ప్రావిడెంట్ ఫండ్ డబ్బు నా పెళ్లికి ఖర్చయిపోతుందని నాకు బాగా తెలుసు.

"కట్నం ఇస్తున్నావా నాన్నా" అని అడిగితే "ఎవరికోసం తల్లీ కట్నం ఇస్తున్నది. నీ సుఖం కోసం కాదూ?" ఇస్తున్నది ఎవరికో కాదుగా, నిన్ను జీవితాంతం చూసుకోబోయే నీ భర్తకేగా" అని నన్ను మాట్లాడనీయకుండా చేసేసి, తన ప్రావిడెంట్ ఫండ్‌లో చాలా భాగం కట్నంగా ఇచ్చేశారు నాన్న.

ఆ డబ్బులో చాలా భాగం మగపెళ్ళివారి పెళ్ళి ఖర్చులకైపోతే, మిగిలిన కొంత, మా యిద్దరి పేరునా బేంక్‌లో ఉంది.

వస్తున్న పెన్షన్ డబ్బు చాలకనేమో కొందరు పిల్లలకు ట్యూషన్లు చెప్తున్నారు నాన్న. డబ్బు కోసం అమ్మానాన్నా అవస్థ పడుతున్నారని, వాళ్ళు చెప్పకపోయినా అర్థమైంది నాకు.

ఇంటికి తిరిగి వచ్చాక అదే మాట అన్నాను ఆయనతో. "వాళ్ళు నిరాడంబర జీవులు మైత్రేయీ. వాళ్ళకి కోరికలు లేవు. డబ్బు మీద అనవసరమైన యావ లేదు. వాళ్ళ జీవితం అలా హాయిగా గడిపెయ్యనియ్యి" అని ఆ విషయం గురించి నేను మళ్ళీ మాట్లాడకుండా చేసేశారాయన.

అయినా ఆ ఆలోచన నన్ను వదలలేదు.

నేను ఉద్యోగం చెయ్యడం మొదలుపెట్టినప్పట్నుంచీ, నా సంపాదనలో కొంత డబ్బుని అమ్మానాన్నలకి పంపించాలన్న కోరిక కలగసాగింది నాలో.

ఆయన నెలా నెలా వాళ్ళమ్మ నాన్నాలకి కొంత డబ్బు పంపుతారు. నేను నా జీతంలోంచి కొంత డబ్బును మా అమ్మానాన్నలకు పంపిద్దామనుకున్నాను. ఆ విషయం ఆయనతో ఎలా ప్రస్తావించాలో తెలియలేదు. అసలెందుకు ప్రస్తావించాలన్న ప్రశ్న ఒక పక్క వున్నా ఆయనతో చెప్పకుండా డబ్బు పంపించలేకపోయాను.

ఆయనకి చెప్పకుండా పంపిస్తే ఏం అంటారో, అనుకుంటారోనని నాకు భయం. చెప్తే వద్దంటారేమోనని కూడా భయం. అంత వరకూ ఆయన ఏ విషయంలోనూ నన్నేమీ అనలేదు. అనేందుకు అవకాశం ఇవ్వలేదు. ఈ విషయంలో ఏమంటారో తెలియదు. ఉద్యోగం చేస్తున్నది నేను. నేను సంపాదిస్తున్నానన్న మాటే కానీ, నా డబ్బు మీద నాకేమీ అధికారం కలగలేదు. ఆయన ఆ అధికారాన్ని ఇచ్చినట్లు చూపించారు కానీ, నాకు ఆ అధికారం దక్కలేదు. అధికారం ఒకరు ఇస్తే వచ్చేది కాదు. అదిఎవరికి వారు పుచ్చుకోవాల్సిందేనని తెలిసి కూడా నేను ఆ అధికారాన్ని పొందలేకపోయాను.

అంతేకాదు. మొదట్లో ఆయన ఇంటి పనుల్లో సాయం చేస్తానన్నా వద్దన్న నేను. తర్వాత ఎప్పుడైనా ఏదైనా అవసరానికి, ఆయన సాయం కోరితే ఆయన విసుక్కుంటూ ఆ సాయం చేసేవారు. ఆయన విసుక్కుంటారని తెలిసి నేను అడగడం మానేశాను.

నా ఉద్యోగం వల్ల నాకు నా సంపాదనని ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టడం కుదరలేదు కానీ, ఇంటా బయటా పని పెరిగింది.

నా తోడి ఉద్యోగినులతో మాట్లాడుతున్నప్పుడు వాళ్ళు కూడా నేను పడుతున్న కష్టం పడుతున్నట్లు తెలిసింది.

ఆ సమయంలోనే ఆయన చెల్లెలి పెళ్ళి కోసం అప్పు చెయ్యాల్సి వచ్చింది. ఆ అప్పు తీర్చడానికి నెలనెలా కొంత డబ్బు నా జీతంలోది అవసరమైంది.

“ఏం చేస్తాం మైత్రేయీ, నన్ను కని పెంచి పెద్ద చేసిన వాళ్ల ఋణం నేను తీర్చుకోవద్దూ? వాళ్లకి మాత్రం సాయం చేసేవాళ్ళెవరున్నారు నేను తప్ప? కొన్నాళ్ళు కష్టపడితే ఈ అప్పు తీరిపోతుంది. అప్పుడు నీజీతం అంతా బేంక్‌లోనే వేద్దాం. అయినా అందులోంచి నువ్వేం ఖర్చు చెయ్యడం లేదుగా ఎప్పుడో మన పిల్లల చదువులకోసమో, పెళ్ళిళ్ళ కోసమో, కట్టుకుంటే, ఇల్లు కట్టుకోవడంకోసమేగా మనం ఆ డబ్బుని ఉపయోగించేది” అని అన్నారాయన.

ఆ డబ్బు అవసరం మా అమ్మానాన్నలకి కూడా ఉందన్నది ఆయన దృష్టిలోనే



E:\Seelamma\
Seelama1
89

లేదు. ఆ మాటే ఆయనతో చెప్దామనుకున్నాను. నేను నెలనెలా కొంత సొమ్ము అమ్మానాన్నలకి పంపిస్తానని అందామనుకున్నాను. “నేను మావాళ్ళకి పంపిస్తున్నాను కాబట్టి నువ్వూ మీ వాళ్లకి పంపిస్తానంటున్నావు” అని అంటారనిపించింది. అదీ కాక ఆయన తన చెల్లెలి పెళ్ళికి చేసిన అప్పు భారాన్ని మోస్తున్న సమయంలోనే మరి కొంత భారాన్ని ఆయన నెత్తిన పెట్టడం బావుండదనిపించింది. అందుకే అప్పుడు ఏమీ అనలేదు.

అప్పుడే కాదు. ఆ తరువాత ఎప్పుడూ కూడా నేను నా డబ్బుని నా వాళ్ళ కోసం ఖర్చు పెట్టడం గురించి మాట్లాడలేకపోయాను. అసలది నా డబ్బుగా మిగలలేదు. మా ఇద్దరిదీ అయిపోయింది. అలా అయ్యాక అది ఇంటి ఖర్చుల్లో కలిసిపోయింది. ఆయన అమ్మానాన్నల అవసరాలకీ, చెల్లెలి అవసరాలకీ వెళ్లిపోయింది.

అమ్మానాన్నలని చూడడానికి వెళ్ళిన ప్రతీసారి, తిరిగి వెళ్ళగానే ఆయనతో పోట్లాడి అయినా వాళ్లకి కొంత డబ్బు పంపించాలనుకునేదాన్ని. తిరిగి వచ్చాక ఆ విషయం ప్రస్తావించగలిగేదాన్ని కాదు.

కొన్నాళ్ళకి డబ్బు ఇవ్వలేకపోతున్నందుకు కాదు. ఇస్తానని ఆయనకి చెప్పలేకపోతున్నందుకు బాధ కలిగింది. ఎందుకు చెప్పలేకపోతున్నానో, చెప్పలేకపోతున్నందుకు నన్ను నేను తిట్టుకునేదాన్ని. ఎన్నోసార్లు ఏం చెప్పాలో ఎలా చెప్పాలోనని మనస్సులో చెప్పుకు చూసుకునేదాన్ని.

అలా చెప్పలేకపోవడానికి కారణం ఆలోచించాను. నా స్నేహితురాళ్ళు కొందరితో దీని గురించి ముచ్చటించాను. అందులో కొందరు ఉద్యోగం చేస్తున్న వాళ్ళు, కొందరు చెయ్యని వాళ్ళు అందరూ నా పరిస్థితిలోనే వున్నారు. ఎవ్వరికీ ఆర్థికస్వాతంత్ర్యం లేదు.

ఉద్యోగం చేస్తున్న వాళ్లకీ, చెయ్యని వాళ్ళకీ కూరలో, ఇంటికి కావల్సిన సరుకులో కొనడానికి స్వేచ్ఛ ఉంది. ఒక పెద్ద ఖర్చు చెయ్యడానికి – అదీ అ ఖర్చు తన కుటుంబ సభ్యుల కోసం అయినప్పుడు – నా స్నేహితురాళ్ళలో ఒక్కరు కూడా స్వయంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. వాళ్ళ భర్తలు తమ సొంత సంపాదనని కాక తన భార్యల సంపాదననైనా వాళ్ళకి చెప్పకుండా ఖర్చు చెయ్యడానికి వెనుకాడ్డం లేదు.

ఈ పరిస్థితి కష్టంగా అనిపించింది నాకు. ఉద్యోగం చేస్తే స్త్రీలకి ఆర్థికస్వాతంత్ర్యం వస్తుందనీ అందులోంచి భర్తతో సమానమైన హోదా వస్తుందనీ నేను చదివింది నిజం కాదేమోననిపించింది.

నేను ఆరు నెలల గర్భవతిగా వున్నప్పుడు పురుడు ఈ ఊళ్ళోనే పోసుకుంటానని అన్నప్పుడు "అదేంటి మైత్రేయీ అలా అంటావు? నువ్వు ఒక్కదానివే ఏం చేసుకుంటావు? అత్తగారు నీకు కావల్సింది చేసిపెడతారు. హాయిగా మీ ఊరెళ్ళి పురుడు పోసుకో. తొలికానుపుకి నువ్వు పుట్టింటికి రాకపోతే మీ అమ్మగారు మాత్రం ఊరుకుంటారా?" అని నన్ను లాలించి పుట్టింటికి పంపించేశారు.

పెళ్ళయిన కొత్తలో ఇలాంటి మాటలు అర్థం కాక, ఆనందించేదాన్ని. కొన్నాళ్ళ వివాహజీవితం తర్వాత, భర్తలు ఏ సమయాల్లో భార్యలతో ఏం మాట్లాడుతారో అర్థం చేసుకున్నాక ఇలాంటి లాలింపు మాటల గూఢార్థం బోధపడింది.

కానుపు ఖర్చుతోనూ, శ్రమతోను కూడుకున్న పని. అది అమ్మానాన్నల దగ్గర అయిపోతే పుట్టిన పిల్లనో, పిల్లాడినో తెచ్చుకుని హాయిగా ఆడుకోవచ్చు ఆయన.

అమ్మ దగ్గరకి వెళ్ళడం వారి కిష్టంలేని పని కాదు. ఇలా వెళ్ళడం నాకిష్టం లేదు. పైకి ఏమీ అనకుండా పుట్టింటికి బయలుదేరాను. నేనేమీ అనకపోవడం వల్లనే ఆయనకి నన్నేమీ అనాల్సిన అవసరం రాలేదు. నేను భార్యగా నా పాత్రను పోషిస్తున్నంత కాలం ఆయన మంచి మనిషిగా ఉండగలిగారు.

పురుడయ్యాక, మూడునెలల పిల్లనీ, నన్నూ తీసుకెళ్ళడానికి వచ్చారు ఆయన. ఆయనతో చెప్పి అమ్మా నాన్నల్ని తీసుకువెళ్దామనుకున్నాను నేను. నలుగురం కూర్చుని ఉండగా "నేను ఒక్కదాన్నీ చేసుకోలేను అమ్మా – కొన్నాళ్ళు నువ్వు వచ్చి సాయం చెయ్యాలి" అని అన్నాను.

వెంటనే ఆయన "మనకోసం కాకపోయినా, మనవరాలి కోసం అయినా వస్తారావిడ. మావగారే కొన్నాళ్ళు ఒంటరిగా ఇక్కడ ఇబ్బంది పడాలి" అని అన్నారు.

"ఈ వయస్సులో నేను శ్రమ పడే బదులు, మీరే ఆ శ్రమేదో పడండి" అని నాన్న అనలేదు.

'నాన్నని కూడా తీసుకువెళ్దాం' అని నేనూ అనలేదు. ఆయన ఏదన్నా అంటే కాదనడం నాకు చేతకాదు. అలా అనడానికి నాకు భయం. ఆ భయం స్వరూపం నాకు అర్థం కాదు. అదెందుకో తెలియదు.

ఆడదిగా పుట్టినందుకు నా అభిప్రాయాలు నా భర్త దగ్గర చెప్పడానికి నేను జంకాల్సి వస్తోంది. గట్టిగా నా అభిప్రాయాన్ని చెప్పగలననే ధైర్యం లేదు నాలో. ఈ పిరికిమందుని నాకు నా చుట్టూ ఉన్న సమాజం చిన్నప్పటి నుండి పోస్తూనే ఉంది. ఆ మందు ప్రభావాన్ని నా చదువూ, నా ఉద్యోగం, నా సంపదనా, నా తెలివితేటలూ, నా అందం ఏవీ పోగొట్టలేకపోయాయి.



E:\Seelamma\
Seelama1
90

పిల్లతో తిరిగి వచ్చిన నాకు అమ్మ ఉన్నన్నాళ్ళు హాయిగా గడిచిపోయింది. ఆవిడ వెళ్ళాక ఉద్యోగానికి వెళ్ళి రావడం, ఇంటిపనులు చేసుకోవడం, పిల్లని చూసుకోడం కష్టమైపోయాయి. పిల్లకి అప్పుడప్పుడు ఆరోగ్యం బావుండకపోవడం, పనిమనిషి చాలాసార్లు మానేస్తుండడం, ఆఫీసులో తోటి ఉద్యోగినుల సమస్యలని తక్కిన ఉద్యోగులు అర్థంచేసుకోలేకపోవడం ఇవన్నీ నా కష్టాన్ని ఇంకా పెంచాయి. ఆయనకి తోచినప్పుడు ఆయన కొంత సాయం చేసేవారు. ఆ చేయడంలో "నీకు సాయం చేస్తున్నాను సుమా" అన్న ధోరణి బాగా కనిపించేది.

"మీ నాన్నగారు ఎపుడైనా మీ అమ్మగారికి ఇలాసాయం చేసి ఉంటారా?" అని అడిగేవారు.

మా అమ్మ ఉద్యోగం చెయ్యలేదు. ఆవిడ సంపాదన ఆయన ఖర్చు చెయ్యలేదు. ఆవిడకి ఇంటి చాకిరీ ఒక్కటే. నాకు ఆఫీసులోనూ, ఇంటిలోనూ చాకిరీ అని అందామనుకుని మానేసేదాన్ని.

ఆయన్ని ఏదన్నా అంటే, ఆయనా నన్నేదో అంటారు. మాటా మాటా పెరిగితే సుఖ శాంతులు ఉండవు. శాంతిలేని కాపురం కన్నా కొంత శ్రమ పడడమే నయం. కాస్త ఓర్పుతో సహించగలిగితే రోజులు వెళ్ళిపోతాయి.

ఇలాంటి వేదాంతం కర్మభూమిలో పుట్టిన అందరికీ ఎంతో కొంత అబ్బుతుంది. ఈ వేదాంత ధోరణిలోనే కొంత కాలం గడిచింది. పిల్ల స్కూలుకు వెళ్ళిరావడం మొదలైంది. ఖర్చులు బాగా పెరిగాయి.

ధరలుపెరిగే కొద్దీ, అమ్మా, నాన్నల ఇబ్బంది పెరిగింది. అమ్మకి ఒంట్లో బాలేదని పెద్ద డాక్టర్లకు చూపించడానికి తీసుకువచ్చారు నాన్న. డాక్టర్లకి చూపించాక – "ఆపరేషన్ చెయ్యాలన్నారు. పాతిక వేలవుతుందన్నారు. ఊరికి వెళ్ళి డబ్బు పోగు చేసి మళ్ళీ తీసుకువస్తాను" అన్నారు నాన్న.

"ఈ ఊళ్ళో డాక్టర్లందరూ అంతేనండీ మావగారూ డబ్బు మనుషులు. అక్కర్లేని వాటికి కూడా ఆపరేషన్లు చేస్తామంటారు. మీ ఊళ్ళో డాక్టర్లే నయం. రోగుల్ని కాస్త శ్రద్ధగా చూస్తారు. అక్కడ చూపించండి. తర్వాత చూద్దాం" అన్నారాయన. నాన్న అమ్మని తీసుకుని వెళ్ళిపోయారు. వాళ్ళు అలా వెళ్ళిపోవడం నాకు బాధగా అనిపించింది. నన్ను కనిపెంచిన వాళ్ళు, నా దగ్గర ఉండి వైద్యం చేయించుకుందామని వస్తే, నేను వాళ్ళకి ఏమీ సాయం చేయలేకపోతున్నానన్న బాధ నా గుండెల్ని కోసేసింది.

నాలో సహనం చచ్చింది.

"మా వాళ్ళని బలవంతంగా పంపించేశారు. పాపం అమ్మ ఆరోగ్యం ఏమీ

బాగాలేదు. అక్కడ ఏం వైద్యం చేయించుకుంటారు?" అని అడిగాను. "కన్న వాళ్ళ ఆరోగ్యం గురించి ఆలోచించడం సహజం మైత్రేయీ. వాళ్ళు అంత ఖరీదైన వైద్యాన్ని ఎలా భరించగలరు?" అని అడిగారు ఆయన.

"నేను ఇన్నాళ్ళు సంపాదించినదంతా ఏం చేసుకోను? నా నెత్తినేసి కొట్టుకోనా? అమ్మ అవసరానికి పనికిరాని ఈ సంపాదన ఎందుకు నాకు? అసలు నేనీ ఉద్యోగం చెయ్యగలుగుతున్నానంటే అందుకు కారణం వాళ్ళు నాకు చదువు చెప్పించడమే కదా" అని అన్నాను నేను.

"నీ సంపాదన అని మనం విడిగా ఏమీ దాచలేదు. అంతా ఖర్చయిపోయింది. అంతేగాదు. మనం ఇలా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసేస్తే, తరువాత మన అవసరాలకి ఏం మిగులుతుంది? పిల్ల చదువూ, పెళ్ళీ లేవూ?" అని అన్నారు.

"అదే మీ అమ్మకి అవసరం అయితే ఏం చేస్తారు?" అని అన్నాను.

"అనవసర ప్రసంగం చెయ్యకు. మా అమ్మ ఆరోగ్యంగా ఉంది. ఆవిడనలా ఉండనీ, నీ శని నోరు పెట్టకు" అన్నారాయన కోపంగా. నేను ఆయనకి నచ్చని విషయం ప్రస్తావించేసరికి ఆయన ఇన్నాళ్ళూ ధరించిన శాంతి ముసుగుని తీసేశారు. మగాడిగా అధికారంగల భర్తగా అవతారం ఎత్తారు. నేను ఇన్నాళ్ళు ఏం జరుగుతుందని భయపడి మాట్లాడకుండా ఉన్నానో, అదే జరిగింది. నేను అణకువ గల భార్యగా ఉన్నంతకాలం ఆయన మంచి మనిషి వేషం వేసుకున్నారు. నేను స్వేచ్ఛ కోరే స్త్రీగా మాట్లాడగానే, ఆయన అధికారం గల భర్తగా అయిపోయారు.

అంతవరకూ వచ్చాక, ఇంక ఆగలేక "నేను ఉద్యోగం చేసి సంపాదించుకున్న డబ్బు నాది. దాన్ని నా వాళ్ళకోసం ఖర్చుపెట్టుకునే హక్కు నాకు లేదా?" అని అడిగాను.

"మైత్రేయీ, హక్కుల గురించి మాట్లాడకు! నువ్వు వాళ్ళని చూసుకోవాలనుకుంటే, నువ్వు అక్కడికి వెళ్ళి చూసుకో, మొగుడన్నాక వాడి మీద కాస్త గౌరవం ఏడవాలి. నాకది లేదు. అదే లేకపోతే మనం ఇంక కలిసి ఉండడం కష్టం. ఎప్పుడు వెళ్ళాలనుకుంటే అపుడు వెళ్ళిపో, ఏ ట్రైనుకి టిక్కెట్టు కావాలోచెప్పు. కొని తీసుకు వస్తా, పిల్లకి టిక్కెట్టు అక్కర్లేదు" అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయారు.

నేను ఇన్నాళ్ళూ దేని గురించి భయపడ్డానో అర్థమైంది నాకు. ఆయన మాటని కాదంటే, నన్ను అమ్మా, నాన్నల దగ్గరకి పిల్లని తీసుకుని వెళ్ళిపొమ్మన్నారు. కాపురం నిలబెట్టుకోవాలంటే, నేను ఆయన మాట వినాలి.

కాపురం నిలబెట్టుకోవాలనే తాపత్రయం ఆయనకు లేదు. అవసరం నాది. నేనూ, నా పిల్ల వెళ్ళిపోయినా ఆయనకు పరవాలేదు. వెళ్ళిపోకుండా ఉండే బాధ్యత నాది.





పిల్ల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని నేను కాపురం వదులుకోలేను. విడాకులు పిల్లకి తండ్రిని లేకుండా చేస్తాయి. నాకు సమాజంలో భర్త అండ లేకుండా చేస్తాయి. అవి అమ్మా, నాన్నలకి ఇష్టమైనవి కావు.

నేను కాపురం వదులుకోలేను. అంటే నేను ఆయన దగ్గర ఆయనకు ఇష్టం వచ్చినట్లు ఉండాలి. నన్ను ఆయన దగ్గర ఉంచుకోవాల్సిన అవసరం ఆయనకు లేదు. ఉండాల్సిన అవసరం నాకుంది. ఆడదిగా నేను నా భర్తకి కావాలి – వ్యక్తిత్వం ఉన్న ఒక స్త్రీగా కాదు. నా సంపాదన కావాలి ఆయనకు. అది నా వాళ్ళకు దక్కకూడదు.

ఇది నా ఒక్కదాని సమస్యా కాదు. నాలా చాలామంది ఉన్నారు. చిన్నవీ, పెద్దవీ ఉద్యోగాలు చేస్తూ, ఇంటా, బయటా శ్రమపడుతూ, తమ సంపాదనల మీద తమకే అధికారం లేనివాళ్ళు.

ఇంత శ్రమపడుతూ నేనెందుకు ఉద్యోగం చెయ్యాలా అని ఆలోచించాను. నేనే కాదు, నాలాంటి చాలామంది ఆడవాళ్ళు నాలాగాకష్టపడుతూ, సంసారాలు గడవడానికి ఉద్యోగాలు చెయ్యక తప్పడంలేదు. అయితే నేను ఉద్యోగం చెయ్యడానికి అంతకన్న బలమైన కారణం ఒకటుంది.

రెండు మూడు తరాల ముందు ఉద్యోగాలే కాదు, చదువులు కూడా లేవు ఆడవాళ్ళకి. చదువుకోవాలనుకున్న అమ్మాయిలు ఎన్నో సమస్యలని ఎదుర్కొని, చదువుకున్నారు. అలా ఒకటి రెండు తరాల స్త్రీల శ్రమ ఫలితంగా, ఆడవాళ్ళకి చదువుకునే మార్గం ఏర్పడింది. స్త్రీకి విద్య అవసరం అన్న గుర్తింపు వచ్చింది. ఆడవాళ్ళు చదువుకోగలుగుతున్నారు. తల్లితండ్రులు అంతకు ముందు ఆడపిల్లలకి చదువు చెప్పించడం వృధా అనుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి చాలా వరకు మారింది. ఇంకా మారుతుంది.

ఉద్యోగాలూ అంతే. ఇప్పుడు ఉద్యోగం చేస్తున్న స్త్రీలు కష్టపడుతున్నారు. కొన్ని తరాలుగా తమలో పెరిగిన గుణాలని, పురుషులైనా, స్త్రీలైనా ఒక్కసారిగా వదిలించేసుకోలేరు. వాటిని వదిలించుకుందుకు కొంతకాలం పడుతుంది.

మగవాళ్ళందరూ చెడ్డవాళ్ళు కాదు. వాళ్ళకి స్త్రీలు శత్రువులు కారు. తల్లిదండ్రులు ఆడపిల్లలని మగపిల్లలతో సమంగా చూడడం నేర్చుకుంటున్నట్లు, మగాళ్ళూ భార్యలని తమతో సమంగా చూసుకోడం నేర్చుకుంటారు. కొన్నితరాలుగా ఆధిపత్యం అనుభవించిన మగజాతి దాన్ని ఒక్కసారిగా వదిలేసుకోలేదు. అలాగే స్త్రీలూ బానిస భావాన్ని అంత తొందరగా వదిలించుకోలేరు.

చాలామంది స్త్రీలు ఉద్యోగం చేస్తోంటే తరువాత తరానికి ఉద్యోగం చెయ్యడం సామాన్యమైన విషయం అవుతుంది. అప్పుడు భార్యాభర్తలు సమానమైన బాధ్యతలు స్వీకరించగలుగుతారు.

ఈ మార్పు వస్తోంది. ఈ తరం ఆడవాళ్ళలో చాలామంది కష్టపడుతూ, భర్త సహకారం లేకుండా, ఆర్థిక స్వతంత్రం పొందకుండా ఉద్యోగాలు చేస్తున్నారు. తరువాత తరం వాళ్ళకి ఈ కష్టం కొంత తగ్గుతుంది. ఇంకో రెండు మూడు తరాలకి ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుంది. అప్పుడు సమానత దానంతటఅదే వస్తుంది.

ఏ ఉద్యమంలోనైనా కొందరు కష్టపడాలి. నష్టపోవాలి. ఇప్పుడు నాలాంటి వాళ్ళం ఆ కష్టం పడుతున్నాం. ఎంత కష్టమైనా నేను ఈ ఉద్యోగం మానను. విడాకులు తీసుకోను. కొన్ని అసమానతలు ఉన్నాయని కుటుంబ వ్యవస్థని కూలదోసుకుంటే, విశృంఖలత్వం, విచ్చలవిడితనం విజృంభిస్తాయి. అది ఎవ్వరికీ మంచిది కాదు.

నాకీ కష్టం తప్పదు. ఇలా రెండు మూడు తరాల స్త్రీలు నాలా కష్టపడితే, ముందు తరాల స్త్రీలు హాయిగా ఉండగలుగుతారు.

ముందు తరాల స్త్రీలు తమ భర్తలతో సమంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవించగలుగుతారని తలచుకుంటే నాకెంతో ఆనందంగా ఉంది.

నా మనవరాలో, మునిమనవరాలో సుఖపడ్డం కోసం, నేను సమిధను అవుతున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది.



E:\Seelamma\
Seelama1
92

*ఆంధ్రభూమి, ఆగష్టు 18, 1988*

# వర్ణభేదం

**"మ**నవడి బారసాల కదరా ఇవాళ, ఇవన్నీ ఇంటికి పట్టుకెళ్ళు" అంటూ పిండివంటలున్న రెండు అరటి ఆకుల్ని అరుగుమీద ఓ పక్కగా ఉంచింది సుభద్రమ్మ.

వాటిని తీసుకున్నాడు సత్తెయ్య. తన తలగుడ్డని తీసి అందులో ఆకుల్ని భద్రంగా పెట్టి, గుడ్డని మూట కట్టి చేత్తో పట్టుకుని నిలబడ్డాడు.

ఆకులు తీసినచోట తనచేతిలోని చెంబులోంచి గంగాజలం చిలకరించింది సుభద్రమ్మ.

"ఇవిగో ఈ బట్టలు తీసుకో" అంటూ పిలిచారు అరుగుమీద మరోమూల పడక్కుర్చీలో కూర్చున్న పంతులుగారు.

సత్తెయ్య అటు నడిచాడు. ఓ రెండు పంచెలు, రెండు చీరలు కొత్తవి సత్తెయ్యకి అందించారు పంతులుగారు. ఒకరి చేతులు ఒకరికి తగలకుండా జాగ్రత్తపడ్డారు ఇద్దరూ.

"ఈ రోజింక పనిలోకి వెళ్ళకు. రేప్పొద్దున్నే కనబడు" అన్నారు పంతులుగారు.

ఒక చేత్తో మూటతో, మరోచేత్తో బట్టలతో ఇంటికి నడవసాగాడు సత్తెయ్య.

వెనకే కదిలాడు సత్తెయ్య కొడుకు వెంకట్రావు.

సుభద్రమ్మ ఆకుల్ని అరుగుమీద ఉంచడం, సత్తెయ్య ఆ ఆకుల్ని తీసుకున్నాక అక్కడ నీళ్ళు చల్లడం, పంతులుగారు సత్తెయ్యకి బట్టలు విసురుతున్నట్టుగా ఇవ్వడం ఇవన్నీ వెంకట్రావుకి సరిగ్గా అర్థం కాలేదు.

పదేళ్ళ వెంకట్రావుకి ఇదంతా వింతగా అనిపించసాగింది.

పంతులుగారింట్లోకి తమనెందుకు రానివ్వరో కదా అని ఆలోచించుకుంటూ అడుగులెయ్యసాగాడు.

"పంతులుగారింటిలోన ఎట్టాగుంటాదయ్యా?" అనడిగాడు సత్తెయ్యను.

"నేనెప్పుడూ లోనకెళ్ళలే. ఆ పెద్దకులపోళ్ళు. ఆరింటిలోకి మన్ని రానీయరు" అన్నాడు సత్తెయ్య.

"పెద్ద కులమంటే ఏంటయ్యా?"

"అది నాకు తెలీదురా, మా అయ్య మనమంతా తక్కువ కులపోళ్ళం. పంతులుగారి లాంటి వోరంతా పెద్దకులపోళ్ళని అనేవాడు. ఊళ్ళోవాళ్ళూ అదే అనేవోళ్ళు, నాకూ అదే తెలుసు. మనల్ని ఆళ్ళ ఇళ్ళకీ రానీరు. ఆళ్ళ పిల్లల్ని మనోళ్ళతో ఆడనీరు. ఎందుకో నాకూ తెల్దు."

"అదేంటయ్యా, నువ్వేనాడూ ఆళ్ళ ఇళ్ళలోనకెళ్ళి సూళ్ళేదా?"

"మనకెందుకులేరా ఇయన్నీ, మన బతుకు మనం బతుకుదాం. ఇయన్నీ నీకసలొద్దు. సక్కగా సదూకో, పట్నంలో మంచి ఉజ్జోగం చేసుకుందూగానీ."

"ఆడ కులాలండవా?"

"ఉండవంట. పెద్ద పెద్ద పట్నాల్లో ఉజ్జోగాలు చేస్కుంటున్నోళ్ళకి కులాలుండవంట. ఒహరింట్లో కోరు పోతారంట."

"నీకెట్టా తెలుసయ్యా?"

"ఆడ పనిచేస్తా ఈడకొచ్చినోళ్ళు సెప్పార్లే. నువ్వు బాగా సదూకో. పట్టం పోయి ఉజ్జోగం సేద్దూగాని."

❋ ❋ ❋

ఇది జరిగి ఇరవై ఏళ్ళయ్యాయి.

ఈలోగా వెంకట్రావు కష్టపడి చదువుకున్నాడు. గవర్నమెంటు ఆఫీసులో పెద్ద ఉద్యోగం సంపాదించుకున్నాడు.

అయిదేళ్ళ సర్వీసులో డబ్బు బాగా సంపాదించాడు.

పెళ్ళి చేసుకున్నాడు.

ఒక పిల్ల పుట్టి రెండేళ్ళు గడిచాయి.

❋ ❋ ❋

నాన్నా!

ఈ నెల 29వ తారీఖున నీ మనవరాలు అరుణ పుట్టినరోజు. ఆ రోజు అందరినీ పిలిచి విందు చేస్తున్నాను. నువ్వో రెండు రోజులు ముందే రా. నా మిత్రులందరినీ కలుద్దువుగాని.

ఇక్కడ మాకు కులాల పట్టింపులు లేవు. అందరం కలిసిపోతాం. పెద్ద కులాల వాళ్ళు కూడా మనింటికి వస్తారు.

పంతులుగారింట్లో మనవడి బారసాలకి మనల్ని వీధిలోంచి పంపేసినట్లుండదు ఇక్కడ. నువ్వే చూస్తావుగా. తప్పకుండా రా. నేనెన్నిసార్లు రమ్మన్నా రానంటున్నావు. ఈసారి నీ మనవరాలి కోసమైనా రా.





నీ
వెంకట్రావు

సత్తెయ్య వెంకట్రావు దగ్గర నుండి వచ్చిన ఉత్తరాన్ని చదివించుకున్నాడు.

తనకొడుకు పట్నం వెళ్ళిన దగ్గర్నుండి తనను రమ్మంటున్నాడు. తనే ఏదో సాకు చెబుతున్నాడు. ఈసారి వెళ్ళాలి అనుకుని బయల్దేరాడు.

ముందుగానే వెళ్ళాలనుకున్నా కుదరక, సరిగ్గా పుట్టినరోజు నాటికి కొడుకింటికి చేరుకున్నాడు.

విశాలంగా ఉన్న ఇల్లూ, అందంగా సర్దిన ఫర్నిచర్ చూసి కొడుకెంతో గొప్పవాడయ్యాడని ఆనందించాడు సత్తెయ్య.

ఆఫీసులో వెంకట్రావు దగ్గర నౌకర్లుట. ఇద్దరు మనుషులు. ఇంట్లో పనంతా చకచకా చేసుకుపోతున్నారు. ఇంటిముందూ, ఇంట్లోనూ రంగు కాయితాలూ, బెలూన్లు దగ్గరుండి అందంగా కట్టించింది వెంకట్రావు భార్య.

అతిథులకోసం కుర్చీలు అద్దెకి తెప్పించి హాల్లో వేయించారు. రకరకాల తిండి పదార్థాలు హోటల్నుంచి ఆర్డరిచ్చి తెప్పించి ఉంచారు.

అరుణకి ఖరీదైన గౌను వేశారు. వెంకట్రావూ, భార్యా ముస్తాబయ్యారు. మావగారి కోసం కొని ఉంచిన మంచిబట్టల్ని సత్తెయ్యచేత తొడిగించింది కోడలు.

సత్తెయ్యకొక పక్క కుర్చీవేసి కూర్చోబెట్టారు.

అతిథులు నెమ్మదిగా రాసాగారు.

ఒక్కొక్కొరూ రావటం వెంకట్రావునీ, భార్యనీ అభినందించడం అరుణని ముద్దాడడం, తాము పట్టుకొచ్చిన గిఫ్టులు ఇవ్వడం, కుర్చీల్లోకి వెళ్ళి కూర్చోడం ఏదో సినిమా చూస్తున్నట్లుంది సత్తెయ్యకి.

అరుణకి వచ్చిన వాళ్ళందర్నీ ఆంటీలు, అంకుల్స్‌గా పరిచయం చేస్తున్నారు వెంకట్రావు దంపతులూ – వాళ్ళకి "హల్లో," "గుడీవెనింగ్" అని చెప్పిస్తూ పిల్లలంతా "హాపీబర్త్‌డే" చెప్పి వాళ్ళ వాళ్ళ మమ్మీ, డాడీతో వెళ్ళి కుర్చీలో కూర్చుంటున్నారు.

తన ఆఫీసులో పనిచేస్తున్న వాళ్ళని సత్తెయ్యకి పరిచయం చేస్తున్నాడు వెంకట్రావు. నమస్కారాలకి ప్రతి నమస్కారాలు చెయ్యమని కోడలు ముందే చెప్పి ఉండడం వలన సత్తెయ్య వాళ్ళకి నమస్కారం చేస్తున్నాడు. క్లర్కుల్ని పరిచయం చేసినపుడు కూడా సత్తెయ్య నమస్కరిస్తుంటే కాస్త అసహనంగా చూసింది కోడలు. ఎవ్వరూ లేని సమయం చూసి ఆ విషయం చెప్పింది. అప్పుడర్థమయ్యింది సత్తెయ్యకి – అందులో కొందరు వెంకట్రావు కింద పనిచేసే వాళ్ళని, మరికొందరు వెంకట్రావుతో పనిచేసే వాళ్ళని,

మరికొందరు వెంకట్రావుపైన పనిచేసేవాళ్ళని.

సత్తెయ్య ఇంకో విషయాన్ని గుర్తించాడు.

తనకు పరిచయం చేస్తున్నప్పుడు గుమాస్తాలుగా పరిచయం చేసిన వాళ్ళందరూ ఒకచోట కూర్చుంటున్నారు. వెంకట్రావు తోటి ఆఫీసర్లుగా పరిచయం చేసిన వాళ్ళందరూ మరోచోటికి వెళ్ళి కూర్చుంటున్నారు. మరీ పెద్ద ఆఫీసర్లన్న వాళ్ళు ఇంకోచోట కూర్చుంటున్నారు.

అంతేకాదు గుమాస్తాలు ఆఫీసర్లకి నమస్కారాలు పెడితే వాళ్ళు తిరిగి నమస్కారం పెట్టకుండా తల అటూ, ఇటూ తిప్పి చిరునవ్వు నవ్వుతున్నారు.

కూర్చోడంలో తేడా ఆఫీసువాళ్ళకే కాదు, వాళ్ళిళ్ళల్లో వాళ్ళక్కూడా ఉన్నట్లుంది. ఏ తరగతికి సంబంధించిన ఆడవాళ్ళు వాళ్ళ వాళ్ళతోనే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలు కూడా అంతే.

ఒక గుంపులో వాళ్ళు మరో గుంపు వాళ్ళతో మాట్లాడ్డం కూడా ఒకరు మర్యాదగా మాట్లాడుతున్నట్లు, మరొకరు అధికారంతో మాట్లాడుతున్నట్లు అనిపించేలా ఉంది.

ఇంతలో అతిథుల్లో కలకలం చెలరేగింది.

వీళ్ళందరి కన్న పెద్ద ఆఫీసర్‌గారొస్తున్నారని.

ఆయన హాల్లోకి రాగానే అంతా నిశ్శబ్దమయిపోయింది. ఆయన అందర్నీ పలకరిస్తున్నట్లుగా నవ్వుతూ వచ్చి వెంకట్రావుని అభినందించారు. అరుణ చేతికి ఏదో గిఫ్ట్ ఇచ్చారు.

"మీరు రావడమే మా అదృష్టం. ఇవన్నీ ఎందుకుసార్" వినయంగా అన్నాడు వెంకట్రావు.

"నీకివ్వలేదోయ్.... అది ఆ పిల్లకే" అన్నారు ఆయన. అదే చాలా పెద్ద జోకయినట్లు అందరూ నవ్వారు.

"నాకు అర్జంటుగా పనుంది, నేను వెళ్ళాలి. వస్తానమ్మా" అని వెంకట్రావు భార్యతో అని ఆయన కదిలారు. ఆయన వెనకే కొందరు వెళ్ళి ఆయన్ని కారెక్కించి వచ్చారు. కొందరైతే ఆయనతోపాటే సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళాక మళ్ళీ మామూలుగా హడావిడిగా అయింది హాలంతా.

వెంకట్రావు పుట్టినపుడు తనింట్లో బంధువులంతా సరదాగా కబుర్లుచెప్పుకుంటూ ఉండడం....

ఆ సమయానికి పంతులుగారు రావడం –

అందరూ లేచి నిలబడ్డం ఆయన వెంకట్రావు పేరన తనకో వందరూపాయలిచ్చి



E:\Seelamma\
Seelama1
94

వెళ్ళిపోవడం – గుర్తొచ్చాయి సత్తెయ్యకి.

అంతవరకూ శర్మ, శాస్త్రి అంటూ తన వాళ్ళని వెంకట్రావు పరిచయం చేస్తుంటే కులాల పట్టింపులు లేని కాలం వచ్చిందనుకున్న సత్తెయ్యకి ఎక్కడో ఏదో సరిగా లేదనిపించింది.

అలా ఆలోచిస్తూ చూస్తుంటే...

అంతవరకూ ఇంట్లో కష్టపడి అన్నీ తయారుచేసిన నౌకర్లిద్దరూ హాలవతల కిటికీ పక్కన నిలబడి కన్పించారు.

సత్తెయ్యకి కొంత అర్థమైనట్లనిపించింది.

పార్టీ అయిపోయి అతిథులంతా వెళ్ళిపోయాక ఆ ఆఫీసు ప్యూన్లు మిగిలిన పదార్థాలను అట్టపెట్టెల్లో పెట్టుకుని పట్టుకెళ్తుంటే సత్తెయ్యకి పూర్తిగా అర్థమైంది.

వందల సంవత్సరాలుగా పాటించబడుతున్న కుల వ్యవస్థ లేదు. అయితే దాని స్థానంలో అలాంటిదే ఇంకో వ్యవస్థ వచ్చింది. ప్యూన్లు, క్లర్కులు, ఆఫీసర్లు, పై ఆఫీసర్లు, పేరేదైనా వ్యవస్థ మాత్రం పోలేదు.

నిట్టూర్చాడు సత్తెయ్య.

# విముక్తి

E:\Seelamma\ Seelama1 95

చెల్లి పెళ్ళి కుదిరిందీ, ముహూర్తం నిర్ణయించుకునే పని ఉందీ, దానికి ముందుగా కళ్యాణమండపం కుదుర్చు కోవాలని అమ్మా నాన్నా రమ్మంటే, ఆఫీసుకి ఓ ఇరవై రోజులు సెలవు పెట్టి బొంబాయి నుండి హైదరాబాద్ చేరాను.

ఆఫీస్ కేంటీన్‌లో భోజనం ఎంత బావున్నా. పెద్ద పెద్ద హోటళ్ళలో రకరకాల రుచికరమైన వంటకాలు తింటున్నా, ఇంట్లో అమ్మ చేతి వంట ముందు అవేమీ బావుండవని అనుకుంటూ, అంటూ తింటున్నాను. చెల్లీ, అమ్మా, నాన్నా పెళ్ళి సంబంధం మంచి చెడ్డల గురించి చెప్తున్నారు. అసలే అందంగా ఉండే చెల్లాయి, పెళ్ళి కాబోతోందన్న ఆనందంతో ఉందే మో ఇంకా అందంగా కనిపిస్తోంది.

ముహూర్తం ఎప్పుడు పెట్టుకోవాలన్న విషయం ఇంకా తేలలేదు. అది ఫిబ్రవరి నెల. మార్చి మూడో వారం నుండి మే చివరి వరకూ మంచి ముహూర్తాలున్నాయిట. ముహూర్తం నిర్ణయించుకోవాలంటే, దానికి ముందుగా ఓ మంచి కళ్యాణమండపం కుదుర్చుకోవాలి. మంచి ముహూర్తాల రోజుల్లో కళ్యాణమండపం దొరకడం కష్టం.

నా సెలవు వీలు గురించి అడిగారు నాన్న. ఇప్పుడు పెట్టిన సెలవు ఇరవై రోజుల్లో పెళ్ళికి కావల్సిన ముఖ్యమైన పనులు పూర్తిచేసుకుని వెళ్తే, పెళ్ళి సమయానికి ఓ వారం రోజులు సెలవు ఎప్పుడు పెట్టడానికైనా కష్టం కాదన్నాను. మగ పెళ్ళివారికి ఈ మూడు నెలల్లో ఎప్పుడైనా ఒకటేనట. ఎంత తొందరగా అయితే అంత బావుండుననుకుంటు న్నారని అంది అమ్మ. చెల్లాయిని చూసాక కాబోయే బావగారికి తొందర అనిపించడం లో వింత ఏమీ కనిపించలేదు నాకు. అదే మాట నవ్వుతూ అన్నాను. నవ్వేసింది చెల్లాయి.

ఇన్నాళ్ళూ అమ్మా నాన్నల దగ్గర హాయిగా ఉండే పిల్ల ఇంకెవరి దగ్గరికో వెళ్ళిపోతుందంటే ఎందుకో మనస్సుకి బాధగా అనిపించింది. నాకే ఇలా ఉంటే ఇంక అమ్మా నాన్నలకి ఎలా ఉండి ఉంటుందో? పెళ్ళయి వెళ్ళిపోయే ఆడపిల్లకి ఎలా ఉంటుందో?

కన్నవాళ్ళని వదిలి పెట్టి దూరంగా మొదటిసారి వెళ్ళడం ఎంత కష్టంగా ఉంటుందో మూడేళ్ళ క్రితం ఉద్యోగం కోసం బొంబాయి వెళ్తున్నప్పుడు నేను అనుభవించాను. నన్ను పంపించడానికి అమ్మా నాన్నా కూడా అంత బాధా అనుభవించారు. అయితే కొన్నాళ్ళకి అది అలవాటయిపోయింది. పెళ్ళయి వెళ్ళిపోతున్న అమ్మాయి విషయం కూడా అంతే అయి ఉంటుంది. అంతే కాదు. భర్తతో గడపబోయే కొత్త జీవితం ఆలో చనలు ఈ బాధను అంతగా తెలియ నివ్వవేమో కూడా. మగవాణ్ణయి పుట్టిన నాకు ఆ ఆలోచనలు తెలియవు. తెలిసే అవకాశమూ లేదు.

అసలు ఇంకొకరి ఆలోచనలూ, అనుభవాలూ మనకి పూర్తిగా ఎప్పుడూ తెలియవు. వాళ్ళు చెప్పేదీ, చేసేదీ మనకి తెలుస్తుంది. వాటిని మన అనుభవాల ద్వారా మనం అర్థం చేసుకుందుకు ప్రయత్నిస్తాం.

"వాళ్ళకి తొందరగా ముహూర్తం కావాలంటే మనం కూడా తొందరగానే చేసేయ్యొచ్చు కదా. మనింటి దగ్గరగానే నాలుగైదు కళ్యాణమండపాలున్నాయి కదా. వాటిలో మనకి అనుకూలమైనది ఒకటి ఏ రోజుకి దొరుకుతుందో కనుక్కుని. ఆ రోజుకి ముమూర్తం నిర్ణయిం చేసుకుంటే సరి" అన్నాను నేను.

"పెళ్ళి పనులు చూసుకోవాలి కదా?" అంది అమ్మ.

"ఇప్పుడు మనం చూసుకునేది ఏముంది? అంతా కాంట్రాక్టులే కదా. నగలూ, పెళ్ళి బట్టలూ కొనే పని ఒకటే ఉంటుంది. అదీ కష్టం కాదు. ఏదో ఒక మంచి కొట్టు చూసుకుంటే రెండు మూడు రోజుల్లో అయిపోతుంది. శుభ లేఖలూ అంతే. పది రోజులుంటే చాలు. పనులన్నీ చూసేసుకోవచ్చు."

"ఇంకా చూసుకోవాల్సినవి ఉన్నాయి కదా?" అంది అమ్మ.

"ఇంకేం ఉన్నాయి?" అని అడిగాను నేను.

"మీరు మాట్లాడుతూ ఉండండి. నేనిప్పుడే వస్తాను" అంటూ వెళ్ళిపోయింది చెల్లి. అలా వెళ్ళిపోవటం ఏదో పని ఉండి కాక, మేము మాట్లాడుకునే విషయం తనకి ముందే తెలిసి, అక్కడ ఉండడం ఇష్టం లేక వెళ్ళిపోతున్నట్లనిపించింది నాకు.

"మీ అమ్మకి రకరకాల ఆలోచనలూ, భయాలూను" అన్నారు నాన్న, ఏదో చెప్ప డానికి ముందు ఉపోద్ఘాతంలా.

నేను అమ్మ కేసి చూసాను. అమ్మ కళ్ళలో నీళ్ళూ. మొహంలో బాధా కనిపిం చాయి. కూతురికి మంచి సంబంధం కుదిరినప్పుడు అమ్మకి ఏ విషయం గురించి బాధగా ఉందో తెలియలేదు నాకు.

"అమ్మమ్మకి ఒంట్లో బావుండడం లేదు" అంది అమ్మ, నా సందేహానికి సమాధానంగా.

"బావుండడం లేదంటే...." అన్నాను నేను.

"ఓ ఆరు నెలల నుండి అమ్మమ్మ మంచం దిగడం లేదు. మధ్యలో మీ అమ్మ ఒకసారి రాజమండ్రి వెళ్లి చూసి వచ్చింది. జబ్బు ఇది అని డాక్టర్లు చెప్పలేక పోతున్నారట కానీ ప్రాణం ఎప్పుడన్నా పోవచ్చునని అంటున్నారుట. మనిషి పరిస్థితి మాత్రం రోజురోజుకూ దిగజారి పోతోంది" అన్నారు నాన్న.

"అమ్మమ్మకెంత – డెబ్బై ఉంటుందా వయస్సు?" అని అడిగాను నేను.

"సరిగ్గా డెబ్బై. వయస్సు మరీ ఎక్కువేం కాదు. ఆరోగ్యమే సరిగ్గా లేదు. ఓ విధంగా ఆవిడ పోవడమే ఆవిడకి మంచిది. అయితే అది ఎప్పుడో" అంటూ ఆగింది అమ్మ.

అమ్మ ఏం చెప్పాలనుకుని చెప్పలేక పోతోందో, చెల్లి ఏది వినాల్సి వస్తుందని వినకుండా వెళ్ళిపోయిందో ఇప్పుడు నాకు అర్థం అయింది. అది ఎవరిన్న వాళ్ళు మనసులో అనుకోకుండా ఉండలేనిది. ఎవ్వరితోనూ అనలేనిది.

చెల్లి పెళ్ళి ముహూర్తం నిర్ణయించడానికీ, అమ్మమ్మ అనారోగ్యానికీ ఉన్న సంబంధం నాకు నెమ్మదిగా అర్థం అవసాగింది. ఆవిడ ఎన్నాళ్ళు బతికి ఉంటుందో తెలియదు. ఆవిడ ఉండగా చెల్లి పెళ్ళి చెయ్యగలిగితే బావుండునని అమ్మ ఎన్నోసార్లు అంటూండేది. ముమూర్తం తొందరగా పెట్టించేసి చెల్లి పెళ్ళి చేసేస్తే అమ్మమ్మ తన అనారోగ్యం కారణంగా పెళ్ళికి రాలేకపోయినా, విని సంతోషిస్తుంది. ఆ తరువాత ఎప్పుడో వీలైనప్పుడు చెల్లీ బావగారు రాజమండ్రికి వెళ్ళి ఆవిడకి కనిపించి రావచ్చు. నేను అదే మాట అన్నాను.

"అమ్మమ్మ ఎక్కువ రోజులు బతకదేమో అంటున్నారుట డాక్టర్లు. తీరా మనం తొందరలో ఓ ముహూర్తం నిర్ణయించుకుంటే, ఆ సమయానికి పెళ్ళి చెయ్యగలుగుతామో లేదో అని అనుమానం. అందుకే కాస్త దూరంగా ఏ మే లోనో పెట్టుకుంటే...." అని చెప్పాల్సింది చెప్పకుండా చెప్పారు నాన్న.

అలా ఆలోచించడం బాలేకపోయినా, కూతురి పెళ్ళి చేస్తున్నప్పుడు అవన్నీ ఆలోచించుకోవడం అమ్మా నాన్నలకు తప్పదేమో.

"ఓ పక్క అమ్మమ్మని తలచుకుంటే బాధగా ఉంది. మరో పక్క ఈ పెళ్ళి ఏమవుతుందోనని భయంగా ఉంది" అంది అమ్మ.

"ఏ సంగతీ తేలిపోతే ముహూర్తం సంగతి చూసుకోవచ్చు. డాక్టర్లూ దేవుళ్ళు కాదు సరిగ్గా చెప్పడానికి. సుమారుగా చెప్పగలిగినా బావుండును" అన్నారు నాన్న.

"మావయ్యతో ఈ విషయం మాట్లా డారా? ఏమంటాడు?" అని అడిగాను నేను.

"ఏమని అడుగుతాం? అమ్మమ్మ ఆరోగ్యం ఎలా ఉందని అడుగుతాం. 'ప్రస్తుతానికి ఏదో కాలక్షేపం చేస్తోంది. ఏమవుతుందో డాక్టర్లు చెప్పలేక పోతున్నారు. అసలు రోగ నిర్ధారణే అవడం లేదు' అని అంటున్నాడు మావయ్య. అంతకు మించి మనం ఏమడుగుతాం?" అంది అమ్మ.

"అంత కన్న ఇంకా ఏమన్నా అడిగితే మీ మావయ్యకి కోపం కూడా రావచ్చు" అన్నారు నాన్న.

"కోపం కాదు కానీ, అన్నయ్యకి బాధ కలుగవచ్చు. నేను బానే చూసుకుంటున్నానే అని అంటున్నాడు. నిజమే – అమ్మని దగ్గర పెట్టుకుని చూసుకుంటున్న వాళ్ళని మాట మాటకీ డాక్టర్ ఏమంటున్నాడని అడిగితే – మనం ఏదో వాళ్లు సరిగ్గా చూడ్డం లేదని అడుగుతున్నాం అని అనిపిస్తుంది. ఇది చాలా సున్నితమైన విషయం. మనం ఏం మాట్లాడినా వాళ్ళకి బాధ కలగకూడదు. మనల్ని తప్పుగా అర్థం చేసుకోకూడదు. అన్నయ్య ఏమీ అనుకోకపోయినా వదిన అనుకోవచ్చు" అంది అమ్మ.

"పోనీ ఒకసారి వెళ్ళి చూసి వస్తే అక్కడి పరిస్థితి అర్థం అవుతుంది కదా అని అనుకుంటే ఎవ్వరికీ వెళ్ళడానికి కుదరడం లేదు. ఎలాగూ సెలవులో వచ్చావు కదా నువ్వు వెళ్ళి చూసి వస్తావేంటి?" అని అడిగారు నాన్న.

నేనేదో చెప్పేలోపుగానే అమ్మ, "నాకీ ఆలోచనే రాలేదు. ఒకసారి వెళ్ళిరా. అక్కడి పరిస్థితీ అర్థం అవుతుంది. అమ్మమ్మని చూసినట్లూ ఉంటుంది. ఆవిడా సంతోషిస్తుంది" అంది.

సరేనని చెప్పి, మర్నాడు పొద్దున్నే రాజమండ్రి బయల్దేరాను. రాజమండ్రికి వెళ్ళడం నాకు కొత్త కాదు. నా చిన్నప్పటి నుండి వేసవి సెలవులకు అమ్మమ్మ గారి ఊరు రాజమండ్రి వెళ్లడం నాకు అలవాటే. రైలు గోదావరి బ్రిడ్జి దాటుతోంటే ఓ పక్క ప్రయాణం అయిపోతోందన్న బాధా, మరో పక్క అమ్మమ్మ ఊరొచ్చేసిందన్న ఆనందమూ కలిగేవి.

బ్రిటిష్ వాళ్ళు వందేళ్ళకి ముందే కట్టించిన బ్రిడ్జీ. ఆ పక్కనే రైళ్ళకీ, బస్సులకీ కలిపి కట్టిన బ్రిడ్జీ. వాటి మీద రైలు ప్రయాణాలు నా మనస్సులో మంచి జ్ఞాపకాల్లా మిగిలి ఉంటాయి. ఇప్పుడు వాటి పక్క ఇంకో బ్రిడ్జి వచ్చేసింది. పాత బ్రిడ్జిని అసలు వాడడం లేదు. దాన్ని ఏం చేస్తారో తెలియదు. పనికి రావడం లేదని ఎప్పుడో కొట్టేసి దాన్లోని ఇనుమునీ, రాళ్ళనీ వాడుకుంటారేమో. దాన్ని కొట్టేస్తారంటే ఏదోలా అనిపించింది నాకు.

ఆ బ్రిడ్జిని చూస్తోంటే నాకు వార్ధక్యం. మరణం గుర్తుకు వచ్చాయి. మనుషుల్లాగానే మనుషులు నిర్మించిన వాటికి కూడా ముసలితనమూ, చావూ ఉంటాయా



E:\Seelamma\ Seelama1 96

అనిపించింది.

రాజమండ్రి స్టేషన్‌లో దిగి అమ్మమ్మ ఇంటికి వెళ్ళేసరికి హాల్లో అత్తయ్యా మావయ్యా కూచుని ఉన్నారు. కళ్యాణి కనిపించలేదు. నేను వస్తున్నానని తెలుసు కానీ ఏ రైల్లో వస్తున్నానో వాళ్ళకి తెలియదు. అందుకేనేమో కళ్యాణి ఇంట్లో లేదు. ఫ్రెండింటికి వెళ్లిందిట. నేను వాళ్ళిద్దరినీ పలకరించి అమ్మమ్మ ఉన్న గదిలోకి వెళ్ళాను.



అమ్మమ్మని చూస్తే నాకు గోదావరి నది మీద పాత బ్రిడ్జి గుర్తొచ్చింది. ఓ నిముషం కూడా ఎక్కడా కూచోకుండా నిరంతరం తిరుగుతూ ఏదో ఒక పని చేస్తూ ఉండే అమ్మమ్మ కదలలేకుండా మంచం మీద పడుక్కుని ఉంది. అస్థిపంజరానికి తోలు చీర కట్టినట్లుంది ఆవిడ శరీరం.

''బావున్నావా నాయనా. మంచి ఉద్యోగం చేసుకుంటూ బాగా సంపాదించుకుంటున్నావుట కదా – ఇంక పెళ్ళే తరువాయి" అంది అమ్మమ్మ నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

ఒకటిన్నర సంవత్సరాల క్రితం నేను చూసిన చేతులు కావివి. రెండేసి జతల బంగారు గాజులతో నిండుగా ఉండే చేతులు – ఇప్పుడు వడలిపోయిన తామర కాడల్లా ఉన్నాయి. అసలు అమ్మమ్మే నాకు ఇన్నేళ్ళుగా తెలిసిన అమ్మమ్మలా లేదు. మాట అయాసంగా వస్తోంది. మొహం నీరసంగా ఉంది. కళ్ళు లోపలకు వెళ్ళిపోయాయి.

అమ్మమ్మ నా గురించీ, అమ్మా నాన్నల గురించీ, చెల్లి గురించీ ఏవో ప్రశ్నలు అడుగుతోంది. మౌనంతో. చిరునవ్వుతో, తల కదలికతో. ఊ.... ఊలతో సమాధానాలు చెప్తున్నాను కానీ, నా మనస్సు ఎక్కడో ఉంది.

నేను స్కూల్‌కి వెళ్ళడం మొదలెట్టాక కూడా నన్ను చంకనెత్తుకుని తిప్పేది అమ్మమ్మ. నేను కాలేజీలో చేరాక కూడా తను చేసిన పిండివంటలని తన చేతులతోనే తినిపించేది. నేను బాగా చదువుతున్నానని తెగ మురిసిపోయేది. దిష్టి తీసేది. అమ్మ కానీ నాన్న కానీ నన్ను ఏదన్నా అంటూంటే వాళ్ళని ఏమీ అననిచ్చేది కాదు. అలాంటి అమ్మమ్మ అలా పడుక్కుని ఉంటే చూస్తూ ఎలా ఉండగలనా అనిపిస్తోంది.

వృద్ధాప్యం తెచ్చే ఈ భయంకరమైన మార్పును మనుషులు చూస్తూనే వున్నారు. చూస్తూ కూడా భౌతికంగానూ, మానసికంగానూ ఈ ప్రపంచంలోనే ఉంటున్నారు. రోగాన్నీ, ముసలితనాన్నీ, చావునీ చూసి భయపడో, బాధపడో, జాలిపడో ఈ ప్రపంచం నుండి పారిపోవడానికి ఈ మనుషులందరూ బుద్ధులు కాదు. బుద్ధుడు ఈ బాధల్ని చూసి, వీటికి దూరంగా తను ఒక్కడూ వెళ్ళిపోవడానికో, అందరినీ తనతో తీసుకుని



వెళ్ళడానికో, భార్యనీ, కొడుకునీ, రాజ్యాన్నీ వదిలి వెళ్ళిపోయాడు. అలా వెళ్లిపోగలిగాడు కాబట్టే బుద్ధుడు బుద్ధుడు అయ్యాడు. అలా వెళ్ళిపోలేరు కాబట్టే మనుషులు మనుషుల్లానే ఉంటున్నారు.

"నేనే ఏదో మాట్లాడుతున్నాను. నువ్వు ఏమీ మాట్లడ్డం లేదేంటి నాన్నా?" అంది అమ్మమ్మ.

అంతకు ముందు ఎప్పుడు వచ్చినా అమ్మమ్మ ఆరోగ్యంగా హాయిగా కనిపించేది. అప్పుడు నేను అమ్మమ్మని ఎలా ఉన్నావని అడిగే వాడిని. ఇప్పుడు ఎలా ఉన్నావని ఎలా అడగను? ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించే వాళ్ళని ఎలా వున్నావని అడగ్గలం. అలా కనిపించని వాళ్ళని ఏమడుగుతాం? అంతకుముందు అమ్మమ్మ దగ్గరికి రాగానే నాకు గార్లు చేసి పెట్టు అనో, బొబ్బట్లు చేసిపెట్టు అనో అడిగే వాడిని. ఇప్పుడు తను కదలలేని స్థితిలో ఉంది. ఏదన్నా చేసిపెట్టమని ఎలా అడగ్గలను?

నాకు పరీక్షలలో బాగా మార్కులు వచ్చాయని చెప్పేవాడిని. అమ్మమ్మ సంతోషించేది. ఇప్పుడు నాకు ఉద్యోగంలో మంచి పేరు వస్తోందని చెప్పాలి. కదలలేకుండా మంచం మీద పడుక్కునున్న అమ్మమ్మతో నా గురించి నేను చెప్పుకోవడం ఎలా?

ఎప్పుడు కలిసినా ఒకరితో ఒకరం ఏదో ఒకటి మాట్లాడుకుంటూనే ఉండేవాళ్ళం అమ్మమ్మా, నేనూ. అలాంటిది అమ్మమ్మతో ఏం మాట్లాడాలన్నా, ఎలా మాట్లాడాలన్న ఆలోచన రావడం నాకు బాధగా అనిపించింది. అనుకోకుండా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అవి అమ్మమ్మకి కనిపించాయి.

"అదేంటి నాన్నా. కళ్ళ నీళ్ళు పెట్టుకుంటావు. నన్ను చూసా? నువ్వలా ఏడుస్తోంటే నాకు బావుంటుందా చెప్పు. నాకేం వయస్సు తక్కువా ఏంటి? పదేళ్ళు – వింటున్నావా – పది ఏళ్ళు" – పది ఏళ్ళు అన్న మాటల్ని వత్తి పలుకుతూ తన చేతిని ఎత్తి, నా కళ్ళని తుడవబోయింది అమ్మమ్మ. చెయ్యి సరిగ్గా లేవలేదు. వేళ్ళ చివర్లు నా బుగ్గలకి తగిలాయి.

నాకు పదేళ్ళప్పుడు. ఆవిడకి యాభై ఆరేళ్ళు. 'నా కన్నా నువ్వే చిన్న– నీ వయస్సు ఎనిమిదేళ్ళే' అని నేను అనడం గుర్తొచ్చింది నాకు. అమ్మమ్మ అది గుర్తు పెట్టుకుని ఇప్పుడు నాతో తన వయస్సు పది ఏళ్ళని చెప్తోంది. నాకు ఏడుపు ఆగలేదు.

"వెర్రి నాన్నా – నువ్వు వచ్చావని నేను సంతోషిస్తోంటే, నన్ను చూసి నువ్వు ఏడుస్తున్నావా. అది ఏమన్నా బావుందా? మనిషిన్నాక రోగం, ముసలితనం, మరణం తప్పవు. ఎవరో మీ తాతయ్య లాంటి అదృష్టవంతులుంటారు. ఇవేమీ చూడ కుండా తొందరగా పోతారు. అందరికీ ఆ అదృష్టం దక్కుతుందా?" అని ఒక్కక్షణం ఆగి,

"అది మాత్రం ఏం అదృష్టంలే. పిల్లలు పెద్దవాళ్ళవడం చూసుకోలేదు. మనవల్నీ, మనవరాళ్ళనీ చూసుకోలేదు. తొందరగా పోవడమూ దురదృష్టమే" అంది.

"ఇప్పుడవన్నీ మాట్లాడతావెందుకు అమ్మమ్మా? నువ్వు బావుంటావు?" అన్నాను నేను.

"అసలు ఉంటానో ఉండనో తెలియని నన్ను బావుంటావని అంటున్నావు. అదే పదివేలు. ఈ వయస్సు వచ్చాక – ఇలా ఆరోగ్యం చెడ్డాక ఎంతో కాలం బతక కూడదు. బతికితే అందరికీ భారమే. మన వాళ్ళు మనం ఈ లోకం లోంచి వెళ్ళిపోతే బావుండును అనుకునే ముందే మనం వెళ్ళిపోవాలి."

"నువ్వు వెళ్ళిపోవాలని మేమెవ్వరమూ అనుకోం."

"ఓరి వెర్రి నాగన్నా! ఇప్పటికే కొందరు అనుకుంటూ ఉండి ఉండవచ్చు. కొన్నాళ్ళు నన్ను చూసుకోవాల్సి వస్తే నువ్వూ అనుకోవచ్చు"

"నేనెప్పటికీ అలా అనుకోను. నువ్వు నాతో వచ్చెయ్యి. నాతో ఉందువుగానీ."

"నన్ను చూస్తున్నావు కదా – నేనెక్కడకీ ప్రయాణం చెయ్యలేను. ఇంక మిగిలింది ఒక్కటే ప్రయాణం. ఆ దేవుడెప్పుడు పిలిస్తే అప్పుడు ఆయన దగ్గరకు వెళ్ళిపోవడమే."

అమ్మమ్మ అలా మాట్లాడుతోంటే వింటూ ఉండడం కష్టంగా అనిపించింది. "నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతావా?" అన్నాను బేలగా.

"నేనెక్కడకి వెళ్తానురా? అలా వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ నీ దగ్గరకే వచ్చేస్తాను. నువ్వు మాత్రం తొందరగా పెళ్ళి చేసుకో" అంది అమ్మమ్మ.

నా పెళ్ళి సంగతి ఎత్తేసరికి నాకు కళ్యాణి గుర్తుకు వచ్చింది. కళ్యాణిని తలచుకోగానే నా మొహంలో నాకు తెలియకుండానే ఏవో భావాలు కనిపించా యేమో–

"వెళ్ళు. వెళ్ళి కళ్యాణిని పలకరించు. నువ్వు వస్తావని విన్నప్పటి నుండి కళ్యాణి నీ కోసం ఎదురు చూస్తోంది. మీ పెళ్ళి నాటికి నేనుంటానో ఉండనో – నువ్విక్క దున్నప్పుడే ఒకసారి మీరిద్దరూ కలిసి నా దగ్గరకు రండి. చూసి ఆనందిస్తాను. అంత కన్న నేనేం చెయ్యలేను. దేవుడు నన్నిలా మంచానికి కట్టి పడేసాడు" అంది అమ్మమ్మ.

"అమ్మమ్మా– నువ్వు మమ్మల్ని దీవించాలి. అంత కన్నా మాకింకేం అక్కర్లేదు. మా పెళ్ళి వరకూ నువ్వు ఉంటావు."

"ముందు నీ చెల్లి పెళ్ళి అవనీ. సంబంధం కుదిరిందట కదా. ముహూర్తం కోసం చూస్తున్నారుటగా అమ్మా నాన్నా. నేనేమో ఈ రోజో రేపో అన్నట్లున్నాను. నా వల్ల నీ చెల్లి పెళ్ళికి ఏమీ ఇబ్బంది రాకూడదని నేను దేవుడికి మొక్కుకుంటున్నాను.



E:\Seelamma\
Seelama1
98

ముహూర్తానికి ఓ నెల రోజులు ముందే పోతే పరవాలేదు. నా కోసం ఏడుస్తూనైనా దాని పెళ్ళి చేసేస్తారు. అలా చెయ్యమని మీ అమ్మతో చెప్పమని మావయ్యతో చెప్పాను కూడా. కానీ ముమూర్తం సమయంలో పోతేనే కష్టం. దాని పెళ్ళికి అడ్డం రాకుండా నన్ను ఆ దేవుడు తీసికెళ్ళిపోతే బావుండును."

అమ్మమ్మ తన మరణం గురించి ఎంత మామూలుగా మాట్లాడుతోందో. పైకి అలా మాట్లాడుతోందో, మనస్సులో కూడా అలానే అనుకుంటుందో తెలియదు. ఒక వయస్సు దాటాక మనుషులు మరణాన్ని గురించి అలాగే అనుకుంటారేమో. నిజంగానే పాత చొక్కాను పారెయ్యాలనిపించినట్లు ఈ పాత శరీరాన్ని వదిలెయ్యాలని అనిపిస్తుందేమో – ఉందో లేదో తెలియని ఆత్మకి.

నేను నా ఆలోచనలలో ఉండగానే, లోపలకి ఓ కంచంలో గుజ్జులా కలిపిన కొంచెం అన్నం తీసుకుని వయస్సు పై బడ్డ ఒకావిడ వచ్చారు. నేనంతకు ముందు ఆవిడని చూడలేదు.

అమ్మమ్మ ఆవిడతో, "మా మనవడు. బొంబాయిలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. కళ్యాణికి కాబోయే మొగుడు" అని నా గురించి చెప్పింది. నాతో, "ఈవిడ నీకు తెలిసి ఉండదు. మనకి దూరబ్బంధువు. నేనిలా మంచం మీద పడ్డప్పటి నుండి నన్ను చూసుకుందుకు ఇక్కడే ఉంటోంది. నాక్కావల్సినవన్నీ ఆవిడే చూస్తోంది. ఆవిడే లేకపోతే నా గతి ఏమయ్యేదో. ఎన్ని జన్మలెత్తినా ఆవిడ ఋణం తీర్చుకోగలనో లేదో?" అని అంది. కాస్త ఎక్కువగా మాట్లాడడం వల్లనేమో ఆయాసం వచ్చింది అమ్మమ్మకి.

"మీరు ఎక్కువ మాట్లాడకండి. నేను మీకు చేస్తున్నది ఏమీ లేదు. నిజానికి నేను మీకు బాగా ఋణపడి ఉన్నాను. నా బతుకు ఇలా సాగుతోందంటే అంతా మీ చలవే. భోజనం తెచ్చాను. కాస్త తిందురు గానీ" అంటూ అమ్మమ్మకి దగ్గరగా ఓ కుర్చీ లాక్కుని కూర్చుంది ఆవిడ.

"నా బతుకు ఎలా అయిపోయిందో చూసావా? నలుగురికి వండి పెట్టలేకపోతే పోయె – నా తిండి నేను తినలేని రోజులు వచ్చాయి. ఇదిగో ఈవిడ ముద్దలు నా నోట్లో పెడ్తే కానీ నా రోజు గడవదు. ఇంతా చేస్తే అది అరుగుతుందో లేదో తెలియదు. అరక్కపోయినా ఆవిడకే కష్టం. నా బాధలు ఎప్పుడూ ఉండేవేలే కానీ నువ్వెళ్ళి భోంచెయ్యి. వాళ్ళంతా నీకోసం కూచుని ఉంటారు" అని నన్ను బయటకు పంపించేసింది అమ్మమ్మ.

అమ్మమ్మ గదిలోంచి నేను హాల్లోకి వచ్చేసరికి మావయ్య ఒక్కడే సోఫాలో కూచుని ఉన్నాడు. నన్ను చూడగానే పక్కకి జరిగి నాకు చోటిచ్చాడు.

“అమ్మమ్మని చూస్తోంటే చాలా బాధగా ఉంది” అన్నాను నేను ఇంకేమనాలో తెలియక.

“డాక్టర్లకి చూపిస్తూనే ఉన్నాం. వాళ్ళకీ అంతుబట్టడంలేదు” అన్నాడు మావయ్య.

“ఏమంటారు డాక్టర్లు?” అన్నాను నేను.

“చెప్పలేమంటారు. ఏ నిముషంలో ఏదన్నా అవచ్చునంటారు. అన్నిటికీ సిద్ధంగా ఉండాలంటారు. ఇంకా అయ్యేందుకేముంది కనుక? మనిషి బాగా నీరసించిపోయింది. మంచంలోంచి లేవలేకపోతోంది. అసలు ఒక పక్క నుండి ఇంకో పక్కకి ఒత్తిగిల్లడానికే కష్టపడి పోతోంది. నాకైతే మాత్రం ఆవిడని చూడాలంటేనే బాధగా ఉంటోంది” – అలా అంటున్న మావయ్య గొంతులో నాకైతే ప్రత్యేకంగా బాధ ధ్వనించలేదు. నిరంతరం ఒకే విషయం గురించి ఏ మనిషీ బాధ పడుతూ ఉండడేమో.

“అసలు రోగం ఏమిటి?” అని అడిగాను నేను.

“రోగానికి నాకు తెలిసిన పేరేం చెప్పడం లేదు డాక్టర్లు. అయినా ఏ పేరు పెడితే మాత్రం ఒరిగేది ఏముంది? ఈ రోగం తగ్గి ఆవిడ మామూలు మనిషి అవదంటారు. ప్రాణం కూడా ఎక్కువ కాలం ఉండకపోచ్చునంటారు.”

“ఎక్కువ కాలం అంటే....” అంత బాధలోనూ నేను వచ్చిన పనిని నేను మర్చిపోలేదు.

“ఎంతకాలం అంటే ఇదమిద్ధంగా చెప్పలేమంటున్నారు డాక్టర్లు. వయస్సు పరంగా చూస్తే అమ్మమ్మకి డెబ్భైయేళ్ళే. కానీ ఆరోగ్యపరంగానే....” అంటూ ఆగాడు మావయ్య.

నేను రాజమండ్రి వచ్చింది ఒకటి రెండు రోజులు ఉండి అమ్మమ్మ పరిస్థితి ఎలా ఉందో కనుక్కుని హైదరాబాద్‌కి వెళ్ళిపోవడానికి. ఇక్కడి పరిస్థితి అర్థం అయితే అక్కడ కెళ్ళి చెల్లి పెళ్ళి ముహూర్తం ఖరారు చేసుకోవచ్చు. అమ్మమ్మని చూస్తే బాగా శుష్కించి పోయింది. మొహంలోను, కళ్ళలోను కళాకాంతులు లేవు. మావయ్యేమో డాక్టర్ల లెక్క ప్రకారం ఎంతో కాలం బతకదంటున్నాడు. అయితే ఎంతోకాలం అంటే ఎంత కాలం రోజులా, వారాలా. నెలలా?

“మా పెళ్ళి వరకూ ఉంటుందను కున్నాను” అన్నాను నేను.

“నువ్వు మీ పెళ్ళి అంటావు. నీ చెల్లి పెళ్ళి వరకూ కూడా ఉంటుందో ఉండదో తెలియటం లేదు. కన్నకొడుకు ఇలా మాట్లాడుతున్నాడేంటి అని అనుకోకు. ఆవిడని చూస్తోంటే మాత్రం ఎంత తొందరగా వెళ్ళిపోతే అంత మంచిదనిపిస్తోంది” – అలా అంటున్నప్పుడు మాత్రం మామయ్య కళ్ళు తడి అయ్యాయి.



E:\Seelamma\
Seelama1
99

“మావయ్యా” అన్నాను నేను సోఫాలో మావయ్యకి దగ్గరగా జరుగుతూ.

“ఏం లేదురా. నన్ను పెంచిన కన్నతల్లి అలా కష్టపడుతోంటే చూడ్డానికి చాలా బాధగా ఉంది. అందుకే వెళ్ళిపోతేనే మంచిదనుకుంటున్నాను. సునాయాస మరణం అంటారూ.... అది రావాలి ఆవిడకి. ఆవిడ చేసుకున్న పుణ్యానికి తప్పకుండా వస్తుందనే అనుకుంటున్నాను”

“ఆవిడ ఏం పాపం చేసిందని ఇప్పుడిలా బాధపడుతోంది?” – నాలో నేను అనుకుంటున్నానని అనుకుంటూ పైకి అనేసాను.

“నువ్వన్నది కరక్టేరా. చేసిన పాప పుణ్యాల బట్టి మనుషులకు కష్టసుఖాలు రావు. అదే నిజమైతే నాకు తెలిసి అమ్మమ్మ పుణ్యమే చేసింది కానీ పాపం చెయ్యలేదు. అయినా ఆవిడకి జీవిత మంతా కష్టాలే కదా. మా నాన్న మా చిన్నప్పుడే పోతే ఆవిడే మాకు అమ్మా నాన్నా అయి పెంచి పెద్ద చేసింది. దానికి ఎంత కష్టపడిందో నీకు తెలియదు. ఇప్పుడు చూడు. నలుగురికీ చేసి పెట్టే మనిషి నిరంతరం చేయించుకోవాల్సి వస్తోంది. మీ అమ్మమ్మని చూసాక నాకు పాప పుణ్యాల మీదా, అందువల్ల మనిషికి కలిగే కష్టసుఖాల మీదా నమ్మకం పోయింది” అని అన్నాడు మావయ్య.

“అలాంటి కార్యకారణ సంబంధం కనిపించకపోవడం వల్లనే మన ఋషులు ఈ జన్మలో మనం అనుభవిస్తున్న కష్టసుఖాలకు ఈ జన్మలో చేసిన పాప పుణ్యాలే కాదు, అంతకు ముందు జన్మలో చేసిన పాప పుణ్యాలు కూడా కారణమని అన్నారు” అన్నాను నేను.

“అసలు జన్మ అంటే ఏమిటి? మనకి తెలిసి మనం పుడతాం. పోతాం. మధ్యనున్నది మన జీవితం. పుట్టడానికి ముందు మనం ఉంటామా అన్నది అసలు ప్రశ్న. మనం అంటే ఎవరం? మన శరీరమా? అది కానిది వేరే ఏదన్నా ఉందా? మన శరీరం అయితే దానికి జన్మలున్నట్లే. మన పిల్లలు మనలోని భాగాలే. మనం పోయినా మన పిల్లలూ, వాళ్ళ పిల్లలూ ఉంటూనే ఉంటారు. పోయి ఏ లోకంలో ఉన్నాడో మహాను భావుడు రాజ్‌కపూర్ ఈ భావాన్నే ఎంత అందంగా రాయించుకుని, పాడించుకుని చిత్రీకరించాడు? ఒకవేళ నశించిపోయే శరీరమే కాక నశించని ఆత్మ ఉండడం, దాన్నంటుకునే శరీరాలు పుట్టడం, పోవడం నిజమైతే జన్మల అర్థం మారి పోతోంది. కానీ అది నిజమో కాదో నాకు తెలియదు” – మావయ్య అమ్మమ్మ గురించి కాక వేదాంతం గురించి మాట్లాడ్డం మొదలెట్టాడు. నిజానికి ప్రతి మనిషీ తను ఏమి చెయ్యలేని పరిస్థితిని ఎదురుకున్నప్పుడు ఈ ధోరణిలోకి వెళ్తాడు. కానీ మావయ్యకి ఈ ధోరణి ఎప్పుడూ ఉన్నదే. మా ముందు తరాలలో ఎవరో ఒకరి అంశలమే కదా

నేనూ మావయ్యానూ – అందుకే నాకూ ఈ వేదాంత ధోరణి కాస్త ఉంది. అసలు భారతదేశపు గాలిలోనూ, నీళ్ళలోనూ ఉండి ఉంటుంది ఈ ధోరణి.

మేమిలా మాట్లాడుకుంటూ ఉండగానే అత్తయ్య వచ్చింది. వస్తూనే –

"మీ కాబోయే బావగారిని చూసావా? ఎలా ఉంటారు? మంచి ఉద్యోగంట కదా. దానికి తోడు హైదరాబాద్‌లోనేట కదా. మీ అమ్మకీ, మీ చెల్లికీ కూడా సుఖం" అంది.

"వాణ్ణి కూడా బొంబాయి వదిలేసి వచ్చి రాజమండ్రిలో ఉద్యోగం చూసు కోమను" అన్నాడు మావయ్య.

"అంత మంచి ఉద్యోగం వదిలేసి ఇక్కడికి రావడం ఎందుకు? అయినా కళ్యాణి కూడా ఈ సంవత్సరం ఇక్కడ ఎమ్మెస్సీ అయిపోగానే బొంబాయిలోనే టాటా ఇనిస్టిట్యూట్‌లో పీహెచ్‌డీ చేద్దామనుకుంటోందిగా. ఎమ్మెస్సీ పరీక్షలు ఏప్రిల్ నెల చివరలో ఉంటాయి. అక్కడ ఎంట్రన్స్ పరీక్ష మేమధ్యలో ఉంటుందిట. అప్పుడు అక్కడికి వచ్చి రాస్తుంది. ఈ లోగా మీ చెల్లి పెళ్ళి అయిపోతుందేమో కదా" అంది అత్తయ్య.

"ముహూర్తం ఎప్పుడు పెట్టుకోవాలా అని చూస్తున్నారు" అని ఆగాను.

"మీ అమ్మ బాధ నాకు అర్థం అయింది. ఇక్కడ ఏ సంగతీ తేలిపోతే మీ అమ్మకి ఏం చెయ్యాలో పాలు పోతోంది. మా పరిస్థితీ అలానే ఉందిక్కడ. ఏప్రిల్ మొదలుకుని వరుసగా పిల్లకీ, పిల్లాడికీ పరీక్షలు. వాళ్ళ పరీక్షల సమయానికి ఇంట్లో ఏ హడావిడీ లేకుండా ఉంటే బావుండునని దేవుళ్ళకి మొక్కుకుంటున్నాను" అంది అత్తయ్య.

అత్తయ్య అలా మాట్లాడడం మావయ్యకి నచ్చిందో లేదో తెలియలేదు. "ఇప్పుడవన్నీ ఎందుకు?" అన్నాడు. అలా అనడంలో ప్రాముఖ్యత ఎందుకు మీద ఉందో ఇప్పుడు మీద ఉందో అర్థం కాలేదు.

ఈ లోగా అమ్మమ్మ గదిలోంచి ఆ పెద్దావిడ బయటకి వచ్చింది.

"ఏమంటున్నారు మీ ముసలావిడ? ఈ రోజైనా ఏ గొడవా చెయ్యకుండా తిన్నారా?" అంది అత్తయ్య ఆవిడతో.

"ఏం తినడం? ఇదిగో చూడండి" అంటూ అమ్మమ్మ కోసం తీసుకెళ్ళిన కంచం చూపించిందావిడ. అందులో అన్నం ఇంకా కొంత ఉంది. అమ్మమ్మ అంతా తినలేకపోయింది లాగుంది. కంచం చూపించడంతో ఆగకుండా ఆవిడ "ఎంత కలిపి తీసుకెళ్ళినా ఏదో ఒకటి అంటారు. ఎక్కువైతే ఇంత ఎందుకు తెచ్చావని అంటారు. తక్కువైతే ఇంకొంచెం తీసుకురావల్సిందని అంటారు. చాలా కష్టంగా ఉంది" అని



E:\Seelamma\
Seelama1
100

అంది.

"మీ పరిస్థితి బావుండక మీరీ పనికి ఒప్పుకోవాల్సి వచ్చింది కానీ మీరూ పెద్ద వారే కదా. మీరు చేసినట్లు చేయించు కోవాల్సింది పోయి మిమ్మల్ని కష్టపెడు తున్నారు. చేసే వాళ్ళ బాధ చేయించుకునే వాళ్ళకి ఏం అర్థమవుతుంది?" అత్తయ్య నిజంగానే అమ్మమ్మ మీద కోపంతో ఈ మాటలు అంటోందో లేక తనకి సాయం చేస్తున్నారు కదా అని ఆవిడని సంతోష పెట్టడానికి అంటోందో తెలియలేదు.

"మా అబ్బాయి ఉద్యోగానికి కొంచెం గొడవ ఉండి నేనీ పనికి ఒప్పుకుంటా నన్నప్పుడే, నా కొడుకూ కోడలూ ఇద్దరూ కూడా వెళ్ళవద్దన్నారు. నేనే వాడి ఉద్యోగ పరిస్థితి బాగుపడే వరకూ వాళ్ళకి భారం తగ్గుతుందని వచ్చానిక్కడికి. ఒకటి రెండు నెలల్లో వాడికి మంచి ఉద్యోగం దొరికేటట్లుంది. వాడి పరిస్థితి బాగుపడగానే వచ్చి నన్ను తీసుకెళ్ళిపోతానంటున్నాడు. నేను ఉంటానన్నా వాడు ఉండనివ్వడు" అంది ఆవిడ.

"మీరు వెళ్తానంటే మాత్రం మిమ్మల్ని మా అత్తగారు వదలుతారా ఏమిటి? ఆవిడ ఈ లోకంలోంచి వెళ్ళాకే మీకు ఇక్కడ నుండి విముక్తి. అంతవరకూ ఈ బాధ తప్పదు మీకు. ఆవిడ పిలుస్తున్నట్లున్నారు. తొందరగా వెళ్ళండి లేకపోతే ఆవిడకి కోపం వస్తుంది. మళ్ళీ మీకే ఇబ్బంది" అంది అత్తయ్య.

ఈ సంభాషణ రోజూ జరుగుతూనే ఉండి ఉండాలి. అయితే అది నా ముందు అవడం మావయ్యకి కాస్త ఇబ్బందిగా ఉండి ఉంటుంది. అత్తయ్య కూడా నన్ను కాబోయే అల్లుడిగా వాళ్ళింట్లో వాడిగా అనుకుని మాట్లాడేస్తూ ఉండి ఉంటుంది. అదే ఇంకెవరైనా ఉండి ఉంటే మాట్లాడి ఉండేది కాదేమో.

ఆవిడ అమ్మమ్మ గదిలోకి వెళ్ళి పోయింది.

అత్తయ్యా, మావయ్యా, నేనూ కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాం. ఏ విషయం గురించి మాట్లాడ్డం మొదలెట్టినా అది అమ్మమ్మ ఆరోగ్యం దగ్గరికే దారి తీస్తోంది. మేం అలా మాట్లాడుకుంటూ ఉండగా కళ్యాణి ఇంట్లోకి వచ్చింది. కళ్యాణిని చూడగానే నా మనస్సులో నాకు తెలియ కుండానే ఆనందం కలిగింది. కళ్యాణి మనస్సులోనూ అదే అయ్యుండవచ్చు.

"నువ్వు రేపు పొద్దున్నకి వస్తావేమో అనుకున్నాను. అందుకనే బయటికి వెళ్ళాను. ఈ సాయంత్రానికే వస్తున్నట్లు చెప్పి ఉండవచ్చుగా?" అంది కళ్యాణి.

"నేను ఏ ట్రెయిన్‌లో వస్తున్నానో ముందుగా చెప్తే మీలో ఎవరో ఒకరు స్టేషన్‌కి వస్తారు. అందుకనే చెప్పలేదు" అన్నాను నేను.

“పద డాబా మీదకి వెళ్లి కూచుందాం” అంది కళ్యాణి.

అలా డాబా మీద కూచుని కబుర్లు చెప్పుకోవడం మాకిద్దరికీ అలవాటే. మా కబుర్లకి మమ్మల్ని వదిలెయ్యడం అత్తయ్యా, మావయ్యలిద్దరికీ అలవాటే. మేం డాబా మీద కూచుని ఉన్నప్పుడు వాళ్ళు ఎక్కువగా పైకి రారు. ఒక్క అమ్మమ్మే ఒక్కోసారి పైకి వచ్చి చూసేది. చూసి అనేది, “మిమ్మల్ని చూసి ఆనందించడానికే వస్తున్నానిలా – మీ ఆనందాన్ని చెడపడానికి కాదు” అని. ఇప్పుడు అమ్మమ్మ అలా పైకి డాబా మీదకి రాలేదు. కళ్యాణి బొంబాయి వచ్చి టాటా ఇనిస్టిట్యూట్‌లో పీహెచ్‌డి చెయ్యడం గురించి చెప్తోంది. నేను కళ్యాణి మొహాన్నే చూస్తూ కూచున్నాను. ఆ మొహంలో నాకు అమ్మమ్మ పోలికలు స్పష్టంగా కనిపించాయి. ఆ మాట అందరూ అనేదే – కళ్యాణికి వాళ్ళ మామ్మ పోలికలు వచ్చాయని. ఒకవేళ అమ్మమ్మ చనిపోయినా అమ్మమ్మ ఉన్నట్లా? లేనట్లా? అమ్మమ్మా తాతయ్యల లోని భాగాలే మా అమ్మైనా, మావయ్యైనా. వాళ్ళిద్దరి భాగాలమే నేనూ కళ్యాణి. మాకిద్దరికీ పెళ్ళయి మాకు పిల్లలు పుడితే వాళ్ళు అమ్మమ్మ అంశలే కదా. మా పెళ్ళీ, మా పిల్లలూ అని అనుకోవడం నాకే వింతగా అనిపించింది.

మేమిద్దరమూ మా చదువూ ఉద్యోగం గురించీ, మా ఫ్రెండ్స్ గురించీ, ఇంకేవో విషయాల గురించీ తప్ప మా పెళ్లి గురించి మాట్లాడుకోం.

కళ్యాణి చదువులోంచి సంభాషణ మా చెల్లి పెళ్ళి మీదకు మళ్లింది.

“మీ చెల్లి పెళ్ళి ఈ సమయానికే వచ్చింది. నాకూ తమ్ముడికీ కూడా ఏప్రిల్ నుండి వరసగా పరీక్షలు. రావడం కుదురు తుందో లేదో. మామ్మ పరిస్థితి చూస్తే ఇలా ఉంది” అంది కళ్యాణి.

“అమ్మమ్మని చూస్తే బాధగా ఉంది. చెల్లి పెళ్ళి చూడ్డానికి రాలేకపోయినా, పెళ్ళవుతుందని వింటే సంతోషిస్తుంది కదా అని అనుకున్నాం. మనిషిని చూస్తే భయం వేస్తోంది. ఎముకలూ, తోలూ – అంతే. ఎన్నాళ్ళు అలా మంచాన పడి ఉంటుందో?” అన్నాను నేను.

“మామ్మని చూడకుండా ఉండలేను. అలాగని చూడనూ లేను. ఆరు నెలల క్రితం నాకు తనే జడ వేసేది. ఒక్క ఆరు నెలలలో ఎంత తేడా వచ్చేసిందో. రోజు రోజుకీ మనిషి కృంగిపోతోంది. అలా చెయ్యడం తప్పో ఒప్పో తెలియదు కానీ ఒక్కోసారి మామ్మకి ఈ బాధ నుండి విముక్తి కలిగించు దేవుడా అని ప్రార్థిస్తున్నాను” అంది కళ్యాణి.

నాకు యుథనేషియా గుర్తొచ్చింది. కోలుకోలేని రోగంతో బాధపడుతున్న రోగిని



E:\Seelamma\
Seelama1
101

కష్టాల నుండి తప్పించేందుకు ఆ రోగి దగ్గర వాళ్ళూ, డాక్టర్లూ ఆ రోగిని ఈ లోకం నుండి పంపించేసేందుకు ఏదో ఒక మార్గం చూడడం తప్పా? ఒప్పా? అని చర్చ సాగుతూనే ఉంది. ఇప్పుడు అమ్మమ్మ పరిస్థితి ఏమిటి? ఈ మాటే నేను కళ్యాణితో అనబోయేంతలో, సంభాషణని మార్చేస్తూ –

“నీ ప్రోగ్రాం ఏంటి? ఇరవై రోజులు సెలవు పెట్టావు కదా?” అని అడిగింది కళ్యాణి.

“చెల్లి పెళ్ళి పనులు చెయ్యాలి. రేపో ఎల్లుండో బయల్దేరి హైదరాబాద్ వెళ్ళిపోతాను” అన్నాను నేను.

“అన్ని రోజులు సెలవు పెట్టావు కదా. ఓ నాలుగు రోజులు ఇక్కడ ఉండ వచ్చుగా” అంది కళ్యాణి.

నాకూ ఉండాలనే ఉంది. ఇలా కళ్యాణి దగ్గర కూచుని కబుర్లు చెప్తోంటే నాకు కాలమే తెలియదు. జీవితంలో తక్కిన విషయాలేమీ గుర్తుకు రావు. ఇలా ఉండిపోవాలనే ఉంటుంది. కానీ హైదరాబాద్ వెళ్లక తప్పదు. అక్కడకి వెళ్ళకుండా నేను ఇక్కడే ఉండాలంటే ఒక్కటే మార్గం. అమ్మా, నాన్నా, చెల్లీ కూడా ఇక్కడకు రావాలి. వాళ్ళు ఎందుకు వస్తారు? అమ్మమ్మకి ఏదైనా అయితే వాళ్ళు వస్తారు. అప్పుడు నేను నాలుగు రోజులు కాదు పదిహేను రోజులు ఇక్కడే ఉండిపోవచ్చు.

నా ఈ ఆలోచన నాకే వికృతంగా అనిపించింది.

అదే సమయానికి కింద నుండి గోలగా మాటలు వినిపించసాగాయి. ఏమిటా అని కిందకి దిగాం నేనూ, కళ్యాణీ.

అమ్మమ్మ మమ్మల్ని వదిలి వెళ్ళి పోయింది.

మర్నాటి పొద్దున్నకి అమ్మా, నాన్నా, చెల్లి వచ్చారు. తక్కిన బంధువులు కూడా వచ్చారు.

“ఆవిడ బాధ పడుతోంది. ఆ బాధ నుండి తప్పించవయ్యా అని నిన్ను ప్రార్థిస్తే ఇలాగా ఆవిడ కష్టాలు తీర్చావు?” అని భగవంతుడితో చెప్పుకుని చెప్పుకుని బాధ పడ్డాడు మావయ్య.

“నేను నీ దగ్గరికి వద్దాం వద్దాం అనుకుంటూనే ఆలస్యం చేసాను. నీ మనవరాలి పెళ్లి కోసమైనా ఉంటావను కున్నాను. నాన్న చిన్నప్పుడే పోయాడు. ఇప్పుడు నువ్వు లేకుండా అయ్యావు.” అని అమ్మ వాళ్ళమ్మని తలచుకుని తలచుకుని ఏడ్చింది.

“మనం ఇద్దరం అత్తాకోడళ్ళలా కాక తల్లీ కూతుళ్లలా ఉండేవాళ్ళం – మీరు లేకుండా నేనెలా ఉండనండీ” అంటూ కన్నీళ్ళు కార్చింది అత్తయ్య.

“నువ్వు నాకు జడ వేస్తూ – ‘ఇంకెన్నాళ్ళు వెయ్యగలుగుతానులే – పెళ్ళి చేసుకునో చేసుకోకుండానో నువ్వు మీ బావ దగ్గరకి వెళ్ళిపోతావు’ అని అనేదా నివి. అందుకు సమాధానంగా ‘నేను నిన్ను వదిలి వెళ్ళను – రోజూ నా చేత జడ వేయించుకుంటావా – నేనింక వెయ్యనని చెప్పి నువ్వే నన్ను విడిచి పెట్టి ఎక్కడికో వెళ్ళిపోతావు’ అని అనే దాన్ని నేను. నేను ఊరికే అలా అన్నందుకే నన్ను వదిలేసి వెళ్ళిపోయావా మామ్మా?” అని బాధ పడింది కళ్యాణి.

అమ్మమ్మతో నాకున్న బంధమూ, ఆవిడకి నా మీద ఉన్న ప్రేమా, అలాంటి అమ్మమ్మ గురించి నాకు వచ్చిన ఆలోచనలూ గుర్తొచ్చి నాకూ ఏడుపు ఆగలేదు.

అందరి ఏడుపుల వెనుకా అమ్మమ్మ ఇక లేదన్న బాధతో పాటు, ఆవిడ విషయంలో వాళ్ళేదో తప్పు చేశారన్న భావమూ ఉన్నట్లనిపించింది నాకు.

నాన్న అందరినీ ఊరుకోపెట్టారు. అందరికీ జనన మరణాల గురించీ, భగవంతుడి లీల గురించి, అమ్మమ్మ గడిపిన సంపూర్ణ జీవితం గురించీ, ఆవిడ మీద ప్రేమ ఉండడం వల్లనే ఆవిడని భగవంతుడు పిలిపించుకోవడం గురించీ చెప్పారు. ఆవిడ గడిపిన రోజులే ఆవిడకి ఆనందకరమైన రోజులనీ, రాబోయే రోజులన్నీ కష్టాల రోజులే అనీ అందుకని ఆవిడ చనిపోవడమే ఆవిడకి మంచిదనీ, మన ఆనందం కోసం ఆవిడ కష్టపడుతూ ఉండాలనుకోవడం మన స్వార్థం అనీ చెప్పారు. నెమ్మది నెమ్మదిగా అందరూ ఆ మాటలే అనడం మొదలెట్టారు.

అమ్మమ్మ పోయిన మూడో నాటికల్లా ఇంట్లో పరిస్థితి మామూలుగా అయిపో యింది. కళ్యాణీ, నేనూ గదిలో కూచుని కళ్యాణి పరీక్షల గురించి మాట్లాడుతు న్నాం. హాల్లో కూచుని అమ్మా, నాన్నా, అత్తయ్యా, మావయ్యా చెల్లి పెళ్ళి ముహూర్తం గురించి మాట్లాడుకుంటున్నారు.

“మీరిక ఏమీ ఆలోచించకండి. మార్చి నెల చివరలో ముహూర్తం కుదిర్చేసుకోండి. అలా చేస్తేనే అమ్మ ఆత్మ శాంతిస్తుంది. ఆవిడ కోరిక ప్రకారం మన వాళ్ళ పెళ్ళి కూడా ఏ ఓడాదిలోగా చేసేద్దాం” అంటు న్నాడు మావయ్య.

“అమ్మ పోయిన వెంటనే పెళ్ళి చేసేస్తే ఎవ్వరూ ఏమీ అనుకోరు కదా” అంటోంది అమ్మ.

“కుదిరిన సంబంధం ఆలస్యం చెయ్యకూడదు. తొందరగా కానిచ్చెయ్యండి. ఆయన చెప్పినట్లు మార్చి చివరలో పెట్టేసుకోండి ముహూర్తం. పెళ్ళి పనులు అవుతాయా అవవా అని మాత్రం అనుమానించకండి. అంతగా అవసరం అయితే మీ తమ్ముడు వచ్చి సాయం చేస్తారు” అంది అత్తయ్య.



E:\Seelamma\ Seelama1 102

“మరి ఆ సమయానికి మీరు రాగలుగుతారా? పిల్లల పరీక్షలు ఉంటాయి కదా?” అన్నారు నాన్న.

“పిల్లల పరీక్షల ఏప్రిల్‌లో కదా. మేము కాస్త ముందుగా వస్తాం. వాళ్ళు ఆ పెళ్ళి రెండు రోజులకీ వస్తారు” అంది అత్తయ్య.

హైదరాబాద్‌లో ఫ్రెండ్ ద్వారా కళ్యాణ మండపం ఖాయపరిపించీ ముమూర్తం నిర్ణయించేసారు నాన్న. ఆ విషయం చెల్లీ వాళ్ళ కాబోయే మావగారికి కూడా చెప్పేసారు.

తరువాత పది రోజులూ అమ్మమ్మ కర్మకాండ హాడావిడిలోనూ, చెల్లి పెళ్ళి పనుల గురించి మాట్లడుకోవడంలోనూ గడిచిపోయింది. ఇంట్లో పనికి వంట వాళ్ళని కుదిర్చాడు మావయ్య. ఇన్నాళ్ళూ అమ్మమ్మకి పనిచేసేందుకు వచ్చినావిడకి ఇంట్లో ఏమీ పనిలేదు. అయినా ఆ పది రోజులూ ఆవిడ ఇంట్లోనే ఉంది. కర్మ కాండంతా అయిపోయి, బంధువులు వెళ్ళిపోయాక ఆవిడ గురించి అత్తయ్య అమ్మతో మాట్లాడింది.

“అమ్మకి కావల్సినవి చేసిపెట్టేందుకు కదా ఆవిడని పెట్టుకున్నది. ఇంక పంపిం చెయ్యవచ్చు” అంది అమ్మ.

తను అనుకున్నదే అమ్మ కూడా అన్నందుకు ఆనందించినట్లుంది అత్తయ్య. వెంటనే, “ఆవిడకి ఏదన్నా ఇవ్వనా?” అని అడిగింది.

“ఆవిడే కదా ఇన్నాళ్ళూ అమ్మకి కావల్సినవన్నీ చూసి చేసింది – ఆవిడని ఉత్తచేతులతో ఏం పంపిస్తాం? ఇంతకీ ఆవిడకి ఏం ఇస్తున్నారు?” అని అడిగింది అమ్మ.

“తిండీ బట్టలూ అన్నీ మన దగ్గరే కదా. అవి కాకుండా నెలకి ఐదు వందలు ఇస్తున్నాం” అంది అత్తయ్య.

“అయితే నువ్వో అయిదు వందలూ, నేనో అయిదు వందలూ ఇద్దాం. ఓ వెయ్యి రూపాయలవుతాయి” అంది అమ్మ.

ఆవిడకి ఇవ్వదలచుకున్న వెయ్యి రూపాయలతో పాటు అమ్మమ్మ చీరలు కూడా కొన్ని తీసి ఇచ్చి ఆవిడ కాళ్ళకి దండం పెట్టారు అమ్మా, అత్తయ్యా. ఆవిడని స్టేషన్‌కి తీసికెళ్ళి బండి ఎక్కించే పని నాకు అప్పగించారు.

స్టేషన్‌కి ఆటోలో వెళ్తున్నంతసేపూ కానీ, ఆ తరువాత స్టేషన్‌లో రైలు కోసం ఎదురుచూస్తున్నంతసేపూ కానీ ఆవిడకూ, నాకూ మధ్య మాటలు లేవు. ఆవిడని రైలెక్కించి, కిందకి దిగి, కిటికీ దగ్గర నిల్చుని, “తెనాలిలో స్టేషన్‌కి మీ అబ్బాయి వస్తాడు కదా” అని అడిగాను.

“వాడికి నేను వస్తున్నట్లు తెలియదు. తెలిసినా కూడా వస్తాడో లేదో తెలియదు.

ఇంక నా పాట్లేవో నేను పడాలి" అందావిడ.

ఆవిడ అలా అంటుంటే అందులో మమ్మల్ని ఏదో అంటున్న ధోరణి ఉందో లేదో తెలియలేదు.

"మీ అబ్బాయికి ఇంకో రెండు నెలల్లో ఉద్యోగం వచ్చేస్తుందనుకుంటున్నారు కదా. అన్నీ సద్దుకుంటాయి" అన్నాను నేను.

"వాడికి ఉద్యోగం ఇప్పుడూ ఉంది. వాడికీ వాడి పెళ్ళానికీ నన్ను వాళ్ళ దగ్గర ఉంచుకోవడం ఇష్టం లేదు. అందుకే ఈ అవకాశం రాగానే ఇలా వచ్చేసాను. ఇక్కడ నా జీవితం గడిచిపోతుందని అనుకున్నాను కానీ ఇలా అర్థాంతరంగా...." అంటూ మాట్లడడం అపేసిన ఆవిడ కళ్ళల్లో కన్నీళ్ళు కదిలాయి. మళ్ళీ ఆవిడే–

"మీ అమ్మమ్మగారు చాలా మంచావిడ. ఆవిడకి సేవ చేసిన పుణ్యం వల్ల నన్ను నా కొడుకూ, కోడలూ కొంచెమైనా బాగా చూసుకుంటే నా జన్మ ధన్యమైనట్లే. లేకపోతే నా బతుకు కుక్కలు చింపిన విస్తరే. వాళ్ళని మాత్రం ఎందుకు ఆనడం. వాళ్ళ ఆర్థిక పరిస్థితి బావుంటే వాళ్ళకి నేను భారం అయ్యుండే దాన్ని కాదు. మీకు డబ్బుంది కాబట్టి మీరు మీ అమ్మమ్మని చూసుకుందుకు నన్ను పెట్టుకున్నారు" అంటూ కళ్ళొత్తుకుంది ఆవిడ.

రైలింక కదలబోతోంది. మా అవసరానికి తీసుకువచ్చి ఆ అవసరం తీరగానే ఆవిడని పంపించేస్తున్నామేమో ననిపించింది నాకు. నేను ఆవిడని దించేసి నాతో తీసుకెళ్ళిపోదామా అని అనుకున్నాను.

"ఉండబట్టుకోలేక నా మనస్సులో ఉన్న బాధ నీతో అనేసాను బాబూ. నువ్వు ఏమీ అనుకోకు. ఈ ఐదు నెలలూ మీ అత్తయ్య నన్ను బానే చూసుకున్నారు. ఈ పనికి ఒప్పుకుని నేను కష్టపడుతున్నానని ఆవిడ అనుకునేవారు. తను పడవలసిన కష్టం నేను పడుతున్నానని కూడా కొన్నిసార్లు అన్నారు. మీ అమ్మమ్మ పోతేనే నాకు విముక్తి అనేవారు. నిజానికి పోయి మీ అమ్మమ్మే విముక్తి పొందారు. నాకు వచ్చింది విముక్తి కాదు. చావు లాంటి బతుకు. పోయి ఆవిడ బతికిపోయారు. ఉండి నేను చస్తున్నాను" అని ఆవిడ అంటూండగానే రైలు కదలిపోయింది.

నాకు ఏం చెయ్యాలో తెలియలేదు. నిజానికి అమ్మమ్మ పోవడం వల్ల అమ్మమ్మ పిల్లలకి పెద్దగా కష్టం కలగలేదు – అమ్మమ్మ లేదన్న బాధ తప్ప. ఆ బాధ కూడా పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ, ఈ పనుల మధ్య తగ్గిపోతోంది. అమ్మమ్మ మరణం ఈ పెద్దావిడకి జీవిత సమస్య అయింది. ఆవిడ బతుకు ఎలా గడుస్తుందోనన్న ఆలోచన నన్ను కలిచివేసింది.



E:\Seelamma\
Seelama1
103

రాబోతున్న కన్నీళ్ళని ఆపుకుంటూ నెమ్మదిగా స్టేషన్ బయటికి నడిచాను నేను.

ఆవిడని తల్చుకుంటూంటే నాకు గోదావరి నది మీద పాత బ్రిడ్జియే గుర్తుకు రాసాగింది.

❁

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 21 జూన్, 1985

# శీలమా? అది యేమి?

E:\Seelamma\
Seelama1
104

**వి**శాలాక్షి స్త్రీ.

మనుషులందు స్త్రీ పురుష భేదమున్నది.

ఈ స్త్రీ పురుష భేదము దైవదత్తము. దైవదత్తమని రాసినాడు, వీడు దేవుని నమ్మిననుకున్న అది సత్యము కాదు. నాకు దేవుని యందు నమ్మకము లేదు. అసలీ పురాణములు నాకు ప్రమాణములు కావు. మరి పై వాక్యములోని దేవుడెక్కడ నుండి వచ్చెను?

అది భాషలోని చమత్కారము. మనిషి మనసునందొక భావముదయించును. అది వేరొక మనిషికి చెప్పవలెను. అటుల చెప్పుటకుపయోగించు సంజ్ఞ భాష. ఈ భాషకి స్పష్టత ముఖ్యము. అది విన్నవారికో, చదివినవారికో అర్థము కావలెను. అందరికీ అర్థమగునటుల మాటలాడవలెనన్న లోక విరుద్ధమగు పద ప్రయోగము చేయరాదు. ఒక కథను రాసెడువాడు జనసామాన్యములో వాడుకలోనున్న మాటలనే వాడవలెను.

మనదొక జాతి. కొన్నివేల సంవత్సరములుగ కొన్ని ఆలోచనలు, ఆచారములు మనకంటినవి. మనలో నాటుకున్నవి. అటుల నాటుకున్న ఒక భావమే దైవము. అది యటుండనిమ్ము.

మనుషులందు స్త్రీ పురుష భేదమున్నది.

విశాలాక్షి స్త్రీ.

ఆమెకొక అన్న కలడు. ఆమె కన్న ఇరువది సంవత్సరములు పెద్ద. కొన్ని సంసారములింతియే. నడుమ చాల సంవత్సరములు పిల్లలు పుట్టరు. పుట్టిపోదురు. విశాలాక్షి తండ్రి ఆమె జననమునకు ముందే చనిపోయెను. తల్లి జన్మనిచ్చి మరణించెను. విశాలాక్షిని పెంచి ఇరువది రెండు సంవత్సరముల యువతిని చేసినది జానకి.

జానకి విశాలాక్షికి వదినె. రామచంద్రునకు భార్య. ఆ దంపతులకొక కొడుకు కలడు. పేరు రంగనాథము. విశాలాక్షికన్న రెండు సంవత్సరములు చిన్న.

మగవారెవ్వరైనా వచ్చిన లోనింటి నుండి వెలుపలికి ఆడువారు రాకూడదను నియమము వారింట లేదు.

మన సమాజములో మార్పు మూడు రకములు. కొన్ని సంవత్సరములుగా వచ్చుచున్న ఆచార వ్యవహారములను పట్టుకొని యుండెడివారు కొందరు. అట్టి ఆచారములలో అర్థము లేదని కొత్త మార్గములలో పోయెడివారు కొందరు. మరికొందరుందురు. వారు పూర్తిగా కొత్త మార్గమునపోరు. కాని అటులపోవుట తప్పుగా భావించరు.

రామచంద్రుని కుటుంబము మూడవజాతికి చెందినది. వారు పూర్తిగా మారలేదు. కాని మారుట తప్పుగా భావించరు. నేడు మనలో నిట్టివారి సంఖ్యయే అధికము.

రంగనాథము స్నేహితులతో విశాలాక్షి చనువుగా నుండును. వారందరిలోను ఆమెకు విశ్వనాథముతోటి చనువెక్కువ.

విశ్వనాథము రంగనాథము కన్న ఆరేళ్ళు పెద్ద. అతడు రంగనాథము చదువుచున్న కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడు. వారిరువురి నడుమ గురు శిష్య సంబంధము కన్న స్నేహ సంబంధమెక్కువ. స్నేహితుని ఇంటికి తరచు వచ్చెడువాడు విశ్వనాథము.

కాని కొన్నాళ్ళకు ఆ వచ్చుట రంగనాథము కొరకు కాక, విశాలాక్షి కొరకే ననిపించుట మొదలిడెను.

మొదట కొన్నాళ్ళు రంగనాథమింట లేడన్న వెంటనే వెడలిపోయెడివాడు. తరువాత కొన్నాళ్ళు రంగనాథమింట లేడన్న విశాలాక్షి యున్నదా యని యడిగెడువాడు. మరికొన్నాళ్ళకు విశాలాక్షి యున్నదాయన్న ప్రశ్నతోనే వచ్చుచుండెను.

ఉపన్యాసకుడగుట చేతనేమో విశ్వనాథము గంటల తరబడి మాటాడగలడు. ఆ మాటలాడుట సందొక నేర్పున్నది. వినువారికి విన్నంతసేపు కాలగమనము తెలియదు. ఒక గంట గడచును. ఇంతలో ఒక గంట గడిచెనా అని అనిపించును. గంట అనినెంత? అరువది నిమిషములు.

అరువది నిముషములుపైన మనలని మనము మరచునటుల మాటాడుట యన్నమాటలా? అటుల మాటాడుట ఒక కళ, ఈ కళయందు విశ్వనాథము నిష్ణాతుడు.

ఏ కళయైనను కానిమ్ము; కళాకారుడెంత గొప్పవాడైనను కానిమ్ము. ఆ కళను అనుభవించెడువాడు రసజ్ఞుడయిన కాని కళ రాణింపదు. విశ్వనాథము మాటాడుదానిని విశాలాక్షి అర్థము చేసుకొనగలదు. ఆనందించగలదు.

వారెన్నో విషయముల గురించి ప్రసంగింతురు – చూచిన చలన చిత్రముల గురించి, చదివిన పుస్తకముల గురించి, వివిధ భాషలలోని మంచి గ్రంథములను

గురించి విశ్వనాధము వివరించును. విశాలాక్షి వినును. విశాలాక్షి చెప్పును. విశ్వనాధము వినును.

అటుల మాటలాడుటలో వివాహము గురించి ప్రసంగము వచ్చును. విశ్వనాధము విశాలాక్షిని తనను పెళ్ళాడుదువా అని అడుగును. ఆమె సమాధానమీయదు.

అటుల సమాధానమీయకుండుటలో విశాలాక్షికి అభ్యంతరము లేదని విశ్వనాధము నిశ్చయించుకొనెను. కొన్నాళ్ళ తరువాత తనకామె అర్ధాంగి కాగలదని అతడనుకొన మొదలిడెను.

విశాలాక్షి విశ్వనాధము యెడ చూపెడు చనువును వదినె చూచెను. చూడకుండుటకామె గుడ్డిదా? విశాలాక్షి నలుగురకు తెలియునటులగనే ప్రవర్తించును. వారిరువురు గంటల తరబడి మాట్లాడుదురు.

విశ్వనాధము గుణవంతుడు. మంచి యుద్యోగము నందున్నాడు. చూచుటకు పెద్ద అందగాడు కాకున్నను కురూపి కాడు. మగవాని అందమునకేమున్నది? అన్నా వదినెలిద్దరు, వారిద్దరి వివాహ వార్తకై ఎదురుచూచుచుండిరి.

ఆ సమయమున ఒక ఘోరము జరిగెను.

విశాలాక్షి చనిపోవ ప్రయత్నించెను.

ఒకనాడు ఆమె వర్షములో తడిసివచ్చెను. వచ్చి ఏమియు మాటలాడక, భోజనము చేయక కూర్చుండెను. రాత్రి ఎందుకో మెలుకువ వచ్చిన జానకికి చీరను తాడుగా కంఠమునకు తగిలించుకొనుచున్న విశాలాక్షి కనిపించెను. ఆమె నా ప్రయత్నము నుంచి విరమింపచేసి జరిగినది తెలుసుకొనెను.

వర్షమున నిలుచుండిన విశాలాక్షి ఇంటికి చేరుటకై వేరొక వ్యక్తి కారునెక్కెను. ఆ వ్యక్తి వర్షములో కారునొక చోటికి తీసుకుపోయి, బలాత్కరించి ఆమెను చెరచెను. ఆమెనింటి దగ్గర దింపి, పోలీసులకీ విషయము చెప్పిన నీకే నష్టమని చెప్పిపోయెను.

అన్నా వదినెలు కూడా ఈ విషయమందరికి తెలిసిన విశాలాక్షి వివాహమగుట కష్టమగునని భయపడిరి.

విచారముతో విశాలాక్షి తన గదిలోను, ఒకరితో నొకరు మాట్లాడుకొనకుండ తక్కిన ముగ్గురు హాలులోన కూర్చుండగ విశ్వనాధము వచ్చెను. ఇంటనందరూ అంత విచారముగా నుండుటకు కారణమడిగెను. వారేదియో చెప్పి అతనిని పంపించ ప్రయత్నించిరి. కాని అతడు తరచి తరచి అడిగి అసలు విషయమును గ్రహించెను. వెంటనే విశాలాక్షి గదిలోనకు పోయెను.

"విశాలాక్షీ!" విశ్వనాధము పిలిచెను.



E:\Seelamma\
Seelama1
105

"ఆ పేరుతో నన్ను పిలిచి ఆ పేరున పవిత్రము చేయకుండుడు. అది హిందువులకందరకు తల్లియగు కాశీ విశాలాక్షి పేరు – నాకెట్లు వచ్చినదో?" విశాలాక్షి కంట నీటితో, కంఠమున బాధతో అనెను.

"నీవు చాల బాధపడుచున్నట్లున్నావు. అంత బాధపడవలసినదేమియు జరగలేదు."

"ఒక స్త్రీకి శీలమెంతో ముఖ్యము. నేను దానిని కోల్పోయితిని."

"ఏమి కోల్పోయితివి?"

"శీలమును."

"శీలమా? అది యేమి?"

విశాలాక్షి అతనిని నివ్వెరపడి చూచినది.

"నీ ధనము పోయినదా? నగలు పోయినవా?"

"వాటికన్న ముఖ్యమయినది పోయినది."

"అని నీవు భ్రమపడుచుంటివి. అసలు పోయినదేమియు లేదు."

"మీరు నన్నోదార్చుటకిట్లు మాట్లాడుచుండిరి. మీకు తెలియదా నాకు మానమెంత ప్రాణమో."

"విశాలాక్షి – నిన్నాపేరుతోనే పిలిచెదను. నీతో ఈ విషయము మున్నెన్నడు ప్రసంగించలేదు. దానికి అవకాశము రాలేదు. ఈ సమయము ప్రసంగములకు అనువైనది కాదు. కాని అవసరమట్లు చేయుచున్నది."

"కూర్చుండుడు."

విశ్వనాధము విశాలాక్షి పక్కన కూర్చుండెను. కూర్చుని ఇట్లనెను.

"స్త్రీ పురుషుల నడుమ శృంగార భావము తప్పక యుండును. అది జంతువులన్నింటియందు ఉన్నది. అసలీ శృంగార భావము లేకున్న సృష్టి జరగదు. ఇది ఈ సృష్టికి అవసరమయిన ప్రక్రియ. దానిని మనము కాదనరాదు.

పచ్చి శృంగార భావముకాక తక్కినభావములు మనిషికి అవసరమయ్యెను. మనిషి ఆహారము కొరకు వేటమాని, ఆహారోత్పత్తి చేయుట మొదలిడిన తర్వాత ఆస్తి వ్యవహారములు వచ్చినవి.

సమిష్టి ఆస్తి కాక వ్యక్తుల ఆస్తి వచ్చెను. మాతృస్వామ్య వ్యవస్థతో మొదలయి నెమ్మదిగా పితృస్వామ్య వ్యవస్థ వచ్చెను.

తండ్రినుండి కొడుకునకు ఆస్తి రాసాగెను. తన ఆస్తి "తన" కొడుకునకే చెందవలయునన్న తండ్రి కోరిక కారణమున భార్యకి ఎన్నో కట్టుబాట్లు వచ్చెను. ఆ కుటుంబ వ్యవస్థ పటిష్ట పరచుటకే స్త్రీకి శీలమను ఆభరణము తొడగబడెను.

ఈ వ్యవస్థ మంచిది. ఉపయోగకరమైనది. శీలమనునది ఈ వ్యవస్థకొరకే కాని, స్త్రీ కొరకు కాదు. వ్యవస్థ కొరకే దానినొక పవిత్రమైన దానిని చేసి, అది పోగొట్టుకున్నదని ఒక స్త్రీని అధోగతిపాలు చేయుచున్నారు. ఇందేమి నీతి యున్నది?"

"ఏ స్త్రీ ఏ పురుషునితోనైన కలసి ఉండవచ్చునందురా?" విశాలాక్షి కంఠమున కంపరము ధ్వనించెను.

E:\Seelamma\
Seelama1
106

విశ్వనాథము నవ్వెను. "నేనటుల అనను. అది తప్పని నా భావము కాదు. కాని అది మన ప్రస్తుత సమాజ పరిస్థితులకు సరికాదు. అవసరములను బట్టి ఆచారములు మారును. మన ప్రస్తుత సమాజమునందీ వ్యవస్థ ఉన్నది. ఇందు స్త్రీ పురుష స్వేచ్ఛా శృంగారము నిషిద్ధము. దానిని నేనంగీకరింతును. నేను చెప్పునది వేరు. ఒక స్త్రీని వేరొక పురుషుడు బలాత్కారముగా అనుభవించినంత మాత్రమున ఆ స్త్రీ పొగోట్టుకున్నదేమియు లేదనియే."

"మీరు చెప్పునది నాకర్థము కాలేదు."

"ఒక స్త్రీ ఒక పురుషుని ప్రేమించినదనుకొనుము. ఆమెను ఆమె తండ్రి ఏదో కారణమున వేరొక పురుషునకిచ్చి పెండ్లి చేసెననుకొనుము. వారిరువురి సంసారము సాగుచున్నది. ఆమెకా సంసారము చేయుట కొంచెమైనను ఇష్టము లేదు. ఆమె పోగొట్టుకున్నదేమి?"

"సుఖము, సంతోషము, ఆనందము."

"శీలము పోయినదా?"

"శీలమెట్లు పోవును? ఆమె తన మగనితో కదా కాపురము చేయుచున్నది."

"వాడెట్లు మగడైనాడు? బలాత్కారమననేమి? నీకిష్టము లేకుండా నిన్నొకడనుభవించుటయే కదా? మరి తనకిష్టములేని మగనితో సంసారమేమి? తనకిష్టమయిన మగడే కానిమ్ము. తన కిష్టము కాని సమయమున మగని అవసరమునకై తననర్పించుకొనటయేమో."

విశాలాక్షి మాట్లాడలేదు.

"ఇంకొక విషయమునర్థము చేసుకొనకుండ నమ్ముచుండి. బలాత్కారము చెడు కాదని నేనను. కాని దానివలన మీరేదియో పోయినదని బాధపడుటకర్థము లేదు. దానిని దాచి యుంచుట కూడా మంచి పని కాదు.

"నలుగురికి తెలిసిన నవ్వులపాలగుదుము కదా?"

"మీయన్న నెవ్వరైనా దారిలో కొట్టిన పోలీసులకు తెలుపక మీరూరుకుందురా? మీ యింట దొంగలు పడి దోచుకున్న మీ ప్రవర్తన ఇట్లుండునా? వాడెవ్వడో నిన్ను



బలాత్కరించెను. నలుగురికి తెలిసిన నవ్వెదరా? ఎవరిని చూసి? నిన్ను చూసా? అటుల నవ్విన వారితో నీకు పనియేమి? వారు నిన్ను చూసి నవ్వుట కాదు, వారిని చూసి అసహ్యించుకొనవలెను."

"సంఘము మీరనుకొనింత మారలేదు – ప్రగతి సాధించలేదు.

"సంఘమేది ప్రగతి సాధించుటకు, సాధించునది మనము. మనమిటుల కూర్చున్నంత కాలమిది ఇటుల సాగుచునే యుండును. కాళ్ళకి ఎత్తుమడమల చెప్పులు, పెదవులకు ఎఱ్ఱని రంగులు ప్రగతి కాదు. ప్రగతి ఆలోచనలో రావలెను, ఆచరణలో రావలెను. నువ్వు భయపడి వానిని బయటపెట్టుకున్న వాడు మరి కొందరినిటులనే చేయును. వానిని చూచిన మరికొందరికి విచ్చలవిడితనము వచ్చును, అది నీకిష్టము కాబోలు."

"కాదు" విశాలాక్షి అనెను.

"అటులయిన వానిని వదిలేసి నీ జీవితమున ఒక చెడ్డపని చేయకుము."

"నా జీవితమునకు కూడ అర్థమున్నదా?"

"నీ జీవితమనకేమయినది. నిన్నకీ, నేటికీ ఏమియు జరగలేదే. నీవు బస్సు నుండి పడిన నీకు గాయమగును. నీ బ్రతుకున కర్థము పోవునా? వాని వివరములనిమ్ము. నేను పోలీసులకు చెప్పెదను."

"ఈ విషయము నలుగురకు తెలిసిన ఎవ్వరును నన్ను వివాహమాడరని వదినె భయము."

"నిన్నెవడు వివాహమాడవలెను?"

"నన్నెవరు ఆడుదురు?"

"నేనెన్నియోసార్లు నిన్నడిగితిని – నన్ను వివాహ మాడెదవా అని. మరల అదే ప్రశ్న అడుగుచున్నాను. నీవు ఆడెదననువరకు నేనడుగుచుందును" విశ్వనాథము లేవబోయెను.

విశాలాక్షి అతని చేతులను తన చేతులలోనికి తీసుకొని కళ్ళకద్దుకొనెను.

*(కథలూ, నవలలూ రాయడానికి ఒక చక్కని వాడుక భాష వంటి గ్రాంథిక భాషను తీర్చిదిద్దుకున్నారు విశ్వనాథ. ఈ కథ కోసం ఆ శైలిని వాడుకుందుకు ప్రయత్నించాను)*